25

...పాతికేండ్ల సారస్వత సేవ...

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక సెప్టెంబరు, 2013 ₹ 20



వంటా వార్పూ

# మిసిమి
మాసపత్రిక


**"All that we are is the product of what we have thought"**
***- Dammapada.***


**సంపుటి 24** **సెప్టెంబరు 2013** **సంచిక 9**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........................................ 3
రంగస్థలం మీద తెలుగు కథ ........................... 5
– డాక్టరు పెద్ది రామారావు
ఆధునికానంతరం–కొన్ని అపోహలు ..................... 9
– పన్నాల సుబ్రహ్మణ్యభట్టు
సీత జోస్యం (నార్ల వెంకటేశ్వరరావు) .................. 16
– ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
రష్యా కవిత్వం .......................................... 23
– ముకుంద రామారావు
ఆయుర్వేదం – ఆత్మకథ ............................... 31
– ఆచంట లక్ష్మీపతి
చరిత్రలో చంద్రగిరి మహల్ ........................... 41
– డా॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
నెల్లూరు–మారుపేర్లు .................................. 49
– పలగాని గోపాల రెడ్డి
వందేళ్ళ సాక్షి – పానుగంటి అపూర్వ సృష్టి ........... 55
– డా॥ దామెర వేంకట సూర్యారావు
సూరదాసుని గోలోకం .................................. 57
– కోడూరు పుల్లారెడ్డి
రినైజాన్స్ చరిత్ర ......................................... 68
– అశ్వినీకుమార్
చదవండి (పుస్తక పరిచయం) .......................... 76


ముఖచిత్రం : ఉద్విగ్న
రెండవ అట్ట : వంటా వార్పు
మూడవ అట్ట : ఎదురు చూపు
నాల్గవ అట్ట : పూల కూర్పు

... చిత్రకారుడు :
ఎస్. ఇళయరాజా


వివరాలు : 40 వ పుటలో...

తెలుగు నాటక రంగం పౌరాణికాలతోనే మొదలయి (మంజరీ మాధవీయం-1860), చారిత్రక నాటకాలతో (రామరాజు చరిత్ర) పరిపుష్టమై కాళ్లకూర నారాయణ రావు వర విక్రయంతో సాంఘిక నాటకాలు మలుపు తిరిగి (చింతామణి-1921) తో ఒక వెలుగు వెలిగాయి.

అయితే 'రంగస్థలం మీద తెలుగు కథలు-నవలలు' ఎప్పుడు రూపు దిద్దుకున్నాయో - పెద్ది రామారావు వివరించారు.

'ఆధునికానంతరం'పై ఉన్న అపోహలు ఎలా వుంటాయో పన్నాల సుబ్రహ్మణ్యభట్టు సవివరంగా తమ వ్యాసంలో క్రోడీకరించారు.

ఈ నెల ముఖచిత్రం - ప్రత్యేకమైనది. చిత్రకారుడు రంగులు కలపకుండా, ఎటువంటి కుంచెలు చేతితో వాడకుండా - ఒక సమగ్రమైన 'రూపచిత్రాన్ని' చిత్రించి భావోద్వేగాన్ని సైతం వ్యక్తీకరించగలగటం అభినందించదగిన ప్రక్రియ.

సాంఘిక చరిత్రలు తెలుగులో వెతక వలసిందే- 'నెల్లూరు-మారుపేర్లు' ఈ తరగతిలో చెప్పుకోదగినది.

నార్ల వారి 'సీత జోస్యం' గురించి సత్యనారాయణ సమగ్రంగా వివరించారు. ఈ రెండంకాల నాటిక ఇప్పటికీ చర్చనీయాంశమే. కేంద్ర సాహిత్య పురస్కారం పొందిన 'సీత జోస్యం' నేటికీ సాంఘికపరంగా అన్వయించుకోదగినది, సంస్కృతీపరంగా విశ్లేషించదగినది.

వందేళ్ళనాటి 'సాక్షి'ని మళ్ళీ స్పృశించటం చక్కటి అనుభూతి.

కోడూరు పుల్లారెడ్డి బహుభాషా కోవిదులు - వారు 'సూరదాసుని-గోలోకం'లో కృష్ణుని బాల్యాన్ని సూరదాసు - పోతన-ఎఱ్ఱన రచనలను ఉటంకిస్తూ వర్ణించిన తీరు అభినందనీయం.

**'మిసిమి'** పరిశోధనా వ్యాసం 'రినైజాన్స్ చరిత్ర'లో తెలుసు కోవలసిన కోణాలెన్నో...
పాఠకులకు వినాయక చతుర్థి శుభాకాంక్షలు...

**- సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✶ "... ఇంత వరకు ఏ తెలుగు పత్రికలోను ఇటువంటి అర్థవంతమైన సంపాదకీయం (ఆగష్టు 2013) రాలేదు... తప్పనిసరిగా సాహిత్యకారులు ఆలోచించవలసిన ఎన్నో విషయాలు చర్చకు పెట్టారు... లోహియా కూడా తన *ఇంటర్‌వెల్ డ్యూరింగ్ పాలిటిక్స్‌*లో ఇటువంటి అభిప్రాయాలు వెలిబుచ్చారు..."

**– రావెల సోమయ్య** (వాయిస్ మెయిల్), హైదరాబాదు.

✶ "... చాలా మంచి సంపాదకీయం... ఈనాటి తెలుగు సాహిత్యపు తీరు తెన్నులను ఆలోచింపజేసే ప్రయత్నం... కొన్ని సత్యాలను ఎవరూ కాదనలేనివి కూడా... ***మిసిమి***లో రచనలన్నీ ఆలోచింపచేసేవే..."

**– యార్లగడ్డ బాలగంగాధరరావు** (వాయిస్ మెయిల్), విజయవాడ.

✶ "... తెలుగు భాషా వికాసానికి, సర్వతోముఖాభి వృద్ధికి, వట్టిమాటలుగా కాక గట్టి చేతలతో తమదైన రీతిలో, బాణిలో నిలువెల్లా సాహితీ సౌరభ పరిమళాలతో విలసిల్లుతున్న మిసమిసలాడే ***మిసిమి*** ద్వారా ఇతోధికమైన సేవనందిస్తున్న సంపాదక వర్గానికి అభినందన సుమాంజలులు...

...జూలై సంచిక ఎప్పటివలెనే వైవిధ్య భరితమైన రచనలతో ఇంతకు ముందటి సంచికలపై వీసమెత్తు ఆధిక్యత సంపాదించింది. ఈ స్థాయినిలాగే నిలుపుకోండి. కవితలకు, కథలకు, కథానికలకు కాస్తచోటు కల్పించండి. పత్రిక సమగ్రమవుతుంది...



...రావినూతల సత్యనారాయణ *అమృతం కురిసిన రాత్రి* తీయని జ్ఞాపకాలను నెమరు వేయించారు... ఏ భాష కదే గొప్పదైనా, ద్రవిడ భాషలలో తదితర భాషలకన్నా తెలుగు రవంత తీపిదనాన్ని ఎక్కువగా కలిగినటువంటిది. ఆ భాషా వైశిష్ట్యాన్ని శంకరావు విపులీకరించ సఫలీకృత ప్రయత్నం చేశారు... ముకుంద రామారావు, యథావిధి *ఇరుగుపొరుగు దేశాల* కవితా సౌరభాలను ప్రతినెలా మనకు పంచుతున్నారు... సన్నిహితత్త్వం, గురుభావం, ఆరాధనాతత్త్వం, కళలపట్ల అంకితభావం – రచయిత సి.యస్.రావులోనూ, వ్యాస నాయకుడు పినాకపాణిలోనూ, ప్రతిఫలించినందున ఆ రచన జీవం పోసుకుంది. ఆప్యాయతను తొణికిసలాడింది. నండూరి పార్థసారథి హిందూస్థానీ–కర్ణాటక సంగీతంపై పరిశోధనాత్మక, తులనాత్మక పరిశీలన సంగీత విద్యలో ఉన్నత శిక్షణ పొందేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నది....

...వెలగా వెంకటప్పయ్య తెనాలిలో *రావూరి భరద్వాజ అనుభవాలు*, పరిచయాలు చక్కగా ప్రోదిగుచ్చినట్లు సమీకరించారు.

శ్రీమతి ఎ.శ్రీదేవి *తెలుగు జాతి శిల్పకళా వైభవం* కళాత్మకంగా, కళోన్నతంగా, కళారూపంగా తన వ్యాసాన్ని పాఠకుల ముందుంచారు.

**– డాక్టరు శివభూషణం,** కర్నూలు.

✶ "... ఆగష్టు అట్టమీది బొమ్మలు చాలా ప్రత్యేకంగా వున్నాయి. పాకిస్తానీ చిత్రకారుడు చుగ్తాయి గురించి మనకు అంతగా తెలియదు. మీరు ఆయన చిత్రించిన బొమ్మలు వేయటమే కాకుండా చుగ్తాయి చిత్రకళా జీవితం గురించి చక్కగా సమీక్షించారు... మధురాంతకం నరేంద్ర వ్యాసం *తెలుగు రచన తీరుతెన్నుల*పై మంచి సమీక్ష. మీ సంపాదకీయం ఆలోచింపజేసేది..."

**– సి.యస్.రావు,** హైదరాబాదు.

✶ "... దాశరథి కృష్ణమాచార్య దృక్పథం ఎందరికో కనువిప్పు కావాలి... మారుతీరావు పరిశీలన చాలా లోతయినది... సంపాదకీయం ఆగష్టు ప్రత్యేకంగా అభినందించాలి.... రచయితలు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..."

**– జి.యస్.రావు,** హైదరాబాదు.

**✦ మంచి ఉత్తరానికి ఒక మంచి పుస్తకం బహుమతి! ✦**

# నోబెల్ కవితల గుబాళింపు

**"1901** నుండి నోబెల్ కవిత్వం – కవుల జీవిత, కవిత్వ విశేషాలు" పేరుతో ముకుంద రామారావు రచించిన గ్రంథం ఎంతో విశిష్టమైంది. నోబెల్ బహుమతుల్ని గెల్చుకున్న కవుల జీవిత విశేషాలతో పాటు, వాళ్ల రచించిన కొన్ని కవితల తెలుగు అనువాదాల్ని కూడా ముకుంద రామారావు ఈ గ్రంథంలో పొందుపర్చారు. (ప్రపంచ సాహిత్యానికి లభించే అత్యున్నత పురస్కారం నోబెల్ పురస్కారం. కొన్ని కోట్ల రూ.లతో శాశ్వతంగా నిలిచిపోయే కీర్తి ప్రతిష్టలు కూడా ఆ బహుమానాలు అందుకున్న వారి స్వంతమవుతాయి). అనేక దేశాలకు, అనేక భాషలకు చెందిన 37 మంది నోబెల్ పురస్కారాలు పొందిన కవులను పరిచయం చెయ్యడం ఎంతో శ్రమతోనూ, ఎంతో సాహసంతోనూ కూడుకున్న పని. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ముకుంద రామారావును అభినందించాలి.

ఈ పుస్తకానికి "అరచేతిలో ప్రపంచం" పేరుతో ముందు మాట రాసిన వేల్చేరు నారాయణరావు అన్నట్టు "తెలుగు కవులకీ, రచయితలకీ నోబెల్ బహుమానాన్ని గురించి ఆశలున్నంతగా అవగాహన లేదు. సరదాలున్నంతగా సమాచారం లేదు. గత ఐదు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యం ఎంచక్కా తన చుట్టూ గిరిగీసుకొని తన బొమ్మ తన అద్దంలోనే చూసుకొని మురిసిపోతుంది. ఇంకా దరిమిలా విప్లవ నినాదాలు, ప్రాంతీయ చైతన్యాలు, స్త్రీవాద, దళితవాద, బీసీవాద నినాదాలు, స్థానికతా వాదాలు అక్షరాల్లో నింపేసి అదే గొప్ప సాహిత్యమనీ, లేదా గొప్ప సాహిత్యానికి అదే ప్రమాణమనీ అందరికీ చెవులు చిల్లులు పడేలా గుండెలు మూసుకుపోయేలా అరుస్తోంది. ఒక సుగుణం – ఈ రకమైన సాహిత్యానికి ప్రపంచం తన మాట వినాలనే తపన లేదు. అది ప్రాంతీయం, దేశికం, పరిమిత సామాజికం. అయినా తెలుగులో ప్రతి పదేళ్ళకీ ఒక యుగకవో, మహాకవో ఉదయిస్తూనే ఉంటాడు. ఎలాగోలా తన కవిత్వం ఇంగ్లీషులోకి అనువాదమైతే చాలు, ప్రపంచమంతా అది చదివేస్తుందనీ, ఇంక తన పేరు నోబెల్ బహుమానాల జాబితాలో చేరిపోతుందనీ కలలు కనేవాళ్ళు తారసపడుతూనే ఉంటారు. ఇలాంటి తెలుగు సాహిత్య వాతావరణానికి ముకుంద రామారావు గారు ఒక గొప్ప ఉపకారం చేశారు. నోబెల్ బహుమానపు ముఖద్వారాలు తెరిచి ఆ బహుమానం పొందిన కవిత్వంలో ఏం జరిగిందో కళ్లు మిరిమిట్లు గొలిపేలా చూపించారు".

ఈ పుస్తకంలో 1901వ సంవత్సరంలో మొదటి సారి నోబెల్ పురస్కారాన్ని పొందిన సల్లీ ప్రధోమే (ఫ్రాన్స్) తో మొదలెట్టి 2011వ సంవత్సరంలో ఈ బహుమానం అందుకున్న టామస్ ట్రాంస్ట్రోహ్మర్ (స్వీడన్) తో ముగించాడు. ఈ 37మంది నోబెల్ విజేతల్లో భారతదేశానికి చెందిన ఒకే ఒక కవి: రవీంద్రనాథ్ టాగోర్. ఇతర దేశాల కవులను, వారి కవితలను కాస్త క్లుప్తంగా పరిచయం చేసిన ముకుంద రామారావు రవీంద్రనాథ్ టాగోర్‌ను గురించి చాలా వివరంగా పరిచయం చేశాడు. టాగూర్‌ను గురించి చెబుతూ ముకుంద రామారావు – "రవీంద్రనాథ్ టాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. అందులో రహస్యమేమీ లేదు. ప్రఖ్యాత కవిగానే కాక కథకుడిగా, నవలాకారుడిగా, నాటకకర్తగా, ప్రయోక్తగా, వ్యాస రచయితగా, సంగీతకారుడిగా, చిత్రకారుడిగా, జాతీయ అంతర్జాతీయ సామాజిక సంఘటనల పట్ల నిబద్ధుడిగా, సాహిత్య సాంస్కృతిక ప్రతినిధిగా, విద్యావేత్తగా, తాత్త్వికుడిగా, నటుడిగా, గాయకుడిగా, ఉపన్యాసకుడిగా అన్నింటా అందర్నీ ఆకర్షించిన మేధావి" అంటాడు.

రవీంద్రుని ఒక కవితను ఇలా అనువాదం చేశాడు ముకుంద రామారావు :

**వసంతంలో ఒకరోజు / నా ఒంటరి అడవిలోకి / సుందరమైన ప్రియురాలుగా / ఒకామె వచ్చింది / నా పాటల్ని రక్తికట్టించి**

**నా కలలకు మాధుర్యాన్ని అద్దటానికి / హఠాత్తుగా ఒక క్రూరకెరటం / నా గుండె తీరాన్ని విరగ్గొట్టి /భాషనంతా తుడిచిపెట్టుకుపోయింది.**

ఈ 37 మంది కవుల జీవిత విశేషాలను చెప్పడంతో ఆగిపోకుండా వాళ్ళ కొన్ని కవితల్ని తేటతెల్లమైన తెలుగులోకి అనువాదం చెయ్యడం ముకుంద రామారావు సాధించిన గొప్ప విజయం. ఈ అనువాదాలను గురించి, అనువాదాలు చెయ్యడంలో గొప్ప అనుభవజ్ఞుడైన వేల్చేరు నారాయణరావు అన్న ఈ మాటల్లో ఎంతో నిజముంది:

"ముకుంద రామారావు చేసిన అనువాదాలు చదువుతూ ఉంటే మనకు అనిపించేదీ, స్పష్టంగా మన భావనా ప్రపంచంలోకి వచ్చేది, ఆయన తన అచ్చపు బుద్ధితో అన్ని తెరలూ దాటుకొని చూసిన ప్రపంచమే. ఆయన ఈ అనువాదాలు ఇంగ్లీషు నుంచే చేసినా, ఆయనకు ఇటాలియన్, ఫ్రెంచ్, స్పానిష్, స్వీడిష్ మొదలైన భాషలు రాకపోయినా, మన భావ ప్రపంచంలోకి వచ్చేది మూలంలో ఉన్న అచ్చపు కవిత్వపు ఛాయలే. అసాధ్యమైన ఈ పనిని ముకుంద రామారావు సాధించటం ఆయన భావనా బలానికి నిదర్శనం."

ఏయే దేశాలకు చెందిన కవులకు ఈ బహుమతి ఎన్నిసార్లొచ్చిందో తెలియజేసే పట్టికను కూడా రచయిత ఈ పుస్తకం చివర్లో పొందుపరచాడు. ఇంత కష్టసాధ్యమైన పనిని సాధించిన ముకుంద రామారావు తెలుగు కవులకు, తెలుగు కవిత్వాభిమానులకు అంతర్జాతీయ కవిత్వపు సొబగుల్ని దర్శించేలా చేసి గొప్ప కవిత్వపు రుచిని ఆస్వాదించేలా చేసినందుకు ఆయనను అందరూ హృదయపూర్వకంగా అభినందించాలి.

**సమీక్షకులు : అంపశయ్య నవీన్**

# రంగస్థలం మీద తెలుగు కథ

**– పెద్ది రామారావు**

సమాజాన్ని అర్థం చేసుకోవడంలో / అద్దం పట్టడంలో తెలుగు సాహిత్యం కనీసం ఒక దశాబ్దం వెనుకబడి ఉంది. సాహిత్యమంటే నా దృష్టిలో కథ, నవల, కవిత్వం మాత్రమే! నాటకం కాదు. తెలుగులో నాటకం సాహిత్యపు హోదాను కోల్పోయి చాలాకాలమయ్యింది. ఇప్పుడది కేవలం ప్రదర్శనకు ఉద్దేశించబడిన రచనగానే గుర్తించబడుతుంది తప్ప, సాహితీ ప్రక్రియగా తనకంటూ ఒక ప్రత్యేకమైన అస్తిత్వం, హోదా, గౌరవం లేవు. 'కావ్యేషు నాటకం రమ్యం' అనే నానుడి మిగిలిన భాషలకు వర్తిస్తుందేమో గాని తెలుగులో కావ్యేషు నాటకం అథమంగానే పేర్కొనవచ్చు. ఇవాళ తెలుగు సాహితీరంగంలో కృషి చేస్తున్న ఎవరూ నాటకం గురించి మాట్లాడుకోకపోవడం, ఏ తెలుగు పత్రికలోనూ నాటక సాహిత్యాన్ని గురించిన చర్చ, విమర్శ లేకపోవడం చూస్తే, తెలుగులో నాటకం అనే ఒక ప్రక్రియ వుందన్న విషయం తెలుగు పత్రికలు, పుస్తక ప్రచురణ సంస్థలు మర్చిపోయాయేమో ననిపిస్తుంది. అలాగే నాటకాల వాళ్ళు కూడా సాహిత్యం గురించి మాట్లాడుకోవడం మానేసి చాలా కాలం అయింది. సమకాలీన కథ గురించి తెలుగు నాటకాల వాళ్ళు పట్టించు కోవడం మానేశారు.

ఒక్కమాటలో చెప్పాలంటే సాహితీ ప్రక్రియలన్నింటి లోనూ అగ్రభాగాన నిలిచే నాటకం, సాహితీ ప్రపంచం నుంచి తనకు తానుగా ఎంతో దూరం జరిగిపోయింది. మిగిలిన సాహితీ ప్రక్రియలకీ, నాటకానికీ మధ్య అంతులేని అగాధం ఇవాళ తెలుగుదేశంలోనే రాజ్యం ఏలుతోంది. ఈ అగాధం బహుశా ఆంధ్ర నాటక కళాపరిషత్ ఆవిర్భావంతోనే ప్రారంభమయ్యిందనుకోవచ్చు. అప్పటిదాకా కథలు, కవిత్వం, నవలలు రాసిన వాళ్ళే నాటకాలు కూడా రాశారు. ఎప్పుడైతే ఆంధ్ర నాటక కళాపరిషత్ కొత్త నాటకాల కోసం పోటీలు ప్రారంభించిందో దాంతో సాహిత్యంతో సంబంధం లేని వాళ్ళు నాటక రచన చేయడం ప్రారంభించారు. కథ, కవిత్వం, నవల, పత్రికా రచన లాంటి వాటితో ఏ సంబంధం లేని ఒక కొత్త తరం నాటక రచయితలు కోకొల్లలుగా పుట్టుకొచ్చారు.

గొల్లపూడి మారుతీరావు, డి.వి.నరసరాజు, గణేష్ పాత్రో, కొడాలి గోపాలరావు లాంటి అనేకమంది పేరుగాంచిన నాటక రచయితలు రంగం మీదకు రాగలిగారు. అంటే ఒక రకంగా నాటక రచన అంతకు ముందుకంటే మరింత ప్రజాస్వామ్యీకరించబడింది. ఇది హర్షించదగ్గ పరిణామమే. అయినా నాణానికి మరో వైపు నాటకం సాహితీ సువాసనలు కోల్పోయింది.

పోటీకోసం రాయడం అంటే పోటీలో గెలవడం కోసం; రాయడం. పోటీలో గెలవాలంటే పోటీ నిర్వాహకులు పెట్టే అన్ని రకాల నియమ నిబంధనలకూ, ఆర్థిక వనరులకు లోబడి నాటకం రాయడం.

పోటీ జరుగుతున్నది ప్రదర్శనకు గాని రచనకు కాదు కనుక, ఆ ప్రదర్శనకు నాయకత్వం వహిస్తున్న దర్శకుడి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా నాటకం రాయడం, దర్శకుడు దర్శకత్వంతో పాటు నాటకంలో పాత్ర కూడా వేస్తాడు కనుక, ఆ పాత్రకి మిగిలిన పాత్రలకంటే ఎక్కువ సంభాషణలుండే విధంగా రాయడం, తద్వారా దర్శకునికి బెస్ట్ డైరెక్టర్‌తోపాటు బెస్ట్ యాక్టర్ కూడా వచ్చే విధంగా తన రచనా నైపుణ్యాన్ని వెలికితీయడం, నిమిషానికో నీతివాక్యం వుండేలా జాగ్రత్తపడటం, నాటకంలో నాలుగైదు పాత్రలు మించ కుండా జాగ్రత్తపడటం, స్త్రీ పాత్రలేకుండానే స్త్రీ సమస్యల

గురించి రాయడం, అంతర్జాతీయ సమస్యనైనా ఆ మధ్యతరగతి కొంపలోనే చూపించాలి, కనక దృశ్య బంధనాన్నంతా రెండు కుర్చీలకీ, ఒక కాలెండర్‌కీ పరిమితం చేయడం.....

ఇలా ఆంధ్ర నాటక పరిషత్తు ప్రవేశ పెట్టిన పోటీలు తెలుగు నాటక రచనా స్థాయిని పాతాళానికి పడవేస్తే ఆ తర్వాత వచ్చిన పరిషత్తులు ఆంధ్ర నాటక కళాపరిషత్తునే మించిపోయాయి. మరలా పైన పేర్కొన్న మొదటి వాక్యంతో ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తే, సమాజాన్ని అర్థం చేసుకోవడంలో / అద్దం పట్టడంలో తెలుగు సాహిత్యం కనీసం ఒక పదేళ్ళు వెనుకబడి ఉంటే తెలుగు నాటకం దానికి మరో మూడింతలు... ఎంత లేదన్నా ఒక ముప్పయి నలభై ఏళ్ళు వెనుకబడివుంది. ఇవాళ తెలుగు నాటకరంగంలో వస్తున్న నాటకాలు, వాటి ఇతివృత్తాలు పరిశీలిస్తే, తెలుగు కథ, నవల, కవిత్వం ఈ ఇతివృత్తాలను కొన్ని దశాబ్దాల క్రితమే స్పృశించిందని మనకు అర్థమవుతుంది.

ఇలా తెలుగు నాటకానికి తెలుగు సాహిత్యానికి మధ్య ఏర్పడిన ఈ అగాధాన్ని పూరిస్తూ 1964లో ఏ.ఆర్. కృష్ణ *కీలుబొమ్మలు* నవలని నాటకంగా మలిచారు. 1951లో డా.జి.వి.కృష్ణారావు రాసిన ఈ నవలని ఆ తర్వాత కాలంలో *puppets* అనే పేరుతో దేశట్టి కేశవరావు అనే మరో రచయిత ఇంగ్లీషులోకి అనువదించారు. ప్రఖ్యాత ప్రచురణ సంస్థ మాక్మిలన్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. సాహిత్యంతో అత్యంత సాన్నిహిత్యం ఉన్న ఏ.ఆర్ కృష్ణ అప్పటికే అత్యంత ప్రాచుర్యం పొందిన అనేక నవలలు ఉండగా ఈ నవలనే ఎందుకు నాటకంగా మలిచారు అన్న ప్రశ్న తలెత్తుతుంది. దీనికి రెండు కారణాలు చెప్పుకోవచ్చు.

డెబ్బయి మంది నటీనటులు సాంకేతిక బృందంతో ఆంధ్రదేశం నాలుగు చెరగులా *మాలపల్లి*ని నూటపది సార్లు ప్రదర్శించి కృష్ణ తెలుగు నాటక రంగంలో ఒక కొత్త అధ్యాయానికి తెరతీశారు.

ఈ నవలలో వున్న వాస్తవికత, తెలుగు గ్రామీణ వాతావరణాన్ని, గ్రామీణ జీవితంలోకి ప్రవేశించిన రాజకీయాలని, విలువల పతనాన్ని ఈ నవల అత్యంత ఆసక్తికరంగా చిత్రీకరించడం మొదటి కారణంగా పేర్కొనవచ్చు. రెండో కారణం ఆ నవలలోవున్న ప్రశ్నించే తత్త్వం. కేవలం ప్రశ్నించడమే గాని రచయిత ఎలాంటి జవాబు ఇవ్వకపోవడం. ప్రముఖ విమర్శకులు ఆర్. ఎస్. సుదర్శనం అభిప్రాయంలో "In G.V.Krishna Rao's *keelu bommalu* we have the kind of Realism that raises questions without answering them. It was Ibsen who said "My concern is to put questions, not to supply answers." And Chekhov declared, "Only the question a writer puts must be reasonable. The answers may be unreasonable. But that does not invalid the work as long as it is based on a reasonable question". *Keelu bommalu* asks the question." what may be the power of a lie?. The result is a chain of events ruining families, causing bitter factions, and spreading panic, misery and disaffection all around, till the liar is crowned with political recognition and hailed as the leader of the village community! This outcome may look unreasonable, but there it is! it is a social fact !" బహుశా ఈ రెండు కారణాల వలనే ఎ.ఆర్. కృష్ణకి ఈ నవలను నాటకంగా మలచాలని అనిపించి వుండవచ్చు. 1968 లో పాలగుమ్మి పద్మరాజు రచన *ప్రియపుత్రుడు* ను ఎ.ఆర్.కృష్ణ నాటకంగా మలిచారు.

అలానే 1971లో ఆయన దర్శకత్వం లో నగ్నమునిచే నాటకీకరించబడ్డ *మాలపల్లి*. ఎందుకు *మాలపల్లి?* మరో నవల ఎందుకు నాటకీకరించకూడదు అన్న ప్రశ్నకి జవాబు, ఆయన అప్పటికే *కీలు బొమ్మలు* దర్శకత్వం చేశారు కనక సులభం అవుతుంది. ఈ రెండు నవలలూ గ్రామీణ నేపథ్యంలో సాగటం గమనిస్తే, బహుశా కృష్ణ గారికి గ్రామీణ నేపథ్యంలో వుండే భౌతికమైన ఆసక్తి అందుకు కారణం కావచ్చు.

గ్రామీణ నేపథ్యంలో వుండే భౌతికమైన సౌందర్యం, భాష, కట్టుబొట్టు, ఆటపాట... వాటిల్లో వుండే నాటకీయత దర్శకుడుగా కృష్ణగారిని ఆకట్టుకొని వుండవచ్చు. డెబ్బయి మంది నటీనటులు సాంకేతిక బృందంతో ఆంధ్రదేశం నాలుగు చెరగులా *మాలపల్లి*ని నూటపది సార్లు ప్రదర్శించి

కృష్ణ తెలుగు నాటక రంగంలో ఒక కొత్త అధ్యాయానికి తెరతీశారు. ఇంచుమించుగా అదే కాలంలో తెలుగు రంగస్థలం మీదకు వచ్చిన మరో కథ *యజ్ఞం.* నక్సల్బరీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో ఆర్థిక అసమానతలు మానవజీవితాన్ని ఎలా తలకిందులు చేస్తున్నాయో వివరించే కథ *యజ్ఞం.* ఈ కథతో రచయితగా కాళీపట్నం రామారావు ఎనలేని ప్రశంసలని, పసలేని విమర్శలని ఎదుర్కొన్నారు. కొర్రపాటి గంగాధరరావు నాటకీకరించిన *యజ్ఞాన్ని* డి.ఎస్.ఎన్. మూర్తి దర్శకత్వం వహించి విజయవంతంగా ప్రదర్శించారు.

1976 ప్రాంతాల్లో సి.ఎస్.రావు కథ *ఊరుమ్మడి బతుకులు,* వారాల కృష్ణమూర్తి *చింత చెట్టు*లాంటి కొన్ని కథలు నాటకాలుగా మారి అలరించాయి. మరలా తొంభయ్యో దశకం మధ్యలో సెంట్రల్ యూనివర్సిటీ నాటక విభాగం తెలుగు కథనీ, నవలనీ విస్తృత స్థాయిలో వేదిక కెక్కించింది. రకరకాల ప్రాంతాల నుంచి, భాషల నుంచి వచ్చే విద్యార్థుల సరికొత్త అలోచనల వలన, అప్పటికే *యజ్ఞం* కథని నాటకంగా మలచిన అనుభవజ్ఞులు డి.ఎస్.ఎన్. మూర్తి అక్కడే అధ్యాపకుడిగా ఉండటం వలన దాదాపు పాతికకు పైగా కథలు / నవలలు నాటకాలుగా కొత్త అవతారం ఎత్తి అటు విద్యార్థులకూ, ఇటు హైదరాబాదు ప్రేక్షకు లకూ కొత్త ఉత్సాహాన్ని అందించింది. డి.ఎస్.ఎస్. మూర్తి దర్శకత్వంలో ప్రదర్శించ బడిన కాళీపట్నం రామారావు గారి *చావు,* ఎలెక్స్ హేలీ రచించిన ప్రపంచ ప్రఖ్యాత నవల *రూట్స్* విశేషమైన ఆదరణ పొందాయి.

*రూట్స్* ఒక్క ప్రదర్శనకే పరిమితమవ్వగా, చావు దాదాపు పది ప్రదర్శనలు పూర్తిచేసుకుంది. *మాలపల్లి* తరహాలోనే ప్రేక్షకులకు నాలుగు వైపులా నాలుగు రంగస్థలాలు ఏర్పరచి ప్రదర్శించిన ఈ నాటకం హైదరాబాద్‌లో వున్న సాహితీకారు లందరూ చూసి ఆనందించారనడం అతిశయోక్తి కాదేమో! అలాగే గంగాధర్ అనే విద్యార్థి దర్శకత్వం వహించి ప్రదర్శించిన చలం *మైదానం,* ఆ నవలలాగే పెద్ద సంచలనం రేపింది. రాజేశ్వరీ, అమీర్‌ల ప్రణయం వేదిక మీదకు ఎలా తర్జుమా చేస్తారో అన్న ఆసక్తితో ఆ వేళ రవీంద్రభారతి సాహిత్యాభిమానులతో కిక్కిరిసిపోయింది. 1995 ప్రాంతంలో పెద్ది రామారావు దర్శకత్వం వహించిన తిలక్ కథ *బొమ్మ,* వడ్డెర చండీదాస్ *చీకట్లో నుంచి చీకట్లోకి* బొటాబొటి మార్కులతో బతికి బైటపడ్డాయి. 1997లో రసరంజని, సెంట్రల్ యూనివర్సిటీ నాటక విభాగం సంయుక్తంగా కథావారోత్సవం పేరుతో ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, ఏడురోజుల పాటు ఏడు సాహితీ కుసుమాలను వేదిక మీదకు తీసుకువచ్చారు. గురజాడ అప్పారావు *దిద్దుబాటు,* కాళీపట్నం గారి కథ *చావు,* గోపిచంద్ కథ *పతితలు,* తిలక్ కథ *దేవుణ్ని చూసిన వాడు,* శ్రీపాద సుబ్రహ్మణ్యం *కలుపుమొక్కలు,* డా. కేశవరెడ్డి నవల *చివరి గుడిసె,* రావిశాస్త్రి *ఆరు సారా కథలు,* ఈ ఉత్సవంలో ప్రదర్శించడం జరిగింది. ప్రతిరోజు ఒక్కో సాహితీవేత్త ఆ కథకీ / నవలకీ వున్న ప్రాముఖ్యం గురించి పరిచయం చేసిన తర్వాత ప్రదర్శన కొనసాగింది.

**రసరంజనిలో ఆ మరుసటి ఏడాది కథా శరన్నవరాత్రులు పేరుతో తొమ్మిది రోజులు తొమ్మిది కథలని, తొమ్మిది మంది విద్యార్థుల దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శించడం జరిగింది.**

రసరంజని ప్రదర్శనల్లో ప్రేక్షకుల కంటే రంగస్థలం మీద నటీనటుల సంఖ్య ఎక్కువగా ఉండే ఆ రోజుల్లో, ఈ నాటకాలకి విశేష సంఖ్యలో ప్రేక్షకులు రావడంతో, రసరంజని ప్రధాన నిర్వాహకులు గరిమెళ్ళ రామ్మూర్తి ఆనందం పట్టలేక విద్యార్థులకి, అధ్యాపకులకీ ఒక మంచి తేనీటి విందు కూడా ఏర్పాటు చేశారు. అదే స్ఫూర్తితో రసరంజనిలో ఆ మరుసటి ఏడాది కథా *శరన్నవరాత్రులు* పేరుతో తొమ్మిది రోజులు తొమ్మిది కథలని, తొమ్మిది మంది విద్యార్థుల దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శించడం జరిగింది.

పైన పేర్కొన్న ఈ కథ నవల నాటకీకరణలన్నీ ఎక్కువభాగం హైదరాబాదు నగరానికే పరిమితం కావడం గమనించాలి. పోటీతో సంబంధం లేకుండా, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులూ చేసిన ఈ నాటకీకరణలు అద్భుతమైన విజయాన్ని పొందగలిగాయి. కాని ఈ విజయం ఆంధ్రదేశంలోని ప్రధాన స్రవంతి పరిషత్తు

నాటకాలను ఏ మాత్రం ప్రభావితం చేయలేక పోయాయి. పైగా ఈ ప్రయోగాలన్నిటినీ ప్రయోజనం లేని ప్రయత్నాలుగా కొట్టిపారేయడం, అవన్నీ హైదరాబాదులో కూర్చొన్న 'మేధావులు' చేసే అర్థం లేని వ్యర్థాలంటూ వెటకారం చేసే తత్త్వం పోటీ నాటకాల మూసలో వున్న అనేకమంది పదేపదే అనటం గమనించాలి.

ఈ నేపథ్యంలో పరిషత్తు చట్రంలోకి కథ / నవలని తీసుకెళ్ళి తెలుగు నాటకం మూసధోరణిని కొంతవరకైనా నియంత్రించే ప్రయత్నం అత్యంత విజయవంతంగా చేయ గలిగింది. అప్పాజోస్యుల - విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్, 2001 భీమవరంలో జరిగిన అప్పాజోస్యుల పరిషత్తుకి "ఈ పుస్తకంలో వున్న ఏదో ఒక కథని నాటకంగా మలచాలి" (అని 15/20 కథలున్న *రచన* పత్రికని ఆంధ్రదేశం మీదకు వదిలారు ఆ పరిషత్తు నిర్వాహకులు.

అప్పటిదాకా ఒక్క కథ/నవల కూడా చదివిన అనుభవం లేని అనేకమంది వర్ధమాన దర్శకులు / నాటక రచయితలు ఓపిగ్గా కూర్చొని తెలుగు కథలు చదవడం ప్రారంభించారు. ఇవేం కథలు? ఒక్క కథలో కూడా 'క్లైమాక్స్' లేదు అని కొందరు, ఎలా చేసినా ఈ కథతో బెస్ట్ యాక్టర్ కొట్టే ఛాన్సే లేదని ఇంకొందరు తర్జనభర్జనలు పడి, మొత్తం మీద తొమ్మిది కథలని వేదిక మీదకు తీసుకొచ్చి పరిషత్తు చరిత్రలో ఒక అధ్యాయానికి తెరతీశారు.

రావిశాస్త్రి *అధికారి,* చలం *సుశీల,* అల్లం శేషగిరిరావు *వరుడు* లాంటి వరకు కొన్ని మంచి కథలు ఈ ప్రయత్నం వలన ప్రదర్శనలుగా రూపుదిద్దుకొన్నాయి. తెలుగు పరిషత్తు సీజన్ అప్పాజోస్యుల తోనే ప్రారంభమౌతుంది. అప్పా జోస్యుల పరిషత్తులో అది అంతటితో ఆ కథానాటకాన్ని తుంగలో తొక్కి వేరే పరిషత్తు కోసం వేరే నాటకం తీసుకునే సమయం ఉండదు కనుక, ఈ కథనే పట్టుకొని అన్ని పరిషత్తుల్లోనూ తిరగాల్సిన అగత్యం పోటీదారులకు ఏర్పడింది. దాంతో ఆంధ్రదేశంలోని అనేక పరిషత్తు ప్రేక్షకులు కథానాటకాలను చేసి ఆనందించే అవకాశం కలిగింది.

అయితే తర్వాతి కాలంలో మరో మూడుసార్లు కథానాటక పోటీలను అప్పాజోస్యుల నిర్వహించినా, ఎంచుకున్న కథల్లోని నాణ్యత, ప్రదర్శన ఏడాదికేడాది గణనీయంగా పడిపోవడం గమనించవచ్చు. కథారచయితల నుంచి నిర్వాహకులే ప్రదర్శన హక్కుల్ని పొంది కొన్ని ప్రముఖమైన కథల్ని ఎంపిక సూచించే తలనొప్పి నుంచి తప్పించుకోవడానికి అప్పాజోస్యుల పరిషత్తువారు కథల్ని ఎంపిక చేసుకునే సౌలభ్యం పోటీదారులకే ఇచ్చేశారు. దాంతో కథాసాహిత్యంలో ఏ మాత్రం గుర్తింపు లేని కథలు కూడా ప్రదర్శనకు నోచుకోవడం ప్రారంభమైంది. ఎప్పుడో రాసిన తన కథనే తీసుకొని దాన్నే మరలా నాటకంగా మలచిన సందర్భాలు కూడా తలెత్తాయి. సమకాలీన తెలుగుకథ/ నవలలకి ఈ ప్రదర్శనలు ఏమాత్రం అద్దం పట్టలేకపోయాయి. అనుకున్నదొకటీ, అయ్యిందొకటి అన్నట్టు ఇది అసలు లక్ష్యానికే ముప్పు తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

కథ / నవల నాటకీకరణ చరిత్రను, అనుభవాలని నిశితంగా పరిశీలిస్తే అసలు సమస్యని గుర్తించగలుగుతాం. ప్రపంచ ప్రఖ్యాత కథని తీసుకొచ్చి పోటీదారులకిచ్చినా అందులో పరిషత్తు పట్లు వున్నాయో లేవో అని వెతుకుతారు. లేకపోతే ఆ కథ రాసిన రచయితకి జీవితం తెలియదు అని దాన్ని మరలా పరిషత్తు పరిధిలోకి తెస్తారు. మధ్యతరగతి కష్టాలనో, రైతు బాధలనో, వార్ధక్య వ్యథలనో చిత్రీకరించిన కథలనే ఇవాళ్టి దర్శకులు నాటకాలుగా మార్చ గలుగుతాన్నారు.

ప్రదర్శించే తీరు, వేదిక మీద దృశ్యాన్ని కళాత్మకంగా (వాస్తవికంగా కాదు) సృష్టించే నేర్పు, ఎలాంటి సంక్లిష్టతనైనా దృశ్యమానం చేయగలిగే చాకచక్యం అలవర్చుకున్నప్పుడే అంత అద్భుతమైన కథలు / నవలలు మరింత అద్భుతంగా వేదిక మీదకు రాగలుగుతాయి. ఇవాళ తెలుగు నాటకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నాణ్యత లేకపోవడం, కొత్తదనం లేకపోవడం. మూసధోరణిలో కొట్టుకుపోవడం, నందిచుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఈ లోపాలను సరిచేసుకోకుండా కథ / నవలల జోలికి వెళ్ళడం వలన మనతోపాటు వాటి స్థాయిని కూడా దిగజార్చిన వాళ్ళమే అవుతాం.

---

డాక్టరు పెద్ది రామారావు
నాటక రచయిత - ప్రయోక్త
ఫోన్ : 9391005610

# ఆధునికానంతరం-కొన్ని అపోహలు

- పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

*(మిసిమి ఆగష్టు సంచిక సంపాదకీయానికి స్పందన - ఈ రచన)*

ఆధునికానంతరం అనే పదం గురించి, సాహిత్య ధోరణి గురించి తెలుగు విమర్శక లోకంలో, పాఠకులలో కొంత అనుమానం, గందరగోళం ప్రవేశించాయి. ఈ వాదానికి బలం చేకూర్చే కథలు సాహిత్యాంశాలు తెలుగులో ఎక్కువగా రాలేదు. పాశ్చాత్య సాహిత్య వీధులలో వచ్చిన చారిత్రక, సాంస్కృతిక భూమికల పట్ల ఆకర్షితులైన కొందరు తెలుగు విమర్శకులు స్థానికంగా రుజువులు చూపలేక ఈ వాదపు ఆవిర్భావ వికాస వివరాలతో వ్యాసాలు పుస్తకాలు ప్రకటించారు. అందువలన కొత్తదారులు వెతుకుదామని తలపోసిన ఉత్సాహం కలవారు సహితం, తమ రచనలు కొన్ని ఈ వాదంలోకి రావచ్చు అని ఆశపడుతున్నారు తప్ప ఈ వాదంలో ప్రత్యేకంగా రచనలు చేయడానికి ఉద్యమించలేకపోతున్నారు.

ఆధునికానంతర లక్షణాలకు భిన్నంగా ఉన్న సమకాలీన సాంప్రదాయక, ఆధునిక ధోరణులను కూడా ఇందులోకి చేర్చగలమనే ఆకాంక్ష పెరిగింది. ప్రాంతీయ మూలాలను, ఇప్పటివరకు అణగారిన వర్గాల బాధలను చాటే కథలను, స్త్రీ వాదధోరణి కథలను కూడా ఈ వాదపు కథల జాబితాలోకి చేర్చే ప్రయత్నాలు ఆరంభమయినాయి. వివాహ బంధంవీడి బయటకి వచ్చి స్వతంత్రంగా బ్రతికే స్త్రీవాద కథ నిజానికి ఆధునికానంతర కథ కాదు. ఆ వీడటంలోగల సాంకేతిక (గర్భవిచ్ఛిత్తి, జ్ఞాపకాల నిర్మూలన, భావోద్వేగాల అవరోధాల అతిక్రమణలలో ఉత్పన్నమైన అప్రకటిత న్యాయాంశాలను ఎదుర్కొనటం) నేపథ్యాలని ఊహాతీతంగా కల్పించినపుడు మాత్రమే ఆధునికానంతరంగా రూపొందుతుంది.

ఇక్కడ చిన్న పోలిక : ఇలాంటి యత్నాలు మన సైన్సుఫిక్షన్ కథలలోను జరిగాయి. సైన్సులో ప్రయోగపూర్వకంగా పరిశోధలను జరిగిన అంశాల మీద ఒక ఫలితానికి సిద్ధమైన కాల్పనిక విషయాల మీద సైన్సుఫిక్షన్ రచయితలు ఇతర దేశాల్లో ఈ రకం కథలు అల్లారు. గ్రహాంతర సత్యాలకి, విదితమైన దత్తాంశాలకీ భిన్నంగా అభూతకల్పనలను తెలుగులో సైన్సుఫిక్షన్ పేరిట వర్గీకరించుకున్నాం. అలాగే మనం ఆధునికానంతర ధోరణినీ కలిపివేసుకొనే గుణానికి సిద్ధం చేస్తున్నాం.

అన్నిటినీ ఆధునికానంతరం తన గుండెకు చేర్చుకోదు. దీనికి వేరే నడక, లక్ష్యాలు, లక్షణాలు ఉన్నాయి. ఈ వాదం చూపు వేరు, ఇది విసిరే సవాళ్ళు వేరు, దీని నిర్మాణాలు వేరు.

ఇక ఈ వాదం పట్ల ఉన్న అపోహలకు అవధిలేదు. భ్రమలకు అడ్డులేదు. ఆధునికానంతరం, కథాప్రక్రియనీ కల్పనా ప్రతిభనీ నాశనం చేస్తుందని భ్రమపడ్తున్నారు. కాని కొత్త నైపుణ్యం సంతరించుకొంటున్నవారే ఈ వాదంలో మనగలరు. రచయిత, పరిశీలకుడిగా, విలేకరిగా పాత్రలు పోషించటంమాని, లీనమై కథని రచించే అవకాశాన్ని ఈ కథలు కల్పిస్తాయి. ఇది ఆహ్వానించదగిన పరిణామమే కదా. సామాజిక వాస్తవాన్ని చెప్పనీయకుండా ఈ వాదం కథ, సమాజానికి చెరుపు చేస్తుందని మరో భ్రమ. నీ చేతిలో లేని, నీకు సంబంధం లేని వర్గాల నుండి, వాస్తవాల నుండి నీకు ప్రమాదం, విపత్తు పొంచి ఉన్నాయని హెచ్చరించటం కన్నా సామాజిక వాస్తవికత ఏముంది? ప్రమాదాల సంఖ్యను అంచనావేయడం మంచి యుద్ధనీతే కదా. ఇది మానవసంబంధాల మీద ప్రతిష్ఠితమైన కథా ప్రపంచపు ఉనికిని ప్రశ్నిస్తుందని మరొక భ్రమ. ఇది అభ్యుదయ సాహిత్య వ్యతిరేకి అనే పెట్టుబడిదారుల జాలమని ప్రచారాలు జరుగుతున్నాయి. కాని సృజన ధర్మాలను కొత్త వలయంలోకి నెట్టి పాఠకునికి ఉత్తేజం కల్గిస్తుందని మరచి పోతున్నారు. పెరటి నుంచి కొత్త ప్లే గ్రౌండ్‌లోకి రచయితలనే క్రీడాకారులను తీసుకుపోగలదని నమ్మటం లేదు. ఇది విసిగించే శైలినిస్తుందని, పాఠకుని తాదాత్మ్యాన్ని నాశనం చేస్తుందని అపోహలున్నాయి. కాని కొత్త సవాళ్ళను విసిరి రచయిత వ్యుత్పత్తికీ, సామర్థ్యానికీ మేలు చేస్తుందని మరచిపోతున్నారు.

ఈనాటి కథ, నవల సాహిత్య రచనలతో తృప్తి చెందని చదువరులు సంతోషిస్తారని తెలుసుకొనలేకపోతున్నారు. అంటే జారిపోతున్న పాఠకులను నిలువరించగల శక్తి ఈ ధోరణికి ఉంది. మన రచయితలలో సైన్సు సాంకేతిక విద్యలలో రాణించినా ఈ ధోరణిలో కోకొల్లలు. మనకు ఈ ధోరణిలో కొత్తరకం వంగడాలను ఊడ్చగల, పెంచగల, నూర్చగల రచయిత రైతులు ఎంతో అవసరం. మంచి రచయితల సృజన ధర్మాలను తృప్తిపరచగల గుణాలు ఈ వాదంలో ఎన్నో ఉన్నాయి.

శైలి, చమత్కారం, పాత్రపోషణ, ఉత్సుకత వంటి లక్షణాల ద్వారా ఇంత వరకు పాఠకునికి అనుభవంలో తట్టని రమ్యతని ఆధునికానంతర రచనలు ప్రసాదిస్తాయి.

ఆధునికానంతర వస్తువు గల ఇంగ్లీషు చిత్రాలు టి.విలో రోజూ కనబడుతూనే ఉంటాయి. వాటిలో ఒకటి రెండు సంభాషణా శకలాలను చూద్దాం :

**మేట్రిక్స్ చిత్రం నుండి :**

"నేను మెదడుని, శరీరం నుండి ఎలా విడగొట్టుకున్నానో చెప్పు"
"శక్తి వల్ల, ప్రపంచానికి అవతలనున్న కాలం వలన"
మరొకటి –
"నన్ను గుర్తించగలవా?"
"దాన్లో ఒక భాగాన్ని గుర్తించగలను"
ఇంకొకటి –
(నీగురించి ఏమనుకున్నావంటే అని ప్రశ్నించాక)
"సమీకరణలో మార్పు తెచ్చే గుణకాన్ని"
(వేరియబుల్ ఇన్ ఈక్వేషన్)
"ఆ గుణకాలను పరిష్కరించు"
మరొక చిత్రం నుండి :
"చర్యకు మాట ఉంటుంది. మాట్లాడ్తుంది"
"ఫలితాలు భాషాతీతం"

మరికొన్ని :
"చంపగలవా..."
"ప్రేలుడు మందు..."
"గురి తప్పదా..."
"లోహం..."
"ప్రయత్నించు..."
"యత్నం... (design)"

ఇటీవల ఒక తెలుగు సినిమాలో...
"ఏరా..."
"ఇంకేంటి..."
"అయితే ఉంటా..."
"గొప్పోడివిరా..."

ఈ ఆధునికానంతర సంభాషణలకు భిన్నంగా మనకథలో, చిత్రాలలో వచ్చే సంభాషణలు కేవలం పాత్ర మధ్య బంధాలకు వేసిన వెదురు వంతెనల వంటివి. ఈ వెదుళ్ళు విరిగి పోయేవి. ఆలోచనలు పెంచలేనివి. వాటిని వదిలి వేసినా పాఠకుడు నష్టపోడు. సూర్యకిరణాలవలె మేలుకొలిపే ఆలోచనలు కల్గించి, బంగారమంత సాంద్రతగల సంభాషణలు రాయాలనుకోవడం నుంచి రచయితకుండవలసిన లక్షణం. అది ఈ ఆధునికానంతర కథా రచనలోనే సాధ్యపడుతుంది. ఇక్కడ పాత్రలు రాల్చే కన్నీళ్ళు ఆర్చుకుపోయే ఉప్పునీళ్ళ చారికలు కాదు. బలమైన ముద్ర వేసే రసాయనాలు. ఇవి పాత్రోన్మీలనకూ, సంఘటనకూ విశ్లేషించే మార్గాన్ని చూపవచ్చు. క్రొత్త దృశ్యాలకు ప్రేరణ కల్గించవచ్చు. కొత్త వాహికలు నిర్మించే సంభాషణలు ఈ వాదపు రచనల్లోనే సాధ్యం.

రక్తికల్గిస్తూ పాఠకుని లీనం చేసే సన్నివేశాల కల్పనకు ఆధునికానంతరం అవకాశమీయదని అపోహ. పాత్రని ప్రమాదం నుండి బయటకు పడవేసే ఘటనల చిత్రణే రక్తికి మూలం. ఈ వాదపు రచనలలో పాత్రలు నడిచే వ్యాకోచ సంకోచాల అవధి ఎంతో ఆకర్షకంగా ఉంటుంది. కార్య కారణ సంబంధం వేగం, విచ్ఛిత్తి కల్పన పాత్రల ధీరోదాత్తతను ప్రదర్శించే ఘటనల కూర్పు ఎంతో నేర్పుతో జతకట్టగల పరిధి ఉంటుంది.

ఆకాశంలో క్షిపణుల ప్రమాదాల ప్రతిఘటన నుండి సముద్ర గర్భంలో ఊహాతీతమైన జల చరాల రెక్కల దంతాల ఎదురు దాడుల వరకూ ఈవాదపు రచనలలో కల్పించవచ్చు.

కొన్ని సామ్యాలతో మూడు రకాల వాదాలలోని కథావస్తువుల కూర్పును గ్రహించగలిగితే ఆధునికోత్తర వాదం తీసుకొనే సామాగ్రి ఎలా ఉంటుందో తెలుస్తుంది.

| 1. కాల్పనిక వాదరీతి : | 2. ఆధునిక రీతి : | 3. ఆధునికానంతరం : |
|---|---|---|
| **మోకాలు విరిగిన మనిషికథ:**<br>వాపుకనబడటం, గుడ్డ కాపడం, పసరుపట్టీ ఎక్కువకాలం చికిత్స మరణభయం, ఆందోళన వీటి చుట్టూ కథ నడపటం ఒక పద్ధతి. బ్రతకదేమో పాత్ర అనే సందర్భం చర్చించ బడుతుంది. అపనమ్మకం నిరాశ కేంద్రాలుగా ఉంటాయి. | ఎక్స్‌రే పరీక్షలు, తేడాలు, రోగ నిర్ధారణ, ఎముకలు అతికే విధంగా సిమెంటు కట్టు, స్థానికంగా ఇచ్చే మత్తుమందు. కొంత భయం తగ్గిన ఆందోళన, మరణ భయం లేదు, వీటిచుట్టూ కథ సాగుతుంది. మనిషి బ్రతుకుతాడు కానీ కుంటి, అవధ్యుడా? అనే అనుమానం కొంత నమ్మకం. | చటుక్కున సాగే పరీక్షలు మత్తుమందు లేక పోవటం లేజర్ చికిత్స కణాల ప్రతిక్షేపించటం. అతి నమ్మకం, తాత్త్వికతతో నిబ్బరం తక్కువ సమయంలో కోలుకొనే రోగి, ఆందోళన లేమితో రోగి వీటి చుట్టూ కథ నడప వచ్చు. పాత్ర గతం కన్నా, శైలి వంటి ఇతర అంశాల చర్చకు అవకాశం. మనిషికి ధోకా లేదు. అదొక చిన్న ఘటన అనే దృష్టి ప్రముఖంగా కనబడుతుంది. పూర్తి నమ్మకం. |
| **ఆనకట్ట కథ :**<br>జమీందారు నీటికి అడ్డుకట్టవేస్తే, ఏమీ చేయలేని రైతు దీనాలాపన, జమీందారుకి కనువిప్పు. వ్యక్తులపై దమననీతి లేదా పశ్చాత్తాపం. ఇవి చర్చితాలు. | అనుమతులతో ఉన్నా డామ్ కడ్తే నిర్వాసితుల వెతలు సంఘటిత పోరాటం, న్యాయస్థానమిచ్చే ఊరట విజయం, అపజయం చర్చకు వస్తాయి. వ్యవస్థల మధ్య ఘర్షణ– ఇవి కనబడేవి. | గుర్తు పట్టలేని పోలీసుల జులుం, ఊహించని ఆయుధాలతో దాడి, ప్రతిగా నిర్వాసితుల యుక్తులు వంటివి దృశ్యంలోకి వస్తాయి. తెలియరాని అస్త్రాల లోకం. |
| **సముద్రంలో వేట :**<br>వేటకి వెళ్లడం, వాతావరణం తెలియకపోవటం, గంగమ్మ తల్లి దయతో వెనక్కిరావటం, ప్రకృతితో సఖ్యత లేదా విషాదం. బ్రతికివస్తే బెస్తవాడి పట్టుదల మనిషి జీవకాంక్ష. మృత్యువుతో జాలరి వీరమరణం. చేప అంతరంగం వర్ణితం కాదు. | మరపడవలున్నాయికదా అని గర్వం. బెస్తవారి సాహసం. రంపంతో ఇనుప బల్లెంతో చేప శత్రువు సంహరణ. ప్రకృతితో వ్యూహాత్మకంగా తల పడటం. మందు గుండు పాత్రతో సొరచేప మరణం. మానవుడి విజయం. చేప పోరాటం కొంతైనా వెలుగు చూస్తుంది. | సముద్రంలో బెస్తవారిని ఊహించ లేని జలచరాల దాడివల్ల వచ్చిన మందు కందని రోగాల ముట్టడి, బయటపడ వేసే ఏదో చేప మందు చూపిన బెస్త యువకుడు. చివరికి విజయం మనిషిదే అన్న గర్వ సిద్ధి. అనేక పోరాట, సహజ వ్యూహాల కూడలి. సొరచేపలకు కూడా పూర్తి పాత్రగా కల్పనకి అవకాశం. |
| **పరివార కథలు :**<br>భాగమతి, జోదా అక్బర్, సోనీమహివాల్, హీర్ రాంజా ఇతి వృత్తాలను వాటిని సుందరీ సుబ్బారావు ప్రేమకథలు, భర్త వదిలేస్తే పుట్టిల్లు చేరిన ఆడబిడ్డ కథలు రైతు కూలీల గుమాస్తాల ఆర్థిక దీనావస్థలు బిడ్డలు లేని తల్లుల కథలు.<br>కుటుంబ మానవ సంబంధాల వలయాన్ని ఛేదించలేని బంధాన్ని వర్ణిస్తాయి. అసహాయతకీ, కరుణా రసానికి పెద్ద పీట. సిద్ధించని ఆశలకు ఊరటగొల్పే ప్రయత్నాల చర్చ. | పాలన వ్యవస్థ ఆలోచించే మనసు స్వాభిమానం బ్రతకాలనే ఆకాంక్ష పోరాటం– ఇవన్నీ రక్షణవలయం ఏర్పరుస్తాయి. యుద్ధంలో భర్త మరణించాడని తెలిసి రెండో పెళ్ళి చేసుకుంటే భర్త ప్రత్యక్షం కథ. ఇష్టంలేని గర్భం వస్తే కాదన్న వంచిత కథ. చట్టానికి తలవంచక సాయపడిన వైద్యురాలి కథ. భయం దూరం చేసే కథలు. నిలబెట్టే కథలు.<br>ప్రజాస్వామ్య యుగం తెచ్చిన చట్టాలకు మార్పులకు యాంత్రిక | తన ఉనికిని చాటు కోవడానికి స్వయం చాలిత ట్వీటులను పంపి కంప్యూటర్లను పక్కదారి పట్టించిన 17 సం॥ కుర్రవాడి కథ. పాసవర్డుకు రక్షణ, బ్యాంకు ఖాతా నంబర్లకు రక్షణ కల్పిస్తూ ప్రతి వ్యవహారాన్ని వెంటనే సిద్ధం చేసిన మరొక యువకుడి కథ, మంచి కథలవుతాయి.<br>అణుధార్మికత వలన కోలుకోలేని రోగాన్ని, వైకల్యాన్ని పొందిన ప్రేమికుని ధైర్యంగా చంపిన ప్రేయసి కథ. అంగ వైకల్యంతో జనించవచ్చని గర్భం |

**1. కాల్పనిక వాదరీతి :**

నిషేధాల ముసుగులో కాల్పనిక వాద ఊహల వ్యవసాయం. సొంతతనం (ప్రయివసీ) కి కుటుంబ ఆచ్ఛాదన.

మధ్య తరగతి నైతిక విలువలు-వంశపారంపర్య గౌరవ మర్యాదలు, వ్యక్తిగతంగా రాష్ట్ర, దేశరాజకీయాల్లో ప్రవేశం- డబుల్ బారెల్ గన్, రివాల్వర్.

**2. ఆధునిక రీతి :**

నాగరికతకూ విశాల వేదిక. సాంఘిక మానవశాస్త్ర వికాసగతులకు స్థానం కల్పించిన అవకాశవాద గతిశీలత. కొంత సొంతదనం.

చారిత్రక అవగాహన, అభివృద్ధి, సాంకేతిక పదజాల ప్రయోగం, సంస్కృతీ సంప్రదాయ పరమైన తాంత్రిక విశ్వాసాలు.

ఎ.కె-47; రిమోట్ ఆయుధాలు.

**3. ఆధునికానంతరం :**

తీసివేసుకున్న ప్రియురాలి కథ, మంచి కథలవుతాయి. టెక్నాలజీ వ్యవహారాలను ఎంత సిద్ధం చేస్తే అంత బిగింపు.

అసాధ్యపు ఊహలకూ మానవ మేధకు చలువ పందిరి. మనల్ని శాసించే సాంకేతిక టెక్నాలజీ బలాలకు లొంగిపోక ఎదిరించే టెక్నాలజీ, ఆయుధాలకు ప్రతిక్రియలకు ఆకాశ మంత తార్కిక పందిరి.

. . . . . . . . . . . . . . . . . . . .

ఒక్కసారి కవిత్వ విధానం ఆధునికాంతర దృష్టితో చూస్తే ఎలా ఉంటుందో గమనిద్దాం: వస్తువు, ఆలోచనల దారి, సంభ్రమ వ్యూహం ఎలా ఈ రంగంలో చోటు కల్పించుకుంటాయో చూద్దాం.

**ఆధునికానంతర కవిత :**

డేవిడ్ షాపిరో - 1947 : న్యూజెర్సీలోని నివార్క్‌లో జన్మించిన షాపిరో వయొలినిస్టు. తర్వాత సాహిత్యంలో డాక్టరేట్ పొంది కొలంబియాలో సమకాలీన సాహిత్యం బోధించాడు. కవి కెనెత్ కోచ్ వల్ల ప్రభావితుడయ్యాడు. ఆయన ఆత్మ - ప్రతిక్రియాదృష్టికి కారణం జాన్ ఆష్ బరీ కవి. కవిత్వంలో అమలిన శృంగార భావాలను కాదంటూ, అధికార సోపాన పరంపరకు వ్యతిరేకంగా అన్ని రకాల విభజనలను చెరిపి వేసే కవిత్వం రావాలి అంటారు. “కవిత్వం వక్రోక్తిపై ఎప్పటికీ అధికారం సాధించ లేదు. అది ఇప్పుడూ, రేపూ వక్రోక్తిని సాధించే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది” అంటారు.

**గాజు పుస్తకం**

బల్లమీద ఒక గాజు పుస్తకం.
పుస్తకంలో కొన్ని పుటలు మాత్రమే పదాలు లేకుండా
కానీ వజ్రపు మొనగల పెన్సిల్‌తో ముక్కలుగా గీసిన
ఐమూలగా సాగే సుడులు సన్నటి త్రిభుజాలు; నిశ్శబ్ద
ఉచ్చారణ చాటే పగిలిన ఫ్రెంచి వలయాకార రేఖలు.
వాటిని వెనుక నుండీ
ఆఖరి పుటలు నిరాడంబరంగా.
ఆమూలాగ్రంగా చదవగలం.
పరిహాసాస్పదమైన ప్లాస్టిక్‌లా ప్రతిపుటా కాస్తముదుచు కుంటుంది.
దాన్ని రాసినవాడు లాలసగలవాడు బలం పొందినవాడు, పూర్తిచేసివాడు
పిల్లలకి, వస్తువుల లోపల బయటల గురించి బోధిస్తూ
వస్తున్నవాడు, రెంబ్రాంట్ చిత్రాలను బోధించేవాడు.
అతనికిద్దరు అందమైన భార్యలు వారిప్రక్కనే బిచ్చగాడిలా
మృత్యువు. అమూర్త వ్యక్తి అంటే ఏమిటి?
రంగుల చిత్రకారుడు దర్శిస్తాడు, కాని అతను పరిమళాన్ని చిన్న ఇంజక్షన్
గాజు బుడ్డీలలో చూస్తే ఇంకా మంచిదనుకొంటాడు.
నేనుగాజులో ఒక పుస్తకాన్ని చూస్తాను - పదాలు నిష్క్రమిస్తాయి.
మాట్లాడని విశృంఖల పల్టీలతో. నేను మేల్కొని తీరాలి
వాటిని పాడి చెప్పాలి ! పక్కమీద, తల్లి ప్రతిశిశువూ
చెక్కినవి కల్గిన పుస్తకం అందుకొంటాడని చెప్తుంది, కానీ



**డేవిడ్ షాపిరో**

పుస్తకం అసంపూర్ణం, అంతే కదా.

నేను గాజు పుస్తకం తయారు చేసి తీరుతాను. **రచనాకాలం : 1988 ఎ బుక్ ఆఫ్ గ్లాస్ - డేవిడ్ షాపిరో**

"ఆధునికానంతర కవులకు భాష అర్థభావాల అనుసరణ కాదు, అది ఏకపక్ష వివరణ. రహస్యాత్మకంకాదు, సందేహాత్మకం, జీవసంబంధి కాదు, కట్టినది" అని వేరే సందర్భంలో ఇయాన్ గ్రెడ్‌సన్ విశ్లేషించాడు.

అసలు ఆధునిక ధర్మాలు ఏమిటో, ఆధునికానంతర రీతి అందించే మౌలికమైన ఏర్పాట్లు ఏమిటో బేరీజువేసి భేదాలు, కొనసాగింపులు తెలుసుకుంటే అనుమానాలు నివృత్తికావచ్చు :

**ఆధునిక వాదం :**

★ అనేక కళావిజ్ఞాన శాస్త్రాలలో నెలకొన్న వాదం

★ 1863లో కవి బాడ్లేర్ *'పెయింటర్ ఆఫ్ మోడరన్ లైఫ్'* లో ఈ రీతిని ప్రతిఫలించినా 1750 నుండి ఈ ఆలోచనలు యూరప్‌లో పాదుకుంటూనే ఉన్నాయి.

★ పాఠక సమయాన్ని లగ్నం చేసే రచన



**వర్జీనియా ఉల్ఫ్**

★ 1910 లో వర్జీనియా ఉల్ఫ్ మనిషి పాత్ర మారిందని చెప్పింది.

★ 1922 ఎలియట్ *'వేస్టులాండ్',* జేమ్స్ జాయిస్ *'యూలిసెస్'* ప్రకటించారు.

★ అర్థవంతంగా, నప్పే విధంగా ఐక్యతగా కనబడుతూ– నిలకడ, పూర్ణత్వం, సువ్యవస్థితమైన రూపాల వైపు సాహిత్యం వైపూ దారి చూపుతుంది.



**ఎలియట్**

1914–20 వరకు మొదటి ఆధునిక వాద దశ ముగిసిందని 20 నుండి రెండవ ప్రపంచ యుద్ధం వరకు, తర్వాత నవీన ఆధునిక వాదం సాగిందని కెర్మోడ్ భావించారు.



**జేమ్స్ జాయిస్**

★ విచ్ఛిన్నమయిన దశలను చూసి దుఃఖిస్తూ రచనలు చేస్తుంది. ఇది వాస్తవ వాది.

★ మొదటి దశ విపణి పెట్టుబడిదారీ వ్యవస్థ. ఆవిరి యంత్రాల విపణి పెరుగుదల కాలం 1920 వరకు. రెండవ దశ గుత్త పెట్టుబడిదారీ కాలం, ఎలక్ట్రిక్ పరికరాల విస్తరణ, అమ్మకాల కాలం. రెండవ ప్రపంచ యుద్ధ కాలం వరకు.

★ 60లలో ఉత్పత్తుల వికేంద్రీకరణ జరిగిన తర్వాత యూరపు దేశాలలో ఈ భావాలు వేరే రీతులకు దోహదం చేశాయి.

**ఆధునికానంతరవాదం :**

★ ఒకే సారి చదివించి తీరాలని లేదు.

★ కాల్పనికవాదం, ఆధునిక వాదం వలె, ఇదికూడ అంతకు ముందున్న రీతుల కాలంలో పుట్టి–పెరిగి ప్రభావితమౌతూ పెరిగింది. సరైన ఏదో సంవత్సర నుండి విడదీయలేం.

★ 1960 నాటికి ఈ వాదం స్థిరపడసాగింది.

★ ఈ రీతికి 1968లో అమెరికా యూరప్‌లలో వచ్చిన యువాభ్యుదయ పరిణామాలు కారణమయ్యాయి.

★ 1970లో ఇహాబ్ హస్సన్ ఈ పేరును ప్రచారంలోకి తెచ్చాడు.

1971లో ఇహాబ్ హాస్సన్ *'గ్రీకు కవిత్వ దేవత వాద్యకారుడు ముక్కలయ్యాడు ఆధునికానంతరవైపు'* అనే పుస్తకం రాశాడు.

★ విచ్ఛిత్తిలో కూడా అర్థాలను వెతుకుతుంది. విచారించదు.

★ బహుళ జాతి కంపెనీల వినియోగదారుల విపణి అమ్మకాల, పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చాక విస్తరించింది. 1960ల నుండి.

★ అణు బాంబుల తయారీ, ఎలక్ట్రానిక్ వస్తువుల విస్తరణ, జన మాధ్యమాల విస్తరణ మీద విస్తరించిన సంస్కృతీదశ. ఉత్పత్తి లేకుండానే అమ్మకాల ప్రపంచీకరణ దశ.

★ అన్నిటినీ ప్రశ్నిస్తుంది. మాటలే నాయకత్వం వహిస్తాయంటుంది. అసలు వస్తువు కంటే దానిని చర్చించే మాటలతోనే ప్రపంచమంటుంది. ఉపరితలానికే పట్టం, లోతుతో పనిలేదు.

**ఆధునిక వాదం :**

★ కార్య కారణసంబంధి లోతైనది. యుక్తాయుక్త ఆలోచనలతో నడిచేది, లోతైనది.

★ 'కమలం ఆకాశం, కర్చీ' - ఇలాటి వస్తువుల చుట్టూ పదాలతో ఊహల వాస్తవాలను చిత్రించ వచ్చును. వర్ణింప బడినదే వస్తువు చుట్టూ భాష కొన్ని వ్యాకరణ, భావ అలంకార సామగ్రిని కూరుస్తుంది.

★ భాగాలు ఐక్యతనివ్వలేవు, రూపం అసంపూర్ణంగా వుంటుంది. ముక్కలు రూపంకావు.

★ నాటక సాహిత్యంలో మానసికంగా స్థిరచిత్తులైన పాత్రల చిత్రణ వసుధైక కుటుంబ దృష్టి

★ ముందుకు పోయే ప్రత్యేకంగా కనబడే నమూనా

★ బృందగాన నృత్యాలలో సాహిత్య కథా పురాణ వస్తు గ్రహణ ఆనందం కల్గించే సంగీత వినియోగం.

★ సారూప్యతలకు, సామ్యాలకు వెతుకులాట. ఫొటోగ్రఫీ, మాస్ మీడియాతో తంటాలు.

★ పాత పద్ధతులను మాత్రమే ఆచరిస్తుంది చదివేదారిలో అవరోధాలను ప్రతిఘటిస్తుంది.

★ ముందున్న పద్ధతిని వదిలించుకోదు. పూర్తయిన చిత్రం-ముంగింపువున్న కథ-నవలలు; గిరి గీసుకొని వృత్తంలోనే వుండిపోతాయి.

★ పాఠకుడికి విషయం సుబోధకం చేయడమే ఘనత.

★ కొన్నిటిని తీసివేస్తూ ముగింపుకు చేరుస్తాయి.

★ ఒక క్రమమైన వరుసలో కూర్చబడతాయి.

★ ఒక దానిమీద ఒకటి ఆధారం- ముడివేసుకుంటూ ముందుకు వెళతాయి.

★ క్రియలకు (భూతవర్తమాన భవిష్యత్ కాలాలవంటి) రూప పరివర్తనం ఉన్నట్లుగా ఈ రీతిలో కథ నపడవచ్చు.

**ఆధునికానంతరవాదం :**

★ ఆ పదాలన్నీ వస్తువులను మింగేస్తున్నాయి. కనుక అక్కడ వస్తువులు లేవు. మీ పదాలే ఉన్నాయి వాటిదే రాజ్యం. మీరనుకున్న వాక్య నిర్మాణాలు లేకున్నా భాష వుంది. భాష లేకున్నా వస్తువు వుంది. ఏభాషా పదము వస్తువును పూర్తిగా వర్ణించలేదు.

★ శకలాలు కూడా అర్థవంతాలే, అర్థసూచికలే. నిశ్శబ్దం, నిశాంతం కూడా మాట్లాడతాయి. వాటితో కొత్త అలంకారసామగ్రి, రసానుభూతి, నిరలంకారసజ్జ నిర్మించవచ్చు.

★ అగ్రగామి అయినా ప్రత్యేకత కల్గిన క్రొత్తదనం.

★ బృందగాన నృత్యాలు తెలుసున్న సుప్రతిష్ఠితమైన సాహిత్య సంప్రదాయాల నుండి తీసుకు తీరాలని లేదు. కథను గుచ్చాలని లేదు. అసౌకర్యపు శబ్దాల నుండీ కూడా ఒక కూర్పు కోసం ప్రయత్నం సాగవచ్చు.

★ సాహిత్యం కాని అంశాల నుండి తీసుకున్న బాషా వినియోగం ప్రాధాన్యం వహిస్తుంది.

★ పాతవాటిని కాదనలేదు.

★ సాధారణ అవరోధాలను చిగురింప చేస్తుంది.

★ కథ (ఫిక్షన్), ప్రపంచం ఈ రెండూ ఒకదానిలో ఒకటి చొచ్చుకుంటాయి.

★ టైము ఫ్రేములు - కాల ప్రాకారాలుంటాయి.

★ ఇతర మాధ్యమాల సాయంతో సాగించవచ్చు. ఒక్కొక్కసారి నవలా భాగంలా ఉండవచ్చు. వివిధ పఠన శకలాలు కలిపి కుట్టినట్లుండవచ్చు. కలలు సాహిత్య అంతర్భాగం కావచ్చు.

★ కావాలని క్లిష్టతరం చేయవచ్చు. కేంద్రీకరణ జరుగకుండా చాంచల్యం చొరబాట్లు పెట్టవచ్చు.

★ ముగింపు లేకుండా సంబంధాన్ని చాటుతాయి.

★ సంబంధం లేని వరుసక్రమం. కథ వృద్ధి చేయడంలో లాజిక్కుండదు. గుచ్చెత్తటంలో లాజిక్కు ఉండవచ్చు. ఇంటిఅమ్మకాన్ని పోస్టు కార్డుల ద్వారా సమాంతర సంఘటనలను సూచిస్తూ ఏకత్రం చేసిన ఒక 'అమ్మకం' కథ ఉంది.

★ నామవాచకం వలె అవరోహణ (డిక్లయిన్) చెందు తుంది. (పూర్తి పేరు ముద్దు పేర్లు సర్వనామము ఒకటే అక్షరంలా పాత కథ)

| ఆధునిక వాదం : | ఆధునికానంతరవాదం : |
|---|---|
| ★ ప్రపంచాన్ని ఆవహిస్తుంది | ★ ప్రపంచాన్ని – అలలమీద యాత్ర చేసేవాడిలా – అధిగ మిస్తుంది |
| ★ ప్రపంచమొక వ్యతిరేకి | ★ వ్యతిరేకి కాదు, ప్రపంచమొక తోడు |
| ★ కెరటంలోపల ఏముందో అని వెతుకు లాడుతుంది. | ★ కెరటం కంటె ముందుంటుంది |
| ★ క్లుప్తంగా కూడా చెప్పడం | ★ అధికంగా ఉండటమే సారం |
| ★ సంఘటనలను కూర్చుతూ సాగుతుంది. వస్తువునీ పాత్రనీ ఎప్పుడూ చెదరనీయని దృష్టిలోనే కేంద్రీకృతం చేస్తుంది. | ★ సంఘటనలు చేరటాన్ని చెడగొడ్తుంది. వస్తువునీ లక్ష్యాలను చెదిరేలా చేసే మసకలో చూపుతుంది. ఫోకస్‌లో ఉంచదు. కొంత ఫోకసులో ఉంచవచ్చు. |
| ★ అస్పష్ట పదాలను వదలి వేదిస్తుంది | ★ పదాలపోలిక తెచ్చి అస్పష్టత నుండి ఆనందాన్ని తెస్తుంది. |
| ★ బుద్ధితో ఆలోచించమంటుంది | ★ మెదడుకు ఆపేరెందుకు, సరైన నిర్ణయం తీసుకోలేదు కదా! అనే ఫ్లా బర్ట్ మాటను గౌరవిస్తుంది. |
| ★ వస్తువును నియమాల ప్రకారం నప్పుతుంది. | ★ వస్తువును నియంత్రించదు. |
| ★ గాలివేరు నమ్మకం వేరు అనుకుంటుంది. ఆ ధర్మాల ప్రకారం కవిత్వం ఉండాలి. | ★ కవిత్వంలో ''గాలి ముద్దగా తగిలినప్పుడిచ్చే నమ్మకంలా'' కలుపుకోమంటుంది. |
| ★ శబ్దానికి ధర్మాలుంటాయి పాటించాలి శబ్దాన్ని నమ్మి రచించాలి. | ★ ఆదిలో శబ్దముండెను అన్నారు కదా! "ఆపండి, నాకు సాయం చేసేదెవరు? మాటమీద అంత నమ్మక ముంచటం అసాధ్యం'' అన్నారు. కదా ఫాస్టు. మాటమీద నమ్మకం పనికి రాదంటుంది. |

. . . . . . . . . . . . . . . . . . . .


ఇయాన్ గ్రిగ్‌సన్

(ఈ వివరాలకు మూలాలు ఆక్స్‌ఫర్డ్ వారి సాహిత్య పదకోశం, ఇతర పుస్తక రచయితలు, విమర్శకులైన మేరీ క్లాజెస్, ఇయాన్ గ్రిగ్‌సన్, స్టీవెన్ జాన్ సదర్‌లాండ్)

ఆధునికానంతర వాదాన్ని ఇంత దగ్గిరగా గమనించాక మన సాహిత్యలోకాన్ని మరో మంత్ర జలంతో మార్చేందుకు ఎన్నో జలనిధులున్నాయని తోస్తోంది. ఒక్కసారి దారి కనబడితే ఎంతటి పర్వతాన్నీ ఎక్కడం ఆరంభిచవచ్చు. ఎందు చేతనో ఒక ఆధునిక సాహిత్య వీధిని కనుగొనటానికి మనం కనీసం నాలుగు దశాబ్దాలో, ఆరు దశాబ్దాలో వెనుకంజలో ఉంటూ వచ్చాం. టెక్నాలజీ ఉత్పత్తులు మాత్రం ఆరు నెలల్లోను, కెమారాలు రెండు సంవత్సరాలలోనూ మన విపణికి చేరుతాయి. ఎంతో త్వరగా అక్కడి లాప్‌టాప్‌లూ, సెల్ ఫోనులూ వెంట వెంటనే దిగుమతి చేసుకుంటున్నాం. ఆంగ్ల చిత్రాలయితే అదే రోజు ఇక్కడా విడుదలవుతున్నాయి. ఇవన్నీ వెంటనే ఆనందాన్నిచ్చే ఉత్పత్తులు, కాని సాహిత్యం, శ్రమతో, కృషితో, బుద్ధితో పని. అందుకేనేమో ఇంత ఆలస్యం! ఆధునికానంతర కోశంలో ఎంతో ప్రయోగరాశి ఉంది. తెరచి పంటనెత్తికెత్తు కుంటారని ఆశ. విచారించవలసిన విషయం తెలుగులో ఆధునికానంతర సాహిత్యం రాకుండా సాహిత్య విమర్శ జరుగుతోంది. మి

పన్నాల సుబ్రహ్మణ్య భట్టు
విశ్రాంత ఆకాశవాణి నిర్మాత; అవిశ్రాంత అధ్యయనశీలి,
ఫోన్ : 0866-2475120.

నార్ల వెంకటేశ్వర రావు

# సీత జోస్యం (1981)

- ప్రొ. రావినూతల సత్యనారాయణ

**భూమిక:**

రామాయణాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించే వారికి దానిలో అనేక వైరుధ్యాలు దర్శన మిస్తాయి. ప్రప్రథమంగా రామాయణం జరిగిన విషయమా? అలాగైతే దానిని దృఢ పరిచే చారిత్రక ఆధారాలేవైనా లభ్యమైనవా? వాటి వివరాలేమిటి? అవి సత్యాన్ని వెల్లడించ గల్గినవా? ఏయేచరిత్ర కారులు ఎలాంటి నిష్కర్షలకు రాగలిగారు? అవి సమగ్ర వివేచనతో కూడి, తర్క సహిత మైన శాస్త్రీయ దృక్పథంతో కూడినవేనా?

పైన వివరించిన ప్రశ్నలు అనేక మేధావులను, ఆలోచనా పరులను చేసి కలచి వైచాయి. వారి నిరంతర పరిశోధనకు, కృషికీ కారణ మయ్యాయి. అలాంటి మేధావులలో నార్ల వెంకటేశ్వర రావుగారు (వి.ఆర్.నార్ల) పేర్కొన తగిన వారు.

నార్లవారు అర్ధ శతాబ్దికి పైగా భావ ప్రకటనా స్వేచ్ఛకై అవిరాళ కృషి సల్పిన ప్రతిభాశాలి. తెలుగు ప్రత్రికా రంగంలో ''ఎవరెస్టు'' శిఖరాన్ని అధిరోహించిన అగ్రగణ్యులు (అతిరథుడు). అజ్ఞాన తిమిరం, మూఢ నమ్మకాలు, నియంతృత్వం మొదలైన సంఘ నిరోధక శక్తులకు విరుద్ధంగా అలసటెరుగని పోరాటం సల్పిన సంస్కర్త. అంతేకాదు, నార్లవారు కవీ, నాటక కర్త, వ్యాస రచయిత, పరిశీలనాత్మక విమర్శలో అందెవేసినచేయి. అనేక గ్రంథాలను రచించి పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన వారు. అంతటి విశిష్ట వ్యక్తి రామాయణాన్ని నిశిత విమర్శనా దృష్టితో పరిశీలించి, అనేకమంది విద్వాంసులు, చరిత్రకారులు, విమర్శకులు రామాయణాన్ని గురుంచి పరిశోధనలు జరిపి రచించిన పలు గ్రంథములను ఆ మూలాగ్రంగా చదివి, వానిలోని గుణగణాలను మూల్యాంకణము చేసుకొని, తమకు సమంజసమని తోచిన విషయాలను గ్రహించి, వాటిని స్వీయ పరిశోధనా విశేషాలతో మేళవించి రామాయణాన్ని గూర్చి కొన్ని నిశ్చిత అభిప్రాయాలను స్పష్ట పరచారు. ఆ వివరాలను పురస్కరించుకొని, రామాయణ కథా వస్తువు ఆధారంగా "జాబాలి", "సీత జోస్యం" అను రెండు నాటకాలు వ్రాశారు.

ప్రస్తుత వ్యాసం "సీతజోస్యం" అను నాటకానికి సంబంధించినది. అందుచేత, రామాయణాన్ని గూర్చిన నార్ల వారి దృక్పథం తెలుసు కొనుట ఆవశ్యకమే కాక, సమంజసము కూడ. రామాయణాన్ని గురించి తమ పరిశోధనా వివరాలు, నిష్కర్షలు పాఠకులకు తమ పీఠిక ద్వారా అందజేశారు నార్లవారు. వివరాలన్నీ, రామాయణం లో నిజమెంత?, ఏది జన స్థానం?, ఎక్కడి లంక?, రాక్షసులెవ్వరు?, ఋషు లెవరు?, ఋషుల కుట్రలో రాముని పాత్ర అను శీర్షికల క్రింద అయిదు ప్రకరణాలుగా వర్ణితము లైనవి. వానిలోని ముఖ్యాంశాలను తెలుసు కొందాము.

**రామాయణంలో నిజమెంత?**

పై ప్రశ్నకు జవాబుగా ఈ వివరాలను సృజించారు నార్లవారు. వేదాలను చరిత్ర దృష్టితో పరిశీలిస్తే, వాటిలో పేర్కొన్న ఇక్ష్వాకునికి, రామాయణంలోని ఇక్ష్వాకునికి ఏమీ సంబంధము లేదని తెలుస్తుంది. ఋగ్వేదంలో ఒకసారి, అధర్వణ వేదంలో ఒక్కసారి, మొత్తం రెండుసార్లు వేదాలలో ఇక్ష్వాకుని ప్రసక్తి వున్నది. కాని ఇతడు రాముని వంశానికి మూల పురుషుడు కాదు. అలాగే, ఋగ్వేదంలో పేర్కొనబడిన సీత నాగేటి చాలు గాని, రామాయణ నాయిక కాదు. ఋగ్వేదంలోనే ఒక "ఋక్కు" లో "రామమ్" అనే మాట ఉన్నది. అయితే ఆమాటకు సాయనాచార్యుడు సందర్భాను సారంగా చెప్పిన అర్థం "రాత్రి" అని. ఇదే అర్థాన్ని తన ఋగ్వేద అనువాదంలో ఆర్.టి.హెచ్.గ్రిఫిత్ స్వీకరించాడు. ఋగ్వేదంలోని "లక్ష్మణ" శబ్దం "వేదిక్ ఇండెక్స్" వివరణ ప్రకారం ఒక దానశీలి తండ్రి పేరును సూచిస్తోంది. క్రీస్తు శకానికి పూర్వపు ఏ శాసనంలోను రాముని ప్రసక్తి కనబడ లేదని మోరిట్స్ వింటర్ నిట్స్ వ్రాశాడు....

అలాగే సీతకు వ్యవసాయంతో గల సన్నిహిత సంబంధానికి సాక్ష్యంగా పారస్కర గృహ్య సూత్రాన్ని చూపించ వచ్చు. పొలం పైరుపై వుండగా "సీతయజ్ఞం" జరపాలని అది నిర్దేశిస్తున్నది. ఈ యజ్ఞానికి సంబంధించిన ఒక మంత్రం సీతను ఇంద్రుని భార్యగా సంబోధిస్తున్నది. జైనమత గ్రంథాలలో సహితం "సీతజన్నం" ప్రసక్తి వున్నట్లు పేర్కొంటూ జగదీశ్చంద్రజైన్ వాల్మీకి రామాయణానికి ఎంతమాత్రం చారిత్ర కాధారం లేదన్న తీర్మానానికి వచ్చాడు.

పైన పేర్కొనిన విధంగా అనేక మంది విద్వాంసుల పరిశోధన వలన తేలిన అంశాలను నార్లవారు తమ తార్కిక దృష్టితో పరిశీలించి, సమంజసమైన వాటికి తమ నిర్దిష్ట అభిప్రాయాలను మేళవించి ఈ క్రింది విధంగా వివరించారు. రామాయణంలో పేర్కొన బడిన విషయాలు నూటికి 75 వంతులు పుక్కిటి పురాణం మాత్రమే! మిగతా భాగం సహితం, సాధారణంగా అన్ని రాజ కుటుంబాలలో సింహాసనానికై కొనసాగే కుట్రలూ, కుహకాలు మొదలైనవి మాత్రమే! రాముడు వింధ్య పర్వతములను దాటి రాలేదు. రావణుడు గోండ్ రాజు కావచ్చు. లేదా మరొక ఆదివాసి తెగకు చెందిన రాజు కావచ్చు. అంతేకాని, రాక్షసరాజు అనుట ఉచితంగా తోచదు. ఆ విధంగానే రావణుని లంక, ఈ నాటి శ్రీలంక, ఒకటి కావు. రామాయణ యుద్ధాన్ని రెండు విభిన్న జాతుల మధ్య సంఘర్షణ అనుట కంటే ఆహారోత్పత్తి వ్యవస్థకు (Food Production Economy), ఆహార సేకరణ వ్యవస్థకు (Food Gathering Economy) మధ్య జరిగిన సంఘర్షణ అనడమే ఎక్కువ సమంజసము.

అదే విధంగా దండకారణ్య ప్రాంతానికి వ్యవసాయ విస్తరణతో రామునికి కొంత సంబంధము కలదు. కనుక రాముని భార్య పేరు సీత. కనుక, వేదకాలపు సీత మారి, మారి రామాయణం సీతగా పరిణ మించినట్లు చెప్పడానికి వీలు కలిగింది.

**ఏది జన స్థానం? ఎక్కడి లంక?**

ఆలోచనాపరులను రామాయణం జాగ్రఫీ ఎంతగానైనా తికమక పెడుతుంది! వనవాసానికి అయోధ్యలో బయలు దేరిన రాముడు సుదీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి చేరు కొనడానికి ఏదారులవెంట, ఏయేదిక్కులలో పయనించాడో, ఏయే నదీనదాలను, ఏయే పర్వతాలను, లోయలను దాటినాడో, మార్గ మధ్యంలో ఎక్కడెక్కడ ఎంత కాలం విశ్రమించాడో ఈ వివరాలలో దొసగులు కానరావు. ఉత్తర, వాయవ్య, ఈశాన్య భారతాలకు సంబంధించిన భౌగోళిక వివరాలు సవ్యంగానే వున్నాయి. దక్షిణ భారతం వద్దకు వచ్చేసరికి తప్పులు విశేషంగా కనబడు చున్నవి. దీనికి కారణం వాల్మీకి రచనకు ఇతరులు జోడించిన మార్పులేయని తెలియనగు చున్నది. మరీ హెచ్చు తప్పులు కిష్కింధా కాండ లోని 40, 41, 42, 43 సర్గలలో చోటు చేసుకున్నవి. రామాయణాన్ని విమర్శక దృష్టితో పరిశీలించిన పండితులందరు ఇవి ప్రక్షిప్తాలని నిర్ణయించారు. ఒక ముఖ్య విషయాన్ని మనం గమనించాలి. సీతను చెరబట్టిన రావణుడు దక్షిణంగా వెళ్ళినట్లు రామ లక్ష్మణులకు జటాయువు స్పష్టంగా చెప్పాడు (అరణ్య కాండ, 68వ సర్గ) ఋష్య మూకను దాటి రావణుడు వెళ్ళడాన్ని తాను చూచినట్టు సుగ్రీవుడు స్వయంగా రాముడితో చెప్పాడు. అయినా, సీతాన్వేషణకై తక్కిన మూడు దిక్కులకు వానర బలగాలను సుగ్రీవుడు పంపిన కారణం తెలియుట లేదు. దీనిని బట్టి సుగ్రీవుని భౌగోళిక జ్ఞానం అతి తక్కువని మనం అంచనా వేసుకోవచ్చు.

సుగ్రీవుని అంచనా మేరకు రావణుని లంక చేరాలంటే కిష్కింధ నుండి దక్షిణంగా బయల్దేరి, వింధ్య పర్వతాలను దాటి, నర్మద, మహానది, కృష్ణ ... కావేరిని దాటాలి, తామ్రపర్ణిని దాటి అటుపైన నూరు యోజనాలు సముద్ర యానం చేసి కాని లంకకు చేరరు. అంగదుని నాయకత్వాన బయలు దేరిన వానరులు వింధ్య పర్వతాలలో దిక్కు తోచక తిరుగుతూ ఉండగా వారికి సంపాతి తటస్థపడతాడు. లంక ఎక్కడ ఉన్నదీ అతడు వారికి వివరించి చెప్తాడు. దక్షిణ సముద్ర తీరంలోని వింధ్య పర్వత భాగం ప్రసక్తిని తెస్తాడు (కిష్కింధా కాండ 60వ సర్గ). కాని మనకు తెలిసిన వింధ్య పర్వత శ్రేణి దక్షిణ సముద్రము వరకు విస్తరించదు. కాబట్టి ఆ తీరంలో మరో వింధ్య పర్వత శ్రేణి ఉన్నట్లుగా మనం ఊహించు కోవాలి!

లంకపై దండ యాత్రకు రాముడు హనుమంతుడు, జాంబవంతుడు వెళ్ళిన మార్గాననే వెళ్ళి వుండాలి కదా? కాని రాముడు వింధ్య పర్వతాలను దాటినట్లు యుద్ధకాండ చెప్పడం లేదు. ఈ విధంగా రామాయణం లోని జాగ్రఫీ, ముఖ్యంగా దక్షిణ భారతం జాగ్రఫీ అనేక సందేహాలను కలిగించి ప్రశ్నలను రేకెత్తి స్తున్నది. "రామాయణ విషయమై, అంతకంటే ముఖ్యంగా లంక విషయమై జరిగిన –

జరుగుచున్న ఈ భిన్న వివాదాలలో నాకు ఏదీ నచ్చ లేదు. నాకు నచ్చిన వాదం- ఇదే, ఎవరైనా శ్రద్ధాసక్తులతో పరిశీలించ దగువాదం - రావణుని లంక వింధ్య పర్వత పరిసరాలలోనే ఎక్కడో వున్నట్లు చెప్పేది మాత్రమే!" లంకను గూర్చి వివాద చర్చను ముగిస్తూ, నార్లవారు ఈ క్రింది విషయాలు దృఢ పరచారు: రెండూ, రెండున్నర వేల సంవత్సరాల నాటి గ్రీకు రచయితలు చరిత్రలో సింహళాన్ని "తామ్రపర్ణి" గా పేర్కొన్నారు. అశోకుని కాలం నాటి భారతీయులకు తెలిసినది కూడా, "తామ్రపర్ణి" మాత్రమే! శ్రీలంక కాదు. అంతేకాక, భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుడైన "వరాహ మిహిరుడు" లంకను, సింహళ ద్వీపాన్ని విడి విడి ద్వీపాలుగా పేర్కొన్నాడు. మరియు, కిష్కింధ ఉజ్జయినికి ఆగ్నేయ దిశలో ఉండేదని వ్రాశాడు. లంక అనే పదం తెలుగు నుండి సంస్కృత భాషలోనికి వెళ్ళిన మాట అని కొంతమంది భాషాశాస్త్రజ్ఞులు అభిప్రాయం వ్యక్త పరచారు.

క్రీస్తుశకం అయిదవ లేదా ఆరవ శతాబ్దికి చెందిన "కౌముది మహోత్సవ నాటకం" కిష్కింధ, పంచవటి మొదలైనవన్నీ వింధ్య పర్వత ప్రాంతములో వున్నట్లు వివరిస్తున్నది. లంకాపురి సముద్ర తీరాన త్రికూట పర్వతంపై వున్నట్టుగా రామాయణం వివరిస్తున్నది. కాని, సింహళం ఉత్తర తీరంలో ఒక్క పర్వతమైనా లేదు. సింహళం రావణుని లంక కాదనటానికి పైన పేర్కొనిన కారణాలు చారిత్రకాంశాలుగా పరిగణించ వచ్చును.

**రాక్షసులెవరు? :**

ఈ ప్రశ్నకు సమాధానంగా నార్లవారు అనేక విశేషాలను వివరించారు. వారి పరిశీలనాను సారంగా ఋగ్వేదంలో, అధర్వ వేదంలో, మరికొన్ని వైదిక గ్రంథాలలో రాక్షసుల ప్రసక్తి విశేషముగా వున్నది. ఈవిషయం అవినాశ చంద్ర దాస్ అనే రచయిత "ఋగ్వేదిక్ కల్చర్" అనే తన పుస్తకంలో క్రోడీకరించారు.

ఆయన క్రోడీకరణ ప్రకారం, రాక్షసులు కుక్కల, రాబందుల, గుడ్లగూబల ఆకృతులలో వుంటారు. ఒక చోటు నుండి మరొక చోటికి పిట్టల వలే ఎగిరి పోతూ వుంటారు. అవసరాన్ని అనుసరించి వివిధ రూపాలు ధరించినా, మానవాకృతిలోనే వారు అధికంగా వుంటారు. అయితే ఏదో ఒక వైకల్యం తప్పదు, వికారం తప్పదు, వైపరీత్యం తప్పదు. కొందరికి మూడు తలలు, కొందరికి నాలుగు కళ్ళు, కొందరికి చేతులపై కొమ్ములు ఇత్యాదులు సహజ లక్షణాలు. యజ్ఞ యాగాలను రాక్షసులు ధ్వంసం చేస్తారు.... పచ్చి మాంసం తింటారు, నరమాంసాన్ని ఎక్కువ ఇష్ట పడతారని చెప్ప బడినది. ఒక్క అగ్ని దేవుడంటేనే వారికి భయం. అందుచేత రాక్షసుల పీడ తప్పించడానికి అగ్ని దేవుని ధీటగు వారు మరి ఎవ్వరూ లేరు! "అసుర" అనే పదం ఋగ్వేదంలో దుష్టార్థంలో ప్రయోగించ బడినది. (రమేశ్ చంద్ర దత్) ఆర్యులలో ఇండియాకు చేరిన శాఖ వారికి (ఇరాన్‌లో స్థిర పడిన వారికి) "అహుర" అనే పేరుతో అసురుడు దేవాది దేవుడుగా నిలిచాడు! అనంత ప్రసాద్ బెనర్జీ శాస్త్రి వాదన ప్రకారం ఇండియాకి తొలిగా వలస వచ్చిన ఆర్యులు వరుణ దేవుని చలువతో సముద్ర మార్గం వెంట వచ్చారు. వారు వచ్చింది అసీరియా నుండి కాబట్టి వారికి అసురులనే పేరు వచ్చింది. వారు నిర్మించిన అసుర నాగరికతే హరప్పా మొహెంజోదారోలు ప్రధాన కేంద్రాలుగా సింధులోయలో పరిఢవిల్లింది.

లోతుగా పరిశీలిస్తే "పర జాతుల పట్ల ఆర్యుల వైర విద్వేషాల నుంచి, వారి భయ విభ్రాంతుల నుంచి పుట్టుక వచ్చిన వారే రాక్షసులైనా, పిచాచులైనా, వేద కాలం నాటి ఆర్యులు, అంతకు పూర్వమే ఇక్కడ స్థిర పడిన వారితో హోరాహోరిగా సంఘర్షించ వలసి వచ్చింది. ఆయుధ బలంలో ఆధిక్యం తమదే, యుద్ధ పద్ధతులలో పైచేయి తమదే. అయితే, సంఖ్యా బలం తక్కువ అందువల్ల పైకి ఎంత ధైర్యంగా కనబడినా, లోలోపల భయం వారిని పీడిస్తూనే వుండేది.... అవధు లెరుగని క్రౌర్యం ద్వారా అన్య జాతుల వారిని జయించ కోరి నప్పుడు వారి పట్ల జుగుప్స పెంచుకోవాలి. ఇది మానవ స్వభావం. ఇందుకు అనుగుణంగానే ఋగ్వేద కాలం నాటి ఆర్యులు ప్రవర్తించారు. తమతో పోల్చినప్పుడు ఇక్కడి అనార్య జాతుల వారే అన్ని విధాలా ఎక్కువ నాగరికులు. అయినా, లేని పోని ఘనతను తమకు తామే ఆపాదించుకొని, ఇక్కడి వారి రూపు రేఖలను, వేష భాషలను, ఆచార వ్యవహారాలను, వారికి సంబంధించిన సమస్తాన్నీ నిరసించారు, నిందించారు.... ఇక్కడి వారు ఏవిధంగా చూచినా నీచ జనులట; మానవులుగా సంభావించ డానికైనా తగని వారట! ఆర్యులు వలస రావడానికి పూర్వం ఇక్కడ స్థిర పడిన వారిలో ... ద్రావిడులున్నారు వీరందరినీ కలగా పులగం చేసి,

దాసులనీ, దస్యులనీ, ఆర్యులు వీరికి నామ కరణం చేసారు... వారిని రాక్షసులుగా, పిశాచులుగా వర్ణించి వారితో పోరాటం మొదలెట్టారు. (రామప్రసాద్ చాందా. మానవ వికాస శాస్త్రవేత్త) ... వైదిక వాఙ్మయం నిషాదులుగా పేర్కొన్న వారు వింధ్య పరిసరాలలో, ఛోటానాగపూర్ ప్రాంతంలో, బస్తరులో, ఒరిస్సాలో, ఆంధ్రప్రదేశ్ ఈశాన్య దిశలో నివసిస్తున్న మూండా, గోండ్, సవర, చెంచు, ఖోండ్ మున్నగు తెగల వారు. ఈ తెగల వారిలో కొందరు ఆర్య, ద్రావిడ కుటుంబాల భాషలను యాసతో మాట్లాడుతున్నా అవి వారి స్వభాషలే.... ఇంత దూరం వచ్చినా, రాక్షసులెవరో చెప్పక పోవడానికి కారణం – కచ్చితంగా చెప్ప గలిగింది ఏమీ లేక పోవడమే! రాక్షసులు ఆర్యులు కారంటే, మరి వారెవరు? ఆర్యుల మతాన్ని సాంప్రదాయాలను వ్యతిరేకించినందున ఆర్య సంఘం నుంచి వెలివేయ బడినవారా? రామాయణాన్ని విమర్శక దృష్టితో పరిశీలించిన వారిలో అది పేర్కొంటున్న రాక్షసులు ద్రావిడులు కావచ్చునని అధిక సంఖ్యాకులు, కాదు నిషాదులని తక్కిన వారు తీర్మానిస్తున్నారు. ఈఅధిక సంఖ్యాకుల దృష్టిలో సింహళ ద్వీపమే రావణుని లంక. అయి నప్పుడు ద్రావిడులే రాక్షసులని తీర్మానించడం సహజమే....

నార్ల వారి దృష్టిలో రాక్షసులు ఏదో ఒక తెగకు, లేదా ప్రాంతానికి చెందిన వారు కారు. ఎక్కడ వైర విద్వేషా లుంటే. ఎక్కడ భయ విభ్రాంతులుంటే, అక్కడ రాక్షసులుంటారు. రాక్షసులు దేశ దేశాల వారికున్నారు. ఇప్పుడు మన ప్రశ్న రామాయణం రాక్షసులు ఎక్కడి వారని? సింహళద్వీపం రావణుని లంక కాదని గుర్తిస్తే, రాక్షసరాజ్యం కోసం చూడ వలసినది వింధ్య పర్వతాలకు ఉత్తర దిశలో, లేదా ఆ పర్వతాల పరిసర ప్రాంతాలలో. ఎం.వి.కిబే, జి.ఎన్.హిరాలాల్, టి.పరమశివ అయ్యర్, టి.అమృతలింగం, డి.ఆర్.మన్కడ్ ప్రభృతులు రామాయణంలోని రాక్షసులు మధ్య భారత ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయ పడ్డారు. రామాయణ యుద్ధానికి రంగం మధ్య భారతమని, ప్రత్యేకించి వింధ్య పరిసర ప్రాంతమని గుర్తించిన నాడు, ఆయుద్ధం జరిగింది నిషాద జాతికి చెందిన ఏదో ఒక తెగతో అని సంభావించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

**ఋషులెవరు?** :

ఈప్రశ్నకు టూకీగా సమాధాన మివ్వక అతిదీర్ఘ చర్చకు ఉపక్రమించారు నార్లవారు. ఒక లోకోక్తిని బట్టి నదీ మూలాన్నీ, ఋషిమూలాన్నీ విచారించరాదు. అంటూనే, ఋషులను గూర్చిన దీర్ఘ చర్చ జరిపారు దేశదేశాల నాగరికతల చరిత్రను చదివిన వారు కనుక, ఒక నగ్న సత్యాన్ని పాఠకుల ముందుంచారు. అదేమంటే, ఈ నాడు మనం డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, శాస్త్రజ్ఞులుగా పరిగణిస్తున్న వారు అలనాటి మంత్ర వేత్తలని, మానవ చరిత్రలో పసుపోషణ వ్యవస్థ, వ్యావసాయిక వ్యవస్థ, ఒకదాని తరువాత మరొకటి నెలకొన్న తర్వాత, విద్యా, వైజ్ఞానిక విషయాలను గురించి, ఆలోచనలు చేయడానికి, పరిశోధనలు జరపడానికి కొందరికి విరామం లభించింది. వీరిలో అధికులు మేధావులైన వారే, దేవతలకు పూజారులైనారు, రాజులకు పురోహితులైనారు. అగ్ర వర్ణాల, వర్గాల పౌరులకు విద్యా గురువులైనారు. అన్ని రకాల అవిష్కరణలు, అభివృద్ధి సాధించిన వారు ఈ అగ్ర వర్గాల విద్యా గురువులే. అయితే, ప్రజా బాహుళ్యానికి సంబంధించినంత వరకు తమకు తెలిసిన విద్యలను గుప్తంగా ఉంచారు.

తమ ప్రధాన పోషకులకు సహితం తమకు తెలిసిన విషయాలు విడమర్చి చెప్పలేదు. అమోఘ శక్తులను, సర్వజ్ఞతను తమకు ఆపాదించుకొన్నారు. ఋషుల నడవడి, పూజారి వర్గం వైఖరికి భిన్నమైనది కాదు. ఋషి అనగానే అతడు సర్వసంఘ పరిత్యాగి అని మనం భావిస్తాం. ఇది మన పౌరాణిక ఋషుల విషయంలో వలె, మన వైదిక ఋషుల విషయంలో సహితం నిజం కాదు.

అంగిరసుడు, అగస్త్యుడు, భృగుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైన వారు వేద వేదాంగాలలో వలె, పురాణేతిహాసాలలో మనకు తటస్థిస్తారు. ఇవి వంశ నామాలు కాబట్టి, వీరికి సంబంధించిన ఏ వృత్తాంతమైనా, ఏ విశేషమైనా, ఒకే వ్యక్తికి సంబంధించింది కావడానికి వీలు లేదు. వీరి పుట్టు పూర్వోత్తరాలను గురించి అనేక రకాల కథలు ఉన్నవి. అగస్త్య, వసిష్ఠ, విశ్వామిత్రులు గాని, అత్రి భరద్వాజులు గాని, సన్యాసులు కారు. సంసారులే! శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, ధర్మభృత్తు మున్నగు వారు సంసారులని రామాయణం స్పష్టంగా చెప్పక పోయినా, వారు సహితం సన్యాసు లైనట్లు తోచదు. వేదాలలో గాని, దశోపనిషత్తులలోగాని "సన్యాసి" "పరివ్రాజకుడు" అనే మాటలు కన బడవు. ఋగ్వేద కాలం నాటి ఋషులకు,

ఉపనిషత్తుల కాలం నాటి వారి దృక్పథానికి విశేష వ్యత్యాసం గోచరిస్తుంది. పురాణ కాలం నాటికి, ఈ వ్యత్యాసం మరింత పెరిగింది. ఋగ్వేదాన్ని చదివితే ఋషుల యజ్ఞాలు, యాగాలు, క్రతువులు మొదలైన వన్నీ ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆయుర్దాయం కోసమేనని మనకు తెలుస్తుంది. అంతేతప్ప "ఈ జగం మిధ్య" అనలేదు. "ఈ బ్రతుకు బుద్బుద ప్రాయం" అనలేదు. ఆ సిద్ధాంతాలను ప్రతి పాదించిన వారు ఉపనిషత్తుల నాటి ఋషులు. వారిలో అతి ముఖ్యుడైన యాజ్ఞవల్క్యుడు పారమార్థిగ సత్యంగా "ఆత్మే సర్వస్వం" అని జనక మహారాజుకు బోధించాడు. కాని, పారమార్థిక సత్యం కడుపు నింపదు కాబట్టి, వ్యావహారిక సత్యాన్ని పాటించి, ఆ మహారాజు నుంచి పదివేల గోవులను దానంగా పుచ్చుకొన్నాడు. తన కాలంలో యాజ్ఞవల్క్యుని మించిన వేదాంతి లేడు (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ). ఇచ్చట మనం రామాయణ ఋషులను గురించి మాత్రమే కొంత తెలుసు కుందాము.

ఋగ్వేదంలో పేర్కొన బడిన అగస్త్యుడు, వసిష్ఠుడు, రామాయణంలో సహితం ప్రముఖ పాత్ర వహిస్తారు. అయితే వారే వీరు కాదు. ఆ మూల పురుషుల వంశానికి చెందిన వారు. ఈ విషయమై డి.డి.కోశాంబి తన పుస్తకంలో అనేక విషయాలు పేర్కొన్నాడు. కోశాంబి పరిశోధనల ప్రకారం, గోత్ర ఋషులు ఎనిమిది మందిలో ఒక్క విశ్వామిత్రుడే స్వచ్ఛమైన ఆర్యుడు, తక్కిన వారు మిశ్ర సంతానం. అత్రి, అగస్త్యాదుల విషయంలో రామాయణం "ఋషి", "ముని", "తాపసి" అనే వాటిని పర్యాయ పదాలుగా ప్రయోగించింది. కాని ఈ పదాల మధ్య అర్థ భేదాలు వున్నవి. కేవలం ఋషినే తీసుకొన్నా - వేద కాలంలో అతడు యజ్ఞయాగాదులను చేసేవాడు, ఉపనిషత్తుల కాలం వచ్చేసరికి, యజ్ఞ యాగాదులను విరమించి వాదోప వాదాల పట్ల శ్రద్ధ వహించాడు. మునులనేవారు మౌనాన్ని పాటిస్తూ, ఏదో మంత్రాన్ని జపిస్తూ పోయేవారు. తాపసులనే వారు శరీర క్లేశాల ద్వారా నిర్లిప్తతను సాధించడానికి యత్నించే వారు. విభిన్నమైన ఈ ఆధ్యాత్మిక సాధనలను పరిపాలించే వారిని "ఒకే కాడి క్రింద కట్టడం" భావ్యం కాదని నార్ల వారి అభిప్రాయం. అంతేకాక, దండకారణ్యములోని ఆర్యులను వాన ప్రస్థులుగా పెక్కుచోట్ల రామాయణం పేర్కొంటున్నది. వానప్రస్థా శ్రమాన్ని వనాలలోనే గడపాలంటే, ఆర్య ప్రాంతాలలో అవి లేనట్లు దండకారణ్యానికే ఎందుకు వెళ్ళాలి? తమ కథనం ప్రకారమే అక్కడి వారు ఘోర రాక్షసులు, నరమాంస భక్షకులు. వారి మధ్యకు కావాలని వెళ్ళటం దేనికి? ప్రాణాపాయం ఆహ్వానించడం దేనికి? ఇన్ని ప్రశ్నలకు అవకాశమివ్వటంతో పాటు, దండకారణ్యంలోని ఋషులను గురించి రామాయణం వింతలను, విడ్డూరాలను పెక్కింటిని పేర్కొంటున్నది. ఉదాహరణకు వైఖానసులనే ఋషులు బ్రహ్మదేవుని గోళ్ళనుండి, వాలఖిల్యులు ఆయన రోమాలనుంచి పుట్టిన వారుట! ... ఆధ్యాత్మి కోన్నతిని కోరి, కఠోర సాధనలు చేసినా, వీరు ఆయుధాలను విసర్జించినట్లు కనబడదు. విశ్వామిత్రునికి తెలియని అస్త్ర శస్త్రాలు లేవని ప్రసిద్ధి. కావాలంటే, కొత్తవాటిని ఆయన పుట్టించ గలరట! (బాలకాండ, 21వ సర్గ) పైగా ఈ ఋషులకు సకల దివ్య శక్తులూ ఉన్నాయి. వారు త్రికాలజ్ఞులు. ఎంతటి శాపమైనా యివ్వగలరు. అయినప్పుడు రాక్షసులకు ఏదో శాపం యిస్తే, తమకు వారి పీడ వదిలేది కదా? ఆపని చేయక రాముని రక్షణ కోరడం దేనికి? ఇదే ఋషులు పన్నిన కుట్ర! ఈ కుట్రలో రాముడు షరీకు అయినాడు.!

**ఋషుల కుట్రలో రాముని పాత్ర :**

నగర సంబంధమైనది నాగరికత. ఆటవికులకు నగరం నచ్చదు. అందుకే వారు నగరాలు నాశనం చేస్తారు. క్రీస్తుశకం అయిదవ శతాబ్ది నాటికి తెలిసిన ప్రపంచంలో అధిక భాగాన్ని జయించిన "హూణులు" నగరాలను ధ్వసం చేసి ఆరు బయట డేరాలను వేసుకొని వాటిలో బ్రతుకుతూ వుండేవారని చరిత్రలో చెప్ప బడినది. నగరానికి, నగర జీవనానికి వారు అలవాటు పడ్డానికి చాలాకాలం పట్టింది. ఋగ్వేద కాలంలో ఇచ్చటికి వచ్చిన ఆర్యులు ఆటవికులు కాక పోవచ్చు గాని, ఆటవిక స్థితికి ఒకటి రెండు మెట్లు పైగా వున్నటువంటి వారు. అందువల్ల హరప్పన్ నగరాలను వారు ధ్వంసం చేయుట ఆశ్చర్య జనకం కాదు. కాని, వారు వ్యావసాయిక వ్యవస్థను ఎందుకు నాశనం చేసినది తెలుసు కొనుట కొంత కష్ట తరమైన విషయం.

ఋగ్వేదాన్ని పరిశీలిస్తే - అందులో కృత్రిమ రోధస్సులను (చెలియలి కట్టలు మున్నగునవి) ఇంద్రుడు తెగ గొట్టగా వాటి రాళ్ళు రథచక్రాల వలె దొర్లుకు పోయినవని, అటు తర్వాత నదీ జలాలు నిరాటంకంగా ప్రవహించాయనీ స్పష్టంగా పేర్కొన బడినది. "వృత్రహుడు"

అంటే ఆనకట్టలు తెగ గొట్టు వాదని అర్థము చెప్పబడినది. ఆన కట్టలపై ఆర్యులకు కోపకారణం ఆనాటి హరప్పన్ వ్యవసాయ పద్ధతి. అది వరదసాగు పద్ధతిగా పేర్కొన బడినది. వ్యవసాయం కోసం హరప్పనులు ఆనకట్టలు కట్టారని మనం భావించవచ్చు. పసు పాలన ప్రధాన జీవికగా గల ఆర్యులు ఆలమందల మేతకొరకు చదరపు భూమి అవసరమై ఈ ఆనకట్టలను (హరప్పన్ రైతులు అడ్డుపడుతుండగా) తెగగొట్టటం ఒక గడ్డ సమస్యగా పరిణమించింది. పసుపోషణ కోసం ఒక ఘట్టంలో ఆనకట్టలను ఆర్యులు, మరొక ఘట్టంలో వ్యవసాయ విస్తరణ కోసం అడవులను తగల బెట్టడం మొదలు పెట్టారు! సప్త సింధు ప్రాంతంలో స్థిర పడిన కొంత కాలానికి వారి జన సంఖ్య పెరిగి వుండాలి. వారు విస్తరించ గల్గింది ప్రాగ్దిశకే. అది గంగా యమునల ప్రాంతం. వర్షపాతం అధికంగా వున్న ప్రాతం; అక్కడ స్థిర నివాసం ఏర్పరచు కోవలెనన్నా, వ్యవసాయం మొదలు పెట్టాలన్నా అందుకు ముందుగా చేయవలసిన పని అక్కడి అడవులను తగల బెట్టడమే... మరి కొంత కాలం తర్వాత అరణ్యాలను దగ్ధం చేస్తూ తూర్పు దిక్కుకు ఆర్యులు ఏ విధంగా విస్తరించారో శతపథ బ్రాహ్మణంలోనిఒక ఘట్టం విశదీకరిస్తున్నది (డి.డి.కోశంబీ)...

ఇక్కడ ముఖ్యంగా పేర్కొన దగిన విషయం రామాయణంలో మనకు దర్శనమిచ్చే విశ్వామిత్రుడు, భరద్వాజుడు, అత్రి, శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, అగస్త్యుడు మొదలగు ఋషులు ఆశ్రమాల పేరుతో దండకారణ్యంలో వ్యవసాయ క్షేత్రాలని నెలకొల్పినారని, వాటిని నెలకొల్పడానికి ముందు యజ్ఞయాగాదుల పేరుతో దండకారణ్యంలో విశాల ప్రాంతాలని దగ్ధం చేశారని, ఈవిషయం శతపథ బ్రాహ్మణాన్ని విమర్శాత్మక దృష్టితో పరిశీలిస్తే తెలుస్తుంది. వాజపేయం మొదటిలో అన్న పానీయాలకు సంబందించిన యజ్ఞమని ప్రజాపతి చెప్పాడట. ఈ యజ్ఞ సందర్భంలో మరుత్తుల స్తోత్రం జరుగుతుంది. మరుత్తులు కర్షకులని, కర్షకులే అన్నదాతలని శతపథ బ్రాహ్మణం స్పష్టం చేస్తున్నది.

మానవుడు నాగరికుడు కావడానికి ముందు రెండు వ్యవస్థల గుండా పయనించాలి. వాటిలో మొదటిది ప్రాకృతావస్థ (శావేజరీ), రెండవది బర్బరావస్థ (బార్బరిజం). దండకారణ్య వాసులను (రాక్షసులన్న పేరుతో) ప్రాకృత వ్యవస్థను దాటని వారిగా కొన్ని చోట్ల రామాయణం సూచిస్తున్నది; వారు అయోధ్యావాసులను మించి పోగల నాగరికులైనట్లు కొన్ని చోట్ల పేర్కొంటున్నది. కాని, నిజానికి అక్కడి వారు బర్బరావస్థకు చెందినవారు. ప్రాకృతావస్థకు చెందినవారైతే వారు నరమాంస భక్షకులు కావాలి. కాని, నరమాంస భక్షకులుగా రామాయణం విస్పష్టంగా పేర్కొన్నట్టి వారు విరధుడు, ఇల్వలుడు, వాతాపి, కబంధుడు మాత్రమే. అందువలన రాక్షసులు నరమాంస భక్షకు లనడం, వారు ప్రాకృత వ్యవస్థకు చెందిన వారనడం నిరాధారమైన నిందలుగానే పరిగణించాలి. రామాయణన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, దండకారణ్యము లోని వారు ఆహారసేకరణ వ్యవస్థకు చెందిన వారని తెలుస్తుంది.

పినతల్లి కైకేయి కోర్కె ప్రకారం తాను వనవాసానికి పోనున్నట్టు తల్లి కౌసల్యకు చెబుతూ రాముడన్న మాట దండకారణ్యములో తాను "తేనె, గడ్డలు, దుంపలు, పండ్లు" తింటూ కాలక్షేపం చేయబోతున్నానని (అయోధ్యాకాండ, 20వ సర్గ). సరిగ్గా ఇదేమాటను రాముడు గుహునికి సహితం చెబుతాడు (అయోధ్యాకాండ, 50వ సర్గ). అరణ్య వాసాన్ని గడపడానికి చిత్రకూట పర్వత ప్రాంతం ఉత్తమ మైనదని "మీకు కావలసిన తేనె, దుంపలు, పండ్లు" అక్కడ సమృద్ధిగా లభిస్తాయని భరద్వాజుడు చెబుతాడు (అయోధ్యాకాండ, 54వ సర్గ). దండకారణ్యములోని ఆటవికులు తమ పద్ధతి ప్రకారం తాము బ్రతకాలని మాత్రమే కోరుకొని ఉండాలి (ఆహార సేకరణ విషయంలో) కాని, ఆ కోర్కెను ఆర్య ఋషులు సాగనివ్వలేదు.

గంగా, యమున ప్రాంతం నుంచి ఆర్యఋషులు దక్షిణాదికి క్రమంగా విస్తరించారు. దండకారణ్యంలో ఆశ్రమాలను స్థాపించారు. యజ్ఞ యాగాదుల పేరుతో విస్తృత ప్రాంతాలను దగ్ధం చేశారు; దగ్ధం చేసిన ప్రాంతాలను వ్యవసాయ క్షేత్రాల క్రింద మార్చారు. వ్యవసాయానికి కావలసిన పసు సంపదను రాజుల నుంచి గోదానం రూపంలో సంపాదించారు. వ్యవసాయానికి కావలసిన కార్మికులను ఛాత్రుల రూపంలో సమీకరించారు. ఇక్కడ గమనించ వలసిన ముఖ్య విషయమిది; దండకారణ్యానికి వలస వచ్చిన వారి ఆర్థిక వ్యవస్థ స్థానికుల వ్యవస్థకు పూర్తిగా విభిన్న మైనట్టిది. వలస వచ్చిన వారు అరణ్యాలను దగ్ధం చేయాలి, లేకపోతే తాము కోరినట్టు ఆహారోత్పత్తిని వారు

కొన సాగించలేరు. స్థానికులు అరణ్యాల దగ్గ కాండను నిరోధించాలి లేకపోతే, ఆహార సేకరణ వారికి అసాధ్యం కాగలదు. ఈ విభిన్న జీవిత విధానాల మధ్యగల ఈ వైషమ్యం, వారి మధ్య సంఘర్షణను అనివార్యం చేస్తుంది. ఈ విషయంలో రాముని సహాయం పొందడానికి ఋషులు కుట్రను పన్నారు. రామాయణాన్ని (వాల్మీకి కృతిగా సంస్కృతంలో ప్రచారంలో ఉన్నదాన్ని) విజ్ఞుల వలె చదివితే మీకు విదిత మవుతుంది. వాల్మీకి రామాయణం (సంస్కృత మూలము) విశేషించి అరణ్య కాండ లోని తొమ్మిదవ, పదవ సర్గలను పరిశీలిస్తే సీతాదేవి ఆటవికులను గూర్చి భర్తతో వాదించిన విధానము మనకు విదితమవుతుంది గమనించండి.

"ఈ ఆటవికులు మనకు ఏమి అపకారం చేస్తున్నారని భర్తను ప్రశ్నిస్తుంది. ఈ స్థానికులను చంపటమే పనిగా పెట్టుకొనడం మీకు తగునా? తప్పు లేని ప్రజలను హింసించుట ఘోరమని చెబుతుంది. మనతో వైరము లేక దండకారణ్యమున వున్న వారిని, తమ బ్రతుకు తాము నెమ్మదిగా బ్రతుకు తున్న వారిని చంపడం అతిఘోరమని హెచ్చరిక చేస్తుంది. బొంకు లాడడం మహా పాతకం కాగా, పరదారాభిగమనం, వైరం లేకుండా సంహారం మరింత నికృష్టమైన పాపాలని, ఈ చివర పాపాన్నే మీరు చేస్తున్నారని భర్తతో అంటుంది.

సీత పలుకులకు రాముడు "నేను ప్రాణాల నైనా విడుస్తాను, నిన్ను విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను అంతే తప్ప, ఋషులకిచ్చిన మాటలను విడువను" అని ప్రత్యుత్తర మిస్తాడు. రామాయణాన్ని భక్తి భావంతో కాక, విచక్షణా దృష్టితో చదివినప్పుడు పఠితలకు రామాయణంలో ఆహారోత్పత్తి, ఆహార సేకరణ వ్యవస్థల మధ్య సంఘర్షణ స్పష్టంగా గోచరిస్తుంది. అప్పుడు దండ కారణ్యములోని కుట్రలో రాముని పాత్రను సరిగా అర్థం చేసుకో గలుగుతారు.

**ఆయుధాల ప్రశ్న :**

రామాయణ కాలంలో ఆయుధాలను గురించి కొంత తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. ఒక విషయం మాత్రం అందరికీ తెలుసు. రామునికి సంబంధించినంత వరకు ఆయన ప్రధాన ఆయుధం కోదండం అని. అందు వల్లనే ఆయనకు "కోదండ రాముడు" అనే బిరుదు వచ్చింది. కోదండంతో పాటు ఆయన ఖడ్గాన్ని కూడా వినియోగించే వాడని పేర్కొంటారు. అయితే దాని ఉపయోగం సకృత్తుగానే అని మనం గ్రహించాలి. ఆకాలంలో కోదండం, కార్ముకం, అస్త్రము, చాపము, ధనువు, ధన్వము, ధనస్సు, సింగాణీ, అనే పదజాలం కూడా వాడుకలో వున్నట్లు చెప్పబడినది. ధనుస్సులకు వేరువేరు పేర్లు వున్నట్లు తెలియుచున్నది. ధనుస్సు త్రివిధము – టంకార ధనువు, ఝుంకార ధనువు, మహాధనువు అని. ఆయుధాలకు, ఆయుధ ప్రయోగానికి సంబంధించిన విద్యను "ధనుర్వేద సంహిత" అని పేర్కొన్నారు. రాముడు వినియోగించే ధనుస్సు ఏదో మనకు స్పష్టంగా తెలియదు. విశ్వామిత్రుడు రామునికి ఏవో దివ్యాస్త్రములను మంత్రోపదేశం ద్వారా అందజేసాడని రామాయణంలో చెప్పబడినది.

లంకలో జరిగిన యుద్ధంలో రామ లక్ష్మణులపై ఇంద్రజిత్తు ప్రయోగించిన ప్రథమాయుధం నాగపాశం. అది వారిని పడ గొట్టి, చేతులను కట్టి వేసిందట. అలాగే కుంభకర్ణుడు యుద్ధానికి బయలు దేరింది విల్లమ్ములతో కాదు, మొనవాలుతో. అతని వెంట వెళ్ళిన సైనికులు పుచ్చుకొని వెళ్ళినవి రోకళ్ళు, గుదియలు, గొడ్డళ్ళు, త్రిశూలాలు, ఈటెలు. రాక్షసులు, వానరులవలె ధనుర్బాణాలు వినియోగించే వారు కాదేమో? ఒకవేళ వారికి ధనుస్సులుంటే, అవి శక్తిమంతమైనవి కాకపోవచ్చు. ఆయుధాల విషయంలో ఆధిక్యం ఏదో లేకపోతే, రామ లక్ష్మణులు సంఖ్యా బలంగల ఆటవికులను జయించ గలిగే వారు కాదు.

ఏమైనా, ఆయుధ బలం తక్కువైనందు వల్లనే, రామాయణంలో రాక్షసులుగా పేర్కొన్న వారు "గెరిల్లా" యుద్ధ పద్ధతులను అనుసరించ వలసి వచ్చింది. ఎదుట నిలిచి పోరడానికి వీలులేనప్పుడు చాటునుంచి దెబ్బ తీయక తప్పదు. పగలు దాడి జరపడానికి వీలు లేనప్పుడు చీకటి మరుగున ముట్టడించక తప్పదు. అవసరమైనప్పుడు మారు వేషములను వేసుకొని పగతురపై దూకక తప్పదు. రాక్షసులనే వారు ఇటువంటి యుద్ధ పద్ధతులను అనుసరించు వారు కాబట్టే వారికి "నిశాచరు" లని, "కామరూపు" లని, "మాయావు" లని పేర్లు పెట్టారు. ఋ

*ఇంకావుంది...*

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702

# రష్యా కవిత్వం

– ముకుంద రామారావు

**అదే** గాలి రష్యాలో కవిత్వం. ప్రపంచంలో అతి పెద్ద దేశం రష్యా. భూ సరిహద్దులుగా 14 దేశాలు (నార్వే, ఫిన్లాండ్, ఏస్టోనియ, లట్వియ, లిథుయానియ, పోలండ్, బెలారస్, ఉక్రైన్, జోర్జియ, అజర్బైజాన్, కజఖిస్తాన్, చైనా, మంగోలియ, ఉత్తర కొరియా), సముద్ర సరిహద్దులుగా జపాన్, అమెరికా, 9 కాలమండలాలతో ఉన్న విశాల దేశం. ఇటు ఆసియాకు అటు యూరపుకు దగ్గరగా ఉన్న దేశం కావడాన్ని రష్యాకు యూరపు దేశంగాను, ఆసియా దేశంగానూ కూడా గుర్తింపుంది. 7వ శతాబ్దం నుండి రష్యా ప్రాచీన రాజ్యాలనుండి వలసవాదులైన స్లావిక్ తెగల జనసమూహంతో మొదలైంది. మొదట్లో అది రష్యా కాదు. కొన్ని నగర సమూహాలు, ఇప్పటి ఉక్రైన్ బెలారస్ ప్రాంతాలు ఏకమై సామ్రాజ్యంగా వెలసి, కీవన్ రూస్ ప్రాంతంగా రూపాంతరం చెందింది.

ఇదంతా (800–1200) మధ్య కాలంలో జరిగిన పరిణామం. (1237–1613) మధ్య కాలంలో చెంఘీజ్ ఖాన్ మనుమడు బాటూ ఖాన్ దండయాత్రతో ఆ ప్రాంతం మంగోలియన్ల వశమయి, వారి పాలన కొనసాగింది. పూర్వోత్తర ప్రాంతంలో, వాణిజ్యపరంగా అనువైనది, ఆక్రమణకు తొందరగా అందనిదిగా ఉన్న చిన్న పట్టణమే 14వ శతాబ్దానికి మాస్కోగా మార్చబడింది. ఆ కాలపు చివరి రాజుగా మైకెల్ రోమనోవ్, 1613లో ఎన్నుకోబడ్డారు. రోమనోవ్‌ల సామ్రాజ్యం ఆ తరువాత (1613–1825) వరకూ నడిచింది. రోమనోవ్ సామ్రాజ్యం నుండి మొదలయిన సామ్రాజ్య విస్తరణ 17 నుండి 19వ శతాబ్దం సరికి చాలా వరకు పూర్తయింది. 1812లో ఫ్రెంచి సైన్యం నెపోలియన్ ఆధ్వర్యంలో, రష్యాని దండెత్తి మాస్కోని ఆక్రమించుకున్నా, అప్పటి రష్యా రాజుల ఎత్తుగడలముందు అక్కడ ఉండలేక వెనుతిరగాల్సొచ్చింది. లక్షలకొద్దీ ప్రాణ నష్టం జరిగినా, నెపోలియన్ అంతటి వాడిని వెనక్కి పంపగలిగినప్పటి నుండి, రష్యా ప్రపంచంలో ఒక బలమైన రాజ్యంగా పేరు పొందింది. (1825–1920) మధ్య కాలంలో; 1914లో మొదలైన మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్, ఫ్రాన్స్ దేశాలతో చేతులు కలిపిన రష్యా, జర్మనీతో జరిపిన పోరాటంలో చాలా కోల్పోయింది. ప్రభుత్వం, సైన్యం పెత్తనాల పరిణామాలతో, జపాన్‌తో జరిగిన యుద్ధంలో రష్యా ఓడిపోయి, చేసుకున్న సంధి దరిమిలా, 1905–1907 మధ్య కాలంలో అంతర్గత అల్లకల్లోలాల మూలంగా, చివరికి అది 1917లో యుద్ధానికి, విప్లవానికి దారితీసింది.

చరిత్రలో 1917 అక్టోబరు, శ్రామికజన మహా విప్లవంగా ప్రసిద్ధి చెందింది. సోవియట్ శకానికి, ప్రపంచంలో మొట్టమొదటి కమ్యూనిష్టు ప్రభుత్వానికి, అదే నాంది అయింది. లెనిన్, స్టాలిన్ తమదైన పద్ధతుల్లో రష్యాని ముందుకు నడిపించారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, హిట్లర్ యుద్ధోన్మాదాన్ని ఎదుర్కొని కొన్ని కోట్లమంది ప్రాణాలు కోల్పోయినా, 1945 నాటికి రష్యా విజయం సాధించింది. ఈ విజయంతో రష్యా మరింత భూభాగాన్ని సైతం పొందటంతో అతి పెద్ద ప్రపంచ శక్తిగా ఎదిగింది. 1917 నుండి 1945 వరకు కమ్యూనిష్ట్ పార్టీ అధికారంలో ఉంది. ఆ సమయంలో రష్యా అత్యంత శక్తివంతమైన దేశంగా రూపుదిద్దుకుంది. 1922 నుండి 1945 సరికి పొరుగున ఉన్న మరో 14 రాష్ట్రాల్ని కలుపుకుని సంయుక్త సోవియట్ సాంఘిక ప్రజాతంత్ర రాజ్యంగా మారింది. స్టాలిన్, కృశ్చేవ్, బ్రెజ్నేవ్‌ల పరిపాలన తరువాత గోర్బచెవ్ 1985 లో ప్రవేశపెట్టిన పెరిస్త్రోయికా సంస్కరణ అనంతరం, ఆరేళ్ల వ్యవధిలో కమ్యూనిజంతో బాటు అన్నీ కూలిపోయి యెల్ట్సిన్ పరిపాలనలో పెట్టుబడిదారీ విధానానికి రష్యా మారిపోయింది.

అనేక యుద్ధాల మధ్య నలిగి, నూరు భాషలకంటే ఎక్కువ మాటాడే వివిధ ప్రాంతాలు ఉన్న దేశంలో కవిత్వ

ప్రేమికులు ఎక్కువే, కవులూ ఎక్కువే. రష్యన్ భాషే అధికారిక భాష అయినా, మరో 30 వరకూ మరి కొన్ని భాషలు కూడా ఆయా ప్రాంతాల్లో అధికారిక గుర్తింపు పొందాయి. సాహిత్యం ఎక్కువగా రష్యన్ భాషలోనే ఉంది.

**రష్యాలో కవిత్వం :** సాల్విక్ తెగల మీద క్రిస్టియన్ ప్రభావం ఎక్కువ. 10వ శతాబ్దంలో ఆ ప్రభావంతో వచ్చిన జానపద గేయాలు అక్కడి మౌఖిక రూపంలో వచ్చిన ప్రథమ కవిత్వం. 1185–1187లో రాతలో వచ్చిన మొదటి కవిత్వ గ్రంథం 'ఇగొర్ ఉద్యమగీతం', అప్పటి యువరాజు ఇగొర్ దండయాత్రని కీర్తిస్తూ రాసిన కవిత్వం. 16వ శతాబ్దం వరకూ చర్చి బోధనలు, గీతాలతోనే కవిత్వం ఉంటూ వచ్చింది. 1689 నుండి 1725 వరకూ పాలించిన రాజు, పీటర్ మూలంగా మొదలైన సాహిత్య పిపాస, అతని మరణం తరువాత పుంజుకుంది. రష్యన్ భాషకు అనుకూలంగా, కవిత్వ శైలిలో మార్పుకు ఆద్యులు, వి. ఖే. ట్రెద్యకోవ్స్కీ (1703–1769). దానిని అద్భుతంగా మార్చిన వారు ఎం.వి. లొమొనొసోవ్ (1711–1765), గవ్రీల్ దెర్జవిన్ (1743–1816). వసిలీ ఝుకొవిస్కీ (1783–1852) యూరపు కాల్పనిక ఆదర్శవాదం ప్రవేశపెట్టారు. జాతీయత కోసం వెదుకుతూ అలెక్సాండర్ పుష్కిన్ (1799–1837) లాంటి మహా కవి రష్యాకి ఆవిర్భవించారు. మిహైల్ లెర్మొంతోవ్ (1814–1841) పుష్కిన్ శైలీ శ్రేష్టత కొన్నాళ్లు కొనసాగించారు. 18వ శతాబ్దంలో ఇతర ముఖ్యమైన కవుల్లో ప్రముఖులు–ఇవాన్ ఖెమ్నిట్సెర్ (1745–), ఇవాన్ డ్మిట్రియెవ్ (1760–1837), ఇవాన్ క్రైలోవ్ (1769–1844), ఇప్పొలిట్ బొగ్దనోవిచ్ (1744–1803), గవ్రిల రొమనోవిచ్ దెరవిన్ (1743–1816) మొదలైనవారు.

**స్వర్ణోత్సవ కాలం :** 19వ శతాబ్దం రష్యన్ సాహిత్యానికి స్వర్ణ యుగంగా తీసుకున్నా, 1820 నుండి 1880 వరకే ఆ యుగమని కొందరి వాదన. అది కూడా మొదటి భాగం (మిఖైల్ లెర్మొంటోవ్ 1941లో మరణం వరకూ) కవిత్వానిదైతే, తరువాతి కాలం (డోస్టొవిస్కీ చివరి నవల వరకు) వచనానిది. కవిత్వ స్వర్ణయుగానికి ఆద్యులు అలెక్సాండర్ పుష్కిన్. ఆ కాలంలోనే వచనంలో లియో టాల్ స్టాయ్, ఆంటన్ చెకోవ్, ఫియొడొర్ డోస్టొవిస్కీ ప్రపంచ సాహిత్యంలో ప్రముఖులయారు. ఆ కాలపు ఇతర ముఖ్య కవులు – అలెక్సాండర్ సెర్గెయెవిచ్ గ్రిబొయెడొవ్ (1795–



**అలెక్సాండర్ పుష్కిన్**

1829), మిఖైలొ వసిలెవిచ్ లొమొనొసొవ్ (1711–1765), ఫెడొర్ ఇవనొవిచ్ టూట్చెవ్ (1803–1873), మిహైల్ లెర్మొంతోవ్ (1814–1841), ఆఫనసీ ఫెట్ (1812–1892), నికొలై నెక్రసోవ్ (1821–1878) మొదలైనవారు. కాల్పనిక ధోరణి కవిత్వంలో ఈ కాలమంతా నడిచింది.

**అలెక్సాండర్ పుష్కిన్ (1799–1837) :** రష్యా రచయితల్లో ప్రఖ్యాతుడుగా అంగీకరించబడ్డ అలెక్సాండర్ పుష్కిన్, ఎక్కువ భాగం భావ కవిత్వం, 1820–1830 మధ్యనే రాసారు. కానీ కవిత్వ పరంగా ప్రసంశలు పొందిన కవిత్వం మాత్రం, వచనం వైపు మళ్లుతున్న, వారి జీవితం చివర దశ ఏడేళ్లలో రాసినవే. ఆధునిక రష్యా సాహిత్య నుడికారానికి ఆద్యుడు పుష్కిన్. క్రైస్తవ చర్చి ఉపయోగించే శ్లావిక్ భాష, పశ్చిమ యూరొప్ నుండి యెరువు తెచ్చుకున్న భాష, మాట్లాడుకునే స్వభాష కలగలిసిన ఒక ఆధునిక రష్యన్ భాష అది. ఆధునిక రష్యన్ కవిత్వం వాడుతున్న భాష, పుష్కిన్ నుండి వచ్చినదే. ఉదార భావాలతో వ్యక్తిగత జీవితంతో బాటు, అధికారుల మూలంగా అనేక సంఘర్షణలతో పుష్కిన్ జీవితమంతా గడిచింది. చివరికి తన భార్యకు ప్రియుడన్న అనుమానంతో చేసిన ద్వంద్వయుద్ధంలో మరణించారు.

**ఇది సమయం మిత్రుడా, ఇది సమయం ..**

**ఇది సమయం మిత్రుడా, ఇది సమయం,**
**హృదయాలు శాంతిని కోరుకుంటున్నాయి**
**రోజుల తరువాత రోజులు కొట్టుకుపోతున్నాయి,**
**గంటల తరువాత గంటలు గడిచిపోతున్నాయి**
**కొంచెం జీవితం, నువ్వు నేను కలిసి**
**దీర్ఘాయువుగా జీవించాలనుకున్నాం,**
**కానీ అర్థాంతరంగా మరణించొచ్చు**

**ప్రపంచంలో సుఖం లేదు, కానీ స్వేచ్ఛ, నెమ్మదితనం ఉంది**
**చాన్నాళ్లు పరమానందమైన జీవితపు పగటికలలు కన్నాను**
**చాన్నాళ్లు నేను అలసిన బానిసను, దూరాన ఉన్న స్వచ్ఛమైన**
**సంతోష శ్రమజీవన నివాసానికి పారిపో యత్నించాను**

**మిహైల్ లెర్మొంతోవ్ (1814–1841) :** సంపన్న కుటుంబం నుండి వచ్చి, పుష్కిన్ కవిత్వాన్ని ప్రేమించి, పుష్కిన్ మరణాన్ని తట్టుకోలేక *ఒక కవి మరణం* అన్న కవిత రాసినందుకు

కౌకసస్ పర్వత శ్రేణుల్లోకి బహిష్కరించబడ్డారు. బహిష్కారం నుండి తిరిగొచ్చినా, రాసిన రాతల మూలంగా మరోమారు అక్కడికే బహిష్కరించబడ్డారు. తిరిగొచ్చాక తన పాఠశాల సహ విద్యార్థితో తగువులో చంపబడ్డారు.

**మేఘాలు**

**పైన ఆకాశంలో మేఘాలు, స్వర్గంలో సంచరించేవి**
**అజుర్ మైదానమంతా పరుచుకుని, / మంచు ముత్యాల పోదమైన దారాలు**
**నా ప్రియమైన ఉత్తరదేశాన్ని, కొలవలేనంత దూరాల్ని వదిలి**
**నాలా బహిష్కృతుడులా దూరంగా ఇంకా దూరంగా ప్రవహిస్తున్నాయి**
**దక్షిణం వైపు ఏది నిన్ను పురికొల్పుతోంది? / ముండ్లు లేదా దుర్బుద్ధి,**
**ఏ బాణాలు నీకు బాహాటంగా గుచ్చుకుంటున్నాయి?**
**ప్రారబ్ధమా? నేరం నీమీద వేలాడుతోందా?**
**లేదా, స్నేహపు మాధుర్యమే అపవాదపు విషమా?**
**లేదు! ఆ పనికిరాని చెత్త, అజాగ్రత్తగా పయనిస్తోంది**
**మోహం, వేదన, దండన ఇవేవీ నీకు తెలీదు**
**సంవేదన నీకు తక్కువ, నువు స్వేచ్ఛవి - నిరంతర స్వేచ్ఛవి**
**నీకు మాతృదేశమూ లేదు, బహిష్కరణా లేదు**

**వెండి యుగం:** 20వ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాలు రష్యన్ సాహిత్యంలో అద్భుతమైన సృజనాత్మక కాలం కావడాన్ని అప్పటి సాహిత్య కాలాన్ని వెండి యుగంగా భావించారు. సోఫీ పర్నోక్ (1885-1933), మిఖైల్ కుజ్మిన్ (1872-1936) లాంటి కవుల కవిత్వంతో వెండి యుగం ముగిసింది.

మాతృదేశంలో మారుతున్న పరిస్థితుల్లో ఇమడలేక దేశం విడిచిపోయినవారు కొందరైతే, నికొలే గుమిలెవ్ లాంటి కొందరు చంపబడ్డారు, ఓసిప్ మండెలెస్టం లాంటివారు నిర్బంధ కేంద్రాల్లో మరణించారు. ఆనా అఖ్మతోవా లాంటివారు దేశంలోనే ఉండిపోయి అనేక కష్టాల్ని అనుభవించారు. మారినా ట్స్వెటైవా (1892-1941) లాంటివారు ఇంటా బయటా అనేక ఇబ్బందుల పాలయ్యారు. మరికొందరు వ్లాడిమిర్ మయకొవిస్కీ లాంటివారు ఆ రంగం నుండి విరమించుకున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అనుయాయులుగానో, రాజకీయాలకు అతీతులుగానో, వ్యతిరేకులన్న అనుమానం రానివ్వకుండానో, రాసిన కవిత్వం కూడా అప్పట్లో విరివిగానే వచ్చింది. ఏదేమైనా అందరూ వెండియుగంలో అద్భుతమైన కవిత్వాన్ని సృష్టించడంలో తోడ్పడ్డారు

**1917-1939 మధ్య రష్యన్ విప్లవం తరువాత:** 1921 వరకూ కవిత్వం అన్ని విధాలా అభివృద్ధిచెందింది. ప్రతీకాత్మక కవిత్వం రాసిన అలెక్సాండర్ బ్లాక్ (1880-1921), ఊహాత్మక కవిత్వంలో ఎస్.ఏ.యెసెనిన్ (1895-1925), విగ్రహారాధన వ్యతిరేక కవిత్వంతో వ్లాడిమిర్ మయకొవిస్కీ (1893-1930) ఎక్కువగా రాణించారు. వెండి యుగంలో మూడు కవిత్వ ధోరణులొచ్చాయి -

**1.ప్రతీకాత్మక వాదం** (Symbolism) : - 19వ శతాబ్దం చివర్లో యూరప్ సాహిత్యాన్నంతా ప్రభావితం చేసిన ఒక కళాత్మక ఉద్యమం. రష్యా ప్రతీకాత్మకత బీజాలు, ఫ్రెంచి ప్రతీకాత్మకత నుండి తీసుకున్నవి. ఈ ఉద్యమంలోని కవులు, వారి కవితాశక్తి కలిగించిన ప్రేరణతో, లోతైన అనుభూతుల అనుభవాలతో, వారు దర్శించిన భావాలకు, వారిచ్చే కవిత్వ రూపం అది. ప్రజలకు, అతీతశక్తికి మధ్య వారు గొలుసుగా భావించుకునేవారు. (మన బాలగంగాధర తిలక్ *ఆర్తగీతం* కవిత లోని ఈ పాదం వెంటనే గుర్తొస్తుంది. "పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్ప వలసిన వాణ్ణి" అన్నది). ఆ అతీతశక్తి శాశ్వతమైన స్త్రీ కావచ్చు, ప్రకృతి కావచ్చు, మరేదైనా కావచ్చు. అలెక్సాండర్ బ్లాక్ (1880-1921), వలెరి యకొవ్లెవిచ్ బ్రుసొవ్ (1873-1924), ఇన్నొకెంటి అన్నెన్స్కీ (1855-1909), కొన్స్టంటిన్ బల్మోంట్ (1867-1942) మొదలైనవారు, ప్రతీకాత్మక కవిత్వంలో ఆద్యులు.


అలెక్సాండర్ బ్లాక్

**అలెక్సాండర్ బ్లాక్ (1880-1921) :** ప్రతీకాత్మక వాద కవుల్లో అత్యంత ప్రతిభావంతుడు. 'సౌందర్యవంతమైన స్త్రీ మీద పద్యాలు' తో మొదలై 'పన్నెండు' (కొన్నాళ్ళే ఉన్న విప్లవ ఉత్సాహం భూమికగా రాసిన) గొప్ప దీర్ఘ కవిత వరకూ కొనసాగింది. అక్టోబరు విప్లవాన్ని ఆహ్వానించిన కవి. ఎర్ర సైన్యం అన్న కవితలో అప్పటి అతని భావాలు తెలుస్తాయి. మాక్సిం గోర్కీతో సన్నిహిత సంబంధాలున్నాయి. వీరిని బాగా ఎరిగిన వారు, బ్లాక్ నవ్వగా ఎన్నడూ చూడలేదంటారు.

**ఇక్కడ మనం బతుకుతున్నాం**
**ఇక్కడ పురాతన గదుల్లో మనం బతుకుతున్నాం**

**వసంతంలో నీటి దారాలతో / ఆనందం ఇక్కడ అల్లల్లాడుతుంది**
**నది పాట పాడుతుంది / వసంతపు మొదటి గాలులకి**
**ఉల్లాసపు మొదటి సందేశంగా / గది వాకిలిలో**
**నీలాకాశ ప్రకాశం ప్రవహిస్తుంది / సంవత్సరాల కలల**
**పూర్తి పవిత్రమైన వణుకు / పొలాలగుండా సంతోషంగా సవారీచేస్తూ**
**కళ్లు చెదిరే కాంతిపుంజాల ఆశిస్సులందజేస్తుంది**

**2. ఔన్నత్య వాదం** (Acmeism) : - ప్రతీకాత్మక కవిత్వంలోని అస్పష్టతకు విరుద్ధంగా వచ్చిన ప్రతిక్రియా ఉద్యమం ఔన్నత్య వాదం. కవిత్వాన్ని నేలమీదకు దించాలనుకున్న ప్రయత్నం అది. కవిత్వం, అనుభూతికి ఆలోచనకి బంధించబడిలేదని, కవులు సంస్కృతి, మానవ అస్తిత్వం, వర్తమానాన్ని ప్రతిబింబించాలని వారి అభిప్రాయం. సమయం వారికి పారదర్శకం. వారి కవిత్వ పాదాల్లో భూత భవిష్యత్ వర్తమానాలు కనబడేవి. ప్రతీకాత్మక కవిత్వంలోలా, వీరు కూడా బైబిలుసంబంధిత పౌరాణిక విషయాల్ని వాడుకున్నారు. ప్రతీకాత్మత కవులు అజ్ఞాతం వైపు ఎక్కువగా మొగ్గు చూపడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ వాదం వచ్చింది. 1912 లో నికొలే స్టెపనొవిచ్ గుమిలెవ్ (1886-1921), ఎస్.ఎం. గొరొడెస్కీ (1884-1967) నేతృత్వంలో ఈ వాదం మొదలైంది. వారిని అనుసరించిన వారు ఆనా అక్మతోవా (1889-1966), ఓసిప్ మండెలెస్టం (1891-1938).

**ఆనా అక్మతోవా (1889-1966) :** రష్యన్ సాహిత్యంలో ప్రముఖ కవయిత్రి. ఆమె అసలు పేరు అన్నా అంద్రెయేవ్నా గోరెంకో. 11 ఏళ్ల ప్రాయం నుండి కవిత్వం రాయడం మొదలెట్టారు. అప్పటి విభిన్న - స్పష్టత, సాంద్రత, సరళత, సమగ్ర రూపంతో కూడుకున్న కవిత్వానికి ఆద్యుడైన నికోలయ్ గుమిల్యొవ్ ని 1910 లో వివాహం చేసుకున్నారు. 1918 లో విడాకులూ తీసుకున్నారు. వారికి ఒక కొడుకు లెవ్ గుమిల్యొవ్. రష్యన్ విప్లవం మూలాన ఆమె జీవితంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎన్నో కష్టాలు పడాల్సొచ్చింది. 1921 లో ఆమె భర్త దేశద్రోహం కింద, బోల్షెవికుల ద్వారా చంపబడ్డారు. 1938లో కొడుకు నిర్బంధించ బడ్డాడు. 1956 వరకూ అనేక మార్లు అనేక కారాగారాల్లో ఉంచబడ్డాడు. దోషులుగా ప్రభుత్వం పరిగణించిన వారి సంతానం కావడమే అతని అసలు నేరం. స్టాలిన్ ప్రభుత్వం ఆమెను శతృవుగా భావించి, ఆమె రచనల్ని 1925 నుండి 1940 వరకు నిషేధించింది.



ఆనా అక్మతోవా



గుమిల్యొవ్

ఆమె అతి ముఖ్యమైన కవిత REQUIEM *(శ్రద్ధాంజలి)* స్టాలిన్ సమయంలో స్త్రీల దురవస్థని - ఆమెతో బాటు జైలు బయట, అత్యంత దుఃఖంతో ఓపికగా నిస్సత్తువగా, వారి కొడుకు కోసమో, భర్తకోసమో, ప్రేమికుడికోసమో, రొట్టె ముక్క అందించాలనో, చూడాలనో, చిరు సందేశం కోసమో గంటలకొద్దీ వేచి ఉన్న వైనాన్ని, ఒక స్త్రీ దృష్టితో కళ్లకు కట్టినట్టు వర్ణించిన అద్భుతమైన కవిత అది. తనకోసం ఒక స్మృతి చిహ్నం నెలకొల్పుతారేమోనన్న ఆశ ఈ కవిత *శ్రద్ధాంజలి*లో కనిపిస్తుంది. అటువంటిదేమీ జరగకపోయినా, ప్రపంచ వ్యాప్తంగా ఈ కవితే ఆమెకు స్మృతి చిహ్నంగా మిగిలిపోయింది.

**శ్రద్ధాంజలి**

**పరాయి ఆకాశం ఏదీ నన్ను కాపాడలేదు**
**అపరిచిత రెక్కలేవీ నా మొహాన్ని కప్పలేదు**
**సామాన్య ప్రజల సాక్షిగా నేనున్నాను**
**ఆ ప్రదేశంలో, ఆ సమయంలో బ్రతికిపోయి**

*(శ్రద్ధాంజలి దీర్ఘ కవితలో మొదటిభాగం ఇది)*

ఓసిప్ మండెలెస్టం (1891-1938) నిర్బంధ కేంద్రంలో మరణించారు. వారి కవిత్వాన్ని అతని భార్య కంఠతా పెట్టుకుని ప్రచురించిన కవితలోని భాగం అప్పటి దుస్థితిని కళ్లకు కట్టి చూపిస్తుంది.

"కేవలం రష్యాలోనే కవిత్వం పూజ్యమైనది. - అది ప్రజల్ని చంపనిస్తుంది. చంపడానికి సాధారణ కారణం కవిత్వం కావడం ఎక్కడైనా ఉందా?" అని వాపోతాడు.

అలా అని అతనికి దేశప్రేమ , కవిత్వం తక్కువేమీ కాదు. నిర్బంధంలో కూడా అతను -

"చలికి వణికిపోతున్నాను / నాకేదీ కావాలని లేదు కానీ ఆకాశం నన్ను పాడుకొమ్మని ఆజ్ఞాపిస్తూ, బంగారంతో నర్తిస్తోంది" అని కవిత్వంలో మునిగిపోయాడు.

మారినా ట్స్వెటైవా (1892-1941) మరో అద్భుత కవయిత్రి. కష్టాల్ని భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఆమె దృష్టిలో -

"కవులు దూరాలనుండి భాషని తీసుకొస్తారు
భాష కవుల్ని చాలా దూరం తీసుకువెళ్తుంది"..

**వార్తాపత్రికల పాఠకులు**

శూన్యంలో భూమి దొర్లుతుంది
దొర్లుతూ ప్రజల్ని మోస్తుంది / చేతిలో వార్తాపత్రికలు
నములుతూ మింగుతూ / నచ్చనివి ఊస్తూ
ఎవరికివారే / భూమిని మోస్తున్నట్టు -

**3. ఆశా వాదం** (Futerism) :- పాత సంప్రదాయాల మీద కవిత్వ నిర్మాణం చేయరు. మునుపొచ్చినవన్నీ ధ్వంసం చేసి కొత్తగా మొదలెట్టాలని, విజ్ఞానాన్ని విప్లవాల్ని కవిత్వంలో స్వీకరించాలని భావిస్తారు. 1909 లో ఇటలీలో ఈ ఉద్యమం మొదలైంది. వాస్తవవాదానికి వ్యతిరేకంగా, బూర్జువా సమాజాన్ని ఎదిరిస్తూ ఆశావాద కవిత్వం వచ్చింది. దానిలో ప్రతిభావంతులు - వ్లాడిమిర్ మయకొవిస్కీ (1893-1930), వెలిమిర్ ఖ్లెబ్ నికోవ్ (1885-1922), అలెగ్జాండర్ క్రుచెన్యేఖ్ (1886-1968), డేవిడ్ బుర్లియుక్ (1882-1967), వసిలీ కమెనిస్కీ (1884-1961) మొదలైనవారు.

**వ్లాడిమిర్ మయకొవిస్కీ (1893-1930) :** 1917 రష్యన్ విప్లవపు ప్రముఖ కవి. ఆశావాద కవిత్వానికి ఆద్యుడు. కవిత్వాన్ని సభలు, సమావేశాల్లో, రహదారి కూడళ్లలో చదివేవారు. రాగయుక్తంగా పాడేవారు. నిజానికి ఈ సంప్రదాయం రష్యాలో ఎక్కువగానే ఉంది. విమర్శకుల వ్యాఖ్యానాలు, విఫలమైన ప్రేమని తట్టు



మయకొవిస్కీ

కోలేక ఆత్మహత్య చేసు కున్నారు. మన శ్రీశ్రీ కి చాలా ఇష్టమైన కవి. ఆత్మహత్య చేసుకున్నప్పుడు వారి జేబులో దొరికిన ఆత్మహత్య కవిత ఇది. ఆ కవితలో ఈ కింది భాగం బహుశా తన ఆత్మహత్యకు ఉపసంహారంగా రాసిందని అంటారు.

ఒంటిగంట దాటింది / పాలపుంతవెండి రాత్రంతా పారుతోంది
నాకేమీ తొందరలేదు, మెరుపు తంతివార్తలతో
నిన్ను లేపలేను, ఇబ్బంది పెట్టనూ లేను
వాళ్లన్నట్టు ఆ అధ్యాయం ముగిసింది
రోజూ నలిగినలిగి ప్రేమ నౌక బద్దలైంది
ఇక నీకు నాకు సరి. ఇంక బాధెందుకు
పరస్పర దుఃఖాలు, బాధలు , గాయాలు సరితూగడానికి
ప్రపంచం మీద ఏది నెమ్మదిగా స్థిరపడుతుందో చూడు
నక్షత్రాలనుండి నివాళిగా ఆకాశాన్ని రాత్రి చుట్టుముడుతుంది
ఇటువంటి ఘడియల్లోనే లేచి సంబోధిస్తారు
కాలాల్ని, చరిత్రని, సమస్త సృష్టిని

**1960 - 70 ల మధ్య కవిత్వం :** సరికొత్త స్వేచ్ఛతో రాసిన కవిత్వం ఎక్కువ. కోపోద్రిక్తులైన యువకులు రాసిన కవిత్వంగా ఎవ్గెనీ అలెక్సండ్రొవిచ్ ఎవుతుషెంకో (1933), ఆండ్రీ అండ్రెయెవిచ్ వొజెసెన్స్కీ (1933-2010) లను గుర్తించారు. 1960 ప్రాంతంలో కొత్త కవిత్వానినే కాక, పాత కవిత్వాన్ని కూడా ప్రజలు ఆదరించారు. ప్రవాసం నుండి తిరిగొచ్చి ఆత్మహత్య చేసుకున్న మరిన ఇవనోవ్న మారినా ట్స్వెటైవా (1892-1941) లాంటి కవుల కవిత్వాన్ని ప్రజలు అప్పుడే తెలుసుకోగలిగారు. బోరిస్ పాస్టెర్నక్ (1890-1960) కవిత్వం అప్పుడే ప్రచురించబడింది. వారి అమూల్యమైన రచన డాక్టర్ జీవాగో మాత్రం, పశ్చిమంలో ప్రచురించబడ్డ ముప్పయ్యేళ్ల తరువాతే వెలుగుచూసింది. బ్రెజ్నేవ్ స్తబ్ధత కాలంలో సాహిత్యం మీద అధికారిక నియంత్రణ అధికంగా ఉండటంతో అనేకమంది ప్రతిభావంతులైన రచయితలు, కవులు దేశం వదిలిపోవల్సొచ్చింది. అటువంటి వారిలో - మరో గత్యంతరం లేక వెళ్లినవారు 1972లో ఇవిసిఫ్ అలెక్సాండ్రొవిచ్ బ్రోడ్ స్కీ (1940-1996). 1987లో వారికి నోబెల్ బహుమతి వరించింది, 1991 లో అమెరికాలో ఆస్థాన కవిగా ఎన్నుకోబడ్డారు.

ఆండ్రీ వొజెసెన్స్కీ (1933-2010), ఎవ్గెనీ ఎవుతుషెంకో (1932-) సంప్రదాయ వ్యతిరేక కవిత్వాన్ని రాసారు. వొజెసెన్స్కీ కవిత్వ రూపాల్లో అసాధారణ నవీకరణ తీసుకొచ్చారు.

ఆండ్రీ అండ్రెయెవిచ్ వొజెసెన్స్కీ (1933-2010): వాస్తు శాస్త్రజ్ఞుడు కావడాన్ని, కవిత్వ శైలిలో సరికొత్త నడకల్ని ప్రవేశపెట్టారు. ఉపమానాలు, ఉపమేయాలు, రూప కాలంకారాలు వీరి కవిత్వంలో ఎక్కువ. ఏ విమర్శచేసినా దేశాభిమానంతో చేసేవారు. నాజీలు సోవియట్ యూదుల ఊచకోత మొదలుకుని, చెర్నోబిల్ దుర్ఘటన వరకు కవిత్వమయం చేసారు. నోబెల్ బహుమతి గ్రహీత బోరిస్ పాస్టర్నక్‌కు బాగా నచ్చిన కవి, యువతరం బాగా ప్రేమించిన కవి కూడా.

కవిత్వం అంటే – ఒక స్ఫటికం, ఒక ప్రపంచ నమూనా, ఒక సామరస్య ఆకృతి, జరుగుతున్న వాటి సారాంశాల్లో చొచ్చుకుపోయే ఆలోచన పద్ధతి, సత్యాన్ని బహిరంగపరిచే దారి. కవిత్వానికి సరిహద్దులు లేవు, దానికి ప్రాంతాలు రాజధానులు లేవు. భాషలు అనేకమైనా కవిత్వం ఒక్కటే – అని వీరి అభిప్రాయం.

**నేను గోయాని**

**ఉత్త యుద్ధపు గోయాని నేను, శత్రువు పక్షిముక్కు ఉలితో**
**నా జ్వాలాముఖి కళ్లు ఆవులించేవరకూ / నేనా దుఃఖాన్ని**

**నేను యుద్ధ నాలుకని / 1941 సంవత్సరపు మంచుమీద**
**నివురుగప్పిన నిప్పులా నగరాలు / నేనా ఆకలిని**

**ఉరితీసిన స్త్రీ మోసాన్ని / ఎవరి శరీరమైతే గంటలా**
**శూన్య ప్రదేశంలో మోగుతుందో / నేనా గోయాని**

**ఓ రోషపు ద్రాక్షా! / పిలవబడని అతిథి బూడిదని**
**నేను పశ్చిమం వైపు దొర్లించాను. / మరచిపోలేని ఆకాశానికి**
**మేకుల్లా నక్షత్రాల్ని దించాను / నేనా గోయాని**

(గోయా జర్మనీ నౌక. రెండవ ప్రపంచ యుద్ధం చివరి దశలో 7000 మంది సైనికుల్ని తీసుకుపోతున్న ఆ నౌకని సోవియట్ సైన్యం బాల్టిక్ సముద్రం మధ్యలో ముంచింది. అందులో 193 మంది మాత్రమే బతికారు.)

**ఎవ్గెనీ అలెక్సండ్రొవిచ్ ఎవుతుషెంకో (1933–) :** 30 ఏళ్లకే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కవి. సమకాలీన సంఘటనలన్నీ వీరి కవితా వస్తువులే. బాబీయార్ కొండ లోయల్లో 90 వేలమంది యూదులు, నాజీల చేతిలో చంపబడ్డ సంఘటనతో రాసిన కవిత *బాబీయార్* వీరి అద్భుత కవితల్లో ఒకటి. జెకొస్లవేకియా మీద సోవియట్ దండయాత్రని ఖండించకుండా ఉండలేక పోయారు. దానికి మూల్యం చెల్లించుకోక తప్పలేదు. నా ప్రారబ్ధం అతీతం/నా భవితవ్యం ఆశ్చర్యాలమయం – అని చెప్పుకునేవారు.

**బాబీ యార్ మీద ఏ స్మారక స్థూపమూ లేదు**
**మోటు సమాధిరాయిలా ఒక శుద్ధ చుక్క**
**నేడు సమస్త యూదులంత వయస్సువాడిననుకుంటున్నాను నేను**
**యూదులా నేను కనిపిస్తున్నాను**
**ఇక్కడ ప్రాచీన ఈజిప్ట్ గుండా కాళ్లీడుస్తున్నాను**
**శిలువమీద ఇక్కడ చీలలుకొట్టబడి మరణిస్తాను**
**నేను ఇవాళటివరకూ మేకుల గాయాలు వింటూనే ఉన్నాను**

*(బాబీయార్ దీర్ఘ కవిత మొదటి భాగంలో కొంత)*

**రష్యాలో నొబెల్ కవులు :** సాహిత్యంలో నోబెల్ బహుమతి రష్యాలో అయిదుగురుకొచ్చింది. అందులో ముగ్గురు కవులున్నారు 1933 లో ఇవాన్ అలెక్సీచ్ బునిన్ (1870–1953) ,1958 లో బోరిస్ పాస్టెర్నక్ (1890–1960), 1987 లో జోసెఫ్ బ్రోద్ స్కీ (1940–1996) లు ఈ బహుమతి పొందారు. వీరిలో బునిన్, బ్రోద్ స్కీ వలసలో ఇతర రాజ్యాల్లో ఉండగాను, పాస్టెర్నక్ రష్యాలో ఉండగానే ఈ బహుమతి ప్రకటించారు.

ఇవాన్ అలెక్సీచ్ బునిన్ (1870–1953): అక్టోబరు విప్లవాన్ని తట్టుకోలేక, రష్యా నుండి పారిపోయి, ఫ్రాన్స్‌లో తలదాచుకున్న, ఇవాన్ బునిన్‌గా పిలవబడే, ఇవాన్ అలెక్సవిచ్ బునిన్, రష్యా కవి, కథా రచయిత, అనువాదకుడు, నవలాకారుడు. రష్యన్ల ఉదాత్తత, రైతు జీవితం వీరికి ముఖ్య వస్తువు. 1933 లో నోబెల్ బహుమతి పొందిన మొదటి రష్యన్ సాహితీవేత్త. 1917 రష్యన్ విప్లవానికి ముందు బునిన్ రష్యాలో ముఖ్యమైన వ్యక్తిగా గౌరవించ బడ్డారు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, వీరు సిలోను, పాలస్టైన్, ఈజిప్ట్, టర్కీ, మొదలైన దేశాలన్నీ పర్యటించారు. అది వీరి కవిత్వ రచనకు ఎంతగానో దోహద పడిందని వారు చెప్పుకున్నారు. చివరివరకూ కవిత్వం రాసినా, బునిన్ వచనానికే రష్యాలో ఎక్కువ గుర్తింపు ఉండేది. అప్పటి ఆధునిక పద్ధతిలో కంటే వీరు, 19 వ శతాబ్దపు తుర్గెనెవ్, టాల్ స్టాయ్, గార్సిన్, ఛెఖోవ్ లాంటి వారి రచనలకు దగ్గరగా రాసేవారు.

**హిమఖండం మీద పద్యం / అంతెత్తున శిఖరపు హిమరేఖ**
**మెరిసే ఉక్కు ఖడ్గంతో నేను పద్యాన్ని చెక్కాను**

**చలికాలం సాయంతో బహుశా రోజులు గడిచిపోతాయి**
**నా ఏకాంతానికి సంకేతంగా మంచు నాకు తోడుంటుంది**
**కొండ శిఖరం మీద నీలాకాశం కింద**
**సూర్యుడు నా ఏకైక సాక్షి, నేను మృదువుగా కోస్తాను**
**మరకతపు హిమఖండం మీద దృఢమైన ఒక్కో గీత**
**ఆనందం అప్పుగా ఇస్తున్నపుడు చలికాలపు కాంతికి ప్రకాశం**

**మరో కవి నన్ను ఆవిష్కరిస్తాడనుకున్న**
**ఆలోచనకే నవ్వుకుంటాను. బహుశా అతనెప్పుడూ హర్షించకపోవచ్చు**
**అతని లోయ మార్గంలో హర్షధ్వానాల**
**గుంపులో అతను మునిగిపోయి ఉంటాడు**

**కొండ శిఖరం మీద నీలాకాశం కింద**
**మిట్ట మధ్యాహ్నం వేళ నేను పద్యం చెక్కాను**
**శిఖర ప్రదేశాన్ని అందరికీ పంచుతున్న కేవలం అతనికోసం**

**బోరిస్ పాస్టెర్నక్ (1890–1960) :** 1913 లో వచ్చిన *గేయం* అన్న కవిత పాస్టెర్నక్ మొదటి కవిత. కవిత్వ ప్రస్థానం 1914 లో వచ్చిన కవిత్వ సంకలనం 'ముట్టడించే మేఘాల్లో

కవల'తో మొదలయింది. పాస్టెర్నక్ రష్యాని ప్రేమించారు. వారి దోషాలన్నింటినీ, స్టాలిన్ ఆకృత్యాల్ని సైతం క్షమించడానికి సిద్ధపడ్డారు. తాత్కాలికమైన చీకటిలో వెలుగుకోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసారు. వీరికి నోబెల్ బహుమతి "రష్యా గొప్ప సంప్రదాయ కావ్య పద్ధతిలో, ముఖ్యంగా సమకాలీన గేయ కవిత్వాన్ని సాధించినందు" కని బహుమతి ప్రదాతలు మెచ్చుకున్నారు.

**కొంచెం ప్రేమ చాలా కష్టమైనది / కొంచెం ప్రేమ చాలా కష్టమైనది**
**కానీ నువ్వు మెలికలు లేని మనోహరానివి**
**నీ ఆకర్షణ రహస్యం / జీవితమంత అద్భుతం**
**వసంతంలో కలల గుసగుసలు**
**వార్తా సత్యాల మర్మరధ్వని ఎవరైనా వింటారు**
**అటువంటి ప్రాథమికాల కుటుంబానికి చెందుతావు**
**నీ తాత్పర్యం, గాలిలా నిస్స్వార్థం**
**లేచి చూడడం తేలికే**
**ఒకరి గుండెలోని పదాల రొదని కలవరపెట్టి,**
**ఇక రొదలేకుండా బతకొచ్చు**
**ఇవేవీ చేయడం అంత కష్టం కాదు**

**జోసెఫ్ బ్రోడ్ స్కీ (1940–1996) :** వీరి అసలు పేరు ఇవొసిఫ్ అలెక్సాండ్రొవిచ్ బ్రోడ్ స్కీ యూదు సంతతికి చెందినవారు. కవిత్వ పరంగా ఏమీ తప్పులు వెదకలేక, పరాన్నజీవి, కృత్రిమ కవి, మాతృదేశం పట్ల నిజాయితీలేని, రాజ్యాంగం పట్ల నిబద్ధత లేని వాడని ఆయనపై నేరారోపణలు చేసారు. ఈలోగా వీరిని అవమానపర్చటానికి 3 వారాల పాటు చికిత్సా నెపంతో పిచ్చాసుపత్రికి పంపారు. 13 ఫిబ్రవరి 1964 రహస్యంగా కవిత్వాన్ని ప్రచురిస్తున్నారన్న అభియోగంతో బ్రోడ్‌స్కీ ని లెనిన్ గ్రాడ్ వీధుల్లో నిర్బంధించి 13 మార్చి 1964 న విచారణ నిమిత్తం క్రెస్టీ కారాగారానికి పంపి విచారణ చేసారు. ఆ సందర్భంగా న్యాయాధిపతికి వీరికి మధ్య జరిగిన సంభాషణని అప్పట్లో ప్రముఖంగా చెప్పుకునేవారు.


**బ్రోడ్ స్కీ**

**'నీ వృత్తి ఏమిటి?'**
**'కవి, అనువాదకుడు'**
**'కవుల జాబితాలో నిన్ను ఎవరు చేర్చారు?'**
**'ఎవరూ కాదు, మానవజాతిలో నన్నెవరు చేర్చారు?'**
**'నువ్వు పాఠశాల చదువైనా పూర్తి చేయలేదు కదా?'**
**'ఇది చదువుకు సంబంధించింది కాదు,**
**బహుశా దేవుడు ఇచ్చిందేమో'**

--- *నిర్బంధంలో ఉన్నప్పుడు న్యాయాధిపతికి బ్రోడ్ స్కీకి మధ్య జరిగిన ప్రముఖ సంభాషణ*

**స్వేచ్ఛ :**

**నా దేశభ్రష్టుడి దినబత్తెం పట్టుకుని**
**తాళం దడదడ ధ్వనిని హత్తుకుని**
**చచ్చే ప్రాంతాలకు చేరుకుని,**
**మళ్లీ నా దేశీయ భాషలోకి మళ్లుతాను**
**రష్యన్ రూపకపు తేజస్సు**
**చాలా మొండిది – మంట కంటే వేడైనది**
**గొప్పదైన దీపంలా / రాత్రి నన్ను వెలిగిస్తుంది**
**నా పెన్ను తీయలేను**
**నా గుండె భయంతో కొట్టుకుంటుంది**
**కానీ నా వెనకనుంచి రష్యా మీద నీడ**
**తోటలోని పక్షిలా మొరపెడుతుంది**
**వెదజల్లబడ్డ అహంకార ప్రతిధ్వని**
**తెల్లగా పాలిపోయి నా గుండెలో చిక్కుకుంటుంది**
**వసంతాన్ని వెంబడించి**
**దక్షిణం నుండి ఉత్తరానికి కేవలం పగ తీవ్ర మవుతుంది.**
**కోతకొస్తున్న దగ్గు మంటతో / రాత్రులు ఇంకా కిందికి వంగిపోతూ**
**దరిదాపుగా నేను మండుతున్నాను / అందువలన నేను చివరి గోడలా**
**మూర్ఖంగా కొవ్వొత్తిలాంటిదాన్ని ఆరిపోకుండా చూస్తున్నాను**
**ఈ గొప్ప జ్వాల నాతోబాటు మినుకు మినుకు మంటూనే ఉంది**

*(25 మార్చి 1964 ఆర్ఖంగెల్స్క్ తాత్కాలిక చెరసాల)*

**సమకాలీన కవులు :** వినియోగం కంటే ఉత్పత్తి ఎక్కువ అన్నది రష్యాలో ఒక సామెత; బహుశా అది రష్యా కవిత్వానికి కూడా వర్తిస్తుందేమో. అనువాదాల మూలంగా అలెక్సాండర్ పుష్కిన్ దగ్గరనుంచి ఆనా ఆఖ్మతోవా వరకూ రష్యన్ కవిత్వం చాలా వరకు తెలిసింది. కొందరు రష్యన్ కవులు వ్లాదిమిర్ నబొకోవ్, జోసెఫ్ బ్రోడ్ స్కీ లాంటి వారు ఆంగ్లంలో కూడా కవిత్వం రాసారు. భాషలోను, శైలిలోను, ఈ కొత్త కవుల్లో మార్పు కనిపిస్తుంది. బ్రోడ్ స్కీ అన్నట్టు – రాజ్యం కంటే పురాతనమైనది భాష, ఛందస్సు చరిత్రలో జీవిస్తుంది. నిజానికి దానికి చరిత్ర కాదు, కావలసిందల్లా కవి.

గెన్నడీ ఐగి (1934–2006), ఇవన్ ఆఖ్మెటీవ్ (1950–), గెన్నడీ అలెక్సెయెవ్ (1932–1987), వ్లాడిమిర్ అరిస్టొవ్ (1950–), సెర్గేయ్ బిర్యుకోవ్ (1950–), వ్లాద్డిమిర్ యార్లె (1947–), డ్మిట్రి గ్రిగొరియెవ్ (1960–), ఎలెన కట్సుబ (1946–), కొన్స్టంటిన్ కెద్రోవ్ (1942–), ఇగొర్ ఖొలిన్ (1920–1999), విక్టర్ క్రివులిన్ (1944–

2001), అనటొలీ కుద్రవిట్స్కీ (1954-), అలెక్సండర్ మకరొవ్-క్రొట్కోవ్ (1959-), ఆర్వో మెట్స్ (1937-1997), వ్సెవొలోడ్ నెక్రసోవ్ (1934-), రియ నికొనోవ (1942-), గెన్రిక్ సప్గిర్ (1928-1999), ఆస్య ష్నైడెర్మన్ (1968-), సెర్గే స్ట్రటనొవిస్కీ (1944-), అలిన విటుఖ్నొవస్కయ (1973-), ఆన్డ్రెయ్ వొజ్నెసెన్స్కీ (1933-), యెవ్గెని యెవ్టుషెంకొ (1933-), ఎలెన ష్వార్స్ (1948-2010) మొదలైనవారు ముఖ్యమైన సమకాలీన కవులు. ఇజబెల్ల ఆఖతోవ్న ఆఖ్మదులిన (1937-2010) లాంటి కొత్త కవుల ప్రతిభ మూలంగా కవిత్వం మరింత సుసంపన్నమైంది.

**ఎలెన ష్వార్స్ (1948-2010) :** సమకాలీన కవుల్లో ప్రముఖ కవయిత్రి. అప్పటి అనధికార కవుల్లో ఈమె కూడా ఉంది. 1985 వరకూ పెద్ద గుర్తింపుకు నోచుకోకపోయినా, 1990 నాటికి రష్యాలో ఆమె కవిత్వ ప్రచురణ మొదలయింది. ఇప్పటి లెనిన్ గ్రాడ్, ఒకప్పటి సెయింట్ పీటెర్స్ బర్గ్ లో పుట్టి పెరిగి అక్కడే జీవితాంతం గడిపారు. అది వారికి ఒకప్పటి స్వర్గం. అదే ఈ కింది కవిత.

**ఆ వీధి పేరేమిటి :**

**ఆ వీధి పేరేమిటి - గుర్తుల బల్లమీద నువ్వు అది చదువుకోవచ్చు**
**నావరకూ దాని పేరు స్వర్గం. నేను కోల్పోయిన స్వర్గం**
**పూర్తి నగరం పేరేమిటి - దారినిపోతున్న వారిని నువు అడగొచ్చు**
**నాకు మాత్రం దాని పేరు స్వర్గం, నేను పోగొట్టుకున్న స్వర్గం**
**పోయింది కాబట్టి,**
**దాని ఉద్యానవనాలు ఇంకా నాకు వికసిస్తూనే ఉన్నాయి**
**నా గుండె కొట్టుకుంటోంది,**
**నా గుండె బాధ పడుతోంది, ఒక సంతోషంగా జయించిన వెలుగు**
**మెరుస్తున్న నదిమీద,**
**కలుపుమొక్కల్లో నల్ల ఎలుకలు గూడుకట్టుకుంటున్నాయి**
**వాటికి ఆమోదముంది, స్వాగతం,**
**ఈ భూస్వర్గాన్నీ ఏవీ ధ్వంసం చేయలేవు**
**బీరు తాగినపుడు గ్లాసు అంచులకు ఉప్పు పట్టించమని**
**ఉద్దేశపూర్వకంగా చెప్పినా ప్రకాశించావు**
**ఎటువంటి సమయమది - నేను కేలండరులో చూస్తాను**
**నువ్వు ఇంటి కప్పులా, అరిగిపోయి, నీకు లోనా బయటా దేవుడు**
**నువు సున్నితం, బలహీనం, పింగాణీ గిన్నెలా పగిలిపోతావు**
**దేవుడి కాంతి దాని నుండి మెరుస్తుంటుంది**
**బహుశా అంతా స్పష్టమవుతుంటుంది**

*(ఆ వీధి పేరేమిటి - కవితలో కొంత భాగం)*

**ఇజబెల్ల ఆఖతోవ్న ఆఖ్మదులిన (1937-2010) :** ఒక యుగస్వరంగా ఆఖ్మదులిన కవిత్వాన్ని రష్యాలో భావిస్తారు. సమకాలికులైన ఎవ్గెనీ అలెక్సంద్రొవిచ్ ఎవుతుషెంకో, ఆంద్రీ



tsvet

అంద్రెయెవిచ్ వొజెసెన్స్కీ సమకాలీన సమస్యలమీద సరికొత్త పంథాలో కవిత్వ రచన చేస్తున్నా, ఆఖ్మదులిన సాంప్రదాయక పద్ధతుల్లోనే అప్పటి మానసికావస్థల్ని, అభిమానాలని తన కవిత్వంలో తీసుకురాగలిగారు. లెర్మొంటొవ్, పాస్టెర్నక్ కవిత్వ శైలిలో రాస్తున్న కవయిత్రిగా ఆఖ్మదులిన కవిత్వం మీద, నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ బ్రోడ్ స్కీ అభిప్రాయ పడ్డారు. స్నేహం, ప్రేమ, మానవ సంబంధాలు - వీరి కవితా వస్తువులు.

**నేను తోటలోకి వెళ్లాను - కానీ తోటలో**
**పదం, కోమలంగా పెరిగి ఉంది.**
**పూర్తిగా విచ్చుకున్న గులాబీ అంత శోభాయమానంగా,**
**అది శబ్దాన్ని, సుగంధాన్ని, దృష్టిని సారవంతం చేస్తుంది.**
**మన పరిసరాలకంటే విశాలమైనది పదం**
**లోపలంతా సుఖంగా, స్వేచ్ఛగా/ దాని విలువైన నల్ల మట్టి**
**అనాథ బిడ్డల్ని తయారుచేస్తుంది, నాటిన విత్తనాల్లా.**
**నిరాశమయ నవీకరణలు విత్తి, / ఓ తోటా, పదం, నువు తోటమాలివి**
**నీకు కాచే పండ్లు / కత్తెరల మెరుపు రొద**
**పెరిగి వ్యాపించేది ఎవరికోసమో**

రష్యన్ కవులు రచయితలది ఎప్పుడూ ప్రజల స్వరం, ప్రజల ఆత్మ అంతరాత్మ, ఇంతవరకూ బయటి ప్రపంచానికి తెలియని సాహిత్యాన్ని అనువదించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఆలోచన ఆరాటం రష్యాలో ఇటీవలి కాలంలో పెరిగింది. అవి మరిన్ని సాహిత్య ద్వారాల్ని తప్పకుండా తెరుస్తాయి.

రష్యాలో రచయితల బాధలగురించి ప్రపంచానికి తెలిసినంత అక్కడ ప్రభుత్వాలపరంగా, ఏ విధమైన ఇబ్బందుల్లోనూ ఇరుక్కోని ప్రఖ్యాత రచయితల పట్ల ఉన్న పూజ్యభావం సంగతి అంతగా ప్రపంచానికి తెలీదు. ఏ దేశంలోనూ లేనన్ని రచయితల సంగ్రహాలయాలు అక్కడ ఉన్నాయి. ఆయా రచయితల ఇళ్లు సాహిత్య క్షేత్రాలుగా పదిల పర్చబడ్డాయి. ప్రముఖ కూడళ్లలో వారి విగ్రహాలు నెలకొల్పారు. అనేక పట్టణాలకు, రహదార్లుకు, సంస్థలకు వారి పేర్లు పెట్టారు. వారి రాతలు అనేక చోట్ల ప్రముఖంగా కనిపించేటట్టు అమర్చారు. ☸

---

ముకుంద రామారావు
హైదరాబాదు,
ఫోన్ : 99083 47273

# ఆయుర్వేదం-ఆత్మకథ



లక్ష్మీపతి (1880-1962)

శ్రీ ధన్వంతరీ మాసపత్రికలో ప్రతినెల ఒక ఘట్టం చొప్పున ఆచంట లక్ష్మీపతి తన స్వీయ చరిత్రను ప్రకటిస్తూ వచ్చారు. ఈ వ్యాసాలన్నీ 1973వ సంవత్సరంలో స్వీయచరిత్ర పేరుతో పుస్తక రూపంలో వచ్చింది. దీనిలో ఆనాటి సాంఘిక చరిత్ర, సైన్సు, సోషియాలజీ, కల్చరు లాంటి ఎన్నో విషయాలతో పాటు స్వతంత్రం రాకమునుపున్న భారతదేశపు పరిస్థితులు లాంటి ఎన్నో విషయాలపై వివరణలున్నాయి. వాటిలో కొన్ని భాగాలను ఉప శీర్షికలతో మీ ముందుంచుతున్నాము.

---

...మన దేశములో వైద్యవృత్తిని అవలంబింపకోరేవారు దేశములో వైద్యశాస్త్రము ఏరీతిని ఉన్నతస్థితిలో ఉండేదో అనే విషయాన్నీ అట్టి వైద్యశాస్త్ర చరిత్రనూ బాగుగా తెలిసికొనుట అత్యవసరము. కొందరు ఆధునిక వైద్యవేత్తల మనస్సులలో దేశీయ వైద్యపద్ధతుల యెడగల కొన్ని అపోహలు పోగొట్టుటకు మార్గము వారీ శాస్త్రమును గురించి మిక్కిలి శ్రద్ధతో తెలిసికొనుటయే. మనదేశములోని లక్షలాది జనులకు తగిన వైద్య సౌకర్యములను చేకూర్చుటకు వైద్య శాస్త్ర నిపుణులు పాశ్చాత్య వైద్యపద్ధతులనూ మన ప్రాచీన పద్ధతులనూ సమన్వయ పరచి ప్రజలకు అనుకూలమైన విధానములను అమలుపరచుట అత్యవసరము. ఇటువంటి సమన్వయము సిద్ధించుటకు శ్రీ ఆచంట లక్ష్మీపతి స్వీయచరిత్ర మిక్కిలి ఉపయోగపడగలదని నా విశ్వాసము.... శ్రీ లక్ష్మీపతి కృషి వలననే ఆయుర్వేద శాస్త్రమునకు ఇదివరకూ ఎన్నడూ లేని ఔన్నత్యము కలిగి, ప్రజలకు నికరమైన ఆయుర్వేద ఔషధములు లభించే అవకాశము కలిగినది. జనులను ఎక్కువగా పీడించే రుగ్మతలకు అతిసులభమైన వైద్యమును శ్రీ లక్ష్మీపతి చేసి చూపించకలిగినారు.

*(భారత రాష్ట్రపతి వి.వి.గిరి ప్రవేశిక నుంచి....)*

---

**భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆచంట లక్ష్మీపతిని ఆయుర్వేదానికి మారుపేరుగా... "అల్లోపతి, హోమియోపతి, లక్ష్మీపతి" అని ప్రియంగా సంబోధించేవారు.**

**కందుకూరి వీరేశలింగం పంతులు :** ఒకనాడు మా బావమఱది పోడూరు రామచంద్రా రావు- నాలుగవ ఫారములో చదువు తుండేవాడు- కందుకూరి వీరేశలింగము పంతులుగారు ఆ దారిని పోవడము చూచి, "ఈయనేనా వీరేశలింగము పంతులు - పెద్ద సోషల్ రిఫార్మర్ అంటారే! తాటాకు పుస్తకాలు చేతబట్టుకొని వెడుతున్నాడేమిటి?" అన్నాడు. అతని అభిప్రాయములో సోషల్ రిఫార్మర్ అంటే షోకుగా వేషము ఉండాలని అనుకున్నాడు. వీరేశలింగము పంతులు మాకు తెనుగు పండితులు. ఆయన పేరు రాష్ట్రమంతా అప్పటికే వ్యాపించి పోయినది. సంఘమును ధిక్కరించి విధవావివాహములు యేటా రెండు మూడు చేయించేవారు. క్లాసులో పాఠములు చెబుతూ రెండుమూడు పద్యములు చదివి, ఏదో సోషల్ రిఫారమ్ విషయమును గూర్చి ఉపన్యాసము ప్రారంభించగా గంట దానిమీద లెక్చర్‌తోనే గడిచిపోయేది.

**"వారిజాక్షులందు వైవాహికములందు**
**ప్రాణవిత్తమానభంగమందు**
**జకితగోకులాగ్ర జన్మరక్షణమందు**
**బొంకవచ్చు నఘము పొందదధిప!"**

అనే పద్యమును చదివి హిందూదేశమునందు సత్యప్రవర్తనము, హిందువుల ఆచారములు- వీటిగూర్చి హేళనచేస్తూ క్లాసులో పెద్ద ఉపన్యాసములు ఇచ్చేవారు. ఆయన ఆంధ్రదేశముననేగాక, ఇతర ప్రాంతములయందు కూడ బ్రాహ్మణమతమును గురించి చాలా ప్రచారము చేసియున్నారు. వీరేశలింగంపంతులు చాలా గొప్ప

దేశాభిమాని, గొప్పపండితుడు. పండితులలో ఇంగ్లీష్ తెలిసినవారు చాలా తక్కువ. వీరు ఇంగ్లీష్ భాషలోని నవలలను చక్కని తెలుగు భాషలో రచించియుండిరి. ఆరోజులలో పాశ్చాత్య శాస్త్ర విషయమును గూర్చియు, భాషావిషయమును గూర్చియు, చారిత్రక విషయముల గూర్చియు, సంఘమునందలి దురాచారములను గూర్చియు, సులభ శైలిని వ్యాకరణయుక్తముగా అనేక గ్రంథములను రచియించెను. ఆంధ్రకవుల చరిత్రయని యొక యుత్కృష్టమైన గ్రంథమునే కాక, అనేక నాటకములు, ప్రహసనములు మొదలగువానిని రచియించి ప్రకటించెను. మాబోటి విద్యార్థులేగాక గ్రామములోని ఆడవాళ్ళు, పిల్లలు అంతా వీరి పుస్తకములు చదువుకొనేవారు. ఆంధ్రభాషకు, ఆంధ్రదేశమునకు కూడ అన్ని విషయములలో ఔన్నత్యమునకును, కీర్తిని పునాది వేసినది వీరేశలింగము పంతులుగారే. వీరు వ్యాకరణ యుక్తమైన, రమ్యమైన, నవీనమైన తెలుగు కావ్యరచనకు మార్గదర్శకులు. తరువాత కొమర్రాజు లక్ష్మణరావుగారును, మేమును, ప్రారంభించిన విజ్ఞాన చంద్రికా గ్రంథమాల యందు వీరి శైలినే అవలంబించినాము.

**ఆనాటి** M.B; B.S. **చదువు, మెడికల్ కాలేజిలో చేరుట: (1903-1904):** అప్పట్లో ఎమ్.బి; బి.యస్.ను యల్.యమ్ డబ్యూ యస్. అనగా లైసన్సియేట్ ఆఫ్ మెడిసిన్ అండ్ సర్జరీ, యమ్.బి.అండ్ సి. యమ్-అనగా:- యమ్.బి.అనగా బాచిలర్ ఆఫ్ మెడిసిన్: సి.యమ్ అనగా చిరూజియా మాజిష్టర్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ) అని అర్థము. అప్పుడు సర్జరీలో అంతకంటె పై కోర్సు లేదు. ఇప్పుడు యం.బి; బి.యస్. అనియు యమ్. యస్ అనియు విడదీశారు. మెడిసన్‌లో యమ్.డి. అనగా, డాక్టర్ ఆఫ్ మెడిసన్ అని అన్నిటికంటె పెద్ద పరీక్ష. అప్పటికి మనరాజధానిలో తొమ్మిది, పది మంది మాత్రము యం.డి. పరీక్ష ఇచ్చినవారు ఉండిరి.

పదిమంది వరకు యం.బి. అండ్ సి. యమ్.లో ఉండే వారు. యం.బి. అండ్ సి. యమ్. చదివిన వారిలో ఆంధ్రులలో డాక్టర్ పట్టాభి సీతారామయ్య మొదటివారు. వారు L.M.W.S. (అనగా M.B; B.S.) చదివినా స్వచ్ఛందంగా దానిని వదిలి ఆయుర్వేదంపైకి మరలి కొడిగడుతున్న ఒక మహోన్నత భారతీయ శాస్త్రానికి తిరిగి జీవం పోశారు లక్ష్మీపతిగారు.

**పెళ్ళికబుర్లు :** ఆరవఫారము చదువుకొనే రోజులలో ఒకనాడు రాజమహేంద్ర వరము ప్రయాణములో నిడదవోలు విద్యేశ్వరము మధ్య కాలువగట్టు మీద నడచిపోతుండగా ఒక పడవ ఆ దారిని పోవడము తటస్థించినది. ఆ పడవను నిలిపినాము. ఆ పడవలో ఎక్కినాము. నాతో సుబ్రహ్మణ్యం కూడ ఉన్నాడు. అప్పటికి నాలుగైదు సంవత్సరములకు పూర్వమే సుబ్రహ్మణ్యంకు వివాహమయి భార్య కాపురమునకు వచ్చియున్నది. నాకు వివాహము కాలేదు. ఆ పడవలో పెంటపాడు కరణముగారైన కలవచర్ల సుబ్బారాయుడుగారు ప్రయాణము చేయుచుండిరి. వారు మమ్ములను చూచి కుశల ప్రశ్నలువేసిన తరువాత సుబ్రహ్మణ్యంతో ఏదో కొంతసేపు మాట్లాడుచుండిరి. దాని ఫలితము ఏమనగా కొన్నాళ్ళకు సుబ్బారాయుడుగారు, ఒక పురోహిత బ్రాహ్మణునితో కలసి మాధవరం వచ్చి మా తాతగారు, తండ్రిగారు, వగైరాల సమక్షమున తమ కూతురును నాకిచ్చి వివాహము చేయుటకు అనుమతింప గోరుచు ఏమేమో మాట్లాడిరి.

1895 సం॥ ఏప్రియల్ 9వ తేదీని అనగా మన్మథనామ సంవత్సర చైత్ర బహుళ అష్టమి బుధవారం రాత్రి ఐదు ఘడియలపుడు, శ్రవణా నక్షత్రయుక్త మీన లగ్నమున, శ్రీ కలవచర్ల సుబ్బారాయుడు గారి కుమార్తె చి॥సౌ॥ సీతమ్మను నా కిచ్చి, పెంటపాడు వద్దనున్న ఆకుతీగలపాడులో వైభవంగా అయిదు దినములు వివాహము జరిగెను. అనేక గ్రామముల నుండి బ్రాహ్మణులు గుంపులు గుంపులుగా వచ్చి సదస్సు రోజున సంతర్పణ భోజనములు చేసి సంభావనలు పుచ్చుకొని వెళ్ళిరి. పెళ్ళి సమయమున నాకు నూట పదార్లు కట్నము యిచ్చిరి. మొత్తము మాకు పెండ్లి ఖర్చులకుగాను రూ. 770-1-6 అయినది. అందు వధువునకు బంగారునగలు వగైరాలకుగాను రూ. 477-9-1 ఖర్చుఅయినది. పల్లకీలో ఊరేగింపులు, పసుపు నలుగులు, దినము దినము క్రొత్తజామార్లు, పిండివంటలతో భోజనాలు, పండిత సభలు మొదలైనవి జరిగినవి. భోగంమేళం పెట్టలేదు. వీరేశలింగం బోధనలచేతనే భోగంమేళం పెట్టుటకు అంగీకరించలేదు. పెండ్లికూతురునకు పండ్రెండు సంవత్సరములు; నాకు పదునైదు సంవత్సరముల వయస్సు. వివాహముకాగానే మనుగుడుపులకు పెళ్ళికూతురు, తోడి పెళ్ళికూతురుతో కూడ మాధవరం వచ్చి మూడు రోజులుండి తిరిగి మాధవరం నుండి ఆకుతీగలపాడు ప్రయాణ

మయినాము. దారిలో అమృతపురంలో పల్లకీదింపి బోయీలు (చాకలివాళ్ళు) కడుపునిండ కల్లుత్రాగినారు. పిమ్మట వారి ఉత్సాహం మితిమీరి 'ఓ ఓ' అని అరుచుకుంటూ అతివేగంగా ప్రొద్దుగూకక ముందు ఆకుతీగలపాడు చేరారు. ఇది నాకు బాగా జ్ఞాపకమున్నది. అమృతం అంటే కల్లు; అమృతపురం కల్లుకు ప్రసిద్ధికెక్కిన గ్రామము. పది, పదిహేను ఇండ్లుమాత్రము కలవు. చుట్టు వేలకొలది తాడిచెట్లు, తుప్ప అడవి-ఇప్పటికింకా ఆ పేరుచెపితే నాకు దొంగల భయము. ఇప్పుడు రైళ్ళు, బస్సులు పడ్డ తరువాత ఆ ద్రోవని ఎవరూ వెళ్ళడంలేదు.

**చెన్నపట్నం రైలు ప్రయాణం :** నేను చెన్నపట్టణమునకు వెళ్ళవలెనని పట్టుపట్టగానే మా తండ్రి గారు నన్ను ఆచంట వెళ్ళి రైతులవద్ద ధాన్యము వసూలు చేసి దానిని అమ్మి సొమ్ము తీసికొని రమ్మని పంపినారు. 22-6-1889వ తేదీని ఆచంట నుండి మా తండ్రిగార్కి ఈ ప్రకారము ఉత్తరము వ్రాసి యున్నాను;

7-7-1898 తేదీని నేను రాజమహేంద్రవరము వెళ్ళి కాలేజినుండి "లీవింగ్ సర్టిఫికెట్" తెచ్చుకున్నాను. మా తండ్రిగారు ముత్తా శేషయ్య వద్ద నాకు కావలసిన రూపాయలు బదులు తీసుకొని ఇచ్చినారు. రైలులో ప్రయాణపు చిల్లర ఖర్చులకుగాను రూ. 10-0-0 చేతులో పెట్టుకొని, మిగిలిన రూ.50-0-0లో ఎంతో నా పేరనే చెన్నపట్టణము క్రిస్టియన్ కాలేజి ఎడ్రసుకు, మాధవరం పోస్టాఫీసు నుండియే మని అర్డరు చేసినారు. రైలులో డబ్బుపోతుందేమోనని భయము. నాతో ఇంకను రాజమహేంద్రవరము నుండి పది పదిహేను మంది పిల్లలు చెన్న పట్టణమునకు బయలుదేరినారు.

10-7-1898 తేదిని తాడేపల్లి గూడెంలో ఉదయమున రైలెక్కి సాయంత్రము బెజవాడ చేరినాము. అక్కడ రైలు మారవలెను. రైలు స్టేషన్‌లో భోజనమునకు ఏర్పాటులు లేవు- ఊళ్ళోకి రెండు మూడు ఫర్లాంగుల దూరములోనున్న పూటకూటింటికి వెళ్ళి భోజనము చేసివచ్చి రాత్రి గుంతకల్లు బండి ఎక్కినాము. మరునాడు మధ్యాహ్నము 12 గంటల ప్రాంతమునకు నంద్యాల చేరినాము. పదకొండవ తేదీని నంద్యాల స్టేషనులో మధ్యాహ్నము రైలు వచ్చేవరకు విస్తళ్ళువేసి అన్నము తయారుగా వడ్డించి ఉన్నది. ఎవరో మహానుభావులు రైలు మీద వచ్చిన వారికంతా ధర్మముగా అన్నము పెట్టుచున్నారు. ఆకలి మండిపోతూ ఉన్నది. గబగబ భోజనముచేసి వెంటనే రైలు ఎక్కినాము. ఇదే ప్రకారము సామర్లకోటలో బసివిరెడ్డిగారు, తునిస్టేషన్‌లో తుని రాజాగారున్నూ రైలు ప్రయాణీకులకు ఉచితముగా మెయిలు వచ్చినప్పుడు అన్నము పెట్టేవారు. ఇంగ్లీషు పద్ధతిని భోజనము చేసేవారికి రిఫ్రెష్‌మెంట్ రూములు ఇప్పటి వలెనే ఉండేవి. అచ్చటకు సామాన్యముగా హిందువులు పోయేవారుకారు.

ఆ రోజులలో రైలు పెట్టెలలో మూడవ క్లాసు బండ్లలో పాయఖానా గదులులేక- ఒక స్టేషనులో రైలు నిలుపగానే ఇరవై, ముప్పైమంది మూత్రవిసర్జనచేసి, గార్డు రెండుమూడు సార్లు బిగులుకొట్టుతూ ఉంటే పరుగెత్తుకొని వచ్చి తిరిగిరైలు ఎక్కుతూ ఉండేవారు. అందుచేతనే మా తండ్రిగారికి రైలుప్రయాణమంటే భయము. అడవి మార్గమున బండ్లు చాలా నెమ్మదిగా పోవుచుండెడివి. భోజన సదుపాయములు బొత్తిగా లేనందున ఇంటివద్దనుండి ఒకరోజుకు సరిపడేటట్లు మినపరొట్టె, పులిహోరము, పెరుగు అన్నము మూటకట్టుకొని బయలుదేరేవారము. టిఫిన్ క్యారియర్లు అప్పటికింకా రాలేదు. రైల్లో అన్నము తీసికొనివెడితే మయిలపడిపోతుంది. ఒక రకంగా పులిహోరము తీసికొని వెళ్ళ వచ్చును. గారెలు వగైరా ఫలహారములు, అటుకులు అరటిపండ్లు తీసికొని వెళ్ళే వారము.

11-7-1898 సాయంత్రమునకు గుంతకల్లు స్టేషనుకు చేరినాము. ఇక్కడ కూడ రైలు మారవలెను. ఒకటి, రెండు ఫర్లాంగుల దూరములో నున్న హోటలులో భోజనము చేసివచ్చి రాత్రి ఎనిమిది గంటలకు బొంబాయినుండి వచ్చిన మెయిలు ఎక్కినాము. రాజమహేంద్రవరము నుండి బెజవాడ వరకు 'ఈస్ట్‌కోస్ట్ రైల్వే' అనేవారు. బెజవాడ నుండి గుంతకల్లు వరకు 'సదరన్ మహారటా రైల్వే', గుంతకల్లు నుండి మదరాసుకు 'మదరాస్ రైల్వే' అనేవారు. బొంబాయి-మద్రాసు బండి చాలా కాలమునుండి యుండినది. మెయిలు బండ్లు బహువేగముగా పోవుచుండెడివి. మూడవక్లాసు బండ్లలో ఏగది కాగదే! పది, పన్నెండుగురు కూర్చునేది వేరుగా ఉండేది. రాత్రి అంతా కూర్చొని ఉండవలసినదే! మూత్రము పోయుటకు పాయిఖానా గదులు లేవు. గ్యాస్ దీపాలు ప్రకాశమానముగా తెల్లవార్లు రైలుపెట్టెలలో వెలుగుతూ ఉండేవి. పన్నెండవ తేదీ ఉదయమునకు చెన్నపట్టణము సెంట్రల్ స్టేషన్‌కు చేరినాము.

**ఆనాడది తెల్లదొరల రాజ్యం :**

ఆ రోజులలో ఎంత విజ్ఞానవంతుడైనా నల్లవారలకు పెద్ద ఉద్యోగములు ఇచ్చేవారుకారు. అడగడముగూడ తప్పే. ఏమిరాని వాళ్లైనా క్రొత్త క్రొత్తగా దిగి ఐ.యమ్.యస్. దొరలు వెయ్యి రూపాయిలు జీతము తీసికొంటూ మిక్కిలి విజ్ఞానవంతులగు తాబేదార్లమీద, అధికారముచేసేవారు. ఇది మెడికల్ కాలేజీలో స్పష్టముగా కనపడేది. డాక్టర్ జి. రామారావుగారు మాకు అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్గా ఉండేవారు. వారికి యాబదియేండ్లు పైబడిన వయస్సు. ఎనాటమీలో ఏ భాగమైనాసరే క్షుణ్ణముగా వచ్చు. ఆయనే బయాలజీలో కూడా సహాయలెక్చెరర్గా నుండెను. ఒక్కొక్క విద్యార్థివద్దకు వచ్చి మిక్కిలి ఓర్పుతో ఉపదేశించుచుండెను. ఏమీరాని దొరలు పైపైని అధికారము చేయుటేగాక, నల్లవారిని హేళనచేస్తూ ఉండేవారు. ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో మిక్కిలి విద్యావంతులనియు, మిక్కిలి మంచివాడనియు పేరుపొందిన డాక్టర్ సి.బి. రామారావుగారు అసిస్టెంట్గా ఉండేవారు.

మేజర్ డోనోవన్ అని ఒక ఐరిష్‌దొర ఫిజియాలజీ ప్రొఫెసర్గా ఉండేవారు. అతనిని ఇంగ్లీష్ వారు కొంతద్వేషముతో చూచే వారు. ఎందుకనగా ఇతడు స్వాతంత్ర్య ప్రేమి, భారతీయుల దుస్థితిని గూర్చి వ్యసన పడేవాడు. అన్యాయముగు ఇట్టి తారతమ్యములను గూర్చి లోపల లోపల తెల్లవారలకు, నల్లవారలకు ద్వేషములు పూర్తిగా ఉండేవి. కాని పైకి చెప్పడానికి భయము. మైలాపూర్‌లో ప్రఖ్యాతిగా వైద్యము చేయుచున్న డాక్టర్ నంజుండరావు ఈ పరిస్థితులలో సర్కార్ ఉద్యోగమునకు లెక్కచేయక రెజిగ్నేషను ఇచ్చినాడు.

చెన్న పట్టణములో ఇట్లుండగా కలకత్తాలో తెల్ల, నల్ల భేదములు మిక్కిలి హెచ్చుగా విజృంభించినవి. ఉద్యోగులలో అనేకులు భారతీయులు-ముఖ్యముగా బెంగాలీలు-ఐ.సి.యస్., ఐ.యమ్.యస్. పరీక్షలలో ఉత్తీర్ణులైవచ్చి, ఐరోపియనుల గౌరవమును అంతరింపజేయసాగిరి. అరవిందఘోష్, సుభాష్ చంద్రబోస్ మొదలగువారు ఐ.సి.యస్. పరీక్షకు ప్రయత్నించి ఎంతవిజ్ఞానవంతులైనను, నల్ల, తెల్ల భేదములచేత ఉత్తీర్ణులు కాలేకపోయిరి. వీరందరు జాతీయోద్యమము నడుపసాగిరి.

చెన్న పట్టణములో మేము వందేమాతరము పత్రిక తెప్పించి నిరంతరం చదివేవాళ్ళము. డిశ్కషన్ రూమ్‌లో గుసగుసలుగా మాట్లాడుకొనే వాళ్ళము. 1906 వేసవి శలవులు వచ్చినవి. నేనున్నూ, నా సహాధ్యాయి దక్షిణదేశస్థుడు తిరుమేని అనే ఆయనయున్ను మన ప్రాంతములకు వచ్చినాము. మా అత్తవారి ఊరు పెంటపాడులోను, మాధవరంలోను, పోడూరులోను మేము ఇద్దరము జతగా కొన్నాళ్ళు గడిపినాము. ఒకనాడు బిపిన్ చంద్రపాల్ ప్రచారము నిమిత్తము దక్షిణదేశమునకు వచ్చి రాజమహేంద్రవరములో ఉపన్యసించు చున్నాడని విన్నాము. వెంటనే రాజమహేంద్రవరము వెళ్ళినాము. టౌన్‌హాల్ వెనుకనున్న కాంపౌండ్‌లో సముద్రపు హోరువలె గంభీరముగా బిపిన్ చంద్రపాల్ ఇంగ్లీష్ సర్కారును దూషించుచు మాట్లాడినాడు. శ్రీమునగాల రాజా, పాల్‌ని ఆహ్వానించి బెజవాడకు తీసికొని వెళ్ళినారు. బెజవాడలో గొప్ప సభ జరిగింది. నాతోవచ్చిన తిరుమేని, పాల్‌గారితో చెన్నపట్టణము వెళ్ళిపోయినాడు.

చెన్నపట్టణములో సెంట్రల్ స్టేషనువద్ద బిపిన్ చంద్రపాల్‌కి గొప్పస్వాగతము ఇచ్చినారు. వేలువేలుగా ప్రజలువచ్చి బండికట్టిన గుఱ్ఱములను విప్పివేసి తామే బండినిలాగుచు ఆకాశము అంతా మారు మ్రోగగా 'వందేమాతరం' అని కేకలు వేయుచు, ఊరంతా ఉత్సవము చేసినారు-అని తిరుమేని నాకు వ్రాసినాడు. సాయంకాలము 'బీచ్'లో మీటింగ్. అప్పటికి మైక్రోఫోన్‌లు లేవు. లక్షకుపైగా జనము సముద్రపుగట్టున ఇసుక పఱ్ఱలో మూగిపోయినారు. బిపిన్ చంద్రపాల్ 'సింహపుగర్జనల'తో ఉపన్యసించినారు. ప్రజలకు ఇంగ్లీషువారి భయము పోయినది. అప్పటి నుండి దేశమునందలి రాజకీయ పరిస్థితులు మారిపోయినవి. దినపత్రికల వ్రాతలు ప్రజలను ఉద్రేకింపసాగినవి. రాజమహేంద్రవరము నుండి చిలకమర్తి లక్ష్మీనరసింహము ఒక పత్రిక నడిపేవారు- పేరు మరచిపోయినాను. బందరునుండి ముట్నూరు కృష్ణారావు 'కృష్ణాపత్రిక' నడిపేవారు. 'ఆంధ్రపత్రిక' బొంబాయి నుండి వచ్చేది. బెజవాడలో మునగాల రాజా పోషకత్వమున స్వదేశవస్తు భాండాగారము ప్రారంభమైంది. విదేశీవస్తు బహిష్కారము మిక్కిలి ముమ్మరముగా ఆంధ్రదేశమున ప్రారంభము అయినది. పాపారావు అను జిల్లా పోలీస్ సూపరిండెంటు ఆంధ్రదేశములో కూడ విప్లవకారులు ఉన్నారని అబద్ధపు

రిపోర్టువ్రాస్తూ ఒకటి రెండుచోట్ల బాంబులు వేయించాడు.

నేను జూలై నెల రెండవవారములో ప్రెసిడెన్సీ కాలేజీ బి.ఎ. జూనియర్‌లో రెండవ టరము చదువుకు చేరినాను – బిల్ డర్ దొరగారు ఇంగ్లీష్ పాఠములు చెప్పేవారు. “సీలీస్ ఎక్స్‌పాన్షన్ ఆఫ్ ఇంగ్లెండ్” అనే పుస్తకము మాకు పాఠము చెప్పేవారు. ఆ పాఠములు చదువున్నప్పుడే ఇంగ్లీషువారి రాజ్యము మన దేశములో చాలా కాలము ఉండదని అనుకొనే వారము:

“The British will have to leave India bag and baggage when an enemy attacks England”

అని సీలీ ఆ గ్రంథములో వ్రాసినాడు. అదే ప్రకారము జర్మను వారు ఇంగ్లాండుమీద పడిన వెంటనే కాకపోయినను తరువాత దాని ఫలితముగానే బ్రిటిషువారు మన దేశమును విడిచిపోవలసి వచ్చినది.

మా మనస్సులలో స్వతంత్ర బీజములు ఈ శతాబ్దారంభమునందే ప్రారంభమైనవి. అదివరకే ఐరోపియనులకు ఆఫ్రికాలో బోయరు యుద్ధములోను, పోర్టుఆర్థరు జపానువారి చేతులలో పడుటచేత ఆసియా ఖండమునందును కూడ పరపతి తగ్గుటకు ప్రారంభించినది. సర్కారు వారు కఠినముగ నున్న కొలది జాతీయోద్యమము విజృంభింపసాగెను.

ఆ రోజులలో జనరల్ ఆసుపత్రిలో “యూరోపియన్ ఆఫీసర్స్ క్వార్టర్స్” అని, “నేటివ్ ఆఫీసర్స్ క్వార్టర్స్” అని– తెల్లవారలకు నల్లవారలకు వేర్వేరు గదులలో పడకలు ఏర్పాటుగా ఉండేవి. ఎంత సొమ్ము కట్టినను, ఎంతగొప్ప ఉద్యోగి అయినను నల్లవారికి తెల్లవారికొరకై ఏర్పడిన గదులలో పడకలు ఇవ్వరు. రైళ్లలో కూడ– “రిజర్వ్‌డ్ ఫర్ యూరోపియన్స్” అని మూడవ తరగతిలో కూడ తెల్లవారలకు ప్రత్యేకముగా గదులను ఏర్పాటు చేసేవారు. ఇదంతా చూచి మాకు కంటకముగా ఉండేది.

ఒకనాడు మా కాలేజిలో ప్రొఫెసర్, కల్నల్ రాబర్టుసన్ అనే ఆయన జనరల్ హాస్పిటల్‌లో వరుసగా రోగులను చూచుచు పోవుచుండగా నల్లవారల గదుల ప్రక్కనుండి పోవుచుండగా నేను ఆయనతో “ఇదేమి అన్యాయము. హెచ్చుసొమ్ము కట్టినను ఎందుకు భారతీయులకు హెచ్చుతరగతి గదులు ఇవ్వరు?.. అని అడిగినాను, “... పోయి మీ తిలక్‌ను అడుగు” అని ఆయన నాకు బదులు చెప్పినాడు. ఆ రోజులలో బాల గంగాధర తిలక్‌మీద రాజద్రోహ నేరము కేసుపెట్టి ఆరు సంవత్సరములు ఖయిదు నిర్ణయించి మాండలే జయిలుకు పంపినారు.

ఈ విధముగా లోపల లోపలనే గాక బహిరంగముగా గూడ ప్రజలు ఐరోపియన్‌లను ధిక్కరించేవారు. బంగళాదేశమున అతి వాదులగు అరాజకుల చర్యలు హెచ్చిపోయినవి. సర్కారువారి కచేరీలలోని రహస్యములుదాగక నిముషాలమీద కుట్రదారులకు తెలిసి పోయేవి. అందుచేత కలకత్తాలో నిలువలేక వైస్‌రాయ్ యొక్క మకాములు అక్కడ నుండి యెత్తివేసి ఢిల్లీకి మార్చవలసి వచ్చెను.

ఆ రోజులలో విద్యార్థులకు రాజభక్తి కలిగించు నిమిత్తమై “సిటిజన్ ఆఫ్ ఇండియా” అను ఒక పుస్తకమును సర్కారు వారు ప్రచురించి ఆ పుస్తకమును స్కూళ్ళలో పాఠ్యపుస్తకముగా పెట్టిరి. ఆ రోజులలోనే క్రొత్తగా వెలువడిన లక్ష్మణరావు “హిందూ మహాయుగము” అను గ్రంథమును ఆధారముగా చేసుకొని, పాఠశాలల ఉపాధ్యాయులు ‘సిటిజన్ ఆఫ్ ఇండియా’ గ్రంథమును తీవ్రముగా ఖండించుచు ఇంగ్లీష్ వారిపై ద్వేషము మరింత హెచ్చిపోవునట్లుగా పాఠములను చెప్పుచుండిరి. దానివలన ప్రజలలో క్రోధము మరింత పెరిగిపోవు చుండెను. బందరులో నేషనల్ కాలేజ్ అని యొక సంస్థ, ఇట్లే అనేక చోట్ల జాతీయ పాఠశాలలు ప్రారంభింప బడినవి.

ఆ సంవత్సరము తెనాలిలో రాజకీయ మహాసభలు, సంఘ సంస్కరణ మహాసభలు జరిగినవి. నేను విజ్ఞాన చంద్రికా గ్రంథములు చేతబట్టుకొని ప్రచారము నిమిత్తమై వెళ్ళి ఆ సభల్లో పాల్గొనుచున్నాను. కొండా వెంకటప్పయ్య పంతులు రాజకీయ సభకు అధ్యక్షులు. వారు అప్పుడు గుంటూరులో మిక్కిలి పేరుపొందిన వకీలుగా పనిచేస్తూ మంచి సంపాదన చేస్తూ ఉండేవారు. కొందరు అతివాదులును, మాబోటి యువకులును చేరి– ఉపాధ్యాయులను విద్యార్థులను, మా వకీళ్లు కోర్టులనూ బహిష్కరింపవలెనని తీర్మానము ప్రతిపాదించినాము. మిక్కిలి తీవ్రముగా చర్చలు జరిగినవి. వెంకటప్పయ్యగారు అధ్యక్షులుగా నుండగా ఈ తీర్మానము అంగీకరింపబడిన యెడల వెంటనే ఆయన కోర్టుకు పోవుట నిలుపవలసి వచ్చును. వెంకటప్పయ్య చాలా సత్యసంధుడు. చెప్పినది చేసి తీరవలెను. ఈ క్లిష్ట పరిస్థితులలో ప్రస్తుతము ఈ

తీర్మానము వలదని అనేకవిధముల చెప్పి ప్రాధేయపడెను. కాని, తీర్మానము అధిక సంఖ్యాకుల చేత అతి ఉత్సాహముతో అంగీకరింపబడెను. కాని, తరువాత యీ తీర్మానము అమలులోనికి వచ్చుటకు పది పన్నెండు సంవత్సరములు పట్టెను.

**స్వాములవారి మరణం :** మాధవరంలో మా తాతగారగు స్వాముల వారికి చాలా జబ్బుగా నున్నది. అమితమైన జ్వరము, గుఱక, దగ్గు, ఆయాసము, వీటితో బాధపడుతూ వుండెను. కాని, నన్ను చూడగానే "నీవు తప్పక వెళ్ళి క్లాసులో చేరవలెన"ని చెప్పి నన్ను పంపివేసినారు. అప్పుడు నాకు తెలియలేదు గాని ఆయనకు తీవ్రమైన న్యుమోనియా సంక్రమించి యుండెనని తరువాత తెలుసుకున్నాను. నేను చెన్నపట్టణము వెళ్ళిన కొద్దిరోజులకే అనగా జ్యేష్ఠ శుద్ధ ఏకాదశినాడు పగలు ఒంటిగంటకు స్వాములవారు సిద్ధిపొందినారు. ఆయన ప్రాణములు పోకముందు, "ఈ ప్రాణము ఏకాదశి ఘడియల కొరకు నిరీక్షిస్తూ ఉన్నది" అని చెప్పినారట! కొవ్వూరు గోవుపాదాల క్షేత్రమువద్ద అఖండగౌతమిలో కుంభప్లవము చేయవలసినదని ఆయన చెప్పినారట. కొవ్వూరు తాలూకా తహసీల్దారు అప్పుడు వాడపల్లి పట్టాభిరామయ్య, వెంటనే కలెక్టరుకు కాకినాడ టెలిగ్రామ్ ఇప్పించి బదులుకొరకు నిరీక్షించకుండగనే రాత్రి విమానముకట్టించి దానిలో స్వాములవారి మృత కళేబరమును కూర్చోబెట్టి, బండిమీద పెట్టించి ఎకాయెకిని కలవలపల్లి, చాగల్లు, పశివేదల మీదుగా గోవుపాదాల రేవుకు చేర్చి అక్కడ పడవలో విమానము ఎక్కించి, నడి గోదావరి వరకు తీసికొని వెళ్ళి, విమానమునకు నాలుగు మూలల నాలుగు కుండలు కట్టి ఆ కుండలను నీళ్ళతో నింపి, విమానమును ముంచి వేసినారు. చాలమంది జనము కూడ వెళ్ళినారట!

**భగవంతుని చర్యలు మనకు తెలియవు :** మే 31-వ తేదీ రాత్రి తొమ్మిది గం॥కు తాడేపల్లి గూడెంలో మెయిలు ఎక్కు నిమిత్తము కస్బా పెంటపాడులో రాత్రి ఏడు గంటలకు రెండెడ్ల బండిలో బయలుదేరినాము. ఆ బండిలో నేను, నా భార్య సీతమ్మ, ముగ్గురు పిల్లలు - లక్ష్మీదేవి (పాపాయి అనేవారము). జానకిరామయ్య, అన్నపూర్ణ (రెండు సంవత్సరముల పిల్ల. మా చెల్లెలు సత్తెమ్మ. మా తమ్ముడు కృష్ణమూర్తి. బండివాడు - ఇంతమంది కూర్చున్నాము. త్వరగా రైలుకు వెళ్ళవలెనని బండివాడు ఎడ్లను ఉరకులెత్తునట్లు పరుగెత్తించుచున్నాడు. పెంటపాడు పెద్దచెరువు వద్దకు వచ్చినాము. చెరువు గట్టు మీదనే రోడ్డు ఉన్నది. చెరువు వైపున రోడ్డు ప్రక్కను, పది పన్నెండు అడుగులు పొడవున గోడకట్టి ఉన్నది. అది నేల బారుగా ఉన్నది.

బండివాడు బండికట్టకముందు ఎడ్లకు నీళ్లు పెట్టడము మరచి పోయినాడు. చెరువు గట్టువద్దకు వచ్చేవరకు దాహము ఎత్తి ఉన్న ఎడ్లు నీళ్ళు చూడగానే గభీలున చెరువులోకి అమాంతముగా దూకినవి. క్షణములో బండి నీళ్ళమీదపడి, పడవలాగున తేలుతూ ఉన్నది. ఎడ్లకు నేల అందలేదు. కావున ఎడ్లు వేగముగా ఈదుకుపోతూ బండిని కూడా ఈడ్చుకొని పోతూ ఉన్నవి.

బాగా రెండు అడుగుల ఎత్తు గడ్డివేసి యుండుట చేత నీళ్ళు బండిలోపలకు వేగముగా రాలేదు. దైవానుగ్రమున బండి బోల్తా పడలేదు. ఎవ్వరికినీ ఏమీ అపాయము కలుగలేదు. కొంతసేపటి వరకు ఏమి జరిగినదీ కూడా మాకు తెలియలేదు. బండివాడు అపాయమును గ్రహించి, వేగముగా ఎడ్లను అదిలించి తోలి, రేవుదారి నుండి బండిని గట్టుమీదకు ఎక్కించాడు. ఇదంతా నిమిషాలమీద జరిగిపోయినది.

ఈ విషయమంతా నేను చెన్నపట్టణము చేరినతరువాత మా తండ్రిగారికి వ్రాసిన కార్డును బట్టి స్ఫురణకు వచ్చుచున్నది.

**ప్రకృతేః క్రియామాణాని / గుణైః కర్మాణి సర్వశః**
**అహంకార విమూఢాత్మా / కర్తాహమితి మన్యతే॥**

*(గీత-3-27)*

ప్రకృతియే తనకు స్వభావమైన త్రిగుణముల చేత సర్వకార్యములను చేయుచుండగా తన అహంకారముచేత మూఢులైన మానవుడు అన్ని పనులను తానే చేయుచున్నానని గర్వపడుచుండును.

...డెబ్బది అయిదు సంవత్సరములు నిండిన తర్వాత భగవద్గీత ఎన్నోసార్లు పారాయణ చేయుటచేతకూడా అహంకారమును చంపుకొని భగవంతుని మీద భారము వేయుట సాధ్యముకాలేదు. రమారమి ఇరవై అయిదు సంవత్సరముల వయస్సులో భగవంతుని గూర్చి నేను తలచుట నాకు ఒక విధముగా ఆశ్చర్యముగా నున్నది.

నేను కందుకూరి వీరేశలింగం పంతులుగారి శిష్యుడను; సంఘ సంస్కార ప్రియుడను అగుటచేత నాస్తిక వాదములను బలపరచుచు ఉండేవాడను. మా తాతగారివద్ద నాస్తిక వాదములు చేస్తూ ఉంటే ఆయన చెప్పేవాడు- "మీరు ఎట్లాగైనా ఏడవండి గాని మీ నాస్తిక వాదములను నా వద్దచేయవద్దు. నాకున్న భక్తి మార్గమున నా కాలము గడిచి పోనియ్యండి" అనేవాడు.

పైగా, మెడికల్ కాలేజీ విద్యార్థులకు నాస్తిక వాదము ఉపదేశముచేస్తారు. ఎందుకనగా దేవుడంటూ వుండి, దేవుడే ఆరోగ్యమునకు, ఆయుష్యమునకు, రోగమునకు కారణమైతే వైద్యశాస్త్రము ఎందుకు అని వారి అభిప్రాయము. డాక్టర్లకు అప్పటిరోజులలో తాము అన్ని వ్యాధులను కుదర్చగలమని గర్వము హెచ్చుగా వుండేది. ఇప్పుడు జ్ఞానము అభివృద్ధి అయిన తరువాత ఆ గర్వము కొంత తగ్గినది. నాకు మాత్రము జన్మతః దైవభక్తి యుండియుండవచ్చునని ఇప్పుడు నాకు తోచుచున్నది. ఇది వంశపారంపర్యముగా వచ్చియుండ వచ్చును.

సత్వరజస్తమోగుణాలు పుట్టుకతో ప్రతివానికి సంక్రమించు చుండును. పుణ్యపాపకర్మలచేత వాని వృద్ధి క్షయములకు మానవుడు తోడ్పడును. ఇదియే కర్మ సిద్ధాంతము.

నేను మా తండ్రిగారికి చెన్నపట్టణము చేరగానే వ్రాసిన ఒక కార్డును బట్టి ఈ విషయము ఋజువు అగుచున్నది. ఆ ఉత్తరములో ఈ క్రింది విధముగా నున్నది.

కానీ కార్డు :

6, సుంకువారి అగ్రహారము,
చింతాద్రిపేట. మౌంట్‌రోడ్డు,
5-6-1907.

వి॥శే॥ కుమారుడు లక్ష్మీపతి అనేక నమస్కారములు చేసి రాయంగల విన్నపములు:

మమ్ములను రైలెక్కించి కృష్ణమూర్తి వచ్చియున్నాడు గావున సంగతులు వివరముగా చెప్పియుండును. ఆ రోజున రాత్రి భగవంతుడు ఎందు నిమిత్తమై చేసెనో తెలియదు గాని అందరము సురక్షితముగా కాపాడినందులకు నాకు మిక్కిలి ఆశ్చర్యముగా నున్నది. అంత యెత్తు గట్టుమీద నుంచి అందలి చెరువులో దుమికినను, బోర్ల పడక, బిడ్డల కేమియు అపాయము కలుగకుండుట నాకు మిక్కిలి చిత్రముగా కన్పించుచున్నాది. మరునాడు గూడూరువద్ద ఇంజను పొడయి రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి చేరుకున్నాము.

చిత్తగించవలెను,
ఎ. లక్ష్మీపతి.

దైవానుగ్రహము చాలక బండి ఆ చెరువులో బోల్తాపడితే ఏమయ్యేదో? ఎవరెవరు బ్రతికేవారో? ఎవరెవరు పోయేవారో? మనకు తెలియనిదంతా దైవవశమనే చెప్పాలి.

ఆయుర్వేదము వైద్యునకు దైవభక్తి నేర్పుతుందిగాని అహంకారము నేర్పదు.

"నవైద్యః ప్రభురాయుషః " - వైద్యుడు రోగములను కుదుర్చుట, రోగుల బాధలను తొలగించుటయందే, అధికారము కలిగి యున్నాడు గాని ఆయుష్యమునకు అధికారిగాడని స్పష్టముగా చెప్పుచున్నది.

**పట్టాభి సీతారామయ్య :**

నేను రైలు ఎక్కి మదరాస్ చేరినాను. పట్టాభి సీతారామయ్య ఉన్న బసకే వెళ్ళినాను. మొట్టమొదట కొన్నాళ్ళు వారున్న గదిలోనే ఉన్నాను. మెడికల్ కాలేజీ తెరచిన మొదటి రోజుననే కాలేజీకి వెళ్ళినాను. ఆ రోజులలో 'ఎపోతకరీ' క్లాసులో చదువుతూ ఉండే ఆంగ్లో ఇండియన్ విద్యార్థులు క్రొత్తగా చేరిన విద్యార్థులను హేళన చేయుచు అనేక బాధలను పెట్టే వారు. నలుగురైదుగురు వచ్చి అకస్మాత్తుగా నన్ను మోసుకొనిపోయి రంగునీళ్ళతో నిండిన ఒక పెద్ద తొట్టెలో పడవేసినారు. దీనిని "డకింగ్" అనేవారు. గుడ్డలన్ని రంగు అయిపోయినాయి. కళ్ళలో అంతా ఇసుకపడింది. ఈ మోస్తరుగా ఇంకా చాలా మందికి చేసినారు.

పాశ్చాత్య దేశములో కూడ ఈ ప్రకారముగ చేస్తారట. కొద్దో గొప్పో ఇంకా ఉందేమో! ఈ మాట పట్టాభిసీతారామయ్యకి తెలియడంతోనే ప్రిన్సిపాల్‌తో చెప్పి వాళ్ళందరిని అదుపులో పెట్టేటట్టు చేశారు. తరువాత మిలటరీ స్టూడెంట్స్ ఉన్నన్నినాళ్ళు ఈ ఆచారము కొద్దో గొప్పో ఉండేది.

**రాజా రంగయ్య అప్పారావు గారి హయాం :**

జోడుగుఱ్ఱముల బండి, ముందువెనుక జవానులు, హడావుడి చాలా హెచ్చుగానుండెను. నాకు గెస్ట్‌హౌస్ నివాసము ఏర్పరచి నన్ను మిక్కిలి గౌరవముగా చూచుచుండెను. శ్రీ రాజాగారికి సిఫార్సు చేసి పళ్ళెమునింద

మామిడిపళ్ళు, కూరగాయలు, పెరుగు వగైరా సప్లయి చేయించెను. ఆనాడు సాయంకాలము శ్రీ రాజా రంగయ్య అప్పారావుగారి ఇంట్లో మేడమీద సభచేయుచుండగా నన్నుకూడ తీసికొని వెళ్ళి, శ్రీ రాజాగారికి పరిచయము చేయించి, నన్ను గురించి వేమొ పొగడి చెప్పుచు సంవత్సరమునకు నూటయాబది రూపాయిలు శాంక్షన్ చేయించెను. శ్రీ రాజాగారు స్వయముగా లోపలి గదిలోకి వెళ్లి రెండుమూడు మామిడిపళ్ళు మంచివిగా ఏరితెచ్చి, నాచేతికిచ్చి, నన్ను ఆశీర్వదించెను. "ఇదంతా మీదే! మేము ఊరికే నామకార్థము ఉన్నామ"ని చెప్పెను. రాజ్యము ఏలడము ధర్మము కొఱకే అని వారి అభిప్రాయము. ఈ ఘట్టము నేను ఎన్నడు మఱచి పోను. రోజంతా మంచి మంచి మామిడిపళ్ళు ఏఱి పంచి పెట్టుటే ఆయనపని.

సర్వోత్తమరావు ఎం.ఏ., పరీక్షప్యాస్ అయి బెజవాడలో నడపబడు "స్వరాజ్య" పత్రికకు శ్రీబోడి నారాయణరావు మొదలగు రాజకీయ అతివాదులతోకూడ సహాయ సంపాదకులుగా నుండిరి.

ఆ పత్రికలో రాజద్రోహపు వ్యాసములున్నవని హరిసర్వోత్తమరావుని, మరికొందరిని అరెష్టు చేసినారు. బెజవాడ సబ్‌జైల్‌లో పెట్టినారు. వారికి మంచినీళ్లు ఇచ్చుటకు కూడా అందరికీ భయము. చెన్నపట్టణములో లక్ష్మణరావుని కూడా పోలీసు గూఢచారులు అనుసరించి తిరుగుతూ ఉండేవారు. వారినికూడా రాజ ద్రోహులక్రింద అరెస్ట్ చేస్తారని ప్రతిదినము భయపడేవారము. మేము అచ్చు ఆఫీసుకు పోవునపుడు పోలీస్ బంట్రోతుల నుండి తప్పించుకొని పోవు నిమిత్తమై ట్రామ్ బండ్లలో ఎక్కి పోకుండా గుఱ్ఱపుబండ్ల మీద ఎక్కి సందులు గొందులు తిరిగి వెళ్ళేవారము. ఏ అచ్చు ఆఫీస్‌లో మేము పుస్తకములను అచ్చువేసేదిన్ని వారికి తెలియకూడదు.

శ్రీహరి సర్వోత్తమరావు రాజద్రోహము కేసు బందరుజిల్లా జడ్జి కోర్టులో విచారణకు వచ్చినది. 'స్వరాజ్య' పత్రికలో తిరునల్‌వేలీ కలెక్టర్‌ను దూషించుచు ఒక వ్యాసములో "అరెరే! క్రూర వ్యాఘ్రమా! నిరపరాధులగు ముగ్గురు భారతీయులను నీపొట్టన బెట్టుకున్నావు గదా!" అనే వ్యాసమును శ్రీహరి సర్వోత్తమరావు వ్రాసినారని ఆయన మీద కేసు.

ఈ వ్యాసమును తాను వ్రాయలేదనియు, ఆ సమయమున తన భార్యకు జబ్బుగా నున్నందున తాను బెజవాడలో లేకుండా చెన్నపట్టణములో నున్నాననియు శ్రీహరి సర్వోత్తమరావు వాదము. ఇది నిజము. దీనికి నన్ను సాక్ష్యమునకు పిలిచినారు. "క్షర్షాస్ప్" అని ఒక ఫారసీవాడు (ఐ.సి.యస్) జడ్జి. చాలా మంచివాడు – దేశాభిమానము గలవాడు– ఆయన తన తీర్పులో "I have no reason to dis-believe the evidence of a budding Doctor"- "పుష్పింపబోవు ఈ చిన్న డాక్టర్ యొక్క సాక్ష్యమును నేను నమ్ముచున్నాను" అని, నా సాక్ష్యమును గూర్చి వ్రాయుచు సర్వోత్తమరావు మీది పెద్దకేసును చాలా భాగము తప్పించి ఆరుమాసముల విడిఖైదు (Simple imprisonment) మాత్రము విధించెను. తరువాత ఈ తీర్పుమీద సర్కారు వారు హైకోర్ట్‌కు అప్పీల్ చేయగా వారు శిక్షను మూడు సంవత్సరముల కఠిన రకముగా మార్చి క్షర్షాస్ప్ చర్యను తీవ్రముగ ఖండించి ఆయనను ఉద్యోగములో క్రిందికి దించివేసిరి.

**తిరువణ్ణామలై రమణ మహర్షి :**

నేను చెన్నపట్టణము వెళ్ళేటప్పుడు శ్రీ స్వాములవారు అంతజ్వరముతో ఉండగాను నోరు గొణుగుపోతూ ఉండగా గజేంద్రమోక్షములోని "కలడందురు దీనులయెడ, కలడందురు పరమయోగి గణముల పాలన్, కలడందురన్ని దిశలను" అను పద్యమును వల్లిస్తూ ఉండెను.

"ఎందుకయ్యా అంతకష్టపడుతూ ఆ వచ్చిన పద్యమునే చదువుకుంటారు. మీకు శ్రమ అవుతూ ఉన్నది కొంచము సేపు ఊరకే ఉండండి" అన్నాను. అనగానే వారు "పిల్లవాళ్ళు మీకు ఏమి తెలుసును? నేను ఎట్లాగా బ్రతుకను. అది నాకు బాగా తెలుసును. శ్రవణము, మననము, ధ్యానము అన్నారు. అందుకోసము భగవన్నామము వినవలెను. విన్నది మననము చేయవలెను. మననము చేసిన దాని గూర్చి ధ్యానించవలెను" అన్నారు. మరణభయమనేది అటువంటి జ్ఞానవంతులకుండదు.

యోగులు తమ దేహమును త్యజించుటకు భయపడరు. శ్రీ స్వాముల వారికి అప్పటికి ఎనుబదియైదు సంవత్సరములు దాటినవి. మరణ సమయము ఆసన్నమైనదని ఆయనకు స్పష్టముగ తెలుసును. కాని మరణమునకు ఎంత మాత్రము భయపడక భగవన్నామ స్మరణ చేసుకొనుచు చిట్టచివరకు స్మారకము కలిగి దేహము

విడచుట ఎంతటి పుణ్యాత్ములకోగాని లభించదు. మరణానంతరము జరుగవలసిన కార్యములు కూడ పూసగుచ్చినట్లు విధించిచెప్పెను.

ఇటీవల, శ్రీ తిరుమణ్ణామలై రమణమహర్షిగారికి అసాధ్యమగు వ్రణము ఎడమచేతి మోచేతిపైన పుట్టినది. నన్ను ఒకసారి సలహా నిమిత్తము పిలిచినారు. శ్రీమహర్షిగారిని నేను పరీక్షించు సమయములో ఆయన నాతో యీ క్రింది మాటలు చెప్పినారు. ఆయన ఎప్పుడు తన శరీరాన్ని వాడు-వీడు అని చెప్పుటయే! నా శరీరము అనడు. "వీడికింకా చికిత్స ఎందుకు? ఈ శరీరముతో కావలసిన పని అంతా అయిపోయినది. పాము కుబుసమును విడిచి నిర్లక్ష్యముగా పోయినట్లు దీనితో పని తీరిపోగానే విడచిపోవలసినదేగాని దానికంత ప్రయత్నమెందుకు?" అన్నారు. "ఉన్నన్నాళ్ళు బాధపడాలిగదా"! అన్నాను. ఇతరుల తృప్తికొరకు వైద్యము చేయించుకొనడమేగాని శ్రీరమణ మహర్షిగారికి యే వైద్యమునందూ ఇష్టములేదు. త్రిగుణాతీతులైన వారలకు వ్యాధి భయము, మరణ భయములేవు. ఇట్టివారినే జీవన్ముక్తులని అనెదరు. ఈ వేదాంతము తెలుసుకొనుటకు నాకు అనేక సంవత్సరములు పట్టినది.

**కె.ఎల్.రావు :**

చెన్నపట్టణములో చేతినిండా పనియుండి, ఆదాయముకూడా బాగానే ఉండేది. చింతాద్రిపేటలో స్వామి నాయకవీధి 58-వ నంబరు ఇంట్లో మేడమీద ఒక గదిని జనరల్ హాస్పిటల్లోని ఆపరేషన్ గదిని మించిపోయేటట్టు సమస్త పరికరములతోను తయారుచేసి, దుమ్మువగైరాలు దూరకుండా చుట్టు అద్దములతో తలుపులు పెట్టించి పెద్ద పెద్ద ఆపరేషన్లు అన్నియు చేయుటకు తగిన యంత్ర శస్త్రములు అన్నియు కొని సిద్ధము చేసినాను. నా స్నేహితుడు మహమ్మద్ హుస్సేన్ ఆపరేషన్‌లలో సహాయము చేసేవాడు.

ప్రతిదినము మూడు నాలుగు ఆపరేషన్‌లు చేసేవారము. కడుపుకోసే ఆంత్రవృద్ధి; బూదకాళ్ళు, బుడ్డలు వగైరా ఆపరేషన్‌లు; కాన్సర్ ఆపరేషన్- అన్నియు ఇక్కడనే చేసేవారము. జనరల్ ఆసుపత్రిలో ప్రధాన శస్త్రచికిత్సకుడగు గాబెట్ గారిని కూడా ఆపరేషన్‌లలో సహాయము చేయుటకు పిలిచే వారము - ఆయన వద్దకు వచ్చిన ప్రయివేటు కేసులు కూడా నా వద్దకు పంపి ఈ ఆపరేషన్ థియేటర్‌లోనే చేసి సగము ఫీజు నాకు ఇచ్చేవాడు. అందుచేత కొంత అనుభవము, ఆదాయము కూడా లభించేది. కన్ను ఆపరేషన్ నేర్చుకొను నిమిత్తమై కసాయి దుకాణముల నుండి మేక గ్రుడ్లు- ఒక్కొక్కటి రెండు అణాలకు కొని, వాటి మీద "కాటరాక్ట్' - అనగా తిమిరము వగైరాలు ఆపరేషన్‌లు చేసేవారము. డాక్టర్ యం. కృష్ణస్వామి అయ్యర్ యం.డి.- గారిని కంటి ఆపరేషన్‌లలో సహాయము చేయు నిమిత్తము ప్రప్రథమమున పిలిచి మాకువచ్చెడి ఫీజులో సగము ఆయనకు ఇచ్చేవారము. కన్ను ఆసుపత్రిలో పనిచేసే టప్పుడు- దూరదూరముగా నుండి ఎన్ని ఆపరేషన్‌లు చూచినను, నిజముగా కంటి ఆపరేషన్‌చేయుట ఏమీ తెలియదు. స్వయముగా చేసినప్పుడు కష్టసుఖములు తెలిసినవి.

ఒక నాడు బెజవాడ నుండి ఒక కంటికేసు వచ్చినది. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి మేనల్లుడు- తొమ్మిది పది సంవత్సరముల పిల్లవాడు, అతని పేరు లక్ష్మణరావు. పిల్లలు గూటీబిళ్ల ఆడుతూ ఉంటే, ప్రక్కను కూర్చునియుండగా - ఆబిళ్ళ వచ్చి కంటిలో గ్రుచ్చుకొని, కన్ను చితికి పోయినది ఆ రాత్రి వెంటనే రైలుమీద చెన్నపట్టణములో తిన్నగా ఆ పిల్లవానిని మా యింటికి తీసుకొని వచ్చినారు. నాయందు వారలకు చాలా నమ్మకము. కాని, నాకు అదే మొదటి కంటి ఆపరేషన్, కన్ను ఆసుపత్రికి పంపితే కన్ను తీసివేస్తారు. నేను ధైర్యముచేసి ఆ కన్ను తీసివేయకుండా- పిల్లవానికి క్లోరోఫారము ఇచ్చి చితికపోయియున్న కన్ను పరిశుభ్రముగా కడిగి, యథాప్రకారము గ్రుడ్డులో కన్ను అమర్చి - దూదివేసి మూసి, కట్టు కట్టినాను. అదృష్టము బాగా ఉన్నది. మరునాడు కట్టువిప్పి చూడగా- కన్ను చక్కగా అతుక్కొని యున్నది.

ఆ పిల్లవాని తల్లి మిక్కిలి సంతోషముతో - "మీకు నేను ఏమీ ఇయ్యలేను... మా పిల్లవాడు పెద్దవాడయి, ఉద్యోగము చేసి నప్పుడు ఒక నెలజీతము మీకు సమర్పించుకుంటాడు" అన్నది. ఆ పిల్లవాడే ఇప్పుడు డాక్టర్ కె.యల్.రావు అయి, ఢిల్లీలో ఇరిగేషన్ అండ్ పవర్ అను శాఖకు అధికారిగా ప్రఖ్యాతిగాంచి, ప్రస్తుతము సెంట్రల్ మినిస్టరుగా ఉన్నారు. ఆంధ్రులకు అపారమైన కీర్తిని సంపాదించుచున్నారు. నా యందు ఇప్పటికిని చాలా అభిమానము కలిగియున్నారు.

- మిసిమి

# ఎస్. ఇళయరాజా



ఇళయరాజా



పూల కూర్పు

**సం**ప్రదాయం, వాస్తవికత చెట్టపట్టాలేసుకొని మనల్ని ఆనంద సాగరంలో ముంచివేస్తున్న ఈ చిత్రాలు ఎస్. ఇళయరాజావి. 1979వ సం॥లో 19వ తేది ఏప్రిల్‌లో తమిళనాడులో జన్మించిన ఇళయరాజా చిన్నతనం నుంచి రవివర్మ చిత్రాల వల్ల ప్రభావితుడైనాడు. చెన్నైలోని ప్రభుత్వ లలిత కళాశాల నుంచి మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణుడై తైల వర్ణ, జలవర్ణ, పాలెట్ నైఫ్ చిత్రాలలో నిష్ణాతునిగా గుర్తింపు పొందాడు.



వంటా వార్పూ

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటంలో అతనికి తమిళనాట అత్యంత ప్రజాదరణ పొందిన ఆనంద వికటన్ పత్రిక తన వంతు పాత్ర పోషించింది.

ఒకప్పుడు, నలభై సంవత్సరాల క్రితం ఈ విధమైన చిత్రాలు వేసి జె.పి. సింఘహల్ మనకు కను విందు చేశాడు. సింఘహల్ తరువాత అతని అంతేవాసిగా వేరెవ్వరూ ఈ తరహా చిత్రకళపై మొగ్గు చూపక పోవటానికి కారణం, ఇది అత్యంత కష్టతరమైన శ్రమతో కూడిన శైలికావటమే! ఈ తరహా ఫొటోరియలిజమ్‌కు విదేశాలలో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యాపార చిత్రకళగా గుర్తింపు ఉంది.



ఎదురు చూపు

ఈ చిత్రాలన్నిటిలోనూ నిరాడంబరమైన, పరిశుభ్రమైన దక్షిణ భారత గ్రామీణ జీవితం ఆదర్శవంతంగా చిత్రించబడింది. ఉలితో అందంగా చిత్రించబడ్డ ద్వార బంధాలు, చూరులో నుంచి తొంగి చూసే సూర్య కిరణాలు, కట్టెపొయ్యిలు, ఛామన ఛాయతో తలనిండ పూదండ ధరించి, మెరిసిపోయే దక్షిణాది పల్లెటూరి అమ్మాయిలూ అతని భూమికలు. శ్రమైక సౌందర్యానికి ప్రతీకలు ఇళయరాజా చిత్రాలు.



ఉద్విగ్న

**ముఖచిత్రం :** ఈ బొమ్మకొక ప్రత్యేకత ఉంది. ఇది పూర్తిగా కంప్యూటర్‌లో చిత్రించబడ్డ రంగుల చిత్రం. చిత్రకారుడు కుంచె ముట్టుకోలేదు, రంగులలో ముంచలేదు. వీటిని వేయడానికి అతని ముందు కాన్వాస్ లేదు. తన స్వీయ ప్రతిభను కంప్యూటర్ టెక్నాలజీతో రంగరించి, చక్కటి చిత్రాలు వేయటమే కాక వేసిన చిత్రాలలో భావ ప్రకటనను ప్రస్ఫుటీకరించగలిగాడు. చిత్రకళలో అత్యంత ఆధునికమైన ఈ ధోరణిని మనం పోస్టు మోడ్రనిజంగా భావించటంలో తప్పులేదు.

ఈ చిత్రకారుని వివరాలు తెలియదు.

# చరిత్రలో చంద్రగిరి మహల్

- దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

పోర్చుగీసు యాత్రికులు తిరుమల-తిరుపతిని భారతీయుల రోమ్ ఫ్రాన్సిస్కన్ క్లెరిక్ ఫ్రెయ్ లూయీ ద సాల్వెడార్, నాటి విజయనగర పాలనపై పట్టుగల ఇమ్మడి నరసింహ నాయకుడు. ఇతడిని క్రీ.శ. 1503లో సాదరంగా ఆహ్వానించాడు. ఆ తరువాత ఎందరో పోర్చుగీసువారు వచ్చారు. కృష్ణదేవరాయల (క్రీ.శ. 1509-1529) పాలనాంతం వరకు విజయగనగర పాలకులతో వీరు సఖ్యతగా మెలగేవారు. కాని, కృష్ణరాయల తరువాత వీరిలో మార్పు రావడం ఆరంభమైంది. వీరి ధనదాహం, రాజ్యకాంక్ష, హిందూ మత వ్యతిరేకతలు బయట పడసాగాయి. ఉదాహరణకు, పోర్చుగీసు గవర్నరైన అఫాన్సో డీ సౌజా నాయకత్వాన దాదాపు మూడువేల మంది క్రీ.శ. 1543లో గోవా నుండి బయలుదేరి విజయనగర రాజ్యంలో అంతర్భాగంగా ఉండిన తిరుమలను దోచుకోవడంకై ప్రయత్నించారు. అదే తరుణంలో నేటి కేరళలోని కొల్లం సమీప తేవలకార ఆలయాన్ని దోచుకొన్నారు; ఇతర సమీప ఆలయాల్నీ దోచుకొన్నారు. మరోవైపు, కెనరాలోని భత్తక్ ఓడరేవును ముట్టడించారు. ఇక, విజయనగర రాజ్య తమిళ ప్రాంతాల్లోని క్రైస్తవ మిషనరీలైతే మత వ్యాప్తితో బాటు హిందూ ఆలయాల్ని దోచుకోవడం, ధ్వంసం, చేయడం వంటి కార్యకలాపాల్ని చేపట్టారు. అసలు క్రీ.శ. 1540లలో, 1550లలో పోర్చుగీసువారు పలు హిందూ ఆలయాల్ని దోచుకోవడం, ధ్వంసం చేయడం చేశారు. కడకు పోర్చుగీసు వైస్రాయ్



చంద్రగిరి కోట

డామ్ కాన్స్టాంటినో డీ బ్రగాంకా కూడా పోర్చుగీసు గోవాలో, ఉత్తర పోర్చుగీసు ప్రాంతంలో హిందూ ఆలయాల్ని ముట్టడించడం, దోచుకోవడం, ధ్వంసం చేయడం క్రీ.శ. 1550లలో చేశాడు. ఈ కాలంలోనే దక్షిణ విజయనగర ప్రాంతాల్లోని నాయకులు కూడా కుమ్ములాడుకొంటూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుండేవారు.

ఇదంతా, ఆరవీటి అళియ రామరాయలకు (కృష్ణదేవరాయల అల్లుడు) నచ్చలేదు. క్రీ.శ. 1543 నాటికే అతడు విజయనగర రాజధానిలో తన అధికారాన్ని సుస్థిరపరచుకొని ఉండడం; చంద్రగిరి, పులికాట్టులతో సన్నిహిత సంబంధాలు కల్గి ఉండడం; అసలు, నాటి పులికాట్టుకు అతడే మహామండ లేశ్వరుడుగా ఉండడం; అనగా, పులికాట్టుకు ప్రభువుగా ఉండడంతో క్రీ.శ. 1543వ సంవత్సరం మధ్యలో తన సోదరులు (కజిన్స్) చిన్నతిమ్మ, విఠలల నాయకత్వాన పెద్ద సైన్యాన్ని చంద్రగిరి, తిరుపతిలకు పంపి, అక్కడ నుండి భువనగిరి, పుదుక్కోట్టై, మధురై, తిరునల్వేలిలకు పంపించి ఆ ప్రాంతాల్లో పరిస్థితి చక్కదిద్దడంకై ప్రయత్నించాడు క్రీ.శ.1534 నాటికే పోర్చుగీసు యాత్రికుడు గాస్పర్ కారీయ తిరుమలను సందర్శించినట్లు తన రచన *లెందాస్ ద ఇండియా*లో చెప్పుకొన్నాడు. అంతేగాక, శాంథోమ్‌లోని జెసూట్‌లు తమ పరిసరాల్లోని హిందూ ఆలయాల్ని ధ్వంసం చేస్తున్నారని తెలుసుకొని క్రీ.శ. 1559లో వారి స్థావరాన్ని ముట్టడించి, పెద్దసంఖ్యలో పోర్చుగీసు పౌరుల్ని బంధించి తీసుకొని వెళ్ళడమేగాక, క్రైస్తవ మతగురువు అపోస్టల్ అస్థికల్ని కూడా పాక్షికంగా తన రాజధాని విజయనగరానికి తీసుకెళ్ళాడు. దీనితో భయపడి పోర్చుగీసువారు ఇతనితో బేరానికి దిగినారు. కడకు, పెద్ద పరిహారాన్ని చెల్లించి వీరు అస్థికల్ని, బందీయైన వారిని తీసుకెళ్ళారు. ఇదంతా, నాటి విజయనగర కాల్బల శక్తిని, పోర్చుగీసువారి బలహీనతను తెలియజేస్తోంది. బహుశా, పోర్చుగీసువారు ఆలయాల్ని దోచుకొనే ఇలాంటి వాతావరణం ఉండిన పదహారవ శతాబ్దపు మధ్య కాలంలో నేటి కేరళలోని పద్మనాభస్వామి ఆలయ సంపదను రహస్య గదుల్లో ఆలయ నిర్వాహకులు దాచిపెట్టినట్లు తెలుస్తోంది. (ఈ మధ్యనే సుప్రీంకోర్టు

ఆదేశాలమేరకు ఆ సంపద బయల్పరచడం జరిగింది.) క్రీ.శ. 1565 నాటి రాక్షస-తంగడి (తళ్ళికోట) యుద్ధం కూడా ఈ వాతావరణానికి తోడైనట్లు తోస్తోంది. ఈ యుద్ధంతో విజయనగర, రాజ్య రాజధాని పెనుగొండకు మార్చాల్సిన పరిస్థితి కూడా వేంకటపతి రాయల కాలంలో ఏర్పడింది.

ఆరవీటి వేంకటపతి దేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని క్రీ.శ. 1586 నుండి క్రీ.శ. 1614 వరకు పాలించాడు. క్రీ.శ. 1586లో విజయనగరం నుండి, క్రీ.శ. 1587 నుండి పెనుగొండలో, క్రీ.శ. 1592 నుండి చంద్రగిరిలో, క్రీ.శ. 1604 నుండి రాయవెల్లూరులో, క్రీ.శ.1611/1614 నుండి తిరిగి చంద్రగిరిలో రాజధాన్లుగా పాలించాడు. అనగా, వేంకటపతిరాయుల కాలానికి విజయనగర రాజ్యం పశ్చిమ ప్రాంతాలపైన, నైరుతి ప్రాంతాలపైన తన పట్టును కోల్పోయింది.

చంద్రగిరి స్థలకరణంగా పనిచేసిన కృష్ణరాజపిళ్ళై తెలుగులో వ్రాయగా, మరాఠా భాషలోకి తర్జుమా కాబడి, తిరిగి ఇంగ్లీషులోకి వ్రాయబడిన పందొమ్మిదవ శతాబ్ది తొలి రోజుల నాటి నివేదిక ప్రకారం (ఐ.ఓ.ఎల్.ఆర్; మెకంజీ కలెక్షన్ జనరల్ వాల్యూం నెం. 25, హిస్టారికల్ మెమోరియల్ ఆఫ్ చంద్రగిరి : 124-125) శక 1509వ సంవత్సరం (క్రీ.శ. 1592) వాయ, మార్గళి నెల నుండి ఆనంద సంవత్సరం, భాద్రపద నెల, అమావాస్య 30 వరకు 28 సంవత్సరాలా 10 నెలలు వేంకటపతిరాయులు పాలించడమేగాక, నందన సంవత్సరం, ఆవణి నెల 25న తిరుమలకు వెళ్ళి, వేంకటేశుని దర్శించుకొని, ఆయనకు, అగ్రపదీతరం (హాఫ్ ఆలవెన్స్) దానంగా ఇచ్చి, చంద్రగిరి కోటలో నివాసం ఏర్పరచుకొని, పదకొండవ యాదవ రాయలు నిర్మింపజేసిన చంద్రగిరి కోట చిన్నదిగా ఉందని తలచి, తనకు తన అనుచరులకు చాలదని భావించి, పాతకోట చుట్టూ 12000 గజాల నేలను సేకరించి; తన గురువు తాతాచారికి, తన బంధువులకు, కోటను మరింత విస్తారం చేసి, దానికి 72 బురుజుల్ని ద్వారాల్ని నిర్మింపజేశాడు.

ఈ నివేదికలోనే వేంకటపతి నిర్మింపజేసిన కోట ద్వారాల గురించి, 72 బురుజుల గురించి, ఆ బురుజులో నియమింపబడిన సైనికులు, ఉంచబడిన తుపాకుల గురించి, అంతఃపురాల నిర్మాణం గురించి, కందకం త్రవ్వకం గురించి, చంద్రగిరిలో నాడు ఏర్పరచబడిన పన్నెండు పేటలు (వార్డులు) గురించి కూడా వివరాలు ఇవ్వబడినాయి.

చంద్రగిరిని ఒక అందమైన ఆధునిక నగరంగా రూపొందించడంకై ఆరవీటి వేంకటపతి రాయలు చేసిన కృషిని ఈ నివేదికలోని వివరాలు తెలియజేస్తున్నాయి. ఇంతటి అద్భుతమైన రాజధానీ నగరం కావుననే ఎందరో దేశీయ విదేశీయ రాయబారులు (అంబాసిడర్లు) ప్రతినిధులు (ఎమిసరీస్), మిషనరీలు చంద్రగిరిని సందర్శించారు. క్రీ.శ.1590ల నాటి, క్రీ.శ.1600ల నాటి మిషనరీల, లేఖల్లో చంద్రగిరి ప్రస్థావన, దాని దాపున ఉన్న తిరుమల-తిరుపతి ప్రస్థావన పలు సందర్భాల్లో అగుపడుతోంది. క్రీ.శ.1600లో మొగల్ చక్రవర్తి అక్బర్ రాయబారి కూడా వేంకటపతిరాయుల చంద్రగిరి దర్బారుకు రావడం, వేంకటపతి క్రైస్తవ మిత్ర ధోరణిని అక్బర్ మెచ్చుకొన్నట్లు అతడు చెప్పడం జరిగింది. అలాగే, పోర్చుగీసు వైస్రాయ్ ఏరిస్ డీ సల్డాన్హ వద్దనుండి వచ్చిన రాయబారికి వేంకటపతి రాయలు క్రీ.శ. 1602లో తిరుమలలో స్వాగతం పలకడం కూడా జరిగింది. నాటి క్రైస్తవ మిషనరీల (జెసూట్‌ల) నివేదికలో క్రింది విధంగా చెప్పబడి ఉంది.

ఏరిస్ వద్దనుండి వచ్చిన రాయబారి చంద్రగిరి వద్దకు రాగానే రాజదర్బారు ముఖ్యుల్లో ఒకడు ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు, తప్పెట్లు, వినోదం, సంబరాలకై ఉపయోగించే ఇతర సాధనాలతో ఎదురు వెళ్ళి తోడ్కొని వచ్చి నగరంలోని అత్యంత మేలైన మహల్ (పేలస్)లో విడిది ఏర్పాటు చేయబడింది.

ఐతే, ఆరోజు చక్రవర్తి (వేంకటపతి రాయలు) చంద్రగిరికి రెండు క్రోసుల (లీగ్) దూరాన గల రోమ్ వంటిది, అత్యంత అందమైనట్టిది, విశాలమైనట్టిది, భక్తితో విలువైన కానుకలతో పెరుమాళ్‌ని (వేంకటేశుని) దర్శించడానికై వచ్చే జనంతో ఎల్లప్పుడూ నిండి ఉండెడిదియైన తిరుపతిలో (తిరుమల) విడిది చేసి ఉండడంతో, తన ఆప్తుని పంపి అత్యంత గౌరవప్రదంగా తన వద్దకు తీసుకురావాల్సిందిగా కోరడం జరిగింది. అంతేకాక, ఆ రాయబారికి ఆహ్వానం పలకడంకై తన, అద్భుత నివాస ముఖద్వారం వద్ద నిరీక్షించడం జరిగింది.

ఆ సందర్భంలో రాజు ఎటువంటి విలువైన దుస్తులు ధరించలేదు. ఎందుకంటే, వేంకటేశుడు నివాసమున్న

కొండపై నాడు విలువైన దుస్తులు ధరించడం అచటి సాంప్రదాయానికి విరుద్ధం (తిరుమలలో భగవంతుడు మాత్రమే విలువైన దుస్తులు ధరించాలని, మానవులు వినమ్రతతో సాధారణ వస్త్రాలు ధరించాలని నాటి జనం నమ్మేవారు). ఐతే శిరస్సు నుండి పాదాల వరకు విలువైన ఆభరణాల్ని, రాజు ధరించి ఉండడం జరిగింది. వీటిలో, చేతి కంకణాలు, పెరల్స్ కూర్చిన తీగలు కూడా ఉండినాయి. వీటిలో రెండు ఆభరణాలు మాత్రం అత్యంత అందమైనవి.

అందులో ఒక ఎమరాల్డ్ చుట్టూ పెద్ద పెరల్స్, ఒక మేలైన డైమండ్ ఉన్న నగ ఒకటి. ఇక, రెండవ ఆభరణం అత్యంత విలువైన పెద్ద రూబీ (గ్యురైరో, హీరాస్ రచనలు చూడుము). ఇదంతా వేంకటపతి రాయల వినమ్రతను, అతనితో జసూట్‌లుమెలగిన రీతిని తెలియజేస్తున్నాయి.

వేంకటపతి కాలంలో చంద్రగిరికి వచ్చిన మరొక పోర్చుగీసువాడు జాక్వెస్ డీ కౌత్రే. ఇతడు నేటి బెల్జియంలోని బ్రుజెస్‌లో క్రీ.శ. 1575లో జన్మించాడు. ఆసియాలో దాదాపు 35 సంవత్సరాలు గడిపాడు. క్రీ.శ. 1592లో గోవాకు వచ్చాడు. తొలుత ఆగ్నేయ ఆసియాలో నగల వ్యాపారం చేశాడు. క్రీ.శ. 1603లో తిరిగి గోవాకు చేరాడు.

పోర్చుగల్‌కు వ్యాపార రీత్యా పలుమార్లు వెళ్ళివచ్చాడు. చివరకు, క్రీ.శ. 1611లో ఆంధ్ర, కర్ణాటకల్లో డైమండ్ల కొనుగోలు అవకాశాల్ని తెలుసుకోవాలనుకొన్నాడు. ఇందుకై పశ్చిమం నుండి గాక, దక్షిణం నుండి ఆరంభించాలను కొన్నాడు. అందుకై ఓడలో గోవానుండి కొచ్చిన్ చేరాడు.

తరువాత భూమార్గాన మధురై, తిరుచిరాపల్లి, శ్రీరంగం (దీనిని జెరూసలేంతో పోల్చాడు) మీదుగా ఉత్తర దిశగా పయనించి సెంజి, ఆరణి, వేలూరు (ఇక్కడ ఇతడు వేంకటపతి రాయలను కలిసినట్లు చెప్పుకొన్నాడు), గుఱ్ఱంకొండ, (వేంకటపతి రాయల బావమరిది గొబ్బూరి ఓబరాయల ప్రొవన్షియల్ దర్బారు ఉండిన ప్రాంతం: ఓబరాయలు దారిదోపిడీగాళ్ళతో చేతులుకలిపి యాత్రికుల్ని దోచుకొనేవాడని కౌత్రే తెలిపాడు), ఆతరువాత, చంద్రగిరికి, అటుపిమ్మట చివరగా తిరుపతికి చేరుకొన్నాడు. తను చంద్రగిరిలో ప్రవేశించిన రీతిని కౌత్రే క్రింది విధంగా వివరించాడు. "గుఱ్ఱంకొండ నుండి మేము చంద్రగిరి నగరానికి బయలుదేరాము. క్రీ.శ. 1565 తరువాత చక్రవర్తి ఇక్కడ దర్బారు నిర్వహిస్తున్నాడు. ఇది చాలా అందమైన ప్రాంతం, బేలూరు వలె కోట గోడల్ని కల్గి ఉంది. ఇక్కడ చాలా ఎత్తైన కొండపై, ఒక లావు గోడలు గల కోట (క్యేజిల్) ఉంది. ఈ కొండ పాదాల చెంత చక్రవర్తి నివాస భవననం (అంతఃపురం) (ప్యాలెస్). ఇది చాలా పెద్దది, విశాలమైన, ఆకర్షణీయమైన నిర్మాణం. నగర ప్రవేశ ద్వారం వద్ద అతిపెద్ద శిలాప్రతిమ ఉంది. అదొక నీగ్రో శిల్పం. అంగోలాలో వలె ఉంది. దీనిని దేశీయులు ప్రిమల (పెరుమాళ్) అంటారు. వీరు ఆరాధించే దేవతల్లో ఒకరు.

ఈ దేవుని చేతిలో ఖడ్గం ఉంది; ఆయన చుట్టూ ముగ్గురు స్త్రీలు ఉన్నారు. ఇక, నగరం లోపల మరొక ప్రతిమ ఉంది. ఇది కూడా పెద్దది. ఇది ఒక కోతి రూపంలో ఉంది. దేశీయులు ఇతనిని ననాందో (ఆంజనేయ) అంటారు. ఇతని గురించి గొప్ప కథల్ని చెబుతారు. ఈ ఆటవికులు (బార్బేరియన్స్) (దేశీయులు) ఇతనిని కూడా ఒక దేవునిగా ఆరాధిస్తారు. ఇతనికి పొడవైన తోక ఉంది. అది అతని శరీరం చుట్టూ ఉంది. అతనికి నూనెరుద్ది ఉన్నారు. అక్కడ ఇంకొక ప్రతిమ కూడా ఉంది. అది పెద్దదిగా, క్రమబద్ధమైన పరిమాణం లేకుండా, మానవ రూపంలో ఉంది. ఐతే, ఏనుగు శిరస్సును కలిగి ఉంది. దేశీయులు దీనిని గనెసా (గణేశ) అంటారు. ఈ ముగ్గురు వికృత రూపులు (మోన్‌స్టర్స్): ప్రిమల (పెరుమాళ్), ననొకటొ (ఆంజనేయ), గనెసా (గణేశ) లను దేశమంతటా దేవుళ్ళుగా ఆరాధిస్తారు" (ఇక్కడ కౌత్రే భారతీయుల్ని బార్బేరియన్స్ అని, దేవతల్ని మోన్‌స్టర్స్ అని సంబోధించడం బట్టి కౌత్రే వంటి నాటి పోర్చుగీసు వారికి భారతీయుల ఎడల, భారతీయ దేవతల ఎడల గల, తక్కువ భావం తెలుస్తోంది. ఐతే, ఇతనికి భారతీయ నగరాలు, కోటల ఎడల గౌరవం ఉండేదని తెలుస్తోంది).

కౌత్రే ఇంకా ఇలా అన్నాడు. "ఈ నగరం (చంద్రగిరి) గొప్ప పొలిమేరల్ని కల్గి ఉంది. అది జనాలతో నిండి ఉంది. అక్కడ పల్లకిలో ఒంటరిగా వజ్రాల ఖనికి (తిరుమల) వెళ్ళాను. చంద్రగిరి వరకు నాతో వచ్చిన సహచరుడు ఫ్రాన్సిస్కో డీ సిల్వేరా దొంగల భయం వలన, సరుకులు లేకున్నా మార్గమధ్యంలో సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని నాతో రానందున తను భద్రంగా రావడానికి దారిని తెలియజేస్తానని, ఆతనికి చెప్పి నేను ఒంటరిగా (తిరుమలకు) బయలుదేరాను. నేను నగర (చంద్రగిరి) కోట గోడల్ని దాటి, నగర పొలిమేరలు మీదుగా రెండు క్రోసులు (లీగ్స్) ప్రయాణించి పగోడా (ఆలయం) ఉన్న తిరుపతి (తిరుమల)

చేరాను. ఇదంతా (తిరుమల-తిరుపతి) ఒకే నగరంగా ఉంది. ఇక్కడ (తిరుమల) నేనొక పెద్ద నిర్మాణం, చూశాను. దీనిని తిరుపతి పగోడా (ఆలయం) అనేవారు. ఇది దేశంలోనే ప్రధానమైనదిగా, ఇతర ఆలయాలన్నింటికీ నాయక నిర్మాణంగా భావించబడేది. దీనికి చాలా పెద్ద ఎత్తున ఆదాయాలు ఉండేవి. వీటిని దేశంలోని రాజులు, చక్రవర్తులు, ఇచ్చేవారు. ఆదాయాలేగాక, ధనరూపంలో, ఆభరణాల రూపంలో కూడా సంపద ఉండేది. అందుకే నాటి చక్రవర్తి (ఆరవీటి వేంకటపతి రాయలు, క్రీ.శ. 1586-1614) తనకు డబ్బు అవసరం ఉన్నప్పుడల్లా పగోడా (తిరుమల ఆలయం) నుండి అప్పుగా తీసుకొనేవాడు. అట్టి సందర్భాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహించబడేవి (సెరిమోనీస్). ఆ తరువాత, ఆలయ నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణుల నాయకుడు యైన వ్యక్తి ఈ అప్పును చక్రవర్తికి ఇవ్వడం జరిగేది.”

అంతేగాక, తిరుమలలోని దేవుని రూపం గురించి, అక్కడి ఆలయ ఆభరణాల గురించి, ఉత్సవాల గురించి, ఆ సందర్భంగా వచ్చే విజయనగర పాలకుల గురించి, వారి దానాల గురించి, గుంపులు గుంపులుగా, కోలాహలంగా వచ్చే భక్తజనాల గురించి, తిరుమలలో జరిగే వజ్రవైఢూర్యాలు, ఇతర సరుకుల వ్యాపారం గురించి, దేవదాసీల భరత నాట్యాల గురించి, తిరుమలలో పకడ్బందీగా ఉన్న భద్రత గురించి, తిరుమల-తిరుపతిల అభివృద్ధి గురించి కూడా వివరించాడు కౌట్రే. ఐతే, నాటి స్పెయిన్ (పోర్చుగల్లులకు) చక్రవర్తి మూడవ ఫిలిప్ జనవరి 1607లో విజయనగర (చంద్రగిరి రాయవెల్లూరు) చక్రవర్తికి వ్రాసిన లేఖలో మతవిషయంలో సహకారానికి, ఔదార్యానికి మెచ్చుకొంటూనే ఫిబ్రవరి 1610లో తన గోవా వైస్రాయ్ ర్యుయ్ లూరెన్కో డీ తవోరా కు లేఖ వ్రాస్తూ ఇలా అన్నాడు: “విజయనగర చక్రవర్తికి (ఆరవీటి వేంకటపతిరాయలు) చాలా వయసు మీరినట్లు తెలిసింది. ఆయన మరణిస్తే వర్గాలు ఏర్పడే అవకాశముందనీ తెలిసింది. రాజ్యాధికారంకై ముగ్గురు పోటీదారులున్నారు. వీటన్నింటి దృష్ట్యా మీరు (తవోరా) రహస్య ఆజ్ఞల్ని పంపించండి మనవారికి. చక్రవర్తి మరణించగానే ఆయన భూముల్నిగాని, లేదా,



శాంథోమ్, దాని పరిసరాలతో కూడిన నాల్గు క్రోసుల (ఒక క్రోసు మూడు మైళ్ళకు సమానం, 4800 మీటర్లకు సమానం) భూమిని మన రాజ్యంలో అంతర్భాగం చేయాల్సిందిగా మనవారికి ఆజ్ఞాపించండి. దీనిని శాంథోమ్‌లో ఉన్న మనవారితోబాటు మరికొంతమంది కలసి సాధించవచ్చు. ఆ ప్రాంతాల్లోని దేశీయులు బలహీనులు, యుద్ధాలకు అలవాటు లేనివారు. అంతేగాక, చక్రవర్తి, అతని మంత్రుల నిరంకుశత్వం నుండి ఆ జనం స్వేచ్ఛను పొందినవారుగా ఆనందిస్తారు. మన పెత్తనం ఆ ప్రజలపై ఏర్పడగానే వారంతా వర్గాలుగా విడగొట్టబడగానే పెద్ద ఖర్చులేకుండానే కొంకావో (కోరమాండల్) ప్రాంత పాలకుడిని కాగలను. నా ఖజానాకు భారత్‌లోని మన ప్రాంతాలన్నింటి నుండి వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఈ ప్రాంతాల నుండే వస్తాయి. ఇప్పుడు ఉన్న భారత్‌లోని ప్రాంతాల్ని కాపాడుకోవడానికి ప్రతి ఏడాదీ ఇరవై వేల పర్దావోస్ (పగోడాలు) ఖర్చు పెట్టినా ఆదాయం ఉంటుంది. అంతేగాదు, చక్రవర్తి మరణించగానే దేశంలో పలు ప్రాంతాల నుండి, ప్రాంతీయుల నుండి వచ్చే ఆదాయాలు గల తిరుపతి (తిరుమల) పగోడా (ఆలయం) ఖజానాని కూడా మన స్వాధీనం చేసుకోవచ్చు. తిరుపతి శాంథోమ్‌కు ఆరు క్రోసుల దూరంలో ఉంది. అసలు తిరుమల ఆలయంలో ప్రవేశించే సంపద అక్కడే ఆలయంలోనే పేరుకు పోయి ఉంటుందే గాని ఎప్పుడూ బయటకు తీసుకురాబడదు. దీనికి సంబంధించి మరికొంత సమాచారం నాకు తెలపండి” అని మూడవ ఫిలిప్ వ్రాశాడు. కాని, అతని కలలు నిజాలు కాలేదు. క్రీ.శ. 1611-1612 లలో విజయగనగర (చంద్రగిరి-వెల్లూరు) సైన్యాలు, ముఖ్యంగా గొబ్బూరి కుటుంబ ప్రోత్సాహంతో పోర్చుగీసు స్థావరం శాంథోమ్‌ను ముట్టడించాయి. ఐతే, వేంకటపతి రాయలు క్రీ.శ. 1614లో మరణించాక అధికారంకై అంతర్యుద్ధం జరిగింది. ఒకవైపు గొబ్బూరి కుటుంబం సహాయం పొందిన వ్యక్తి, మరొక వైపు తంజావూరు రఘునాథనాయక, వెలుగోటి కుటుంబం సహాయం పొందిన వ్యక్తి మధ్య పోటీ ఏర్పడింది. చివరకు ఆరవీటి రామదేవరాయలు రాజ్యాధికారం చేపట్టి క్రీ.శ. 1629 వరకు చంద్రగిరి

రాజ్యాన్ని పాలించాడు. క్రీ.శ. 1630లలో అళియ రామరాయల మనుమడు ఆరవీటి పెద వేంకట రాయలు రాజయ్యాడు.

**చంద్రగిరిలో తొలి అడుగు పెట్టిన క్రైస్తవం :**

ఇగ్నేష్యస్ లయోలా క్రీ.శ. 1540లో యేసుసభను స్థాపించారు. క్రైస్తవ ధర్మాన్ని బోధించేందుకు దీని సభ్యులు ఇండియా వంటి దేశాలకూ వచ్చారు. ఇక, తెలుగు నేలపై తొలిసారిగా నాల్గు వందలా పదునైదు సంవత్సరాల క్రితం అడుగు పెట్టారు. అది కూడా, చంద్రగిరిలో ఆనాటికి అది విజయనగర సామ్రాజ్య రాజధాని. ఆ నగరంలో యేసుసభ సభ్యుల బృందానికి ఘనస్వాగతం లభించింది. అలా, ఆంధ్రలో క్రైస్తవం మొదటిగా ప్రవేశం చేసింది.

అది, క్రీ.శ. 1598వ సంవత్సరం అక్టోబర్ నెల 15వ తేదీ ఉదయం. విజయనగర ప్రభువులు చంద్రగిరి కోట తూర్పు ద్వారం నుండి ఒక అసాధారణమైన ఊరేగింపు బయలు దేరింది. ఆ ఊరేగింపు అగ్రభాగాన ఈటెలు, కత్తులు ధరించిన అశ్వికదళమున్నది. ఆ దళం వెనుక అందంగా అలంకరించిన గజరాజులనధిరోహించి వియజనగర సామ్రాజ్య ప్రముఖులు అనుసరిస్తున్నారు. వీరి వెనుక పర్వతంలా సమున్నతంగా ఉన్న ఇంకొక మహా గజరాజు ఠీవిగా నడుస్తోంది. ఆ గజరాజు నుదిటిపై వైష్ణవ నామాలున్నాయి. దానిని అధిరోహించిన బాలుడికి పదమూడేండ్లు ఉండవచ్చు. అతని ముఖంలో రాజఠీవి ఉట్టిపడుతోంది. ఆ గజరాజు వెంట వస్తున్న ఇద్దరు సేవకులు ఆ రాకుమారుడికి చామరలతో వీస్తున్నారు. తిరుపతి వైపు సాగుతున్న ఆ ఊరేగింపుకు ఇద్దరు 'పథికులు' ఎదురయ్యారు. వారు నల్లని నిలువుటంగీలు ధరించి అదే రంగు నడముపట్టీని బిగించి కట్టుకొన్నారు. నలుచదరంగా నున్న నల్లని టోపీలను తలలపై పెట్టుకొన్నారు. చేతి కర్రల సాయంతో మందగమనంతో వస్తున్న వారిని చూడగానే ఊరేగింపు అగ్రభాగాన ఉన్న అశ్విక దళం ఆగింది. ఆ దళం వెనుకనున్న గజదళంలోని ఏనుగులు ముందుకు వచ్చి, మధ్యన దారి విడచి ఒకదానికొకటి ఎదురుగా నిలబడ్డాయి. మావటి వారు అదిలింపులతో ఏనుగులన్నీ మునికాళ్ళపై వంగగా, రాజాస్థాన ప్రముఖులు వాటిపై నుండి గౌరవ ప్రపత్తులతో క్రిందకు దిగారు. ఏనుగుల వరుస మధ్యలో నుండి రాజకుమారుడు కూర్చున్న గజరాజు ముందుకు వచ్చింది. ఏనుగును దిగిన అతడు 'పథికుల'కు సవినయంగా నమస్కరించాడు. ఆ నమస్కరించిన తీరు ఆతని కులీన (ఉన్నతి) సంస్కృతీ, సంస్కారాలకు అద్దం పడుతోంది. ఆ బాలుడు ఓబరాయుడి అన్నగారి సుపుత్రుడు (గొబ్బూరి ఓబరాయుడుకి నాటి చంద్రగిరిని రాజధానిగా చేసుకొని విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలిస్తుండిన రెండవ వెంకటపతి దేవరాయలకు మామగారు). అతడు విజయనగర చక్రవర్తి పక్షాన రాజాస్థాన ప్రముఖులతో కలిసి ఆ పథికులకు సాదర స్వాగతం పలికేందుకు అక్కడికి వచ్చాడు. విజయనగర చక్రవర్తిని సందర్శించేందుకు వచ్చిన ఆ ఇద్దరు పథికులు యేసుసభ సభ్యులు. వారిలో ఒకరు మైలాపురిలోని సెయింట్ థామస్ కాలేజి డైరెక్టరుగా కూడా ఉండిన ఫాదర్ సైమన్ డిసా. రెండవ వారు ఫాదర్ ఫ్రాన్సిస్కో, రిచియో. తెలుగు నేలపై అడుగుపెట్టిన తొలి క్రైస్తవులు వీరే. విజయనగర సామ్రాజ్య రాజధాని చంద్రగిరిలో వీరికి ఘనస్వాగతం లభించింది.

అలా వచ్చిన యేసుసభ సభ్యులను రెండవ వెంకటపతి రాయలు సాదరంగా ఆహ్వానించాడు. అంతేగాక తన రాజప్రాసాదానికి సమీపంలోనే వారి నివాసానికి ఒక భవంతిని కట్టించాడు. మైలాపూర్ సమీపంలోని ఎలమూరు గ్రామాన్ని వారికి మాన్యంగా కూడా ఇచ్చాడు. అప్పుడు యేసుసభ సభ్యులు నివాసముండిన భవనం నేటికీ చంద్రగిరి కోట సమీపంలో నిలచి ఉంది. డిసా, రిచియోలు వచ్చిన కొద్ది నెలలకు మాన్యువల్ డి వెయిగా, మెల్కియార్ కుటీనో, ఆంటోనియె రూబీనో, ఆంటోనియా డయజ్ మొదలగు వారు చంద్రగిరికి వచ్చారు. చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో క్రైస్తవం వ్యాప్తికై కృషి చేయసాగారు. క్రీ.శ. 1610లో ఫాదర్ రిచియో చంద్రగిరిలోనే మరణించాడు. తెలుగు నేలపై మరణించిన మొట్టమొదటి యేసుసభ సభ్యుడు ఇతడే.

ఆ రోజుల్లో ఇద్దరు యేసుసభ సభ్యులు వేంకటపతి రాయలకు అత్యంత సన్నిహితంగా మెలిగేవారు. వారిలో ఒకడు, బ్రదర్ అలెగ్జాండర్ ఫ్రే; ఇతడు ఆంగ్లేయుడు. మరొకడు, బ్రదర్ బర్తలోమియో ఫోంటెబోనా; ఇతడు ఇటలీ దేశస్తుడు. వేంకటపతి రాయలకు లలిత కళలంటే ఇష్టం, అందులోనూ చిత్రలేఖనమంటే మరింత ఇష్టం. అందుకే, ఇతని ఆస్థానంలో పలువురు చిత్రకారులుండేవారు. ముఖ్యంగా బ్రదర్ ఫోంటెబోనా పలు అపురూపమైన కళాఖండాలను చిత్రించి వేంకటపతి రాయలకు ఇచ్చాడు. మొగల్ చక్రవర్తి అక్బర్‌కు వేంకటపతి రాయల ఆస్థానంలోని

యేసుసభ సభ్యులంటే అపారమైన గౌరవం ఉందని ఒక మొగల్ రాయబారి ద్వారా (క్రీ.శ.1600లో) తెలుసుకొన్న వేంకటపతి తన ఆస్థాన యేసుసభ సభ్యుల్ని మరింత ఆదరంగా చూసుకొనేవాడు.

ఒక సందర్భంలో, మలబార్ వైస్ ప్రోవిన్స్ ప్రథమ అధినేతయైన అల్బెర్టో లెర్జియో తన సహచరుల్ని చూడాలని చంద్రగిరికి వచ్చాడు. అలా వచ్చిన ఈతనిని వేంకటపతి రాయలు తన గురువు తాతాచార్యులతో కలసి రాజప్రాసాదం ప్రధాన ద్వారం వద్ద ఘన స్వాగతం పలికాడు. ఆ సమయంలో చక్రవర్తికి ఒక గజరాజును, ఒక వేట కుక్కను, ఒక బైబిలును కానుకలుగా అల్బెర్టో సమర్పించాడు. ఆ దృశ్యం క్రింది తైలవర్ణ చిత్రంలో చూడవచ్చు.

ఐతే, వేంకటపతి రాయలు క్రీ.శ. 1614లో మరణించాడు. మరోవైపు యేసుసభ సభ్యులూ ఒక ఏడాది క్రితమే చంద్రగిరి ఆస్థానం నుండి వెళ్ళిపోయారు. అందుకు కారణం, ఎంత శ్రమించినా క్రైస్తవ మత ప్రచారంలో సఫలీకృతులు కాలేకపోవడమే. కాని, వీరు చంద్రగిరిలో ఉండిన పదిహేను సంవత్సరాల్లో తెలుగువారి కొరకు యోహాను పేరిట ఒక పాఠశాలను ప్రారంభించారు. సత్యోపదేశాన్ని తెలుగులో రూపొందించారు. ఐనా, కేవలం పన్నెండు మంది మాత్రమే క్రైస్తవం స్వీకరించారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా, తెలుగు నేలపై ఆరంభమైన సువార్తా ప్రచారం ఇలా అర్ధాంతరంగా ముగిసింది. క్రీ.శ. 1613 తరువాత 88 సంవత్సరాలకు యేసుసభ సభ్యులు కర్ణాటిక మిషన్ స్థాపించే వరకు తెలుగువారు క్రైస్తవం స్వీకరించేందుకు వేచి యుండవలసి వచ్చింది.

ఫ్రాన్స్ చక్రవర్తి 14వ లూయీ కోరిక మేరకు యేసుసభ సభ్యుల బృందమొకటి క్రీ.శ. 1658లో సయామ్ (నేటి థాయిలాండ్) వెళ్ళి, అక్కడ చెలరేగిన విప్లవానికి భయపడి భారత్‌లోని ఫ్రెంచి స్థావరాలైన తమిళ ప్రాంతంలోని పాండిచ్చేరి, బెంగాలు ప్రాంతంలోని చంద్రనగర్‌లకు చేరారు. సయామ్ వెళ్ళే అవకాశం లేనందున అప్పటికే తమిళుల మధ్య కృషిసల్పుచుండిన మధురై మిషన్‌వలె మరో మిషన్‌ను పాండిచ్చేరి, ఉత్తరాన స్థాపించాలని పాండిచ్చేరి బృందం భావించింది. దాని ఫలితమే కర్ణాటక మిషన్ ఆవిర్భావం. కాని దీని యేసుసభ సభ్యులు ప్రధానంగా తెలుగువారి మధ్యే విశేష కృషి చేశారు.

సయామ్ నుండి పాండిచ్చేరి. చేరిన యేసుసభ



కానుకలను అల్బెర్టో సమర్పిస్తున్న దృశ్యం

గురువుల్లో ఒకరు పియరీ మోధ్వి. కర్ణాటక మిషన్ స్థాపన జరిగాక ఇతడు క్రైస్తవం వ్యాప్తికై క్రీ.శ. 1701 లో ఆంధ్ర ప్రాంతం వైపు ప్రయాణమయ్యాడు. తొలుత పల్లికొండకు చేరాడు. ఆ తరువాత పెదనాయని దుర్గం చేరాడు. అక్కడి పాలయగాణ్ణి సందర్శించి, కానుకలు సమర్పించాడు. అటు తరువాత బైరేపల్లి కోలాలం (కోలార్), సన్నకల్లుల మీదుగా క్రీ.శ. 1701 అక్టోబర్ నెలలో నేటి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు చేరుకొన్నాడు. పుంగనూరులో మోధ్వి చాలాకాలం ఉండినాడు. అక్కడి పాలకుని అనుమతితో ఆ ప్రాంతంలో ఒక క్రైస్తవ ఆలయాన్ని కూడా నిర్మించాడు. ఇతని బోధనలకు ప్రభావితులై పుంగనూరు ప్రాంతపు వీరశైవ మతానికి చెందిన ఒక విధవరాలు, ఆమె నలుగురు కుమారులు క్రైస్తవులయ్యారు. వీరితో ఆంధ్ర శ్రీసభ ఆవిర్భవించింది. వీరు వెలమ కులస్థులు. క్రైస్తవం స్వీకరించిన విధవరాలి పేరు వెంకటమ్మ. క్రైస్తవం స్వీకరించాక, శౌరమ్మగా పేరు మార్చుకున్నది. ఈమె కుమారుల పేర్లు తెలియుట లేదు. వీరిది పుంగనూరు సమీపంలోని మార్లపల్లె గ్రామం. ఆ గ్రామంలో ఇప్పటికీ వారి సమాధులున్నాయి. వీరి తరువాత పుంగనూరు ఒక ప్రధాన క్రైస్తవ కేంద్రమయింది. యేసుసభ వారి రికార్డుల ప్రకారం అక్కడ ఎనభై మందికి పైగా ఆ కాలంలో క్రైస్తవ మతం స్వీకరించారు. ఇది జరిగాక, క్రీ.శ. 1702లో శౌరమ్మ పెద్ద కుమారుని వెంటబెట్టుకొని వివిధ ప్రాంతాల్లో మోధ్వి క్రైస్తవ ధర్మాన్ని ప్రబోధించాడు. ఇప్పటి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి, పెరకూరులలో క్రైస్తవ ఆలయాన్ని నిర్మించాడు. ఐతే, క్రైస్తవం విస్తరించడానికి ఇష్టపడని స్థానికులు, క్రీ.శ. 1711లో మోధ్విని, ఆతని సహచరుడు మాక్స్ మిలియన్ డి కూబర్ విల్లేని పెరకూరులో విషప్రయోగం చేసి చంపారు. అక్కడి క్రైస్తవ ఆలయాన్ని

ధ్వంసం చేశారు. దీనితో అక్కడి క్రైస్తవులు చెల్లాచెదురైపోయారు. మోద్వి పుంగనూరును విడిచాక క్రీ.శ. 1702లో అక్కడకు డీలా ఫోంటేన్ వచ్చాడు. త్వరలోనే అక్కడి పాలక కుటుంబ విశ్వాసం చూరగొన్నాడు. స్థానిక సైన్యంలోని బోయ కులస్తులు ఇతని బోధనలకు ప్రభావితులై క్రైస్తవాన్ని స్వీకరించారు. ఈ బోయ కులస్తుల వారసులు నేటికీ పుంగనూరు, కలికిరి, నరసిమ్మయ్యపాలెం వంటి గ్రామాల్లో ఉన్నారు. అలాగే తొమ్మిదిమంది బ్రాహ్మణులు, ఇతరులు కూడా క్రైస్తవాన్ని స్వీకరించారు. పుంగనూరు, దేవనల్లెలో ఏర్పడిన క్రైస్తవ ఆలయాన్ని కూడా ఇతడు నిర్మించాడు. ఈ సంఘాల్ని స్థిరపరిచాక కృష్ణాపురం వెళ్ళాడు. అక్కడి రాజు ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. ఇక్కడ కొందరు తొగటివారు క్రైస్తవం స్వీకరించారు. ఇది జరిగిన తరువాత క్రీ.శ. 1718 నవంబర్ 10న పుంగనూరుకు 90 మైళ్ళ దూరంలోని చిన్నబళ్ళాపురంలో ఫోంటేన్ మరణించాడు. తెలుగునేలపై క్రైస్తవ వ్యాప్తికి ఇతోధికంగా కృషి చేసిన ఇతనిని కర్ణాటిక మిషన్ వ్యవస్థాపకునిగా పేర్కొనవచ్చు.

ఫోంటేన్ తరువాత క్రైస్తవం మరింత ఎదిగేట్లు చేసిన వాడు లెగాక్. కర్ణాటిక మిషన్ చరిత్రలోని ఇతని కాలం స్వర్ణయుగంగా చెప్పవచ్చు. క్రీ.శ. 1709 నుండి చిన్నబళ్ళాపురంలో నివసించిన ఇతడు ఫోంటేన్ మరణం తరువాత క్రైస్తవం వ్యాప్తికై నిరంతరం కృషి చేశాడు. ఈతని బోధనకు ప్రభావితులై చిన్న బళ్ళాపురంలోని పలు శూద్ర కుటుంబాల వారు క్రైస్తవాన్ని స్వీకరించారు. ఐతే, కొంతకాలం తరువాత స్థానిక విష్ణు భక్తులైన దాసరి కులస్తుల గురువు క్రైస్తవం స్వీకరించిన వారిని ఊరి నుండి వెలియేయించాడు. దీని తరువాత దేవనపల్లిలో లెగాక్ స్థిర నివాసం ఏర్పరుచుకొన్నాడు. ఇక్కడ కూడా క్రీ.శ. 1704 నాటికే పలువురు క్రైస్తవాన్ని స్వీకరించారు. కాని ఇక్కడి దాసర్లు కూడా క్రైస్తవాన్ని వ్యతిరేకించారు. కడకు, ఆర్కాట్ నవాబు సాదతుల్లా ఖాన్ స్థానిక అధికారులకు ఆజ్ఞలిచ్చి ఇతనికి క్రైస్తవం స్వీకరించిన వారికి రక్షణ కల్పించాల్సి వచ్చింది. క్రీ.శ. 1713 నుండి ఇతడు అనంతపురం జిల్లాలోని కృష్ణాపురంలో నివసించాడు. అక్కడ పెద్ద క్రైస్తవ ఆలయాన్ని నిర్మించాడు. కాని, అది అగ్నిప్రమాదంలో ధ్వంసమైంది. తిరిగి రెండేండ్లలో పునర్నిర్మింపబడింది. కృష్ణాపురంలోని సాలె కులస్తుడు భీమిశెట్టి రంగప్ప క్రైస్తవం స్వీకరించాడు. ఇతని వంశీయులు తరువాతి కాలంలో కొండ్రముట్లలో స్థిరపడ్డారు. లెగాక్‌ను సంజీవనాథస్వామిగా కూడా పిలిచేవారు. క్రీ.శ. 1720లో కృష్ణాపురంలో భయంకర అంటువ్యాధి వ్యాపించగా ఇతడు, ఫ్రాన్స్ నుండి కృష్ణాపురానికి క్రీ.శ. 1718లో వచ్చిన ఫ్రాంకోయిస్ కేరన్ విశేష కృషి చేశారు. కడకు, కేరన్ అంటువ్యాధి బారిన పడి క్రీ.శ. 1721 జూలై 28న మరణించాడు. ఇక, లెగాక్ క్రీ.శ. 1738 ఏప్రిల్ 4న, గుడ్‌ఫ్రైడే రోజున కృష్ణాపురంలోనే మరణించాడు. కేరన్, గిల్బర్ట్ దు క్రోస్‌ల సమాధుల మధ్య లెగాక్ సమాధి కూడా నేటికీ కృష్ణాపురంలో ఉంది. ఇప్పటికీ ఇతని సమాధిని పవిత్రమైనదిగా అక్కడి ప్రజలు భావిస్తారు.

లెగాక్ కృష్ణాపురంలో ఉండిన రోజుల్లో ఎలనాటి సీమ రెడ్లు క్రైస్తవం స్వీకరించారు. (బహుశా క్రీ.శ. 1713లో) దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూన్న ధర్మవరం దగ్గరలో ముదిగుబ్బ గ్రామపెద్ద తుమ్మా హనుమంతరెడ్డి క్రైస్తవుడిగ మారిన భీమిశెట్టి రంగప్ప ద్వారా లెగాక్ గురించి విని, ఆతని దగ్గరకు వెళ్ళి, స్వస్థుడై క్రైస్తవాన్ని స్వీకరించాడు. లెగాక్ ఇతనికి రాయపరెడ్డి అని పేరు పెట్టాడు. ఇతని బంధువులు కూడా అనేకులు క్రైస్తవులయ్యారు. క్రీ.శ. 1722లో ముదిగుబ్బలో లెగాక్ క్రైస్తవ ఆలయాన్ని నిర్మించాడు. ముదిగుబ్బకు నాల్గుమైళ్ళలోని ఆలమూరులోని రాయపురెడ్డి బంధువులు గోపురెడ్లు కూడా క్రైస్తవాన్ని స్వీకరించారు. (బహుశా క్రీ.శ. 1712లో...) ఐతే మారఠుల దండయాత్రలకు భయపడి క్రీ.శ. 1733 ప్రాంతంలో ఈ రెండు గ్రామాల రెడ్లు దాదాపు ఎనభై కుటుంబాలవారు నాటి నెల్లూరు జిల్లాలోని దర్శి సమీపాన గల బుక్కాపురం చేరారు. తరువాత గోపురెడ్లు మాత్రం సిరిపురంలో స్థిరనివాసం ఏర్పరుచుకొన్నారు. వీరి బంధువుల్లో ఒకరైన మరన్నరెడ్డి కలెక్టర్ హోదాలో క్రైస్తవ ఆలయాన్ని ఆ ఊరిలో నిర్మించాడు. కాలగమనంలో ఇదే రీతిలో పొన్నపాటి, ఇంద్రెళ్ళరెడ్డి, పెంటారెడ్డి, కొమ్మారెడ్డి, ఉడుముల, దగ్గుల, ఆదూరి, గాదె, బోయపాటి, బాసాని, అల్లం, పరువ, వట్టి, దుగ్గింపూడి వంటి ఇంటిపేర్ల వారు కూడా క్రైస్తవులయ్యారు.

ఇలాగే, సంస్కృతం, వేదసాహిత్యాల్లో ఉద్దండుడైన కాల్మెట్ బోధకుని కాలంలో క్రీ.శ. 1735 ప్రాంతంలో కడప జిల్లా, గండికోట సీమలోని పలువురు కమ్మ కులస్తులు క్రైస్తవం స్వీకరించారు. వీరంతా నిజానికి గుంటూరు ప్రాంతం నుండి వచ్చి విజయనగర ఆరవీటి పాలకుల

నాయకుల వద్ద, కడప నవాబుల ఆస్థానాల్లో పనిచేస్తుండే వారు. వీరిలో తొలుత పర్నెపల్లి గ్రామవాసి సుబ్బయ్య భార్య అన్నమ్మ పేరుతో క్రైస్తవం స్వీకరించింది. అటు తరువాత ఈమె బంధువులు కూడా క్రైస్తవం స్వీకరించారు. కడప నవాబు వద్ద పనిచేస్తుండిన పలువురు కమ్మవారు కూడా క్రైస్తవాన్ని కాల్మెట్ కాలంలో స్వీకరించారు. క్రీ.శ. 1745లో కాల్మెట్ మరణించాక ముస్లిం-మరాఠా ఘర్షణలు పెరగడంతో వీరంతా కొర్దే బోధకుని నాయకత్వాన కృష్ణానది ఒడ్డున గల మచిలీపట్నం సమీపపు ఓలేరుకు వలస వెళ్ళారు. ఐతే, వీరు గండికోట సీమలో తాము నివాసముండిన ఊర్లపేర్లనే తమ ఇంటిపేర్లుగా చెప్పుకోసాగారు. అలాంటి పేర్లలో పెనికలపల్లి, యెద్దన పల్లి, మల్లవరం, ఏటుకూరు, పూదోట, పొతకమూరు మొదలైనవి కొన్ని.

కొర్దేకు వంటమనిషిగా ఉండిన ఒక గొల్లవాడు కూడా (గండకోట సీమ తిమ్మనాయునిపేట వాసి) ఓలేరుకు వచ్చి, తదనంతరం క్రైస్తవుడై, స్వంతూరికి వెళ్ళడంతో ఇతనిని చూసిన బంధువులు పన్నెండు కుటుంబాలవారు కూడా క్రైస్తవం స్వీకరించారు. వీరంతా అనంతపురానికి దక్షిణాన గల చెన్నమనాయుని కోటలో స్థిరపడ్డారు. జ్ఞాన ప్రకాశంగా పిలువబడ్డ కొర్దే రచించిన *మోక్షమార్గం* గ్రంథాన్ని ఓలేరు నుండి గొల్ల యువకుడు తెచ్చుకొన్నాడని తెలుస్తోంది. కడకు కొర్దే క్రీ.శ. 1755లో మరణించాడు. ఐతే, ఓలేరులో స్థిరపడ్డ క్రైస్తవులంతా మరోసారి క్రీ.శ. 1788లో మద్రాసు సమీపంలోని కీళచేరికి వలసవెళ్ళి స్థిరపడ్డారు. కర్ణాటిక మిషన్‌కు చెందిన సంఘాలు కూడా సర్కారు జిల్లాలోని, బుక్కాపురం, పెద్దారికట్ల, ఓలేరులకు తరలి వచ్చాయి. ఓలేరు మిషన్ బాపట్ల, గుంటూరుల్లో నూతన సంఘాల్ని, స్థాపించింది. ఓలేరు కేంద్రంగా బోధకత్వం నిర్వహిస్తూ పరమానంద స్వామిగా పిలవబడ్డ జార్జియో మనెంతే క్రీ.శ. 1733లో ఇటలీలోని నేపుల్స్‌లో పుట్టి, 1762లో ఇండియా వచ్చి, 1764లో ఓలేరు చేరి, చిత్తూరు అనంతపురం, కర్నూలు, ఒంగోలు, గుంటూరు, మచిలీపట్నం, ఫిరంగి పురం బుక్కాపురం, పెద్దారికట్ల, నంద్యాలమ్మపేట, మైదుకూరు, ప్రొద్దుటూరు, చిక్కబళ్ళాపురం, ధర్మవరం, కొండవీడుల్లో బోధనలు చేసి, నాటి మద్రాసు గవర్నర్ సర్ కాంప్ బెల్ 10-11-1786న మద్రాసు సమీప కూవం, మప్పేడు, కొత్తూరు, గ్రామాల భూముల్ని దానంగా ఇవ్వడంతో అక్కడ చేరాడు. ఈ మద్రాసు సమీప ప్రాంతానికి ఓలేరు నుండి 400 గండికోట - కమ్మ- కుటుంబాల, వారు కూడా వలస వచ్చారు. ఇతర కులాల వారు కూడా ఇచట క్రైస్తవం స్వీకరించారు. ఇచటనే కీళచేరిమిషన్ పుట్టింది. క్రమంగా మద్రాసు పరిసరాల నుండి తెలుగువారి క్రైస్తవ కీళచేరిమిషన్, పాండిచ్చేరి పొలిమేరల వరకు వ్యాప్తి చెందింది. అలాంటి ప్రాంతాల్లో పన్నూరు, మొలనూరు, పాల్ నెల్లూరు, వరగడం (వలకపురం) ఉరియూర్, కుప్పం, రాజంపేట్, క్రిస్టియన్‌పేట్, తల్లపట్టీడ, రావత్తనల్లూరు, తచ్చూరు మొదలైనవి. కీళచేరి కేతలిక్ ఫౌండేషన్‌ను, శ్రీసభను మనెంతే ఏర్పాటు చేశాడు. పాతికేళ్ళు ఓలేరులో, పాతికేళ్ళు, కీళచేరిలో గడిపాడు. కడకు 1812లో మద్రాసులో మరణించాడు. ఇక వాయల్పాడులో 1730లో క్రైస్తవ బోధకులు మతవ్యాప్తి కార్యకలాపాలు జరిపినట్లు, 1736లో కడప జిల్లా సిద్ధవటం కోట కేంద్రంగా పాలించిన కడప నవాబు ఆ స్థానంలో జ్యాకీమ్ డి సౌజా అను బోధకుడు ఉండినట్లు, ఇతడు సిద్ధవటంలో క్రైస్తవ ఆలయాన్ని నిర్మించినట్లు, కంబల దిన్నెలో 1756 వరకు మార్టిన్, కోర్దె అను బోధకులు ఉండినట్లు, వీరు అక్కడ నిర్మింపజేసిన క్రైస్తవ ఆలయాన్ని నిజాం సైనికులు 1756లో ధ్వంసం చేసినట్లు, దీనితో వీరు కృష్ణాపురానికి తరలిపోయినట్లు కూడా తెలుస్తోంది.

ఐతే, క్రైస్తవ బోధకులు, సంఘాలు, విద్యాసంస్థలు స్థానిక జనాల్లో అనుమానాలు మొలకెత్తేట్లు తమ కార్యకలాపాల్ని నిర్వహించడం వలన, క్రీ.శ. 1773 ప్రాంతపు పద్నాల్గవ క్లెమెంట్ ప్రపంచ వ్యాప్తంగా యేసుసభను అణచివేయడానికి ప్రయత్నించడం వలన తెలుగు నేలలో కూడా కొంతకాలం క్రైస్తవం వ్యాప్తి మందగించింది. దాదాపు ఒకటిన్నర శతాబ్ది తరువాతనే, మరలా పుంజుకోసాగింది. ఐతే, ఈ లోపు కొన్ని కుటుంబాలు క్రైస్తవానికి ఊపిరి పోస్తూవచ్చాయి. అలాంటి కుటుంబాల వారి ఇంటి పేరు భిన్న రూపాల్లో వ్యాప్తి చెందడమే ఇందుకు నిదర్శనం. ఉదాహరణకు, ఇన్యాసి, శౌరి వంటి ఇంటిపేర్లు ఇన్నయ్య, ఇన్నమ్మ, ఇన్నారెడ్డి, శౌరి, శౌరమ్మ, శౌరయ్య, శౌరలమ్మ, శౌరెడ్డి, ఇన్నాశౌరి, గోవా శౌరి వంటి ఇంటి పేర్లుగా రూపాంతరం చెందాయి. ౙ

---

డా॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
రిటైర్డ్ ప్రొఫెసర్, చరిత్రశాఖ, ఎస్వీయూనివర్శిటీ,
తిరుపతి. ఫోన్ : 9849584324

# నెల్లూరు-మారుపేర్లు

- పలగాని గోపాల రెడ్డి

క్రీస్తు తదుపరి 1200 నాటికి, ఏలికలందరికే ఏలికలుగా పేర్గాంచినవారు తంజావూరి చోళులు. వారిలోకూడ మూడవ కులోత్తుంగుని నాటికి దిగువ భారతభూమిలో ఎటువైపు తేరిపార చూచినా, ఆ చూపులకందనంతమేర వారి పలుకుబడి పరచుకొన్నది. ఆ కులోత్తుంగుని కటునిటు నుండిన ఏలికల దొరతనం క్రింద నాటి నెల్లూరు సీమలు కూడ ఉండినవి. ఆ దొరలు రాళ్ళపై చెక్కించిన పలువ్రాతలు వెలుగులోకి వచ్చినవి. ఆనాటి కొన్ని కల్ వ్రాతలలో నెల్లూరు, ఆ నెల్లూరికే విక్కిరమ (విక్రమ) సిజ్గపురమన్న మారుపేరుండినట్లు కన్పిస్తుంది.

పెన్ననంటినట్లున్న రజ్గనాయకస్వామి గుడి పరిసర ప్రాంతాన్ని తిరుపాఙ్కడల్, చిత్తరిమేఝి విణ్ణగర్‌గాను అచ్చట నడుంవాల్చిన రంగయ్యను పళ్ళికొణ్డ పెరుమాళ్ (పడుకొన్న పెద్దాయన)గా పిలిచిరి. ఆ పేరులో ముందరిపాలైన "పళ్ళికొణ్ణ"ను సంస్కృతీకరణపై తరగని మక్కువగలవారు మార్చగా ఆ స్వామి శయన పెరుమాళ్ (మిశ్రమ సమాసం)గా ఐనాడు. అంతేగాక, "పళ్ళికొణ్డ" (పడుకొన్న)లో కన్పించిన "కొణ్డ"నొక గుట్టగా తీసుకొని "తల్పగిరి" అనే పేరు పుట్టించిరి. కాని పాతకాలంనాటి రాతిపై వ్రాతలందెక్కడా "తల్పగిరి" కానరాదు.

ఏదైనా ఒక ఏటి తాలూకు రెండు పాయుల నడుమనిరికిన అరుగు (తమిళపరంగా అరజ్గమ్) పైన మాత్రమే పాముచుట్టల పాన్పుపై అలవోకగానున్నట్లు నడుమువాల్చిన రజ్గస్వామిని నెలకొల్పి ఆయనకొక గుడి కట్టెదరు. అట్టి ''తిరవరజ్గమ్'' (శ్రీరంగం)పై కాలువెూపాలంటే రెండింటిలో ఏదో ఒక ఏటి పాయనుదాటాల్సిందే. పరాశరభట్టర్ అన్న వైష్ణవ భక్తుడు కూర్చి పాడిన "కావేరి మహాత్మ్యము" అనెడి కావ్యంలో కన్పించెడి "శ్రీ రంగమాలింగతే" అనే ఒక శ్లోకభాగం[4] కూడ అదే ప్రాతిపదికకు ఊతం.

"పెన్న దాటితే పెరుమాళ్ళ సేవ" అన్నదొకనానుడి. నెల్లూరు సీమలో తరతరాలుగా సాగివస్తున్నదాపలుకు. ఇది కూడ రంగయ్య నెలకొన్న తిన్నెను చేరాలంటే పెన్నపాయల్లో ఒకదాన్ని దాటి నడవడం తప్పనిసరిగా తెలియజేస్తుంది. మరి ఈనాడు పెన్నకు మరొకపాయ కానరాదు. ఏమైనట్లు? కాటన్‌దొర పెన్నకు ఆనకట్టలు కట్టించే సమయంలో దాని కుడివైపు, ఎగువనుండి (పొటేపాలెంకు కొంత పడమరనుండి) కరకట్టలు ఎక్కబోసి బలంచేసారు. ఆ క్రమంలో ఆ రెండవ పాయ మూసుకుపోయింది. అలా మరుగైపోయిన కుడిపాయ సంతపేట ప్రాంతంలో మొదలై అలనాటి ఇసుక డొంక (నేటి St. Peter's High School ముందున్న రోడ్డు) మీదుగా ప్రవహించి నవలాకుల తోట ప్రాంతంలో తిరిగి పెద్దపెన్నలో కలిసిందిగా నా తాతలమాట. ఆ ప్రాంతపు నేలవాళ్ళు (Topo sheets)ను పరిశీలిస్తే మరికొంత నిర్ధారించి చెప్పవచ్చును.

దక్షిణ భారతంలో తగిలే ఏర్లలో ఎక్కువభాగం, అవి కడలికి దగ్గరవుతున్నాయనగా, రెండు పాయలుగా చీలుతాయి. అందులో ఒక దానిని పాలపాయ, మరొక దానిని చల్లపాయగా పిలుస్తారు. పాలపాయ, చల్లపాయల నుండి వీలయినచోట్ల కట్టుకొమ్మలు (Finger Jetty) కొట్టి కాలవలు తీస్తారు. ఆ కాలవలు నేరుగాగానీ, ఒక చెరువు ద్వారాగానీ పంట పొలాలకు నీరందిస్తాయి. ఆ తరి సేద్యం తాలూకు పులక (మురుగు) నీరు తిరిగి పాలేటిలో పడనే పడవు. కానీ చల్లకాలువనుండి తీసిన పిల్లకాలువల పారుదల క్రిందకు వచ్చిన తరి సేద్యం తాలూకు పులక నీరు ఎక్కడికక్కడన్నట్లు (Non-point discharge) చల్లకాలువలోకి

తిరిగి వచ్చిపడును. కాబట్టే పాలపాయులో కల్తీలేని (పాలవంటి) నీరుంటుంది. చల్ల కాలవలో క్రమక్రమంగా నీరు కొద్దిపాటి కల్తీగా (తోడుపెట్టిన పాలవలె) మారును. పాలు, చల్లల సామ్యంతోనే ఆ రెండు పాయలకటువంటి పేర్లు దక్కి స్థిరపడినవి. ప్రకాశంజిల్లాలో ముసి, నెల్లూరు జిల్లాలో పంబలేరు, సువర్ణముఖిలకట్టి చల్లపాయలున్నాయి. కృష్ణా తూర్పుగోదావరి జిల్లాల్లో తగిలే చల్లపల్లి పేరిట ఊర్లు చల్లపాయలగట్టు పైనున్నవే. కంచి ప్రాంతంలోని పావేరుకు ఒక మోర్ (తమి) వాగున్నట్లు తెలిసింది. గుంటూరుజిల్లాలో చేబ్రోలుకు దిగువగా ఒక మోర్వాగింకా నిలిచేఉంది. పాల్వాయివంటి పేర్లున్న ఊర్లు పాలవాగు మొగ వద్దనున్న కలికివాయి, పులికాలువ, కలివెలిపాలెం ఇత్యాదుల విషయానికి తర్వాత వస్తాను.

ఆపైన పెద్దపాయ, తన ఒడిలో నడుంవాల్చిన రంగస్వామి నెలకొన్న ఒక బొంతరాతి మెరకను, పడమర, ఉత్తర దిశలందొరుసుకొంటూ నడుస్తుంది. ఆ తిన్నె పైనుండి చూస్తే ఆ పాలేటి పరుపు కనుచూపు తేరిపారినంతమేర సముద్రం ఉన్నట్లు దర్శనమిస్తుంది. ఆ నీటి పరుపు, శ్రీ మహావిష్ణువు మాగన్నుగా నడుంవాల్చిన శేషశాయి నెలవైన క్షీరవారాశిని తలపిస్తుంది. కాబట్టే ఆ రంగస్వామి గుడి వెలసిన ప్రాంతాన్ని (తిరు+పాల్+కడల్) తిరుపాఱ్కడల్ అని పలు తమిళ కల్వెత (శాసనం) ల్లో పిలిచారు. ఇంకా దాన్ని వైకుంఠంగా భావించి "విణ్ణగర్" (తమి)గా కూడ పిలిచినారు.

క్రీస్తు తదుపరి తొలిమలి నూరేండ్ల (శతాబ్దుల) కాలంలో సముద్ర గుప్త చక్రవర్తి కళింగం మీదుగా లెక్కకు మించిన దండుతో తెనుగు తీర భూమికి దిగివచ్చి జైత్రయాత్ర చేసినట్లు అలహాబాదు కోటలో నిలిపిన ఒక రాతిస్తంభంపై చెక్కించి, ఘనంగా చెప్పుకొన్నాడు. ఆ పెనుదాడి పిఠాపురంను తాకి పెన్నానది వరకు సాగింది.

ఆనాటికి నెల్లూరు సీమ కంచి పల్లవుల ఏలుబడిలో ఉండింది. పల్లవ దొరల సేనాని అయిన ఉగ్రసేనుడు నెల్లూరును కేంద్రంగా చేసుకొని ఆ సీమ ఎల్లలను కాపాడుకొంటూ, ఆ సీమ పెత్తనం కూడ చేస్తూ దాని తలకాపుగానుండెను. సముద్రగుప్తుని శాసనంలో "పాలకడ" వద్ద తానెదుర్కొని ఓడించిన (ఆ) ఉగ్రసేనుని గురించి కూడ తెలుపుకొనెను.

అంటే సముద్రగుప్తుడు నెల్లూరును తాకడానికి రావడం తెలుసుకొన్న ఉగ్రసేనుడు తానెదురు నడచి ఆ పెనుదాడిని "పాలకడ" వద్దే ఎదుర్కొని పోరాడి చివరకు ఓడెను. ఆ పోరు కళ్ళము (రణభూమి) తిరుపాఱ్కడల్‌గా పిలువబడిన పెన్నపెద్దేరు వద్ద జరిగిందిగా నా నమ్మకం. (తిరు) "పాలకడల్" అలహాబాదు శాసనంలో "పాలకడ"గా కన్పించినది. 2,000 సంవత్సరాల క్రితమే ఆ పేరు గంగానది గట్టువరకూ పోయి చరిత్రకెక్కింది.

ఉగ్రసేనుడు వచ్చి ముట్టడించేవరకు ఎదురుచూడక తానే పెన్న దాటి ఎదురేగి, ఆ దాడినెదుర్కొన్నాడని నా ప్రతిపాదన.

**మాడుకట్టి పోరడిత్తాల్ మాలాదు చెన్నెల్ ఎణ్ణు**

**ఆణై కట్టి పోరడచ్చు అరుగాన తెన్మదురై**

పై చెప్పిందొక తమిళ గేయ భాగం. తరతరాలుగా తమిళుల నాలుకపై నడయాడి వస్తున్న ఒక నానుడి. అతి సుందరమైన మధురై ప్రాంతంలో (ఏపుగా, ఒత్తుగా పెరిగిన) నాణ్యమైన వరి పంట పడుగు (పోర్)పై ఏనుగులను (బంతిగా) కట్టి తోలుతూ తొక్కించి నూర్చవలెనే కాని ఎడ్లవల్ల సాధ్యంకాదని దాని భావం. నిన్నమొన్నటి వరకు కుప్పచుట్టూ కళ్ళం పైన తగు మోతాదుగా వరిపనల పడుగు (పోర్) త్రోయించి ధాన్యం నూర్పిడి చేయించిన ఏ రైతుకైనా "పడుగు" అన్నది కొత్త మాటకాదు. అదే "పడుగు"ను తమిళంలో "పోర్" అంటారు. పోర్ (తమి) పోరు (తెను) అంటే యుద్ధంకూడ. అలాగే కళమ్ (తమి) అంటే పంట నూర్పిడికనువైన (కళ్ళము) చదును నేలయే కాక, రణరంగమనే రెండో అర్థం కూడ ఉన్నది. గత దశాబ్దం వరకు కూడ ఎడ్లతోనో ట్రాక్టరుతోనో తొక్కించే కుప్ప నూర్పిడిలో కూలీలు రెండు జట్లుగా ఏర్పడి, పడుగుని పంచుకొని, తమ వంతు నూర్పిడిని ముందుగా ముగించి ఎదుటి జట్టుపై గెలుపు సాధించాలనే పట్టుదలతో చెరామసిగా పనిచేయడమనాటి దృశ్యం.

ఈ పోర్-పడుగు, కళమ్-కళ్ళములకు ఉన్న సంబంధమును బట్టి, ఆ పాలకడల్ ఎడమగట్టు పైనున్న నేటి పడుగు, పాడన్నచోటు యుద్ధరంగమై ఉండ వచ్చునిపిస్తుంది. అంతేకాక పడుగుపాడు ప్రాంతంలో నేలను త్రవ్విన కొన్ని సందర్భాలలో సముద్ర గుప్తుని కాలంనాటి సీసపు రూకలు (Punch Marked Lead Coins)

చెప్పుకొనదగినన్ని దొరికినవి (దువ్వూరు, పంటలల్లూరు, దర్గామిట్టలందు కూడ అట్టి రూకలు దొరికినవి. కాని అవి చెదురుమదురే. ఇంకా రైలుకట్ట కొత్తగా పోసినప్పుడా వడుగుపాడు ప్రాంతంలో కొన్ని అస్తివంజరాలు బయటపడ్డాయి. కానీ అవి గాలి తాకిడికే పొడి పొడి అయిపోయినవట. ఫోటోలయినా తీయలేకపోయినందున, వినికిడి మాటలేతప్ప సాక్ష్యాలేమీ మిగలలేదు. ఆ అస్తిపంజరములు శతాబ్దాలక్రిందటివని భావించగలం.

పై తెలిపిన వివరాలనుబట్టే ఆనాడు సముద్రగుప్తుని ఉగ్రసేనుడెదుర్కొని పోరాడిన "పాలకడ" "తిరుపాళ్కడల్" ఒకటేనని అంటే నేటి పడుగు పాడే నాటి రణరంగమని నా నమ్మకం. అదే నిజమైతే 12వ శతాబ్దినాటికి తిరుపాళ్కడల్గా పిలువబడిన ఆ రంగస్వామి గుడి ప్రాంతం క్రీస్తు శకారంభంనాటికే ఆ పేరుతో పిలువబడిందనుకోవాలి. అలాగే విణ్ణగర్ పేరుకూడ.

పడన్, పడవాలు, పటాలయ్ ఇత్యాదులన్నీ సైనిక పరమైన మాటలే. నెల్లూరు రంగనాయక స్వామికి, ఆ నెల్లూరు మూడు వీధులలోని "పడైముదలి" లిచ్చిన దాన శాసనమొకటి దొరికింది. అంటే 12వ శతాబ్దినాటికే నెల్లూరులో మూడు వీధులనిండా దళవాయిలు స్థిరపడ్డారనుకొనవచ్చును. గడిచిన శతాబ్దంలోకూడ ముస్లింల ఆగడాలను నిలువరించిన వస్తాదులు నెల్లూరు కామాటివీధి వాసులే.

ఇచ్చటే మరొక మాట చెప్పవలసి ఉంది. పెన్న కుడిగట్టునంటినట్లున్న నేటి నవలాకులతోట ప్రాంతం తొమ్మిది లక్ష (నవలక్ష)ల చెట్ల తోటగా ఒక అన్వయం చెప్పి ఖాయం చేశారు. (ఏటా ఆ తోటకు రంగనాయకులస్వామి పార్వేటకు వేంచేస్తారు) ఉత్తరార్కాడు జిల్లా (వందవాసితాలుకా)లో కూడ నవలాకుతోట్టయ్ పేరుతోనున్న గ్రామంతోపాటు నవలాక్, నవలూర్, నవల్పాకం వంటి పేర్లున్న పలు గ్రామములు తమిళనాటంతా తగుల్తాయి. నవలం (తమి) అంటే నేరేడు మ్రాను. ఇప్పటికీ నెల్లూరు నవలాకుతోట ప్రాంతంలో వయస్సు మళ్ళిన నేరేడు మ్రాకులెన్నో మిగిలి ఉన్నాయి.

అసలు విషయానికి తిరిగివద్దాం. రంగయ్య గుడి వెలసిన ప్రాంతాన్ని వైకుంఠ సమానంగా భావించి "విణ్ణగర్"గా పిలిచారని ముందొకసారి చెప్పాను. విణ్ణగర్ (తమి) అంటే మింటిపై విష్ణు లోకమైన వైకుంఠమని రూఢ్యర్థం. (ఆకాశం) నున్నయేడ అని ఒక భాష్యం. దక్షిణాదిలో పలు వైష్ణవ క్షేత్రాలనీ పేరుతో పిలిచారు. పొత్తపినాడు (నేటి కడపజిల్లా)లోని నేన్బాక (నేటిలేబాక గ్రామం) కు కూడ అట్టి పేరుండినట్లు శాసనమొకటి చెప్పింది. అచ్చట కేశవ పెరుమాళ్ళకొక అనాదికాలంనాటి గుడి ఉన్నది. అచ్చటిదే మరొక శాసనం ప్రకారం, ఆనాటి ఏలిక ప్రోద్బలంతో నెల్లూరుకు చెందిన వర్తకుడొకడు ఆ గుడికై కొన్ని కట్టడములు కట్టింపజేసి కేశవ దేవునికి కానుకగా ఇచ్చినట్లు తెలుస్తుంది. దాన్నిబట్టి ఆ రెండు విణ్ణగర్ల మధ్య ఆనాటి వర్తకుల రాకపోకలు బాగా జరిగినట్లు భావింపగలం. అంతేగాక నెల్లూరు-నెన్బాకలన్న ఆ రెండు విణ్ణగర్ల పేర్లలో ఉన్న పోలికకు తర్వాత వద్దాము.

మరే విణ్ణగర్కు లేనివిధంగా, నెల్లూరులోని విణ్ణగర్ అన్న పేరుకుముందు ఒక విశేషణమన్నట్లు "చిత్తరిమేఝి" అనే తగిలింపొకటుంది. చిత్తరి మేఝిని గూర్చి చాలా చెప్పవలసి ఉన్నది.

చిత్తిరిమేఝి అన్నది నాటి వారికి తెలియని ఒకానొక గుంపునకుండిన పేరు. వారి గుర్తు నాగలి - మేఝి (తమి) అంటే నాగలిమేడి. మేడి నాగలి నడకను నిర్దేశించే ఒక విభాగం. పణత లేక నాగటి దుంప (తెను)కు మేఝి (తమి) లేక మేడి (తెను) బిగించబడుతుంది. మేడిపాలు లేక 50150 అనే నెల్లూరు మాండలికానికిదే మూలం. ఆ మేఝి నిటారుగా పైకెత్తుకొని ఉంటుంది. అత్తికాయల గుత్తులు కూడ నేలచూపుగా వ్రేలాడక, మింటి చూపన్నట్లు పైకెత్తుకొని ఉంటాయి. కాబట్టే వాటిని మే(ఝి)డికాయలంటారు. అత్తివరం, అత్తిపట్టు వంటిపేర్లున్న ఊర్లన్నీ వాగో, వంకో లేక ఏటిగట్టుపై ఎత్తులో మేడపైనున్నట్లు వెలసిన ఊర్లే. ఎత్తైన అంతస్తుల భవంతిని మేడగా పిలుస్తారు. మేడు (పేడు, వేడు)తో ముగిసేపేర్లున్న ఊర్లన్నీ అత్తిపట్టుతో పోలికే.

ఆ చిత్తిరి మేఝి గుంపు గుంపంతా తరి సేద్యంలో చేయి తిరిగిన నిష్ణాతులు. సాటిలేని మేటివారు. తమిళ దేశంలో అంతా పరచుకొన్నట్లున్న వెళ్ళాళ కులంవారే. తొలినాటి చిత్తరిమేఝి గుంపుగా ఒక భావన ఉంది. వెళ్ళ (నీరు)+ఆళు (మనిషి) అంటే తరిసేద్యగాళ్ళని అన్వయం. తెనుగునాట, వారే రెడ్డిగా పిలువబడిరి. పాకనాటిలో అనాదికాలంలో వెళ్ళాళవారు కట్టి, కాలువలు తీసిన,

చెరువులందొకటి గిలకపాడన్న ఊరివద్ద ఉంది. నూర్లాది ఏండ్లు గడిచినా వారు కట్టిన ఆ పాత చెరువులు నేటికిన్నీ నిలిచి ఉన్నాయి. వాటి దిగువనుండే భూముల పైరు పచ్చలతో కన్నులపండుగగా తోస్తుందంటే నమ్మకమైన ఆ నీటి వనరులే కారణం. గిలకపాడు, (బోయల చెరువని పేరు) గట్టుపై ఉన్న శాసనంలో దోరపరెడ్డితోపాటు మరికొందరు రెడ్ల పేర్లున్నాయి. వారు సేలనాడు (నేటి సేలం) నుంచి దిగువ పొత్తపి సీమలందలి పలు స్థాయి పెత్తందార్లుగా కూడ తెలుస్తుంది. గిలకపాడు శాసనంలో కన్పించిన ఆరెడ్లందరూ వెళ్ళాళులుగా కూడ అందే చెప్పబడినారు. నెల్లూరుజిల్లా మల్లాం దేవాలయ శాసనాల్లోకూడ రెడ్డి-వెళ్ళాళ అభేద్యం ద్యోతకం.

చిత్తరి మేఝి గుంపు తమ వారి తాలూకు సామాజిక విషయములు వారే విచారించి తగినరీతిలో నిర్ణయించుకొనే అధికారం కలవారు. వారి తీర్పులపై ఎవ్వరికి, చివరకు రాజుకుకూడ అడ్డుచెప్పే అధికారం లేదంటే వారి న్యాయనిబద్ధత ఎంతటిదో తెలుస్తుంది. సారంగధర చరిత్రమన్న తెనుగు కావ్యంలో చిత్రాంగినోట వెలువడ్డ రాజో-రెడ్డో అన్నమాటనుబట్టి కూడ తీర్పులు చెప్పగలిగింది వారిద్దరేనని చెప్పక చెప్పడమే అవుతుంది. వారే రాజు అనుమతి పొందకుండానే భూమిని దానం చేయగల అధికారము కూడ ఉన్నవారు. అందుకనే వారిచ్చిన భూదాన శాసనాల్లో "ఇది చిత్తరిమేఝి" శాసనమని పేర్కొంటారు. కొన్ని సందర్భాలలో వారు ఊళ్ళకు ఊళ్ళే దానమిచ్చిన దాఖలాలున్నవి. ఒకానొక చిత్తరిమేఝి శాసనమైతే నాగలిపైననే చెక్కబడి ఉంది. ఆ శాసనమిప్పుడు మద్రాసు (ఎగ్మూరు) మ్యూజియంలో ఉంది.

నెల్లూరు రంగనాయకుల గుడి (ఉత్తరపు) గోడపై క్రీ.త. 1197 నాటిదొక చిత్తిరిమేఝి వారిచ్చిన దాన శాసనముంది. కానీ ఏలనో అందులో వారి లాంఛనమైన నాగలి చెక్కబడలేదు. 8 నాడులకు చెందిన చిత్తరిమేఝి వారు తాము భూమితల్లికి అనుగు పుత్రులమని చెప్పుకొన్నారు. ఇంకా బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులుకాక చతుర్థ (శూద్ర) వర్ణం వారిమని (గర్వంగా) చెప్పుకొన్నారు కూడా. ఆ పెద్దలంతా చిత్తరిమేఝి విణ్ణగర్ చేరువనే ఉన్న చిత్తరిమేఝి, (వారి) మణ్టపంలో కలసి కూర్చొని ఆ రంగస్వామి గుడిలో జరిగే పూజాది కార్యక్రమములను సమీక్షించి, వాటికొరకై 2200 "కుళి"ల నీర్నేలను తిరువిడైయాటమ్ (తిరువిడైయాట్టమ్) అంటే విష్ణ్వాలయానికి, తిరునాయత్తుకాణి అంటే శివాలయానికి దానమిచ్చిన భూమిగా సమర్పించి, దాని దిగువ కణ్ణనారాయణపుర (గండవరపు) దామిరట్టకుడి (దామిరెడ్డి), కేరుఖళ ఉరుప్పిరట్టకుడి, అల్లూరు ముప్పిరట్టకుడి, అల్లూరు ఐతమరట్టకుడి విరయూరిజియప నాయకుడు (మరికొన్ని పేర్లు చెరిగిపోయినవి) మొదలైనవారు చేవ్రాళ్ళుంచారు.

ఆ ఎనిమిది నాడుల్లో (కడప జిల్లాలోని) పొత్తపినాడు, చాగలనాడు (నెల్లూరు జిల్లాలోని) పేడైనాడు, పూంగినాడు (అదే పాకనాడు)లతో పాటు ఒక కడైసిజ్ఞనాడు ఇత్యాదులున్నవి. అంటే అహోబిలం దిగువనున్న చాగలమర్రి లగాయతు పెన్నగట్ల వెంబడి దాని మొగవరకున్న సీమలజనుల కావళ్ళికొణ్డ పెరుమాళ్‌పై గురి మెండుగా నుండినదని చెప్పగలము.

ఆ భూమి పుత్రులు సమావేశమయినది చిత్తరిమేఝి మణ్డపంలో. ఆ మణ్డపం నేటికిన్నీ నిలిచియే ఉన్నది. ఇప్పటి దాని పేరు "చిత్రకూటం." రంగస్వామిని, ఊరేగుటకై, తేరుపైకి తెచ్చేందుకనువైన ఎత్తైన మండపం వెనుకనే ఆ చిత్రకూట మణ్డపమున్నది. చిత్తిరిమేఝి గుంపువారి వితరణ సహాయంతో కట్టబడిన మణ్డపం కాబట్టే దానికాపేరు వచ్చిందని అనుకొనవచ్చు.

చిత్తరిమేఝి విణ్ణగర్ దొర (రంగయ్య) కు పలువురు దాతలు ఊర్లకు ఊర్లే దానాలిచ్చిరి. అందులో ఒకటి "తామరై మడువు" (నేటి దామరమడుగు). ఆ ఊరికామందు దినాల్లో "చిత్తిరిమేఝి నల్లూరు" అనెడి పేరు కూడా ఉండినదిగా తెలుస్తుంది. ఈ ఊరిలో కూడ "చిత్తరిమేఝి" అన్న తగిలింపు ఉన్నందున, ఆ ఊరు, భూమి తల్లి పుత్రులైన చతుర్థ కులంవారు వలసగా వచ్చి నెలకొన్న నెలవు లందొకటిగా తలంచవచ్చును.

మిగతా వలస గ్రామముల పేర్లలో కన్పించని ఆ తగిలింపు దామర మడుగుకే ఎందుకనే ప్రశ్న తలెత్తుతుంది. కానీ దానికి కారణముంది. దాని పేరు "నల్లూరు." ఆ పేరు "నెల్లూరు" అనే పేరుకు మరొకరూపం. ఈ నల్లూరు పెన్నకటువైపున్న నెల్లూరుకంటే వేరని చెప్పడమే ఆ తగిలింపు యొక్క ఉద్దేశ్యము. చిత్తిరిమేఝి విణ్ణగర్, చిత్తిరిమేఝి మణ్టపమ్, చిత్తిరిమేఝి నల్లూరులకు దాఖలాలన్నీ నెల్లూరు

రంగనాయకులస్వామి గుడి గోడలపై ఉలితో వ్రాయబడిన పలు శాసనాల్లో దొరికినవి. ఇంకా కాళహస్తీశ్వరుని గుడి గోడలపై దొరికిన మరొక శాసనంలో కూడ చిత్తిరిమేఝి గుంపు ప్రసక్తి ఒకటున్నది. ఆ గుంపువారు ఆ దేవుని పూజాధికములకేగాక ఆ స్వామికొక రథం తయారీకయ్యే ఖర్చుల క్రింద కొంత భూమిని దానంచేసిరి. ఈ శాసనాన్ని బట్టి చిత్తిరిమేఝి గుంపులకు శివకేశవ బేధం లేదని తెలియగలం. ఆ దానంచేసిన గుంపుకట్టు పుండివారుగా తెలుస్తుంది.

ముక్తాయింపుగా ఆ నాటి నెల్లూరుకు కూతవేటు దూరంలో ఉండిన రంగస్వామి గుడి పరిసర ప్రాంతమునకు తిరుపాఱ్కడల్ (శ్రీపాలకడలి) చిత్తరిమేఝి విణ్ణగర్ అన్న పేర్లుండినట్లు పలు శాసనాలవల్ల తెలుస్తుంది.

ఇక నెల్లూరన్న పేరుకు వద్దాం. ఈ పేరెలా పుట్టిందోనన్న సంగతిపై దఫదఫాలుగా చర్చించారు. అందరూ నెల్ లేక నల్ల (తమి) అన్నపదమే దానికి మూలమని తేల్చారు. కానీ 'నెల్' అనేమాటకే అసలు విషయం వదిలి పలు అన్వయాలు చెప్పారు. కొందరేమో 'నెల్' (తమి) అంటే 'మంచి'గా తీసుకొని నెల్లూరంటే మంచి లేక అందమైన ఊరన్నారు. మరికొందరు 'నెల్' (తమి) అంటే వరిధాన్యంగా తీసుకొని, వడ్లుపండే ఊరుకాబట్టి అది ధాన్యసంబంధమైన నెల్లూరైనదన్నారు. ఇంకాకొందరు నెల్లికాయ (మంచి ఉసిరికాయ) నెంచుకొన్నారు.

నెల్లూరు మూలస్థానేశ్వరునికి గుడిగోపురాలు లేని అనాదికాలంలో ఆ స్వామి లింగానికి నీడనిచ్చినది ఉసిరి (నెల్లి) చెట్టన్న పుక్కిటికథ ఒకటుంది. ఆ కథ నిజమే కావచ్చు. ఆ నెల్లిచెట్టుండిన ఊరుకాబట్టి నెల్లూరన్న పేరువచ్చిందనిరి.

నెల్లూరు అనే పేరు తమిళ పదమైన 'నెల్'నుండే వచ్చిందన్నమాట నిర్వివాదం. ఆ పదానికి వడ్లు, ఉసిరికాయతో ఉన్న సంబంధంపై తిరిగి చర్చ లేవనెత్తడం చర్వితచరణమౌతుంది. కాన వదలబడినది. నెల్లూరు జిల్లాలోనే దామానెల్లూరు, మంగానెల్లూరు (సూళూరుపేట మం॥), ఉత్తమ నెల్లూరు (వాకాదు మం॥), బుజబుజ నెల్లూరువంటి పేర్లున్న ఊర్లతోపాటు ఇతరత్రాకూడ తొండమనెల్లూరు (చెంగల్పట్టు జిల్లా) వంటివెన్నో దక్షిణ భారతదేశంలో ఉన్నవి. వాటితోపాటు నెలపల్లి, నెలవాయి (సూళ్ళూరుపేట మం॥) వంటి పేర్లకూ "నెల్" మూలమనే అంటారు. "నెల్‌వాయ్" అన్న పేరుతో ఊర్లు తమిళనాటంతా లెక్కకుమించినట్లు పరుచుకొని ఉన్నవి. వాయి, పల్లివంటి నామాంతములను గురించి చెప్పేముందు సెలయేరు, కొండవాగుల గురించి కొంత చెప్పవలసి ఉంది. పాలవాయ, చల్లపాయలను గురించి ఇంతకుముందే తిరుపాఱ్కడల్‌పై చర్చలో కొంత చెప్పియుంటిని. పాలేటి నీటితో సాగయ్యే పొలాల పులక నీరు తిరిగి తల్లి ఏట్లో పడవనికూడ తెలిపినాను. కొన్నాళ్ళపాటు పంటపొలంలో నిలిచినందున ఆ నీరు నిస్సారమవడమేకాక కలుషితమౌతాయి. కాబట్టే ఆ నిల్వనీటిని నోటపోసుకొంటే మింగుడు పడవు సరికదా పుక్కిలించడానికి కూడ పనికిరావు. వెంటనే ఉమిసివేయాల్సి ఉంటుంది. అందువల్లనే అట్టి నీటిని, పాలు, చల్లలుగాక, కఝి (తమి) లేక కలి (తెను)తో పోల్చి పిలిచారు.

నెల్లూరు ప్రాంతంలోని పల్లెవాసులందరికి కలి (Native vinegar) అనే ధాన్యామ్లము లేక సుక్తమును గురించి బాగా తెలుసు. అన్నము వార్చిన గంజిని పాతకలితో చేర్చి నిల్వ ఉంచితే పులిసి అంతా కలిగా తయారౌతుంది. కొన్ని కులములవారికి కలికుండ పూజనీయం. కొత్త ఇంట్లోకి ముమ్ముందుగా కలికుండనే తీసుకుపోయి ఆ కులమువారు నిలుపుతారు. అదొక ఆచారము.

కలి నోట్లో పోసికోలేనంత పుల్లగా ఉంటుంది. తమిళంలో "కఝి", తెలుగున 'కళి'గాను, మరాఠీలో 'కడి'గాను పలుకుబడి. పుల్లని ద్రవమే. కలోగంజో అన్న తెలుగు నానుడి మిగిలే ఉన్నది. గతిలేని వారి తిండికది సూచన. పాలేటి క్రింద సాగుబడి నుండి బయటపడిన పులక నీరు క్రమంగా కలసికొని క్రిందకు దిగుతూ అదొక 'కలి' వాగౌతుంది. పాలేరు, చల్లకాలవ కోవలో కల్లివారు (పులికాలవ) మూడవది కాగలదు. అట్టి కలివాగొకటి నెల్లూరు చెరువు నుంచి మొదలై కల్లూరుపల్లె, కలు(ను)పర్తి పాడులమధ్య సాగి క్రమంగా పెద్దదౌతూ నేటి పెనుబర్తి వరకూ సాగింది. దాని దారి మధ్యలో తగిలే కలివెలి పాలెం, ఆ కలి వాగు గట్టు పైదైనందునే దానికాపేరు వచ్చింది (కలి+వెలి+పాలెం). నెల్లూరుజిల్లా (విడవలూరు మం॥)లో పైడేటికి దక్షిణంగా 'కలివెలి దిబ్బ' పేరుతో మరొక (చిన్న) ఊరున్నది. ప్రకాశంజిల్లా (సింగరాయ కొండ మం॥)లో కలికి వాయిపేరుతో ఒక ఊరున్నది. కలివాగు మొగవద్దనున్న ఊరది.

వెలిగాణి అంటే మెరకపై సేద్యమన్నది అందరికి తెలిసిందే. కలివెలిపాలెం పేరులో కన్పించిన "వెలి" స్వభావం "నీటికందని మెరక"గా భావించతగును. నెల్లూరుజిల్లాలోనే వెలిచర్ల పేర రెండు గ్రామాలున్నవి. అవి రొంపిచెర్ల పేరటి ఊరుకు భిన్నము (వెలిదుక్కి - రొంపిదుక్కి) వెలిచెర్లను వెడిచెర్లగా కూడ ఒక పలుకుబడి ఉన్నది. వెళి (తమి) తెనుగువారి పలుకుబడిలో వెలి "వెడి" అయింది.

దిగువ తమిళనాట తిరునెల్వేలి ఒక జిల్లాకేంద్రం. ఈ పేరులో నెల్, వెలి అన్న పదాలు స్పష్టముగానున్నవి. ముందుచెప్పిన కలివెలి వంటి పేరే నెల్‌వెలి. కాకుంటే అది మంచినీటి ప్రవాహపు దరిపైనుండబట్టే ఆ పేరువచ్చింది.

తిరునెల్వేలి తామ్రపర్ణి నది గట్టున బాగా మెరకలో ఉన్నది. తామ్రపర్ణి నదికి రెండు రుతుపవనాల ప్రభావంవల్ల ఏడాది పొడవున అన్నట్లు రెండు విడతలుగా వరదలు వస్తాయి. ఈ విషయంలో దక్షిణ భారతంలో దానికదే సాటి. తిరునెల్వేలికి తొలినాటి పేరు మూజ్గిల్ కాదు. మూజ్గిల్ (తమి) అంటే వెదురు కాన ఆ ఊరిపేరు తెనుగునాట వెదురు పాకవంటిదనవచ్చును.

తిరునెల్వేలి వద్ద గట్టు పై నుండి నదిలోకి చూస్తూ లోతైన బావిలోకి చూచినట్లుంటుంది. అచ్చటనది వెడల్పుకూడ తక్కువ. వెదురు బొంగుతోపోలిక. ఆ నదిలో నీటి వరవడి ఎక్కువ కాబట్టి ఎవరూ లోతులోకి పోయి స్నానం చేయరు. ఒకరకంగా చెప్పాలంటే అది సూళూరుపేట చెంగాళమ్మ గుడివద్ద కాళంగి నదివలె మదిలో మెదుల్తుంది. తిరునెల్వేలి వరకు ఆ దగ్గరి కొండల నుండి సరాసరి దిగివచ్చిన కొండల నీరు స్వచ్ఛంగా స్ఫటికంవలె మెరుస్తుంటాయి. కాబట్టే నదిలో పడిన పావలారూక కూడ మెరుస్తూ కనిపిస్తుంది. సన్నది లేక నాజూకుదనంతో పాటు తళతళలీనే ఆ ఏరు దాని నీరు, ఈ రెండు లక్షణాలే అచ్చటి "నెల్" వాగుకు ప్రత్యేకం. ఆ నీరు పాలేటి నీటికంటే మిన్నైనందున ఆ మూడురకాల వాగులకంటే, ముందు నిలుస్తుంది.

నెల్లూరుజిల్లా వరదయ్యపాలెంకెగువగానున్న నెలవాయివద్ద కూడ పుత్తూరు కొండల నుండి దుమికి వచ్చెడి ఒక సొన కన్పిస్తుంది. అది కూడ తామ్రపర్ణిని పోలినదే.

దామానెల్లూరు ప్రక్కనుండి కూడ సన్నని కొండ వాగొకటి తరలి వచ్చి కాళంగి నదిలో పడుతుంది. అది దామెన త్రాటివలె సన్నని పొడవైన వాగు. దామణి (తమి) దామెన (తెను) ను పశువులను వరసగా నిలబెట్టి సామూహికంగా ఒకే త్రాటితో కట్టేందుకు ఉపయోగించెదరు. దాని పొడవుకు తగ్గట్లుగా గాక ఆ త్రాడు చాలా సన్నంగా ఉండును.

తామర తూడులోని సన్నని తంతువే సామ్యంగా 'దామి' అనే విశేషణం వచ్చిందని అనుకొనవచ్చు. అగుచో తామ్రపర్ణిలో కన్పించే "తామ్ర"కు "రాగి" లోహంతో సంబంధముండదు. ఈ పార్శ్వమునకు తర్వాత రాగలము.

తమిళనాడంతా తగిలే పదులీది నెల్‌వాయ్ పేరుతో తగిలే ప్రతి ఊరువద్ద శుద్ధ స్ఫటిక సంకాశమైన నీటితోనున్న సెలవాగులున్నట్లు మిత్రుని (స.వెం. రమేశ్) నుండి సమాచారమున్నది. సెలకట్టె లేక సగిలికొమ్మ అంటే ఏమాత్రం వంపు, చీలిక లేకుండా, నిటారుగా, అందునా చాలా త్వరగా పెరిగి పొడుచు కొచ్చినట్లుండే నదరైన రెమ్మ. సెలఏరైనా, సగలేరయినా అపుడే నేలపైకెదిగి వచ్చిన సన్నని జాలున్న వాగులు.

గండికోట సీమలోని నేటి లేబాకకు నెన్ పాకం అన్న పేరు శాసనాల్లో కన్పించిందని ముందే చెప్పాను. తెనుగు - తెలుగు, చాలా - చానా వంటి ఎన్నో పదాల్లో ల-నీల మధ్య మార్పు అందరికి తెలిసినదే. అంటే ఆ నెన్ పాకం కూడ నెల్ పాకమే. ఆ లెబాక ప్రక్కన కొండలనొరుసుకొంటూ చెయ్యేరుగా మారుపేరున్న బాహుదానది వడివడిగా నడుస్తూ చివరకు పెన్నలో పడుతుంది.

జొన్న, సజ్జ, కొర్రల వంటి ధాన్యపు కంకులతో పోలిస్తే వరి కంకి సన్ననిది. అంటే నాజూకైనది? ఆ నాజూకుదనాన్ని బట్టే "నెల్" అన్న పేరు వరిధాన్యమునకు దక్కినది. అది సాధించబడిన అర్థం. రూఢ్యర్థంకాదు.

బాగా పండిన నెల్లికాయను వెలుతురుకెదురుగా పెట్టి చూస్తే దానిలో గింజ కొంత స్పష్టంగా కన్పిస్తుంది. మరే కాయకాగుణము లేదు. ఆ స్ఫుటత్వాన్నిబట్టి ఆ ఉసిరికి నెల్లికాయన్న పేరు వచ్చింది. అది కూడ రూఢ్యర్థం కాదు.

---

**పలగాని గోపాల రెడ్డి**

# వందేళ్ల సాక్షి – పానుగంటి అపూర్వ సృష్టి

*– డా॥ దామెర వేంకట సూర్యారావు*

**కొం**దరు కథలు వ్రాసి గొప్ప కథకులనిపించుకొన్న వారున్నారు. కొందరు నవలలు వ్రాసి గుర్తింపు, గౌరవం పొందిన వారున్నారు. అలాగే కవులనిపించుకొని రాణకెక్కిన వారున్నారు. కాని వ్యాసం – అనే ప్రక్రియకు అపూర్వమైన సాహిత్య గౌరవం తెచ్చిపెట్టి – పాఠకులను విశేషంగా ఆకట్టుకొన్న రచయిత బహుశా పానుగంటి వారొక్కరే. "నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్య ప్రేమికుడంటారు," మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి.

అత్యంత ప్రతిభావంతుడుగా సమకాలంలో విశేషఖ్యాతిని ఆర్జించిన పానుగంటి లక్ష్మీనరసింహరావు పాఠకులనుంచి అపారమైన గౌరవాలు పొందినవారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒకస్థానం ఏర్పరచుకొన్న మహనీయుడు. ఆయన మహోన్నతుడైన నాటక కర్త. అనన్య వ్యాసకర్త. ఆయన రచనల్లో మౌలికత, వైవిధ్యం, గొప్ప శక్తి తత్పరత గోచరిస్తాయి.

పానుగంటి రచనా కాలం, జీవితకాలం చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంతో ముడిపడి ఉన్నాయి. ఆంగ్లం ద్వారా పాశ్చాత్యరీతులతో ఏర్పడిన సన్నిహితత్వం మూలాన భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో మాదిరిగానే ఆంధ్రదేశంలోనూ ఒక పునరుజ్జీవన స్ఫూర్తి మొగ్గతొడిగింది. కొత్త పద్ధతుల్లో విద్యావంతుడైన వర్గం నుండి అనేకులు రచయితలై విస్తృతంగా ప్రయోగాలు చేశారు. ఈ సందర్భంలో ఆనాడు దేశ స్వాతంత్ర్యం కోసం ముమ్మరంగా సాగుతుండిన మహోద్యమం నేపథ్యాన్ని కూడా గమనించవలసి ఉంటుంది. సమకాలీన స్థితిగతులను స్పష్టంగా, సమదృష్టితో అధ్యయనం చేసి సమీక్షించడం ద్వారా పానుగంటికి విశిష్ట ప్రాధాన్యం ఏర్పడింది.

పూర్వం ఉన్న భావాలకు, ఆవేశాలకు అతీతంగా ఆయన వ్యవహరించారు. చుట్టూ ఉన్న రొద మధ్య తన గంభీర స్వరాన్ని బిగ్గరగా వినిపిస్తూ, తన ఆలోచనలు నిర్భయంగా ప్రకటించారు. నాటక కర్తగా హాస్యస్రష్టగా, వ్యాసకర్తగా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. పానుగంటి వారు తెలుగు నాటక రంగానికి ఎన్నో మణి భూషణాలు సమర్పించారు. తెలుగు నాటకం భవిష్యత్తులో మరింతగా శోభిల్లడానికి ఆయన పునాది వేశారు. పానుగంటి ఎంతటి ఉన్నత శ్రేణి నాటక రచయిత అయినా ఆయన పేరు వినగానే సారస్వతలోకంలో నేటికీ గుర్తుకు వచ్చేవి *సాక్షి* వ్యాసాలే. అవి వారి అపూర్వ సృష్టి. *సాక్షి* మొదటి వ్యాసాన్ని 1913లో రాశారు. అదే సంవత్సరం *సువర్ణ లేఖ* పత్రికలో ఈ వ్యాసాలు ఒక సంవత్సరం పాటు ప్రకటించబడ్డాయి. ఆ తర్వాత 1920–22 మధ్య ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యాయి. ఎడ్సన్ ఆంగ్లంలో సృష్టించిన *స్పెక్టేటర్* వ్యాసాల నుండి వీరు ప్రేరణ పొందారు.

**సాక్షి సంఘం :**

*సాక్షి* సంఘాన్ని పానుగంటి కల్పించారు. ఇందులో అయిదుగురు సభ్యులు. సాక్షి కాక ఈ సంతానంలో జంఘాల శాస్త్రి, కాలాచార్యులు, వాణీదాసుడు, బొర్రయ్యశెట్టి సభ్యులు. సమావేశాలు, పత్రికాప్రకటనలు చూసే బాధ్యత సాక్షిది. జాంఘాల శాస్త్రి ఆరడుగుల ఎత్తు గలవాడు. కాలినడకనే దేశమంతా తిరిగినవాడు. అనేక సంస్థానాలను దర్శించి జమీందారులను చూచి వారివ్వని యెడల చెడమడా తిట్టిన వాడు. గంటల కొద్దీ ఉపన్యాసం ఇవ్వగల వాగ్ధారాధాటీకుడు. తారు కంటే నల్లనివాడు. అందవికారంగా ఉండే అతణ్ణి పెళ్ళి చేసుకోవడానికి ఏ కాంతా ముందుకు రాకపోయేసరికి బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. వాణీదాసుడు కవి. ఎడమ చెయ్యి వాటం వాడు. సోమరి, పరధ్యానం ఎక్కువ. నువ్వు గింజ మీద నూరుపద్యాలు చెప్పినట్టి దిట్ట. ఆపాదమస్తకం అసూయ గలవాడు. నాల్గవ వాడు బొర్రయ్య శెట్టి, వ్యాపారి కొంతకాలం క్రితం వ్యాపారం బాగా చేసి విశేష ధనం ఆర్జించినవాడు. ఒకప్పుడు సంపన్నుడైనా ఇప్పుడు మిగిలింది మాత్రం అనుభవం, తామహం. ఆయన అధ్యక్షుడు. సాక్షి సంఘం, సత్యపురంలో పోస్టాఫీసుకు ఎదురుగా ఉంటుంది.

ఎందుకీ *సాక్షి* ? ప్రత్యేక రాజకీయ దండనం మాత్రమే నేరాన్ని అణగదొక్కజాలదు. దీనికి తోడుగా 'సంఘశిక్షణ' కూడా ఉండాలి. అంటే నేరగాడితో ఎవరూ జోక్యం పెట్టుకోకపోవడం, అటువంటి సభలోకి రానీయకపోవడం, గౌరవించకుండా ఉండడం. "పది సంవత్సరాల కఠిన శిక్షకంటే పదిమంది సంఘంవల్ల నేరగాడని చేసిన అనాదరణ నేరాన్ని ఆపడంలో బలవత్తరం. రాజకీయ

దండనానికి అందని నేరాలను గురించి వెల్లడించడం సాక్షి సంఘం ఉద్దేశ్యం” అని వివరిస్తాడు పానుగంటి. సాక్షి వ్యాసాల్లో విషయ వైవిధ్యం ఆశ్చర్యం గొలుపుతుంది. సమాజంలోని ఏ విషయాన్నీ ఆయన విడిచి పెట్టలేదు. శాస్త్రాలు, మతాలు, వైరాగ్యం, సౌందర్యం, గ్రహణాలు, పాఠకజన మహాసభలు, తోలుబొమ్మలాటలు, ఆయుర్వేదం, ఆంగ్లవైద్యం, న్యాయస్థానాలు, పరభాషా వ్యామోహం. నాటక ప్రదర్శనలు, పశువుల సంత- ఇలా వేయి విషయాలు. పానుగంటి వారు ధృడమైన భావాలు ఉన్నవారు. ఆయన అభిరుచులు కూడా కచ్చితమైనవి. తన నాటకాల్లో గాని, వ్యాసాల్లో గాని పదుగురాడు మాటకు ఆయన తల ఒగ్గలేదు. తాను స్థిరంగా నిలబడే జన బాహుళ్యాన్ని తన అభిరుచులను ఆస్వాదించే స్థితికి తీసుకు రాగలిగారు.

**వచన రచనా శైలి :**

పానుగంటి వచన రచనా శైలి విలక్షణమైనది. సాంప్రదాయక వ్యాకరణ పరిధిలో ఆమోదయోగ్యమైన విన్యాస శైలిలో ఆధునికతను, వ్యావహారిక భాషలో సన్నిహితమైన పలుకుబడిని మేళవించి రచన చేశారు. “వచనమును వ్రాయు వానిని తీసి వేత సరుకుగా కుక్కమూతి పిందెగా తృణీకరించుట న్యాయమా? పద్యమున కవిత్వముండి వచనమున లేకుండునా? ఎచ్చట రసముండునో అచ్చటనే కవిత్వ మున్నది” అంటారు పానుగంటి వారు.

సాక్షి వ్యాసాల్లో వారి శైలి గుఱ్ఱంలా పరుగెత్తుతుంది.. రుచిగల శైలి. ఆయన ప్రయోగించిన పదాలు, పదబంధాలు, వాక్యాల దొంతరలు అపూర్వంగా ఉంటాయి. ఉపమాలంకారాలు, అలవోకగా జాలువారతాయి. ‘మండల మానినీ జన మహాసభలో స్త్రీలను వర్ణిస్తూ ‘చిగ మొగ్గలో కొన్ని, రవంత వికసించిన మొగ్గలు కొన్ని చెంప కొప్పుల వారు, కత్తిరింపుల వారు, ముంగురుల వారు, వాలు కన్నెల వన్నెలాడులు, గుండ్ర కన్నుల కోమలాంగులు, చింపిరి కనుల శీతంశుముఖులు, మెల్ల కన్నుల పల్లవ పాణులు …… ఇలా వర్ణిస్తూ “ఆడుది ఉన్న చోటనే అన్ని సౌరభములు, మగ వాడున్న చోటనేమున్నది? పొడుము వాసన, చుట్ట కంపు, సిగరెట్టు గొట్టు” అంటారు. సిల్లీ విషయాన్ని సీరియస్‌గా చెప్పడం ద్వారా, అవసరం లేని చోట గంభీరమైన పదాలు వాడడం ద్వారా ఉదాహరణల వర్షం కురిపించడం ద్వారా పానుగంటి వారు హాస్యాన్ని సృష్టిస్తారు. చారుడు లేని రాజ తంత్రమూ, సంధాన కర్త లేని సాని సరసము, పురోహితుడు లేని పెండ్లి, న్యాయవాది లేని వ్యాజ్యము, వైద్యుడు లేని మరణము, పొసగెడువాడు లేని పశువుల సంత లేదు అనడంలో రచయిత కొంటె తనం, హాస్య దృష్టీ అవగతమవుతాయి. ‘స్వభాష’ అనే వ్యాసంలో తెలుగు భాష ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ “మకరంద బిందు రస స్పందన సుందరమగు భాషయే – మహానంద కందోళ సందోహ సంధాన ముందిలమగు మాతృభాషయే – నమ్రతకు నమ్రత, కఠినతకు కఠినత, సరసతకు సరసత, వదులునకు వదులు, బిగువునకు బిగి, జారునకు జారు, మందతకు మందత – అన్ని వన్నెలు, అన్ని చిన్నెలు, అన్ని వగలు, అన్ని తళుకులు, అన్ని బెళుకులు, అన్ని హొయలు, అన్ని వ్యవహారములు కలిగిన భాష అనడంలో వారి శైలి గంగా ప్రవాహమే.

**సాక్షి – సంస్కరణ :**

తన సాక్షి వ్యాసాల ద్వారా పానుగంటి సంఘాన్ని జాగృతం చేయడానికి, సంస్కరించడానికి, ఉన్నతాభిరుచులు పొందడానికి దీక్షగా కృషి చేశారు. బ్రహ్మపదార్థం నుంచి బర్త్ – కంట్రోల్ దాకా వైవిధ్యం గల అంశాలను ఆయన స్పృశించారు. జంఘాల శాస్త్రి ద్వారా చాలా ఘాటైన అభిప్రాయాలు చెప్పించారు. నాటి సంఘంలో ఉన్న భావదాస్యం, ఆలోచనా రాహిత్యం, ఎదుర్కోవడంలో పానుగంటి విభిన్న స్థాయిలలో కృషి చేశారు. తన సమకాలికులలో అనేకుల మాదిరి పానుగంటి కూడా దేశభక్తుడు. స్వస్థాన వేష భాషాభిమాని. ఐతే దేశభక్త పేరుతో, ముసుగులో వాటిని అధోగతి పట్టిస్తున్న మాట కూడా ఆయన గమనించక పోలేదు. పాశ్చాత్య విధానాలను అంధానుకరణం చేసి అదే గొప్ప అనుకొనేవాళ్ళను ఆయన ఎండగట్టారు. వీరేశలింగం వ్యక్తుల మీద కంటె సమాజం అంతరాత్మపై తన కలం ఎక్కుపెడితే, పానుగంటి వ్యక్తుల లోపాల మీద దృష్టి నిలిపి వారిని సంఘ సంస్కరణలో ఉపకరణాలుగా వినియోగించుకొన్నాడు. సాక్షి వ్యాసాలు తెలుగు వారి జాతీయ సంపద.

---

డాక్టరు దామెర వేంకట సూర్యారావు
మధురానగర్, విశాఖపట్నం.
ఫోన్ : 9885188431

# సూరదాసుని గోలోకం

– కోడూరు పుల్లారెడ్డి

ప్రాచీన కాలం నుండి ఎందరో మహానుభావులైన కవులు కృష్ణభక్తి రసవాహినిలో ఓలలాడి కవితలు, గేయాలు, కథలు, గాథలు రచించి భారతీయ భక్తి సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. వారిలో యశోదాకృష్ణుల ముద్దు మురిపాల ముచ్చట, శ్యామ సుందరుని ఎడ రాధా గోపికల భవ్యప్రేమ, శ్రీకృష్ణుని మధురానగర ప్రస్థాన కాలంలో గోపికలు అనుభవించిన విరహవేదన (భ్రమర్ గీత్) 'సూరసాగర్'లో 'న భూతో న భవిష్యతి' అన్నట్లు మధురాతి మధురంగా గానం చేసిన వాగ్గేయ కవిరాజు సూరదాసు అగ్రగణ్యుడు. వాత్సల్య, శృంగార క్షేత్రాలలో ఆయన భావుకత అనితరసాధ్యం. ఈ రెండు క్షేత్రాలలో ఆయన ఇతర కవులెవరికీ ఏమీ మిగల్చలేదన్న సత్యం 'సూరసాగర్' చదివిన ప్రతి ఒక్కరికి నిలువెత్తున దర్శనమిస్తుంది.

హిందీ సాహితీ క్షేత్రంలో భక్తి మార్గాన్నవలంబించిన కవుల్లో రెండు మార్గాల వారున్నారు. మొదటిది 'నిర్గుణధార'. ఈ మార్గాన్ననుసరించిన కవుల్లో ముఖ్యులు – 1. కబీరు, 2. రవిదాసు, 3. ధర్మదాసు, 4. గురునానక్, 5. దాదూదయాల్, 6. సుందరదాసు, 7. మలూక్‌దాసు, 8. అక్షరఅనన్య. రెండవది 'సగుణధార'. ఇందులో మళ్ళీ రెండు శాఖలు. మొదటిది 'రామభక్తి శాఖ'. ఈ శాఖలోని లబ్ధప్రతిష్ఠిత కవులు – 1. గోస్వామి తులసీదాసు, 2. స్వామి అగ్రదాసు, 3. నాభాదాసు, 4. ప్రాణ్‌చంద్ చౌహాన్, 5. హృదయరామ్. రెండవది 'కృష్ణభక్తి శాఖ'. ఇందులో అగ్రగణ్యులు – 1. సూరదాసు, 2. కుంభనదాసు, 3. పరమానందదాసు, 4. కృష్ణదాసు, 5. ఛీత్‌స్వామి, 6. గోవిందస్వామి, 7. చతుర్భుజ్ దాసు, 8. నందదాసు, 9. మీరాబాయి, 10. రసఖాన్. మొదటి 8 మందిని 'అష్టఛాప్' అని పిలుస్తారు. అందులో అగ్రగణ్యుడు సూరదాసు. ఈ కృష్ణభక్తి శాఖకు ఆద్యుడు మహాప్రభు వల్లభాచార్యుడు. ఆయన క్రీ.శ. 1478 ప్రాంతాల జన్మించి క్రీ.శ. 1530 ప్రాంతాల గోలోకవాసి అయ్యారు. వీరి పూర్వీకులు తెలుగుదేశంలోని గోదావరి మండలం నుండి ఉత్తర హిందూస్థానానికి వలసపోయి అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తాను ఉపాసించే శ్రీకృష్ణుని జన్మస్థలంలోనే తన పీఠం స్థాపించారు. తన శిష్యుడు పూరన్‌మల్ ఖత్రి చేత క్రీ.శ. 1519 ప్రాంతాల గోవర్ధన పర్వతం మీద శ్రీనాథునికి పెద్ద మందిరం నిర్మింపజేశాడు. ఇది ఈనాటికీ ప్రసిద్ధ మందిరమే. శ్రీ రామానుజాచార్యుల వలెనే యీయన కూడ భారతదేశమంతటా విస్తృతంగా పర్యటించి, విద్వాంసులతో శాస్త్ర చర్చ చేసి కృష్ణభక్తి శాఖను ప్రచారం చేశారు. ఆచార్యులవారు క్రీ.శ.1520 ప్రాంతాల దక్షిణ దేశమందలి విద్యానగరానికి వచ్చి శాస్త్ర చర్చలో అక్కడి పండితులను ఓడించి తన శుద్ధాద్వైత మత విశిష్టతను చాటి చెప్పాడు. సాహితీ సమరాంగణా సార్వభౌముడు పండిత పక్షపాతి శ్రీకృష్ణదేవరాయలు ఆచార్యులవారిని కనకాభిషేకం మొదలగు వానిచే ఘనంగా సన్మానించాడు.

శంకరాచార్యుల సిద్ధాంతం నిర్గుణ భక్తి పరమైన అద్వైతం. వల్లభాచార్యుల ఆలోచనాసరళి దీనికి వ్యతిరేకమైన సగుణ భక్తిధారలోని కృష్ణభక్తి శాఖ. తన కృష్ణభక్తి శాఖ సిద్ధాంతాన్ని ఆచార్యులవారు యీ విధంగా వివరించారు : "భగవదనుగ్రహం కలిగినపుడే, 'జీవప్రవృత్తి' ప్రేమాశ్రయ భక్తి వైపు మరలడానికి అవకాశం కలుగుతుంది. ఈ ప్రవృత్తి జీవులు మూడు రకాలు. 1. పుష్టి జీవులు : భగవదనుగ్రహమే ఆధారంగా ఆయన నిత్యలీలల్లో మమేకం కావాలనుకునేవారు. 2. మర్యాద జీవులు : వేదవిధుల నాచరిస్తూ స్వర్గాదిలోకాల ప్రాప్తి వాంఛించేవారు. 3. ప్రవాహ జీవులు : సంసారలంపటంలో పడి సంసార సుఖమే స్వర్గమనుకునేవారు. దివ్యగుణ సంపన్నుడైన శ్రీకృష్ణుడే పరబ్రహ్మ, పురుషోత్తముడు. పరిపూర్ణ ఆనందావిర్భావం కలుగజేసే శక్తి పురుషోత్తమునిలోనే ఉంది. ఇదే శ్రేష్ఠమైన రూపు. పురుషోత్తముడైన శ్రీకృష్ణుని లీలలు శాశ్వతం. ఆయన తన భక్తులకోసం 'వ్యాపీవైకుంఠం'లో (ఇది శ్రీ మహా విష్ణువు వైకుంఠం పైన ఉందట) వివిధ క్రీడలలో మునిగి తేలుతూ ఉంటాడు. ఈ వ్యాపీ వైకుంఠంలో 'గోలోకం' ఒక భాగం. అందులో నిత్యనూతనంగా ప్రవహించే యమునానది, దివ్యాలంకార శోభితమై విరాజిల్లే బృందావనం, శాద్వల విలసిత మంజుతర నికుంజాలు – అన్నీ ఉన్నాయి. భగవంతుని యీ నిరంతర లీలా సృష్టిలో ప్రవేశించగలగడమే జీవుని ఉత్తమ గతి.

ఆచార్యులవారు తన యీ సిద్ధాంతాన్ని 'పుష్టి మార్గ' మన్నారు. ఆయన తన సిద్ధాంతం పునాదిగా రచించిన గ్రంథాలు - 1. పూర్వమీమాంస భాష్యం. ఇందులో చాలా కొద్దిభాగం మాత్రమే నేడు లభ్యం. 2. ఉత్తర మీమాంస భాష్యం. ఇందులో చివరి ఒకటిన్నర అధ్యాయాలు ఆచార్యుల వారి పుత్రుడు గోసాయి విఠ్ఠలదాసు రచించి పూర్తి చేశాడు. 3. శ్రీమద్భాగవత సూక్ష్మటీక, సుబోధిని టీక. సూక్ష్మటీక పూర్తిగా అలభ్యం. సుబోధిని టీకలో కూడ కొంచెం మాత్రమే లభ్యం. 4. తత్వనీతి నిబంధ్ 5. పదహారు చిన్న చిన్న ప్రకరణాల గ్రంథం.

భక్తి సాధనకు అవసరమైన 'శ్రద్ధ' విభాగాన్ని ప్రక్కకు నెట్టి కేవలం 'ప్రేమ' మార్గాన్నే స్వీకరించడం కృష్ణభక్తి శాఖలోని వైచిత్రి. కృష్ణభక్తి శాఖ సంప్రదాయంలో శ్యామసుందరుని సేవించి కైవల్యం పొందడానికి ఆచరించే ఉపాసనా పద్ధతిలో రాగ, భోగ, విలాసాలకు అవసరమైన చక్కని వస్తు సామాగ్రి ప్రదర్శనకు ప్రాధాన్యం ఉంది. ఉత్తరాన మీరాబాయి శ్రీకృష్ణుని, దక్షిణాన గోదాదేవి శ్రీ మహావిష్ణువును భర్తలుగా ఎన్నుకొని మనుగడ సాగించడం, భక్తి పారవశ్యంతోనే అయినా అది రాగ, భోగ, విలాసాల సంసేవనోపాసనా మార్గంలో జరిగిందే! గోదాదేవి చరిత్ర వల్లభాచార్యుల వారి కంటే ముందుది. బహుశ ఈమె కూడ ఆచార్యులవారు కృష్ణభక్తి శాఖకు మార్గదర్శకుడు కావడానికి స్ఫూర్తినిచ్చి ఉండవచ్చు.

సూరదాసు క్రీ.శ. 1483 ప్రాంతాల్లో ఢిల్లీ, మధురల మధ్య ఉండే 'సీహీ' అనే గ్రామంలో జన్మించినప్పటికీ ఆగ్రా, మధురల మధ్య ఉండే 'గౌఘాట్' అనే గ్రామంలో సాధుజీవనం సాగిస్తూ ఉండేవాడు. ఆయన భార్యాబిడ్డలు ఆయన కళ్ళముందే చనిపోవడం ఆయన సర్వసంగ పరిత్యాగానికొక కారణమంటారు హిందీసాహిత్య చరిత్రకారులు. మహాప్రభు వల్లభాచార్యులవారు ఒకసారి 'గౌఘాట్' గ్రామాన్ని పావనం చేశారు. ఆ సందర్భంలో సూరదాసు ఆచార్యులవారి వద్దకు వెళ్ళి ఆనాటి గ్రామీణ 'వ్రజభాష'లో తాను రచించిన ఒక గీతాన్ని శ్రావ్యంగా పాడి వినిపించాడు. ఆచార్యులవారు సూరదాసు మానసంలోని భక్తి తత్పరతను, గీతంలోని రసనిర్భరత గమనించి మెచ్చుకోలుగా భాగవత కథలను యుక్తియుక్తంగా గానం చేయమని ఆదేశించారు. క్రీ.శ. 1523లో సూరదాసు ఆచార్యులవారి శిష్యరికం స్వీకరించక ముందే గోవర్ధన పర్వతంపై కట్టించిన మందిరంలో 'కీర్తనసేవ' బాధ్యత సూరదాసుకు అప్పగించారు ఆచార్యులవారు. ఆనాటి నుండి సూరదాసు ఆ మందిరంలోనే ఉంటూ శ్రీనాథుని సేవలో నిమగ్నమై ఉండేవాడని ఆయన రచించిన 'సూరసారావళి' అనే గ్రంథం స్పష్టంగా వివరిస్తోంది. క్రీ.శ. 1563 ప్రాంతాల్లో గోవర్ధన పర్వత సానువుల్లో గల 'పారసోలి'గ్రామంలో వల్లభాచార్యుల తర్వాత పీఠాధిపత్యం వహించిన ఆయన పుత్రుడు గోసాయి విఠ్ఠలనాథ్ సమక్షంలో సూరదాసు తనువు చాలించాడు. ఈయనే కృష్ణభక్తి శాఖలో పైన పేర్కొన్న మొదటి 8 మందికి 'అష్టఛాప్' అనే పేరు నిర్ణయించిన వారు. సూరదాసు అంధుడు. 'సూరసాగర్' తరచి చూస్తే అందులో అనితరసాధ్యమైన అద్భుత ప్రకృతి వర్ణనలున్నాయనే సత్యం విదితమవుతుంది. జాత్యంధులకు ఇది సాధ్యంకాని పని. అందువల్ల మధ్యకాలంలో ఎప్పుడో, ఏ కారణం వల్లో సూరదాసుకు అంధత్వం ప్రాప్తించి ఉంటుందనిపిస్తుంది. చిత్రమేమిటంటే అంధుడైన సూరదాసు తన మనోనేత్రంతో బాలకృష్ణ సౌందర్యలీలా విలాసాన్ని దర్శించగలగడం. ఆ అనుభూతి పారవశ్యంతో బాలకృష్ణుని శైశవోత్సవాన్ని మధురాతి మధురంగా తనివితీరా వర్ణించగలగడం!

*'సూరసాగర్'లోని యశోద బాలకృష్ణుల మధుర వాత్సల్య సాహితిని రేఖామాత్రంగా పరిశీలిద్దాం.*

1.(i)మూడు నెలల శ్యాం కదలికలను యశోద గమనించి పొంగిపోతూ వుంది.

**మహరి ముదిత్ ఉల్‌టాఇ కై ముఖ్ చూమన్ లాగీ ।.....యహ్ సుఖ్ సుని ఆఈ సబై సూరజ్ బలిహారీ ॥**

(యశోద ఆనందంతో బాలకృష్ణుని వెల్లికల త్రిప్పి ముద్దు పెట్టుకుంటూ వుంది. "నేనీరోజు సౌభాగ్యవతినయ్యాను. నా చిన్నిబిడ్డ మూడున్నర నెలల వాడయ్యాడు. అయినప్పటికి తనంతకు తానే తొడలు ఎత్తి తిరగబడుతున్నాడు. యీ సంతోష సమయంలో ఉత్సవం చేస్తాను." ఈ సంతోష విషయాన్ని మిగిలిన వ్రజ గోపికలందరకు తెలిపింది. అందరూ వచ్చారు. సూరదాసు కూడ మీ సంతోషంలో తన్ను తాను అర్పణ చేసుకుంటున్నాడు.)

(ii) కవిత్రయంలో మూడవవాడు ప్రబంధ పరమేశ్వర బిరుదాంకితుడు ఎఱ్ఱాప్రెగ్గడ తన 'హరివంశం' కావ్యంలో ఇదే సన్నివేశాన్ని యిలా వర్ణిస్తున్నాడు.

**శా॥నోరం జేతులు రెండు గ్రుక్కుకొనుచు న్మోమెల్ల భాష్పాంజన**
**స్మేరంబై తిలకింప నేడ్చుచు బొరిన్ మీ జేతులం గన్ను లిం**
**పారం దోయుచు లేవజూచి పిరుదొయ్యన్ మీది కల్లార్చుచున్**
**శ్రీరమ్యాంఘ్రి యుగంబు గింజు కొనుచుం జెల్వంబు రెట్టింపగాన్.**

తా॥ రెండు చేతులను నోటిలో గ్రుక్కు కుంటూ ముఖం కన్నీట కలిసిన కాటుకతో దీపిస్తుండగా వెక్కివెక్కి ఏడుస్తూ, కన్నులు నులుముకుంటూ పిరుదులను పైకి కదిలిస్తూ లేవడానికి ప్రయత్నం చేస్తూ తన అందమైన పాదాలను గుంజుకుంటూ అందం ద్విగిణీకృతం అవుతుండగా...

సందర్భం ఒకటే. మహాకవులిద్దరూ శ్యామ్ శైశవ క్రీడలను మనోహరంగా చిత్రించారు. ఎఱ్ఱాప్రెగ్గడ (క్రీ.శ. 1280-1364), సూరదాసు (క్రీ.శ. 1483-1563) కంటే 200 సం॥లు పూర్వంవాడు.

2. (i) యశోద శ్యాంను ఊయలలో పరుండబెట్టి ఊపుతూ జోలపాట పాడుతూ తన్మయత్వం చెందుతూ వుంది.

**సాల్నా స్యామ్ ఝులావతి జననీ।**

**అతి అనురాగ్ పరస్పర్ గావతి ప్రఫులిత్ మగన్ హోతి నంద్ ఘర్నీ ....**

**సూర్దాస్ ప్రభు ముదిత్ జసోదా పూరన్ భఈ పురాతన్ కర్నీ ॥**

(యశోద అత్యంత ప్రేమపూర్వకంగా తనలోతాను పాడుకుంటూ శ్యాంను ఊయలలో ఊపుతూ సంతోషంలో మునిగివుంది. అపుడు చంటి కృష్ణుడేమో ఉత్సాహంగా సారిసారికి తన భుజాలు కదిలిస్తున్నాడు. అపుడు యశోద శ్యాంను ఒడిలోకి తీసుకుంది.)

(ii) శ్రీమదాంధ్ర మహాభాగవత కర్త పోతనామాత్యుడు (క్రీ.శ.1400-1470) కూడ యిదే సన్నివేశాన్ని - ఊయలలో ఊపడం - తెలుగు భాగవతంలో వర్ణిస్తున్నాడు. గమనించండి.

యశోద 'చిన్ని మగవానిని' కన్నదని విని చూడడానికి గోపభామలు బయలుదేరారు. చిన్ని మగవాడనడములోనే వుంది పోతన్న పదప్రయోగంలోని గొప్పదనం. బయలుదేరిన గొల్లభామలు ఎలా వున్నారో పోతన్నగారి రసికత్వము ఉట్టిపడే వర్ణన చూడండి.

పెద్ద పిరుదులతోను, సన్నని నడుములతోను, బిగుతైన గట్టి చనుగవతోను, విస్ఫారిత నయనాలతోను, లక్ష్మీదేవి కూడ కళవళపడే వదన వర్చస్సుతోను, తుమ్మెదల వంటి నల్లని వెండ్రుకల భారంతోను ఒప్పే గోపకాంతలు మందగమనంతో బాలగోపాలుని దర్శించడానికి యశోద యింటికి బయలుదేరినారు. అలా ఏతెంచిన గొల్లభామలు చిన్నికృష్ణుని తలకు నూనె అంటి, పసుపు పూసి స్నానం చేయించి, శ్రీరామరక్షయని కొంచెం నీరు చుట్టూ చల్లి, పాపడిని ఉయ్యాలలో పరుండబెట్టి దీవించి జోలపాట పాడుతున్నారు.

**క. జోజోకమల దళేక్షణ / జోజో మృగరాజ మధ్య, జోజో కృష్ణా**
**జోజో పల్లవకరపద / జోజో పూర్ణేందు వదన జోజోయనుచున్**

'జోజో అచ్యుతానంద జోజో ముకుంద' అనే అన్నమయ్యపాట ఎంత ప్రసిద్ధి చెందిందో పద్యాలలో యిది అంతవాసికెక్కింది. తెలుగు తల్లులెంతమందో దీన్ని తమ బిడ్డలను నిద్రబుచ్చడానికి పాడేవారు. జోజో అంటూ జోకొడుతూ మధ్య మధ్య శ్రీకృష్ణుని అవయవ శోభను ఉటంకించడం ఈ జోలపాట పద్యం ప్రత్యేకత.

సందర్భమొకటే. శ్రీకృష్ణుని నిద్రబుచ్చుటం. ఇరువురు మహాకవులు భక్తి నింపారగ వర్ణించారు.

*3. కన్నయ్య తొందరగా ఎదిగి తనను అమ్మా అని పిలవాలని తపిస్తున్నది యశోద. ఈ మాతృభావాన్ని సూరదాసు ఎంతో మధురంగా చిత్రిస్తాడు యీ గీతంలో.*

**నాన్హరియా గోపాల్ లాల్ తూ బేగి బడా కిన్ హోహి!....సూర్దాస్**
**జసుమతి తా సుత్ హిత్ మన్ అభిలాష్ బఢావై।**

("నా చిన్ని గోపాల సుందరా! నీవు తొందరగా ఎందుకు పెద్దవాడివి కావడం లేదో నాకు తెలియడం లేదు. దరహాస చంద్రికలు ఉట్టిపడుతూ వుండగా నీవెప్పుడు నన్ను అమ్మా! అని పిలుస్తావయ్యా? నా మానసోద్వేగ భారం నన్ను నిలువనీయడం లేదు. ఆ భగవంతుడు నా చిన్నిమోహనుడు యీ ప్రాంగణంలో బుడిబుడి నడకలు వేయడానికి ఎప్పుడు అనుగ్రహిస్తాడో? బాలకృష్ణుడు బలరాముడితో పాటు అంతులేని ఆనందంతో ఆడుకోవడం నా కన్నులతో తనివితీరా చూచి తరించాలి. నా చిన్నికృష్ణుడు ఆకలిగొన్నాడన్న భావనతో నేను క్షణక్షణం పాలు తాపడానికి ఆనందంతో పిలవాలనిపిస్తుందెందుకో?" శంకర, బ్రహ్మ, సనకాది మునిజనుల మనస్సులలోనికి రాని ఎన్నో మధురభావనలతో యశోద తన మనస్సులో బాలకృష్ణుని యెడ తీరని కోరికలు పెంచుకొంటూ వుంది.)

*4. తనివితీరని ఆరాటంతో ఆ తల్లి యశోద ఇంకా ఇలా అనుకుంటూ ఉంది :*

**జసుమతి మన్ అభిలాష కరై! ....స్యామ్ అకేలే అంగన్ ఛాండే ఆపు గఈ కఛు కాజై ఘరై।**

("నా బిడ్డ దోగాడడం మానేసి ఎప్పుడు భూమి మీద రెండు కాళ్లపై తప్పటడుగులు వేస్తాడో? వాని పాలపండ్లను ఎప్పుడు చూస్తానో? వచ్చీరాని ఊరించే మాటలెప్పుడు వెలువడతాయో? వ్రజరాజును (నందుని) బాబా! అని ఎప్పుడు పిలుస్తాడో? ముసిముసి నవ్వులు ఒలకబోస్తూ నన్ను ఎప్పుడు అమ్మా! అని మొరాయిస్తాడో? నా చీరకొంగు పట్టుకొని లాగుతూ నాకిది కావాలి, నాకది కావాలి అని ఎప్పుడు హఠం చేస్తాడో? అన్నప్రాసన చేసే రోజు ఎప్పుడు వస్తుందో? తన చేత్తో స్వయంగా అన్నం ముద్ద నోట్లో పెట్టుకొనే

శుభ సమయం ఎప్పుడు వస్తుందో? నవ్వుతూ నాతో ఎప్పుడు మాటలాడతాడో? ఈ భావోద్వేగాన్నుంచి నాకెప్పుడు విముక్తి కలిగిస్తాడో?")

*5. 'నన్ను అమ్మా అని ఎప్పుడు పిలుస్తాడో, నా చిన్నినాయన నా చీరకొంగు పట్టుకొని లాగుతూ నాకిదికావాలి, నాకదికావాలి అని ఎప్పుడు హఠం చేస్తాడో? కదా!' అన్న యశోద కోరికను మనోహరమైన ఉపాలంభనతో తీరుస్తున్నాడు శ్యామసుందరుడు. తనకు రొట్టె, వెన్న కావాలని, పాలు వద్దని ఎంత లౌక్యంగా చెబుతున్నాడో చూడండి బాలకృష్ణుడు.*

**మైయా కబహిం బఢైగీ చోటీ।...సూరజ్ చిరజీవౌ దోఉ భైయ్యా హరి హలధర్ కీ జోటీ।**

("అమ్మా! నా జడ ఎప్పుడు పెద్దదవుతుంది? నేను పాలు చాలాకాలం నుండే తాగుతున్నాను కదా! అయినా నా జడ చిన్నదిగానే ఉంది. నీవేమో నా జడ కూడా అన్న బలరాం జడ అంత పొడుగ్గా, లావుగా అవుతుందని అంటుంటావు. పైగా స్నానం చేయించేటప్పుడు, నా జడ పాములాగా భూమ్మీదికి వ్రేలాడుతుందని అనే దానివి. కానీ అదేదీ జరగలేదు. బహుశ దీనికి కారణం నీవు నాకు ఇన్నాళ్ళూ సారంలేని పాలు తాపడమేననుకుంటాను. నాకు వెన్న, రొట్టె, యివ్వనే ఇవ్వవు.")

5. నీటిలో కనుపించే చందమామను చూచి శ్యాం అంటున్నాడు. "అమ్మా! బయట వుండే చంద్రున్నైతే ఎగిరి పట్టుకోగలను. నీటిలోనేమో దగ్గర కనుపిస్తాడు. కాని నీరు కదిలేసరికి మిణుకు మిణుకు మంటూ దొరకడంలేదు. ఏం చేయాలి? నీవు కాదన్నా సరే నేను చంద్రుడిని పొందితీరాలి."

**లై లై మోహన్ చందా లై।.... సూర్ స్యామ్ బిరుఝూనే సోఏ లిఏ లగాఇ ఛతియా మహతారీ ॥**

("కన్నయ్యా! నీటిలోని చందమామ కావాలని మొండిపట్టు పడుతున్నావు కదా! అందుకని నేను అతడిని ఒక యుక్తితో – ఒక పక్షిని ఆకాశమండపంలోకి పంపి – పట్టుక తెప్పించి యీ బిందెలో దాచాను. చేతులతో చంద్రుడిని వెలుపలకు తీసుకొని నీ మనసుకు నచ్చినట్లు ఆడుకో. ఇంతచిన్న విషయానికెందుకు ఇంత మొరాయిస్తావు" అంది యశోద.)

(శ్యాం బిందెలో చెయ్యిపెట్టి చూచాడు. చంద్రుడు దొరకలేదు. యశోదతో పేచీ పెట్టుకున్నాడు. అపుడు యశోద "శ్యాం! నీవు బిందెలో చెయ్యిపెట్టి వెతుకుతూంటే చందమామ నీ నేత్రకమలాలు, సూర్యకుండలాలతో ప్రకాశించే నీ ముఖమండలం వీక్షించి భయపడి నీ శరణుజొచ్చినాను, నన్ను పట్టుకోవద్దని బ్రతిమాలుతూ దొంగలా పాతాళానికి పారిపోయాడని" అంది. ఈ మాటలు వింటూ శ్యాం మసలుతూ నిద్రలోకి జారుకున్నాడు. అపుడు యశోద శ్యాంను ప్రేమారగ గుండెలకు హత్తుకుందని సూరదాసు అంటున్నాడు.)

విశేషం : శ్రీరామచంద్రుడు కూడా చందమామ కావాలని మారాము చేస్తే అద్దంలో చూపిస్తే అద్దాన్ని సంచిలో వేసుకొని ఊరట చెందాడు. ఇక్కడేమో శ్యాం పైనుండే తెచ్చుకోగలను, నీటిలో దాన్ని ఎలా తెచ్చుకోగలనంటున్నాడు. అంటే శ్రీరామచంద్రుని కోరికకు బాలకృష్ణుని కోరిక వ్యతిరేకంగ ఉందన్నమాట. సూరదాసు బాలకృష్ణుని లీలలు వర్ణించడంలో అఖండుడని ముందే చెప్పుకున్నాము. ఇందుకిది ఒక మంచి ఉదాహరణ.

*6. శ్యామసుందరుడు, సుబలుడు, బలరాముడు, శ్రీదాములతో వివిధములైన ఆటలు ఆడుతున్నాడు. అందులో పరుగుపందెం ఒకటి. అప్పుడు బలరాముడు "శ్యామ్! యీ ఆట నీవు ఆడవద్దు. కాలికి దెబ్బ తగలవచ్చు" అని అన్నాడు. శ్యామ్ "నాకు పరుగెత్తడం బాగా తెలుసు. నా కాళ్ళలో శక్తి బాగా వుంది. చూడు శ్రీదామునితో పోటీ పడతాను" అని అన్నాడు. శ్రీదాముడు పోటీకి సరే అన్నాడు. ఇద్దరూ పరుగు లంకించుకున్నారు. శ్యామ్ ముందు శ్రీదాముడు వెనక పరుగెడుతున్నారు. శ్రీదాముడు హుంకరిస్తూ శ్యామ్‌ను దాటి వెళ్ళాడు. అప్పుడు శ్యామ్ "నేను కావాలనే నిలబడి పోయాను. లేకపోతే నీవేమిటి, నన్ను వెనకేయడమేమిటి?" అంటాడు.*

**సఖా కహత్ హైం స్యామ్ ఖిసానే। ....సూర్ స్యామ్ పుఠి చలే రోఇ కై జననీ పూఛతి ధాఈ।**

(శ్రీదాముడన్నాడు "శ్యామా! నీవు ఓటమివల్ల సిగ్గు పడుతున్నావు. నీవే మిడిసిపడ్డావు. అయినా ముందుకు పోలేక ఆగిపోయి నామీద కోపపడతావెందుకు?" అప్పుడు బలరాముడు మధ్యలో కలుగజేసుకొని "వీనికి తల్లి, తండ్రి లేరు. అందువల్ల గెలుపు, ఓటములు తెలియవు. ప్రత్యర్థులను తప్పుపట్టడం మాత్రం తెలుసు. ఓడిపోయి కూడ స్నేహితులతో జగడమాడతాడు" అని అంటూ శ్యామ్‌ని ఇంటికి పంపాడు. శ్యామ్ ఏడుస్తూ ఇంటికి వెళతాడు. ఏడుస్తూ వచ్చే శ్రీకృష్ణుని చూచి యశోద పరుగిడుతూ వచ్చి విషయం ఏమిటని బాలకృష్ణుని ఆత్రుతగా అడుగుతుంది.)

*7. బాలకృష్ణునికి బలరామునిపై కోపం తగ్గలేదు. బలరాముడు తనను దూషించిన విధం తల్లి యశోదతో వెక్కివెక్కి ఏడ్చి ఏకరువు పెడుతున్నాడు.*

**మైయా మోహిం దాఉ బహుత్ ఖిజాయౌ...సూర్ స్యామ్ మోహిఁ గోధన్ కీ సౌఁ హౌఁ మాతా తూ పూత్॥**

("అమ్మా! అన్న బలరాముడు నన్ను చాలా విసిగించాడు. మీరు నన్ను కొని పెంచుకొంటున్నారట. యశోదమ్మ నిన్నెప్పుడు కనింది? అన్నాడు ఈ అవమానం వల్ల నేను ఆడుకోవడానిక్కూడా వెళ్ళడం లేదు. ఇంకా – నీ తల్లెవరు? నీ తండ్రెవరు? యశోదానందులు ఇద్దరూ గౌరవర్ణ శరీరులు. మరి నీ శరీరం శ్యామవర్ణం ఎందుకయ్యింది? అని అన్నాడు. ఇది విని మిగతా వాళ్ళందరూ చిటికెలు వేసి నవ్వుతూ ఎగతాళి చేస్తూ నన్ను ఏడిపిస్తున్నారు. నీవేమో నన్నే నిందిస్తావు. బలరాముని ఏమీ అనవు" అని కోపంతో చిమచిమలాడుతున్న శ్యామసుందరుని యశోద ప్రసన్నవదనంతో చూసి అందిలా : "చూడు తండ్రీ! బలరాముడు ఒఠ్ఠి అబద్ధాల కోరు. పుట్టుకతోనే ధూర్తుడు. నాయనా శ్యామసుందరా! మన గోధనం మీద ఒట్టు వేసి చెబుతున్నాను. నేను నిజంగా నీ తల్లినే! నీవు నా బంగారు కొండవే!")

*8. తల్లి అనునయం చాలక కాబోలు! చిన్ని కృష్ణయ్య అన్న బలరాముని మీద యింకా ఫిర్యాదు చేస్తున్నాడు.*

**ఖేలన్ అబ్ మేరీ జాఇ బలైయా...సూర్ నంద్ బలరామహిఁ ధిరయౌ తబ్ మన్ హరష్ కన్హయా॥**

("అన్న బలరాముడు ఎప్పుడైనా నేను మిగతా పిల్లలతో ఆడుకోవడం చూశాడంటే నన్ను విసిగించడమే కాదు, ఇంకా యిలా అంటాడు : నీ తల్లిదండ్రులు దేవకీ, వసుదేవులు. యశోదానందులు వాళ్ళకు డబ్బిచ్చి నిన్ను కొని ఎన్నో కష్టనష్టాలకోర్చి పెంచారు. అందువల్ల నీవు యశోదానందులను అమ్మా, నాన్నా అని అంటున్నావు, అంటూ అందరూ నన్నీవిధంగా బాధిస్తున్నారు. అప్పుడేమో నాకు కోపం వచ్చి అన్న దగ్గర నుండి దూరం వెళుతుంటాను." ఇదంతా వెనకాల్నే వుండి వినే నందుడు బాలకృష్ణుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. బలరాముని ఛీత్కారం చేస్తే బాలకృష్ణుడు మనసులో సంతోషించాడని అంటున్నాడు సూర్‌దాస్.)

*9. కన్నయ్యను పిలుస్తున్నది యశోద. "శ్యామా! చాలా ఆలస్యమైంది. ఇంతవరకు ఎక్కడ ఆడుకుంటున్నావు? నీవెపుడు బయలుదేరి వెళ్ళావయ్యా? బాబా నీవు లేకుండా భోంచేయరు కదా? తొందరగా రా మరి." ఈ పిలుపు వింటూనే బాలకృష్ణుడు తల్లి దగ్గరకు వచ్చాడు. యశోద చిన్నకృష్ణుని కాళ్ళు కడిగింది. తడి తుడిచింది. ఇద్దరు కొడుకులు – బలరాముడు కూడా – నందునితోపాటు భోంచేయడానికి వచ్చారు. శ్యాం నందుని ఒళ్ళో కూర్చొని భోజనం చేస్తున్నాడు.*

**జేవత్ స్యామ్ నంద్ కీ కనియా।.... భోజన్ కరి నంద్ అచమన్ లీన్హౌ మాంగత్ సూర్ జుఠనియా॥**

(పెరుగంటే ఎంతో ఇష్టం కనబరచే శ్యామసుందరునికి ఆరోజు అక్కడున్న రకరకాల ఖాద్యపదార్థాలు, కూరలు అన్నీ కూడా నోరూరిస్తున్నాయి. కొంచెం తింటాడు. కొంచెం కింద పడేస్తాడు. మనోహరమైన అందానికి ప్రతి రూపమైన ఘనశ్యాముడు మిఠాయి, పెరుగు, వెన్న మొత్తం కలగలుపుకొని తన నోట్లో వేసుకుంటాడు. తను తింటూ నందుని నోట్లో కూడా పెడుతున్నాడు. యశోద దీనినంతా చూస్తూ పులకించిపోతూ ఉంది. అద్భుతమైన యీ సన్నివేశాన్ని వర్ణించడం ఎవరి తరం? యశోదానందులు అనుభవించే యీ లోకోత్తరానందం త్రిభువనాల్లో ఎవరికీ లభ్యం కాదు. భోజనానంతరం నందుడు చేయి కడుక్కుంటూ నోరు పుక్కిలిస్తున్నాడు. మిగిలిన ఆ ఎంగిలి మెతుకులు తనకు ప్రసాదించమని వేడుకుంటున్నాడు సూరదాసు.)

*10.(i) బాలకృష్ణుడు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. గొల్లభామలందరూ యశోదతో చిన్నికృష్ణునిపై ఫిర్యాదు చేస్తున్నారు. అందులో ఒక భామ అంటూ ఉంది :*

**సావరేహిం బర్‌జతి క్యోఁ జు నహీ।...తా పర్ సూర్ బఛురువని ఢీలత్ బన్ బన్ ఫిరతిఁ బహీ।**

("ప్రతిదినం నీ ముద్దుల తనయుడు మా ఇంట్లో వెన్న తింటాడు. పాలు క్రింద ఒలకబోస్తాడు. పెరుగు ఒళ్ళంతా పులుముకుంటాడు. మా పిల్లలపైన మజ్జిగ చిలకరిస్తాడు. వాటిని ఎంత ఎత్తులో దాచినా కనిపెట్టగలుగుతాడు. ఈ దుష్కృత్యాలన్నీ చేసి మళ్ళీ ఆవుదూడల పలుపుతాళ్ళు తప్పించి పరుగెత్తిపోతాడు. అతడు చేసే ఆగడాలతో మేము ఇంత కష్టపడుతూ ఉంటే నీవు అతడిని అదుపులో పెట్టవెందుకు?")

(ii) మహాకవి ఎఱ్ఱన తన 'హరివంశము' కావ్యంలో ఇదే సందర్భాన్ని వర్ణిస్తున్నాడు. గమనించండి.

సీ. **కడవలపాలు సగము గలయంద్రావి**
**నీళులు దెచ్చి యన్నిటను నినుచుఁ**
**బెరు గంతయును గ్రోలి పిదప బానలయందు**
**సంపూర్ణముగఁ బ్రాచిచల్ల లునుచు**
**నేతులు గొనిపోయి నెఱయ నిప్పులఁబోసి**
**పెనుమంట లొండొండఁ దనరఁ జేయుఁ**
**బెరువులో బాలును బెరువు వెన్నను వెన్న**
**జల్లను జల్ల యాజ్యంబును గలపు.**

తే.గీ. **దలుగులూడ్చి పెయ్యలనెల్లఁ దల్లిచన్ను**
**గుడువ విడుచు గొన్నిటి నలుగడలఁ దోలు**
**నుఱక దామెన కొయ్యలు పెఱికి పాఱ**
**వైచుఁ గావళ్ళ యుట్లను వ్రచ్చి త్రెంచు.**

తా॥ కడవల్లోని సగం పాలను త్రాగి వాటిని నీళ్ళతో నింపుతాడు. పెరుగంతా త్రాగి బానల్లో పాచిపోయిన మజ్జిగ పోస్తాడు. నేతులను నిప్పుల్లో పోసి పెద్ద మంటలను రగుల జేస్తాడు. పాలు, పెరుగు, వెన్నలను నేతిలో కలుపుతాడు. ఆవు పెయ్యదూడ తలుగులను విప్పి కొన్నిటిని తల్లి పొదుగు దగ్గరకు, మరికొన్నింటిని నాలుగువైపులకు తోలుతాడు. నిష్కారణంగా దామెన కొయ్యలను పెరికి పారవేస్తాడు. కావళ్ళను, ఉట్లను త్రెంచి వేస్తాడు.

గోప భామలు బాలకృష్ణుని దుడుకు చేష్టలవల్ల తమకు కలిగిన కష్టనష్టాలు యశోదకు ఏకరువు పెడుతున్నారు.

"పది కడవల నేయి, పెరుగు, పాలు త్రాగి కడవలన్ని బోరిగల వేశాడు. యాభై బానల వెన్న ఉట్లపై ఉంచితే జాగ్రత్తగా దించి పూర్తిగ తిని బానలు పగుల గొట్టినాడు. ఇక్కడ ఉండి చెడిపోవడం కంటే యీ పల్లెకు చిచ్చుపెట్టి ఎక్కడికైనా వెళ్ళి బ్రతకడం మంచిది. పాయసము, కూరలు, అన్నము పడుచుభామలకు పంచిపెట్టి భాండములన్నీ పగులగొట్టాడు. పెయ్యలను పాలు త్రాగటానికి వదలినాడు. యవపిండి, పంచదార కలిపిన తినుబండారాన్ని బానలో వుంచి, యింటి మూలలో దాచిపెడితే అదంత తిన్నాడు. ఒక పుట్టి వెన్న శుభ్రపరచి భద్రపరిస్తే అంతా ఒక్కడే మ్రింగినాడు. ఇటువంటి బాలుడు ఎక్కడైనా వుంటాడా?" ఆఖరుగ అందరూ కలిసి శ్యాంపై యశోదకు ఫిర్యాదు చేస్తున్నారు.

క. **ఎక్కడి కేనియుఁ బోయెద / మిక్కష్టపుఁబాటుపడఁగ నేమోర్వము నీ**
**చొక్కపుఁగొడుకఁను నీవును/నొక్కతలై ప్రుక్కుమాని యుండుఁడు నెమ్మిన్.**

తా॥ ఈ కష్టాలు మేము పడలేము. ఎక్కడికైనా వెళ్ళిపోతాము. నీ సొగసుగాడు కొడుకు, నీవు ఇద్దరూ ఆనందంగా, ప్రేమ మీర కష్టపడకుండ సుఖంగా ఉండండి.

(iii) శ్రీమద్భాగవత కర్త మహాకవి బమ్మెర పోతనామాత్యుడు గోపభామలు బాలకృష్ణునిపై చేసిన ఫిర్యాదులను వర్ణించిన తీరిది.

మత్తకోకిల:**పుట్టి పుట్టదు నేఁడు దొంగిలబోయి మా యిలు సొచ్చి తా**
**నుట్టి యందక తోలుఁ బీటలు నొక్కప్రో విడి యెక్కి చే**
**వెట్టఁజాలక కుండక్రిం దొక పెద్ద తూటొనరించి మీ**
**పట్టి మీఁగడ పాలు చేరలఁ త్రావెఁ దలోదరీ!**

తా॥ పుట్టీ పుట్టగానే నీ కుమారుడు మా యింటిలో దొంగతనానికి వచ్చి ఉట్టి అందనందువల్ల రోలుపై పీటలు ఒకదాని మీద ఒకటి పేర్చి ఎక్కి కూడ చెయ్యి అందనందువల్ల కుండ క్రింద ఒక పెద్ద రంధ్రము చేసి మీగడ పాలు పుడిసిలబట్టి త్రాగినాడు. మరి కొందరు గోపభామలు బాలకృష్ణుని ఆగడాలను ఏకరువుపెట్టిన విధమిది.

"ఒక ఇంటికి వెళ్ళి నీ సుతుడు మీగడ, పెరుగు త్రాగి కొంచెం ఆ యింటి కోడలి మూతికి పులిమినాడు. అత్త అది చూచి కోడలు దొంగని దండించింది. ఒకరి ఇంట్లో కడవలలో గల నెయ్యి త్రాగి ఖాళీ కడవలు వేరొకరి ఇంటిలో తీసికెళ్ళి పెట్టగా రెండు కుటుంబాలకు పెద్ద పోరు జరిగింది నీ పుత్రుని కొంటెతనం వల్ల. నాకంటే వేలుపు లెవ్వరనుచు నవ్వి గోడలకున్న మా దేవుని బొమ్మలపై ఉమ్మేశాడు నీ దుడుకు కొడుకు. తన చేతిలోని బంతి తప్పిపోయిందన్న నెపముతో పరుగు పరుగున మా ఇంటి వెనుకకు వచ్చి స్నానమాడే మా బిడ్డబట్టలు ఎత్తుకొని పోయాడు. ఇది నీ అల్లరి కుమారునికి తగునా? కొడుకులు కలుగలేదని ఒక సతి వగస్తూ వుంటే తనను మగనిగా గైకొన్న యెడల కొడుకులు కలిగెదరని పైబడినాడు నీ మదనగోపాల కుమారుడు. ఇవి శిశువులు చేసే పనేనా? నా మగడు ఇంటి నుండి వెళ్ళడం చూచి ఏకాంతంగ వచ్చి నీ సరసుడైన కుమారుడు నా పొందు కోరినాడు. ప్రపంచంలో ఇట్లా కోరే శిశువులెవరైనా వుంటారా? నిశ్చింతగ నిద్ర పోతుండగ నాబిడ్డ జుట్టు లేగదూడ తోకకు చిత్రంగా కట్టి వీధిలోకి తోలాడు. నీకొడుకు రాచబిడ్డ అయినంత మాత్రాన యీ రచ్చ చేయడం న్యాయంగా వుందా? ఒక గోపిక నిద్రిస్తూ వుంటే, ఆమె నిండుగ కట్టుకున్న చీరను విప్పి, రహస్యంగా తేలుతో కరిపించగా భయంతో పరిగెడితే నీ చిలిపి కృష్ణుడు నవ్వడం న్యాయంగా వుందా?"

సీ. **కలకంఠి! మా వాడ గరితల మెల్ల నీ**
**పట్టి రాగలఁడని పాలు పెరుగు**
**లిండ్ల లోపల నిడి యే మెల్ల దన ద్రోవ**
**చూచుచో నెప్పుడు చొచ్చినాడొ**
**తలుపులు ముద్రలు తాళంబులును పెట్టి**
**యున్న చందంబున నున్న వరయ**
**నొక యింటిలోఁబాడు, నొక యింటిలోఁ నాడు**
**నొక యింటిలోఁ నవ్వు నొకటఁదిట్టు**

ఆ.వె. **నొకట వెక్కిరించు నొక్కకచో మృగ**
**పక్షి ఘోషణములు పరగ జేయు**
**నిట్లు చేసి వెనుక నెక్కడ బోవునో**
**కానరాదు రిత్తకడవ లుండు.**

తా॥ మావాడలోని స్త్రీలందరము నీ కుమారుడు రాగలడని పాలు పెరుగు ఇండ్లలోపల భద్రంగ వుంచి, అతడు ఎప్పుడొస్తాడోనని కాపలా కాస్తూ వుంటే, తలుపులకు తాళాలు వేసివున్నా ఒక ఇంట్లో పాట, మరొక ఇంట్లో ఆట, ఇంకొక యింట్లో నవ్వు, వేరొక ఇంట్లో తిట్లు, మరోచోట వెక్కిరింత, వేరొకచోట

జంతువుల పక్షుల శబ్దాలు కలుగజేస్తూ ఎక్కడికి వెళ్తాడో కానరాడు. ఖాళీ కడవలు మాత్రం ఇండ్లలో వుంటాయి.

**క. ఓ యమ్మ! నీ కుమారుడు / మా యిండ్లను, బాలుపెరుగు మననీడమ్మా,**
**పోయెద మెక్కడ కైనను, / మాయన్నల, సురభులాన మంజులవాణీ!**

తా॥ ఇరుగుపొరుగు గోపెమ్మలు బాలకృష్ణుడు తమ ఇండ్లలో పాలు, పెరుగు అంతా కాజేస్తున్నాడని తమ పుట్టిండ్లపైన ('అన్న' పదానికి 'తండ్రి' అనే అర్థం కూడా ఉన్నందున పుట్టిండ్లు అనడమైంది), తమ పవిత్ర సంపదైన గోవులపైన ఒట్టుపెట్టుకొని వారికి మరెక్కడికైనా వెళ్ళడం తప్ప మార్గాంతరంలేదని మెత్తని మాటలతో సరిపుచ్చే యశోదకు ఫిర్యాదు చేస్తున్నారు.

విశేషం : ముగ్గురు మహాకవులు ఒకే సన్నివేశాన్ని వివిధ కోణాలలో తమ అసమాన కవితానైపుణ్యంతో మనోహరంగా వర్ణించారు.

*11.* (i) *ఆరోపణలు విన్న తర్వాత కూడ యశోద వారి మాటలు నమ్మదు. గోపభామలు తన ముద్దు కృష్ణునిపై లేనిపోనివి కల్పించి చెబుతున్నారని అంటున్నది.*

**అబ్ యే ఝూటహు బోలత్ లోగ్।...సుర్దాస్ ప్రభు నైంకు న బర్జొ మన్ మైం మహరి బిచారి।**

("మీరంతా అబద్ధాలాడడం కూడా నేర్చారన్న మాట! ఇప్పుడిప్పుడే ఐదు సంవత్సరాలు నిండిన నా చిన్నికృష్ణుడు దొంగతనం ఎప్పుడు, ఎట్లా నేర్చుకున్నాడు? నోటి శుద్ధిలేని మీరంతా ఈ ఫిర్యాదు ముసుగులో నా బిడ్డ మోహన ముఖారవిందాన్ని తనివిదీరా వీక్షించాలనే వ్యామోహంతో వస్తున్నారు. నిర్దోషి అయిన నా బిడ్డను దోషిగా చిత్రీకరిస్తున్న మిమ్మల్ని ఆ భగవంతుడే తగిన విధంగా శిక్షిస్తాడు. ఆలోచిస్తే చిన్ని కృష్ణుని చేతికి ఉట్టి ఎట్లా అందుతుంది? అంత శక్తి పసివానికి ఎక్కడి నుండి వచ్చింది.")

(అప్పుడు ఒక గోపవధువు యిలా బదులిచ్చింది : "కృష్ణుడు రోటిపైన ఒక పీటపెట్టి దానిపైకి తన సఖునొకని ఎక్కించి ఉట్టిలోని వస్తువులు అందుకుంటాడు. నేను చెప్పే మాటలపైన నీకు నమ్మకం లేకపోతే నీవే స్వయంగా వచ్చి నీ కళ్ళతో చూడు తెలుస్తుంది. కాస్తంత ఆలోచించినా అవగతమవుతుంది. ఇంత జరుగుతున్నా నీవేమో కృష్ణుని బొత్తిగా మందలించడమే లేదు.")

*యశోద అంతులేని పుత్ర వాత్సల్యంతో కొడుకును వెనకేసుకొస్తూ గోపికలను నిందిస్తూ ఉంది :*

**మేరా గోపాల్ తనక్ సౌ కహా కరి జానై దధి కీ చోరీ।... సూర్‌దాస్ జసుదా కొ నందన్ జో కఛు కరై సో థోరీ।**

("నా చిన్ని గోపాలుడు వట్టి అమాయకుడు. వెన్న దొంగిలించడం నా కన్నయ్యకేం తెలుసు? ఏయ్ భామలూ! చేతులు తిప్పుకుంటూ మహా వస్తున్నారు. మీ నాలుకలనెందుకు అదుపులో ఉంచుకోరు? నా బిడ్డ ఎప్పుడు పైకెక్కి ఉట్టి పైనున్న మీ వెన్న తిన్నాడు? మీ పెరుగు కుండలు ఎప్పుడు పగులగొట్టాడు? మా ఇంట్లో ఏది కావాలన్నా అన్నీ కుండల నిండుగా ఉన్నాయి. అయినా రుచి చూడడానికైనా వ్రేలు పెట్టడే!" ఈ మాటలు వినగానే వ్రజభామలు ముఖాలు ముడుచుకొని "యశోదకు తన ముద్దుల కొడుకు మాటే వేదవాక్యం" అని గొణుక్కుంటూ వెళ్ళి పోయారు.)

(గోపికలందరూ నిష్క్రమించగానే యశోద తన మనసులోని మాట కృష్ణునితో "నాయనా! మన ఇంట్లో లేనివేమిటి? అక్కడ క్రొత్తగా ఉన్నవేమిటి? బజార్లవెంట పెరుగమ్ముకొనే ఈ భామలు సిగ్గువిడిచి నిన్నూ, నన్నూ ఎంతెంత మాటలన్నారు! నా ఆభిజాత్యం దెబ్బతినింది. మనసుకు కష్టం వేసింది. నీ సంగడికాండ్రను తోడు తెచ్చుకొని మన ఇంటి ప్రాంగణంలోనే ఆడుకో" అంది. బిడ్డ తప్పు చేసినా తల్లి మనస్సు ప్రేమతో అటువైపే మళ్ళడం అసహజమేమీ కాదు. కానీ యశోద గొల్లభామలెవ్వరూ సమాధాన మివ్వలేని ప్రశ్నల వర్షం కురిపించి వాళ్ళను తరిమేసి తన బిడ్డను కాచుకొన్న తీరు వాత్సల్యశుద్ధికి పరాకాష్ఠ.)

(ii) బమ్మెర పోతనామాత్యుడు యిదే సన్నివేశాన్ని ఇలా వర్ణిస్తున్నాడు.

**కం॥ చన్ను విడిచి చన డిట్టిట్టు/నెన్నడు బొరిగిండ్ల త్రోవ తెలియఁగడు నేఁడుం**
**గన్నులు తెఱవని మా యీ / చిన్ని కుమారుని రవ్వ సేయం దగునే.**

తా॥ నా కుమారుడు నా చన్ను విడిచి అటుయిటు వెళ్ళడు, పొరిగిండ్లకు త్రోవ ఎరుగడు. నేటికీ కన్నులు తెరవని నా ఈ చిన్న కుమారుని రవ్వసేయ తగునే!

ఇద్దరు మహాకవులు యశోద శ్రీకృష్ణుని వెనకేసుకవస్తున్న విధానాన్ని సుందరంగా వర్ణించారు.

12. (i) బాలకృష్ణుడు మన్ను తింటూ వుంటే తాను ప్రత్యక్షంగ చూశానని ఒక గోపాలకుడు యశోదకు ఫిర్యాదు చేస్తున్నాడు.

**మో దేఖత్ జసుమతి తేరో ఢోటా అబహీ మాటీ ఖాఈ ।... సూర్ కహై జసుమతి ముఖ్ మూందౌ బలి గఈ సారంగపానీ ॥**

(ఒక గోపబాలకుడు యశోదతో "అమ్మా! బాలకృష్ణుడు నేను చూస్తుండగనే యిప్పుడే మన్ను తిన్నాడ"ని అన్నాడు. ఆ వార్త వింటూనే యశోద క్రోధంతో వెళ్ళి శ్యాంను చెయ్యిపట్టుకొని లాక్కొచ్చింది. ఆమె ఒక చేత్తో శ్యాం భుజాన్ని గట్టిగా పట్టుకొని రెండోచేతిలోకి

బెత్తం తీసుకుంది. "కన్నయ్యా! తక్షణం బెత్తంతో బాదుతాను. తొందరగా నోట్లోని మట్టిని బయటకు కక్కేస్తావా లేదా? చెప్పు"మంది. శ్యాం "అమ్మా! ఈ గోప బాలకులందరూ నీ ముందు అబద్ధాలు చెబుతున్నారు. నేను నిజం చెప్పినా నమ్మవు. చూడు. నా నోరు తెరచి చూపిస్తున్నా"నన్నాడు. యశోదకపుడు శ్యాం నోటిలోపల సమస్త బ్రహ్మాండం – సముద్రాలు, సుమేరు మొదలగు పర్వతశ్రేణులు, నదులు, ఘోరారణ్యాలు – కనుపించింది. ఆమె యీ అద్భుత చిత్రం వీక్షించి ఆశ్చర్యంలో పడిపోయింది. ఆమె చేతిలోని బెత్తం ఎపుడు క్రింద పడిపోయిందీ ఆమెకు ఎఱుకేలేదు. ఆమె మనస్సు వ్యాకులంచెందింది. శ్యాం చేతిని వదలిపెట్టింది. యశోద తన్మయత్వంలో అంటూవుంది. "సారంగపాణీ (శ్యాం) నీ నోటికి మూతబెట్టు. నన్ను, నీకు సంపూర్ణంగా అర్పించుకుంటున్నాను.")

(ii)ఇదే సందర్భంలో పోతనామాత్యుడే మంటున్నాడో చూడండి. గోపబాలకుల ఫిర్యాదువిని శ్యాం యశోదతో అంటున్నాడు.

శా. **అమ్మా, మన్నుదినంగ నేశిశువునో, యాకొంటినో వెఱ్ఱినో,**
**నమ్మంజూడకు వీరి మాటలు మదిన్ననీవు కొట్టంగ వీ**
**రి మ్మారంబు ఘటించి చెప్పెదరు, కాదేనిన్ మదీ మాస్యగం**
**ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే.**

తా॥ శ్యాం "అమ్మా నేను పసివాణ్ణా, పిచ్చి సన్నాసినా, ఆకలిగొన్నానా, మన్ను తినడానికి. వీళ్ళ మాటలు నమ్మకు. వీరందరూ నన్ను నీతో దండింపజేయటానికి ఎత్తువేసినారు. కాదంటే నా నోటి వాసన చూడు తప్పయితే దండించమ"న్నాడు. నోరు తెరచి యశోదమ్మకు చూపాడు.

యశోద బాలకృష్ణుని తెరచిన నోరు చూచి విభ్రాంతికి లోనైన విధం పోతనామాత్యుని మాటలలో...

మ. **కలయో, వైష్ణవ మాయయో, యితర సంకల్పార్థమో, సత్యమో,**
**తలపన్నేరక యున్నదాననో యశోదాదేవి గానో పరస్థలమో,**
**బాలకుడెంత, యాతని ముఖస్థంబై, యజాండంబు ప్ర**
**జ్వలమై యుండుటకేమి హేతువొ, మహాశ్చర్యంబు చింతింపగన్.**

తా॥ శ్యాం నోటిలో ఆమె చూచిందేమిటి? సముద్ర, పర్వత, భూగోళ, సూర్యచంద్ర దిక్పాలురతో కూడుకున్న బ్రహ్మాండం. "ఇది నిజమని ఎట్లా నమ్మేది? కలకావచ్చు లేక వైష్ణవమాయ కావచ్చు, తాను యశోదా దేవిని కాకపోవచ్చు." ఇవన్నీ ఆమె మనస్సులో చెలరేగిన భావాలు.

పోతనామాత్యుని చిత్రణ వివరంగా ఉందనుకున్నా, ఇద్దరు చిత్రించింది ప్రతిభావంతంగా ఉంది.

*13.* (i) *బాలకృష్ణుని అల్లరితో యశోదకు వల్లమాలిన కోపం వచ్చింది. కొడుకును అదుపులో పెట్టడానికి శిక్షించాలని అనుకొన్నది ఆమె.*

**బాంధౌ ఆజు కౌన్ తోహిం ఛోరై....సూర్ స్యామ్ కౌ బహుత్ సతాయౌ చూక్ పరీ హమ్ తై యహ్ ఖోరై।**

("శ్యామా! ఈ రోజు నిన్ను కట్టి పడేస్తాను. ఎవరొచ్చి నిన్ను విడిపిస్తారో చూస్తాను. నీకు నేనంటే భయం, భక్తి రెండూ లేకుండా పోయాయి" అంటూ శ్యామ్‌ను తాడుతో రోటికి కట్టివేయడం మొదలు పెట్టింది. తల్లి చాల క్రోధంతో ఉన్నట్టు గమనించిన నల్లనయ్య ఎలాంటి ప్రతిఘటన చూపకుండా కట్టువడి సజల నేత్రాలతో దీనంగా తల్లి వంక చూస్తున్నాడు. ఈ వార్త తెలియగనే వ్రజభామలందరూ అక్కడికి పరుగు పరుగున వచ్చి కృష్ణుని వదలి పెట్టమని యశోదను ప్రార్థిస్తున్నారు. యశోద కృష్ణుని రోలుకు బంధించడం పూర్తిచేసి దండించడానికి చేతిలోని బెత్తం పరీక్షిస్తూ ఉంది. బెత్తం చూస్తూనే గోపికలందరూ కళావిహీనమైన వదనాలతో, వ్యాకుల చిత్తులై, పశ్చాత్తాపంతో అంటున్నారు : "వ్రజరాణీ యశోదా! ఇట్లా చేయడం నీకు న్యాయం కాదు. కొంచెం పెరుగు, వెన్నల కోసం కృష్ణుణ్ణి చాలా కష్టపెట్టావు. అమాయకత్వంతో కృష్ణునిపై ఆరోపణలు చేసి మేము పొరబాటు చేశాము.")

బాలకృష్ణుడు చేసే అల్లరితో నానా యాతనలు పడుతున్నామనే వ్రజభామలు యశోద అతడిని అదుపులో పెట్టడం లేదని అప్పుడు నిందించారు. అదుపులో వుంచడానికి శిక్ష అమలు చేస్తుంటే అదే భామలు అడ్డుపడ్డారు. ఏమిటీ భామల వింత మనస్తత్వం? యశోద బాలకృష్ణుని వెనకేసుకొస్తూ గోపికలతో – ఫిర్యాదు ముసుగులో శ్యామసుందరుని ముగ్ధ మనోహర రూపాన్ని తనివితీరా ఆస్వాదించాలనే వ్యామోహంలో ఆ భామలందరూ తన ఇంటికి వస్తున్నారు – అని అన్న మాటలు గమనార్హం. భామలు శ్రీకృష్ణ ముఖారవిందాన్ని అంత హృదయ రంజకంగా వర్ణించడం గమనిస్తే నిజంగానే బాలకృష్ణుని అతిలోక సుందర రూపాన్ని దర్శించే ఉత్సుకత తోనే ఫిర్యాదు ముసుగులో ఆనాడు తరలివచ్చారేమో? అనిపిస్తుంది.

*కృష్ణుని వదలి పెట్టమని వేడుకుంటున్న వ్రజభామలతో యశోద యిలా అంటున్నది :*

**జాహు చలీ అపనై అపనై ఘర్ ।....సూర్ స్యామ్ సౌం కహతి జసోద బడే నంద్ కే లాల్ ।**

("మీ అందరివల్లే వాడింత అల్లరిగా తయారయ్యాడు. ఆహా!

ఫిర్యాదు చేసి కూడా మళ్ళీ కట్లు విడిపించడానికి వచ్చారు. మా తండ్రిపై ఒట్టు వేసి చెబుతున్నా. వినండి! వీడినెంత మాత్రం నేను నమ్మనుగాక నమ్మను. మీ కాళ్ళు పట్టుకుంటాను. మీ యిండ్లకు వెళ్ళండి. నన్నడ్డగించవద్దు. నేను చేయబోయే తమాషా చూస్తారు గాక!" అంటూ కృష్ణుని వైపు తిరిగి అంది. "పెద్ద మొనగాడివై పోయావన్న మాట. అదేమిటో చూస్తాను" అంది.)

*తీరా యశోద కొడుకును రోలుకు కట్టివేయగా గోప భామల మనసులు విలవిలలాడి పోయాయి. శ్రీకృష్ణుని శిక్షించవద్దు, కట్లు విప్పమని యశోదను బ్రతిమాలుతున్నారు:*

**ముఖ్ ఛవి దేఖి హో నంద్ ఘరణి। .... బదన్ కాంతి బిలోకి సోభా సకై సూర్ న బర్ణి।**

("యశోదా! గమనించు. శ్యామసుందరుని ముఖారవింద శోభ శరద్రాత్రిలో అనంత కిరణాలతో ప్రకాశించే చంద్రకాంతిని గూడ అవహేళన చేస్తూ ఉంది. అతడి కళ్ళనుండి స్రవించే కన్నీటి బిందువులు త్రోవ తప్పి తిరిగి తిరిగి వివశయై అలసిపోయిన ముఖకమలంపై మనోహరంగా జాలు వారుతున్నాయి. మణులు పొదగబడిన శ్రీకృష్ణుని స్వర్ణకుండలాల రోచిస్సులు తన మిత్రమైన కమలాన్ని విడిపించడానికి చపలగతితో తిరిగే కమలబాంధవుడు దిగివచ్చినాడన్నట్లుగా ప్రకాశిస్తూ ఉన్నాయి. శ్రీకృష్ణుని నల్లని వెంట్రుకలు జతకట్టిన తుమ్మెద గుంపులన్నింటితో పోరాటపటిమలో ఉన్నట్లున్నాయి. (తుమ్మెదలన్ని గుమిగూడితే దట్టమైన నల్లనిరంగు సంతరించు కుంటాయి. శ్రీకృష్ణుని వెంద్రుకలు ఆ తుమ్మెదల గుంపుకంటే యింకా ఎక్కువ నల్లగా నిగనిగలాడు తున్నాయని అర్థం). ఇంత గొప్ప వర్చస్సు గల శ్రీకృష్ణుని రోట బంధించడం న్యాయం కాదు" అంటున్నారు గోపభామలు.)

గోపభామలు ఎంత అభ్యర్థించినా యశోద శ్యాంను బంధవిముక్తుని చేయడానికి అంగీకరించలేదు. అపుడు బలరాముడు తమ్మునికట్టు విప్పమని బ్రతిమాలుతున్నాడు.

**జశోదా కాన్హహు తై దధి ప్యారౌ। ....సూర్ స్యామ్ పర్ బలి బలి జైఐ జీవన్ ప్రాన్ హమారౌ॥**

("అమ్మా! శ్యాం కంటే నీకు పెరుగు ప్రియమా? చిలికే కవ్వం తీసి ప్రక్కనపెట్టు. చూడు! తమ్ముడు నీవంటే భయపడుతున్నాడు. నీవు పాలు పెరుగు, వెన్నల మీద ప్రేమ చూపుతున్నావు. అలాగే నేను తమ్ముని మీద ప్రేమానురాగాలు గలవాన్ని. తమ్ముని వాడిపోయిన చంద్రబింబ ముఖ కాంతి చూచి కూడ కాస్సేపు క్రోధం మరచిపోలేవా?" సూరదాసు అంటున్నాడు – బ్రహ్మ, సనకసనందనాది ఋషులు, శివుడు మొదలగువారిని ధ్యానించినా దొరకనివాడు (శ్యాం) వ్రజభూమిలో ఆవులను మేపుతున్నాడు. ఆయనకు మన మందరము అర్పించు కుందాము.)

ఐనా యశోద బలరాం అభ్యర్థనకు విలువ ఇవ్వలేదు. సరిగదా! సమాధానం చెబుతూ వుంది!

**జసోదా ఊఖల్ బాంధే స్యామ్।... సూర్ స్యామ్ ఊఖల్ సౌం బాంధే నిరఖహి బ్రజ్ కౌ బామ్॥**

(యశోద బాలకృష్ణుని రోటికి కట్టివేసి అలాగే బయట వదిలేసి నిజగృహ కృత్యములలో నిమగ్నమైంది. పెరుగు చిలుకుతూ ఆమె పేరుపేరునా తిడుతూ వదరుతూ వుంది. "వీడు యింటింటికి వెళ్ళి వెన్న దొంగిలిస్తూ తిరుగుతున్నాడు. ఆదేదో నా యింట్లో లేనట్లు. ఆ మాటకొస్తే నా ఇంట్లో షడ్రుచుల పదార్థాలన్నీ వున్నాయి. పైగా వ్రజబాలురను కొట్టి పరుగెత్తిపోతాడు. ఇదంతా నీకు తెలుసా బలరాం?" రోటికి బంధింపబడిన బాలకృష్ణుని గోపభామలందరూ కళ్ళప్పగించి చూస్తున్నారు.)

రోటికి బంధింపబడిన హరి నారదుని శాపంవల్ల ఎత్తైన చెట్ల రూపంలో వున్న కుబేరుని కుమారులు – యములార్జునులకు శాపవిమోచనం చేయాలని ఆలోచిస్తున్నాడు.

**తబహిం స్యామ్ ఇక్ బుద్ధి ఉపాఈ। .... సూర్ ధన్య బ్రజ్ జనమ్ వియౌ హరి ధరనీ కో ఆపదా నసాఈ॥**

(శ్యాం, తక్షణం ఒక ఉపాయం ఆలోచించాడు. గోప స్త్రీలందరూ తమతమ యిండ్లకు వెళ్ళిపోయారు. తల్లి యశోద ఇంటి పనులలో మునిగివుంది. అందువల్ల బాలకృష్ణుడు స్వయంగా మహావృక్ష రూపంలోనున్న యములార్జునుల దగ్గరకు చేరాడు. ఆ చెట్లను రోటితో బంధింపబడిన కృష్ణుడు తాకగనే ఆ రెండు చెట్ల ఆకులు గలగల కదలడం, భూమిపై పడిపోవడం జరిగింది. అపుడు శాపగ్రస్తులైన యములార్జునులు – కుబేరుని కుమారులు నలకూబరుడు, మణిగ్రీవుడు – నిజరూపం ధరించి చేతులు జోడించి కృష్ణుని స్తుతించారు. అపుడు శ్యాం తన చతుర్భుజ రూపంలో వారికి దర్శనమిచ్చాడు.)

యశోద ఉత్సుకత రేకెత్తించే యీ దృశ్యం చూచి దిగ్భ్రాంతి చెంది అంటూ వుంది.

**మోహన్ హౌ తుమ్ ఊపర్ వారీ।... సూరదాస్ స్వామీ కీ మహిమా కాపై జాతి బిచారీ॥**

(లీలావిహారి, శ్యామసుందరుని కౌగలించుకుంటూ ముఖాన్ని ముద్దుపెట్టుకుంటూ యశోద అంటూ వుంది. "మోహన్! నన్ను నేను నీకు సమర్పించుకుంటున్నాను. నిన్ను రోటికి ఎందుకు బంధించాను? నేను తల్లినేనా? ఈ చెట్లు చాల ఎత్తుగా వున్నాయి. వీటికి గాలి కూడ తగలలేదు. అటువంటపుడు ఇంత పెద్దచెట్లు

ఎలా విరిగిపడ్డాయబ్బా?" ఆమె ఈ విషయమే సుదీర్ఘంగా ఆలోచిస్తూ వుంది. సూరదాసు అంటున్నాడు – ఇది స్వామి మహిమ. దాన్ని ఎవరు తెలుసుకోగలరు?)

(ii) ఇదే సన్నివేశాన్ని ఎఱ్ఱన మహాకవి తన హరివంశం కావ్యంలో ఇలా వర్ణిస్తున్నాడు.

**శా॥ ఏలా? యిందును నందుఁ బాఱెదవు నీకే భ్రాంతియే వెన్నలుం ।**
**బాలుం బాలక! బాలఁ జేపె నిదె నాపాలిండ్లు పెన్ సోనలై**
**పా లొక్కుమ్మడిఁ గ్రమ్ముచున్నయవి నీభావంబునం దృప్తిగాఁ**
**గ్రోలం జాలవెఁ యింతవ ట్టకటఁ యాగోసేల చుట్టాలలోన్.**

తా॥ ఎక్కడెక్కడికో పరుగెడుతావు. వెన్న, పాలు చాలకనా! నా పాలిండ్లు పాలను చేపినాయి. ప్రవాహంగ పారుతున్నాయి. తృప్తిదీరత్రాగు. చుట్టాలలో ఈ గోల ఎందుకు?

**క॥ అని యెత్తుకొని యురంబునఁ/తనియఁగ నదిమికొని చన్ను తన్ముఖమునకున్**
**ఘనదుగ్ధపిచ్ఛిలమ్ముగ/మనమలరఁగ నిచ్చుటయుఁ గుమారుఁడు ప్రీతిన్.**

తా॥ యశోద బాలకృష్ణుని ఎత్తుకొని రొమ్ముకు అదుముకొని చన్ను నోటిలో పెట్టి మనస్సు అలరగ పాలు తృప్తిగ త్రాపింది. పాలు త్రాపిన తరువాత యశోద అంటూ వుంది. "నిన్ను విడిచిపెడితే ఎప్పటి వలె ఆగడములు చేస్తావు. నిన్ను కాచుకొనుట చాల కష్టమని" కొడుకును చేయి పట్టుకొని పెయ్యలను కట్టి పడవేసే తాడు తలుగు నొకదానిని తీసి బండి దగ్గర గల ఒక రోలును శ్యాం కడుపుకు తలుగుతో బంధించి అంటూ వుంది.

**క॥ కదలిన మొత్తుదు నెక్కడఁ/గదలెద వటు గఱుదులాఁడఁ గదలుమ యేఁజూ**
**చెద ననుచుఁ బోయి యిమ్ముల / ముదిత నిజకుటుంబకార్యములఁ దత్పరయై.**

తా॥ "కదలితే మొత్తుతాను కదులు చూస్తా" నంటూ కుటుంబ పనుల చూసుకొనుటకు వెళ్ళిపోయింది.

***యమళార్జున భంజనము:***

**సీ॥ ఉన్నంత నచ్యుతుం డుద్దామమగుతన**
**సత్యంబు గోపాల జాలమునకు**
**నెఱిగింపఁ దలఁచి యొక్కింత సేపునకు ని**
**జోదరంబున దామయుతనిబద్ధ**
**మగునులూఖలము రయం బెసఁగంగ నా**
**కర్షించి చనిమందగవని కెలని**
**జమిలిమద్దుల తోడ సంరంభమునఁగద**
**లించి తాఁదగులక లీల రెంటి.**

**తే॥ నడుము గడచి నీల్గుటయును బుడమి వగులఁ**
**బెల్లగిలి కూలెఁ దరువులు గొల్ల లెల్ల**
**గూడఁబడి రప్పు కొందఱు గోపసతులు**
**చూచి క్రమ్మఱఁ బాఱి యశోదతోడ.**

తా॥ అపుడు అచ్యుతుడు తనేమిటో గోపాలురకు తెలియ జెప్పదలచి తన కడుపుకు తలుగుతో కట్టిన రోలుతో రయమున కోటద్వారం వైపున నున్న రెండు పెద్ద చెట్ల నడుమ సంభ్రమముతో తానా చెట్లను తగులక చిత్రంగ రెంటి నడుమ వెళ్ళి వళ్ళు నిరుచుకొనగా భూమి పగిలి తరువులు పెళ్ళగిలి కూలిపోయాయి. ఆ చిత్రాన్ని విభ్రాంతితో తిలకించిన గొల్లలు, గోపకాంతలు యశోదతో ఈ విషయాన్ని చెప్పారు.

వ॥ నందగోపాదులు నటమున్న కదిసి రిట్లరిగి యందఱు నున్మూలిత యమళార్జునమధ్యంబున మేఘద్వయమధ్యవిద్యోతి యగు శీతాంశుండునుం బోలె నాలోలలోచనంబున సుధాసేచనరోచు లడర మందస్మిత సుందర వదనమండలంబున నగ్రిమ చూడామండనంబు వొలయుం బోలుపారు కుమారునిం గని రంత నాగోపగ్రామణి కొడుకు కడుపునం బెనఁచిన కట్టోయ్యన నూడ్చి యెత్తుకొని యిదియేమి చందం బీబాలు నుదరంబు ఱోల నిట్లేలకట్టి తింతదవ్వెట్టులీడ్చె నిమ్మహీరుహంబు లెప్పగిదింగూలె నని తద్బంధన నిమిత్తంబు నిజకళత్రంబు వలన విని పుత్రుసత్త్వంబునకు హర్షవిస్మయంబు లతిశయిల్ల నుండె. గోపవృద్ధు లచ్చెరువునొంది తమలోన.

తా॥ నందగోపాలుడు మొదలగువారంతా అంతకు ముందే కదలి వెళ్ళి వ్రేళ్ళతో పెల్లగింపబడిన మద్దిచెట్ల నడుమ రెండు మేఘాల మధ్య ప్రకాశించే చంద్రునివలె అల్లార్చే కళ్ళతో అమృతపు జల్లుల ప్రకాశంతో చిరునవ్వు లొలికే అందమైన ముఖంపై శిఖిపింఛ భూషణం వెలయగా అందాలు చిందే పుత్రుని చూశారు. అంత నందుడు కొడుకు కడుపుకు చుట్టిన కట్లు తిన్నగ విడిపించి. "ఇదేమిటి? బాలుని కడుపును రోటికి యీ విధంగా కట్టినావు. ఇంత దూరంలో గల ఈ మహావృక్షాల వద్దకు రోలును ఏ విధంగా యీడ్చాడు? ఈ చెట్లు ఎలా కూలాయి." అని అలా కట్టివేయడానికి గల కారణం తన భార్యవలన విని పుత్రుని బలసత్త్వాలకు ఆనందాశ్చర్యాలు పొందాడు. గోపవృద్ధులు తమలో అబ్బురపడినారు.

(iii) పోతన మహాకవి కూడా యీ సందర్భాన్ని యిలా వర్ణించాడు.

బాలకృష్ణుడు చేసే అల్లరి పనులకు విసిగిపోయిన యశోద, దగ్గరనే వున్న రోలుకు బాలుని కడుపు త్రాళ్ళతో బంధించడం ప్రారంభించింది. ఎంత పొడవుగల త్రాళ్ళు తెచ్చి కట్టబోయినా తాళ్ళ పొడవు చాలడం లేదు. అక్కడున్న గోపికలు, యశోద విభ్రాంతికి లోనైనారు. లీలా వినోదుడైన బాలకృష్ణుడు ఎలాగైతేనేమి తల్లి యశోదపై గల ప్రేమతో

కట్టువడినాడు. తరువాత యశోద ఇంటిపనులు నిర్వర్తించడానికి లోనికి వెళ్ళింది.

అపుడు బాలకృష్ణుడు ముందు నారదుని శాపానికి గురై మద్దిమ్రాకులైన నలకూబర, మణిగ్రీవుల (కుబేరుని కుమారులు) గని రోలు నీడ్చుకొనుచు ఆ మ్రాకుల వద్దకు వెళ్ళాడు.

**నలకూబర, మణిగ్రీవుల శాప కారణం :** పూర్వం కుబేరుని కుమారులు, నలకూబరుడు, మణిగ్రీవుడు శంకరుని సేవచేస్తూ అహంకరించి వెండి కొండపై పూదోటలో ఆటపాటలాడే చేడియలను గూడి కరేణువులతో సంగమించే ఏనుగులవలె, సురగంబులైన మందాకినీ తరంగముల క్రీడించుచుండగా నారదుడు ఆ దారిన దయచేశాడు. అపుడా స్త్రీలు త్వరగ వలువలు ధరించినారు. మదిరాపాన పరులైన నలకూబర, మణిగ్రీవులు మాత్రం వివస్త్రులై మెలగుచుండగా వారిని నారదమునీశ్వరుడు చూచి వారి గర్వమడంచ దలచి, భూలోకమున యములార్జున తరువులై 100 సం॥లు ఉండండని శపించాడు. తదుపరి గోవిందుని చరణారవిందంతో శాపవిముక్తి కలుగుతుందని ఆశీర్వదించాడు.

అందువల్ల యీ ముద్దుల టక్కరి బిడ్డ మద్దిచెట్లను కూల్చుటకు రోలు ఈడ్చుకుంటూ వెళ్ళి రెండు మాకుల నడుమ చొచ్చి ముందుకు నిగుడుచుండగా...

**క॥ బాలుడు తో లద్దము దివ / మూలంబులు పెకలి విటపములు విఱిగి మహా**
**భీల ధ్వనిఁ గూలెను శా / పాలస్య వివర్జనములు యములార్జునముల్**

తా॥ బాలుడు రోలును అడ్డంగా రెండుమ్రాకుల మధ్య లాగగా చెట్లు వ్రేళ్ళతో సహా గొప్ప శబ్దంతో కూలిపోయాయి. శాపగ్రస్తులైన యములార్జునులు వెలువడినారు. క్రింద కూలిన చెట్ల నుండి అగ్నికీలలు వెలువడినట్లు ఎక్కువ తేజముతో దిక్కులు పిక్కటిల్ల ప్రసిద్ధులైన సిద్ధులిద్దరు వెడలివచ్చి ప్రబుద్ధులై భక్తలోక పాలకుడైన బాలకునికి మ్రొక్కి లేచి కరకమలములు జోడించి యిలా ప్రార్థించారు.

**శా॥ నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్**
**నీ పేరం బనిసేయు హస్త యుగమున్ నీ మూర్తిపైఁ జూపులన్**
**నీ పాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీ సేవ పై చిత్తముల్**
**నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరజ పత్రేక్షణా!**

తా॥ నీ వాక్కులు ఆలకించే చెవులు, నిన్ను స్తుతించే మాటలు, నీకోసం శ్రమించే హస్త యుగము, నీ మూర్తిపై చూపులుంచు భాగ్యం, నీ పాదములు మ్రొక్కు శిరములు, నీ సేవపై మనసు నుంచుట, నీ గొప్పదనాలను గ్రహించే బుద్ధి మాకు కరుణతో అనుగ్రహించు నీరజపత్రేక్షణా!

బాలకృష్ణుడు నలకూబర, మణిగ్రీవులను వారి నెలవులకు వెళ్ళడానికి అనుజ్ఞ యిచ్చాడు.

గోపబాలకులు క్రిందపడే చెట్ల శబ్దం విని పిడుగుపడిన చప్పుడని శంకించి –

**క॥ ఈ పాదపములు గూలగ, / నీ పాప దులూఖ మున నిట బుద్ధం డై**
**యే పగిది బ్రతికెఁ గంటిరె,/ వాపోవదు వెఱవ దెట్టివాడో యితడున్.**

తా॥ ఈ పాపడు రోలుకు కట్టివేయబడ్డాడు. ఈ చెట్లు కూలగ ఎట్లు బ్రతికాడో ఊహకందని విషయం. భయపడడముగాని, వాపోవడం గాని తెలియని ఈ బాలుడు ఎంత గొప్పవాడో!

**ఆ॥పిడుగు వడదుగాక పెనుగాలి విసరదు / ఖండితంబు లగుట గానరాదు**
**బాలుఁ డితడు పట్టి పడద్రోయఁ జాలడు / తరువు లేల గూలె ధరణి మీఁద.**

తా॥ పిడుగు పడలేదు, పెనుగాలి వీచలేదు. చెట్లు విరిగిపడుట కనుపించలేదు. ఇతడు బాలుడుగాన చెట్లను పట్టి పడద్రోయగలేడు. అట్లాంటపుడు యీ రెండు చెట్లు భూమి మీద ఎట్లా కూలినాయబ్బా! అని అందరూ ఆలోచిస్తుండగా – అక్కడున్న గోపబాలకులు కొందరు యిట్లనిరి.

**క॥నందుని కొమరుడు వినుఁడీ / సందున మును దూతి ఱోలు సరి నడ్డముగా**
**ముందటి కీడ్చిన మద్దులు / గ్రందుకొనం గూలె జనుల గంటి మిరువురన్.**

తా॥ బాలకృష్ణుడు రెండు మద్ది మ్రాకుల సందున దూరి రోలు అడ్డముగ పెట్టి ముందుకు యీడ్చినందువల్ల రెండు చెట్లు కూలగ ఇద్దరు మనుజులు ఉద్భవించుట చూచాము.

అంతట నందుడు తన ముఖంలో చిరునగవు తొణకాడగా బాలకృష్ణుని కట్లు విప్పాడు. ముగ్గురు మహాకవులూ ఒకే సన్నివేశాన్ని తమ అసమాన కవితా ప్రతిభతో వివిధ కోణాలలో చిత్రించినా సూత్రం ఒక్కటే – భక్తి.

'సూరసాగర్' వాత్సల్య సాహితికి నిధి. అత్యంత వాత్సల్య భావనతో సూరదాసు బాలకృష్ణ శైశవ వైభవాన్ని తనివితీరా వర్ణించిన ప్రేమరస సాగరం 'సూరసాగర్'. ఇందులో పొంగిపొరలే ఆత్మీయతానుబంధంతో కూడిన వాత్సల్యామృతాన్ని దోసిళ్ళతో కడుపునిండుగా త్రాగడమే మన వంతు.

కోడూరు పుల్లారెడ్డి
విశ్రాంతి సూపరిండెంటింగ్ ఇంజనీర్,
విద్యుత్ బోర్డు, కళ్యాణ్‌నగర్-3,
హైదరాబాద్-18.
ఫోన్ : 9550818495

# రినైజాన్స్ చరిత్ర

*'రినైజాన్స్' ఆలోచన ఇటలీలో మొదలయి, ఫ్రాన్స్ సరిహద్దులు దాటి ఐరోపా తీరాలన్నింటినీ తాకింది. ఈ చరిత్రను కొంతవరకు తెలియజెప్పడమే ఈ రచన ఉద్దేశ్యం. ఇది చరిత్రకారులు రాసిన చరిత్రకాదు. 17వ శతాబ్దపు చిత్రకారులు, శిల్పులు, వాస్తునిర్మాణ నిపుణులు పూర్తిగా నిమగ్నమై వెలిబుచ్చిన అభిప్రాయాల క్రోడీకరణ. అయితే భారతీయ సందర్భంలో ఈ 'రినైజాన్స్' అన్వయింపు ఎంతవరకూ సబబు అనేది ఇప్పటి చర్చనీయాంశం- పాఠకులు సంయమనంతో అవగాహన చేసుకోగలరని ఆశిస్తూ, 'రినైజాన్స్' పదానికి వివిధ కాలాలలో ఉపయోగించిన విశేషణాలను కూడ ఏకరువు పెట్టడం జరిగింది.*



జార్జియో వసారి చిత్రం

మధ్యయుగాల వారికి తాము మధ్యయుగంలో ఉన్నట్లు తెలియదు. ఎందుకంటే ఈ మధ్యయుగం అనే పదబంధం 17వ శతాబ్దంలో వాడుకలోకి వచ్చింది. కాని ఈ రినైజాన్స్ కాలంలో అది రినైజాన్స్ అనే పూర్తి అవగాహనతోనే చరిత్రకారులు ఉన్నారు. అందుకనే ఆ ఆలోచన తాలూకూ చరిత్రతోనే మన చర్చ ప్రారంభించ వచ్చు. ఈ రినైజాన్స్ చరిత్రలో ఎన్నో విషయాలు ఫ్రాన్సెస్కో పెట్రార్క్ తోనే మొదలవుతాయి.

క్రిష్టియన్ రచయితలు చరిత్రను రెండుగా విభాగించారు. మొదటిది చీకటియుగం, తరువాతది క్రిష్టియన్ లేక కాంతియుగం. పెట్రార్క్ ఈ రెండిటిని తీసుకొని మరో విధంగా అన్వయించాడు. అతనికి, మొదటిది కాన్‌స్టాంటిన్ - అదే కాంతియుగం అన్నాడు. రెండవది ఆధునికయుగం. దీనిని చీకటి యుగంగానే చూశాడు. అప్పుడప్పుడే కాంతి పరచుకోవటం మొదలైంది అన్నాడు.



ఫ్రాన్సెస్కో పెట్రార్క్ (1304-1374)

"...ఇది నా ప్రగాఢవాంఛ-నా తరువాత మీరు చాలాకాలం ఉంటారు. మీకోసం మంచికాలం ముందు వేచివుంది. ఈ నిద్రాణావస్థ మిమ్మల్ని ఎక్కువ కాలం బాధించదు. ఈ చీకట్లు తొలగిపోవటం మొదలవగానే ముందు తరాలు మళ్ళీ ఈ పాతతరపు వైభవాన్ని పూర్తి వెలుగులో దర్శించగలుగుతారు..."

అని పెట్రార్క్, రినైజాన్స్ ను స్పష్టంగా వివరించాడు. దీనినే మనం 'పునర్దర్శనం' అనుకోవచ్చు. ఐతే ఇది ప్రారంభమే.

పెట్రార్క్ తరువాతి వారు అతని 'గతకాల వైభవాన్ని' అంగీకరించారు కాని వర్తమానకాలపు చీకటి నిరాశాభావాన్ని అంతగా పంచుకోలేదు. పర్యవసానంగా వారు చరిత్రను రెండుగా గాక మూడు భాగాలుగా విభజించారు. 'గతకాల వైభవం', 'దిగజారిన కాలశకలం' 'ఆధునిక యుగం' అంటూ చివరిదానిని ఆకర్షణీయమైన రూపకాలతో వర్ణిస్తూ-అంధకారం తరువాత కాంతియుగమని, శిశిరం తరువాత వసంతం అని, సుషుప్తి తరువాత మేల్కోవటం అని, చరిత్ర మళ్ళింపు అని, పూర్వస్థితిని పొందటం అని, పునర్వ్యవస్థీకరణని, భాషాపరంగా 'మృత్యోర్మా అమృతంగమయా' అంటూ పునర్జన్మ లేక పునర్దర్శనం అని అనేక పదాలతో నింపివేశారు. ఈ పదాలు ముందుగా, మెల్లగా ఒక కళారూపానికి మాత్రమే అన్వయించి తరువాత ఎన్నో కళావిధానాలకు పెంచుకుంటూ పోయారు. ఆ

విధంగా రాను రాను చివరికి ఒక పూర్తి యుగానికే ఈ రినైజాన్స్‌ను అన్వయించారు.

ఉదాహరణకు 14వ శతాబ్దంలో ఫ్లారిన్‌టైన్ లోని విల్లాని క్రానికల్ – ఒక చిత్రాన్ని 'పూర్వస్థితికి' తేగలగటం: డాంటే కవిత్వాన్ని పెట్రార్క్ కవితను, బొకాసియో పద్యాలను వెలికితీయటం లాంటి మహత్కార్యాలు జరిగాయని పేర్కొన్నది. బొకాసియో, గియాటో (జియో అని అంటారు) గురించి ఈ విషయాన్నే నొక్కి చెపుతున్నారు.

"...గియాటో విజ్ఞత ఎంత గొప్పదంటే.., 'నిజానికి ప్రకృతి–అన్ని కార్యాలకు మాతృక ఐన ప్రకృతి–చిత్రించేదేదీ, కలంతోనో, కుంచెతోనో, మరేపరికరంతోనో సృష్టించినట్లు కాక, అది స్వంతమనేదేదీ తనదిగా కనపడనీయదు' అంటాడు. అందువలనే మానవ సహజమైన బాహిర్‌దృష్టికి చిత్రించబడిన బొమ్మలే కనబడతాయి, లేదా అలాంటి భ్రమ కలుగుతుంది. నిజానికి అతను చేసింది ఏమిటి? ఎన్నో శతాబ్దాలుగా చీకటిపొరల్లో, కాలపుతెరల్లో దాగివున్న కళను వెలుతురులోకి తేగలగడమే..

"...ఈ విషయంలోనే మనం డాంటేకి ఎంతో రుణపడివున్నాం. డాంటే మహాశయుడు తెరిచిన ద్వారాలు: కళలు, కావ్యదేవత, ఫ్లారెన్స్ ప్రాంతపు స్వచ్ఛంద సాహిత్యపు యాసను, భాషను, ప్రాంతీయభాషా సౌందర్యాన్ని తన కవిత్వంలో పొదిగి మళ్ళీ వినిపించాడు. అప్పటివరకూ మృతప్రాయమై ఉన్న కవిత్వ ధోరణులకు మళ్ళీ ఊపిరులు పోసి శ్వాసింపచేశాడు..."

ఈ కవితా పునరావిష్కరణకు తోడు చిత్రకళ కూడా మేళవించింది. అది 15వ శతాబ్దంలో. అంతేగాక శిల్పకళ, వాస్తుకళలతో పాటు అక్షరాలన్నీ బ్రతికి బట్ట కట్టాయి.



**జార్జియో వసారి** (1511-1574)

అక్షరాలంటే..లాటిన్ భాష నేర్చుకోవటమే కాక సాహిత్యవిమర్శ కూడా ముందుకు వచ్చింది. ఈ విద్యాభ్యాసంతో పాటు కళారూపాలన్నీ వెలుగులోకి తేబడినాయి. దీనినే వెస్పాసియానో, లారెంజోవల్ల ఈ విధంగా వర్ణించారు.

"...ఇంతకంటే ఎక్కువ చెప్పటానికి దుఃఖం కమ్ముకొస్తుంది. రోమ్‌ను గాల్స్ జయించినపుడు సర్వం తలక్రిందులయ్యింది. తగలపడిపోయింది. విధ్వంస పరచబడింది. సర్వనాశనమై పోయింది. అసలు రోమ్ నగరమే నేలమట్టమై పోయింది. ఇంక భాషలెక్కడ, యాసలెక్కడ? కళలు, శిల్పాలు, చిత్రాలు అంధకారంలో కూరుకుపోయాయి. తరువాత కొన్ని శతాబ్దాల వరకూ, సరిగా లాటిన్ మాట్లాడేవారే కరువయ్యారు. అంతేకాదు అసలు చదివి అర్థం చేసుకునేవారు అవగాహన పరుచుకొనేవారు కానరా కుండా పోయారు.ఇంతేనా, జనసామాన్యానికి చేరువైన చిత్రకళ, శిల్పకళ, వాస్తుచాతుర్యం అంతగా ఎందుకు దిగజారిపోయాయో అర్థం చేసుకోలేక పోతున్నాం. సాహిత్యంతోపాటు చివరికి కళలన్నీ మృతప్రాయమై మిగిలిపోవటం ఎంతో దుఃఖకరమైన వాతావరణం కాని తరువాత ఈ కాలంలోనే ఎంతో నైపుణ్యం గల చిత్రకారులు, రచయితలు వృద్ధిచెందటం కూడా అవగాహనకు రాని విషయమే..."

(ఇదే స్థితి మన హంపి శిథిలాలు, నేలకూలిన ఆలయాలు, రూపుకూడా లేని భవన నిర్మాణాలు చూసినప్పుడు హృదయవిదారకమైన దుఃఖంతోపాటు నిర్వేదం కమ్ముకొస్తుంది. పర్యాటకులకు వీటిని చూపించి ఆనందిస్తున్నామో, దుఃఖిస్తున్నామో కాని వాటిలో కొంతభాగమైనా పునరుద్ధరించే ప్రయత్నమే జరుగలేదుకదా!)

16వ శతాబ్దంలో ఈ రినైజాన్స్ ఆలోచన ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందింది. దానినే జార్జియో వసారి ఎన్నో కాలశకలాలుగా విభజించాడు. గెలీలియో సంగీతానికి, ఆండ్రియస్ వెసాలియస్ వైద్యానికి అన్వయించగా, ముద్రణకు, తుపాకీమందుకు, అన్వేషణా యాత్రలకు రాబెలయిస్, జీన్ ఫెర్నెల్ అనుసంధానించారు.

వసారి తన జాబితాలో చిత్రకారుల్ని, వాస్తుశిల్పుల్ని, శిల్పకళాకారుల్ని ఈ 'చారిత్రక పునర్దర్శనం' లో చేర్చాడు. ఆ సందర్భంలోనే..

"...కళ ఎన్నోవిధాలుగా దినదినాభివృద్ధి చెంది గొప్ప శిఖరాలను అధిరోహించటం మనం చూశాం. కాని అంతటి ఔన్నత్యం నుంచి అధోస్థితికి పతనమైపోవటం కూడా గమనించాం. మానవ శరీరాలవలే ఈ కళలు కూడా తమ జన్మకాలం నుంచి వృద్ధిచెందుతూ చివరికి మరణావస్థకి చేరుకోవటం వాటి నైజం అనుకోవాలి. మళ్ళీ ఇప్పుడు అధోలోకాల నుండి పునర్జన్మ పొందినట్లు వృద్ధిచెందటమూ గమనిస్తున్నాం. అంతగొప్పగా పరిపక్వ దశకు చేరటం చూస్తున్నాం..."

వసారి ఇక్కడ వాడిన 'రినాసిటా' పదం ముప్పేటగా మారి కళాప్రపంచంలో ప్రసిద్ధి పొందింది. అంతేకాకుండా వసారి ఆ కాలాన్ని మూడు అవధుల్లో భాగించాడు.

"...మొదటగా, పురాతన యుగంలో ఈ మూడు కళలు చాలా శైశవ దశలోనే ఉండిపోవటం గమనించవచ్చు. ఒకటి అరా బాగున్నాయని అనిపించినా వాటిని పొగడవలసిన అవసరమేమీ లేదు. పరిపక్వదశకు ఎంతో దూరంగానే ఆగిపోయాయి. కాని ముందుతరాలకు అవి ఒక దారి ఏర్పరిచి, విధి విధానాలను నిర్దేశించాయని చెప్పవచ్చు..

..ఇక రెండవది–ఈ కళలే రూపాంతరం చెందుతూ ఎంతో వృద్ధిని సాధించాయి. అది, కల్పనలోనూ, ప్రయత్నంలోనూ, జాగరూకతలోనూ సాధించబడినాయని అనవచ్చు. ఎంతచెప్పినా ఈనాటి కళాఖండాలతో పోలిస్తే అవి వర్ణసమ్మేళనంలో, యత్నసాధనలో, పరిపక్వదశకు చేరలేదని చెప్పవచ్చు..

..మూడవకాలంలో–నేను ధైర్యంగా చెప్పగలను, కళ అనేది ఎంతటి ఉన్నత శిఖరాలను చేరవచ్చునో, ఎంత



రాబెలయిన్

పరిపక్వ దశకు రాగలదో, ప్రకృతిని ఎంత గొప్పగా అనుకరించగలదో తెలుసుకొని ఒక్కొక్కసారి భయపడుతుంటాను. ఒకవేళ అంతటి ఔన్నత్యపు శిఖరాలనుంచి ఏ పతనావస్థ లోయలలోకి ఒరిగి పోతాయేమోనని - తమ అభివృద్ధి పథంలో - అనిపిస్తుంది..."

మొదటిదశలో గియాటో అందరికంటే చిత్రకళా విభాగంలో ముందున్నాడు. ఆంద్రియా పిసానో శిల్పకళలో, ఆర్నాల్ఫో, గియాటో వాస్తు నిర్మాణంలో ముందున్నారు. రెండవ దశలో మసాసియో, డోనాటెల్లో బ్రూనెల్లెస్చి అదే వరసలో ఉన్నారు. చివరగా మైఖెలాంజిలో ఒక్కడే చిత్రకళా, శిల్పకళ, వాస్తునిర్మాణంలో ఉన్నత శిఖరాలపై నిలిచాడు.

ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడైన గెలిలీయో తండ్రి విసెంజో గెలీలియో ఈ రినైజాన్స్ ఆలోచనను సంగీతానికీ అన్వయించాడు. ఫిసినో అప్పటికే 'సంగీతం పునరుద్ధరించబడుతోంది, మంచి సంగీతాన్ని రాస్తున్నారు' అన్నాడు. విసెంజో గెలీలియో ఇంకాస్త ముందుకెళ్ళి సంగీతం ఒకప్పటి ఔన్నత్యాన్ని అందుకుంటోందన్నాడు... ఇంకా -

"...ఇటలీపై జరిగిన పైశాచిక దురాక్రమణల తరువాత ఆ దేశంలోని అన్ని రకాల శాస్త్రజ్ఞానాలు ఆరి పోయాయి. అడుగంటి పోయాయి. శిథిలాలలో కూరుకు పోయాయి. అప్పటికీ మిగిలిన పౌరులు నిరాశా నిర్లిప్తతలో మునిగి ఏ రకమైన కళా విద్యాభ్యాసానికి ఆసక్తి కూడా చూపని దారుణస్థితికి దిగ జారారు. ఇక సంగీతం వైపు దృష్టి కూడా పెట్టలేకపోయారు. ఈవిధంగా ఎంతో కాలం అంధకారంలోనే ఉండిపోగా మొదటగా గఫూరియస్, ఆ తరువాత గ్లారియన్, ఇంకా ఆలస్యంగా జార్లినో మొదలయిన వారు సంగీతపు ఆనవాళ్ళకోసం పరిశోధన సాగించి, ఉద్ధరించడానికి, చీకట్ల నిశ్శబ్దం నుంచి మళ్ళీ వినిపించటానికి వారు ఎంత శ్రమ చేశారో, ఎంతకాలం ఎన్ని గ్రంథాలను శోధించారో ఎవరు చెప్పగలరు? ఆ సంగీత నిధిని చరిత్ర పాతరల నుంచి మళ్ళీ వెలికి తేగలిగారు.. పూర్వ వైభవాన్ని సర్వవిధాలా స్వరపరిచారు..."

ఇంతవరకూ ఇటాలియన్ల గురించే మాట్లాడుకున్నాం. ఈ రినైజాన్స్ అనేది ఇటలీలోనే జరుగుతుందని చెప్పుకున్నాం కాని దీనికి కొనసాగింపు ఇంకా ఉంది. ఇది ఎంతగా విస్తృత పరచబడిందంటే అది ఫ్రెంచి తీరాలను

ఎలా తాకిందో, ఐరోపా దేశాలను ఎలా ఆక్రమించిందో తెలుసుకోవాలంటే అక్కడ జరిగిన సంఘటనలు, వారు సాధించిన విజయాలు పరికించాలి. అది శాస్త్రవిజ్ఞానం కాని, సాంకేతిక పరిజ్ఞానం కాని వెసాలియస్ ఉపయోగించిన ‘పూర్వస్థితి’, ‘పునర్వవస్థీకరణ’తోపాటు ‘పునర్జన్మ’ ని వైద్యానికి అన్వయించాడు.

‘‘...ఇది ఎంతో మంచికాలం. వైద్యశాస్త్రం, వైద్యవిధానం మిగతా వైజ్ఞానికవిద్యల వలెనే మరలా వెలుగులోకి వస్తుంది(పూర్వస్థితి). ఇంతకుముందు కూరుకుపోయిన చీకటి గుహలలోనుంచి గాఢాంధకారపు లోతుల్లోనుంచి మెలమెల్లగా వెలికి రాగలుగుతోంది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో అది పూర్తిగా పునర్వైభవాన్ని పొందగలుగుతోందని చెప్పటానికి సందేహపడ నవసరంలేదు. మానవ శరీర భాగాలపై పూర్తి అవగాహన పొంది ఇప్పటివరకూ ఉన్న అజ్ఞానపు తెరలను తొలగించుకోగలిగింది. దీనికి కారకులైన మహానుభావుల ప్రేరణతో నా జ్ఞానపరిధిలో ఉన్న శక్తిమేరకు నావంతు కృషి నేను చేస్తాను.. ఈ ప్రకృతి సహజ శాస్త్రాన్ని ఇప్పటివరకూ కప్పివున్న మట్టిపొరల్లోనుంచి వెలికితెచ్చి కాపాడవలసిన అవసరాన్ని గుర్తించాను. ఇప్పటి శస్త్రవైద్యులు ఇంతకు పూర్వపుతరం కంటే నైపుణ్యంలో ఎంతో ముందుండవచ్చు. కాని ఆధునిక శస్త్రవైద్య శాస్త్రాన్ని పూర్వ, పురాతన విధానంతో పోల్చిచూసుకోవడానికి బిడియపడవలసిన అవసరం లేదు. చివరికి వైద్యశాస్త్రం పునర్భవాన్ని పొందగలగటం ఎంతో ఆనందదాయకం...’’

రినైజాన్స్ చరిత్రలో భాగంగా, రాబెలయిస్ ముందుగా చెప్పింది–ముద్రణాపరిజ్ఞానం, తుపాకి మందులే అయినా ఆయన సమకాలీనులైన వారిలో ఒక సూపర్‌హీరోని చూపించవలసిన అవసరం ఉందని తను జీవించివున్న సమయం మహత్తరమైనదని నమ్మాడు.



జీన్ ఫెర్నల్ (1497-1558)

‘‘...విద్యాభ్యానం, శాస్త్రవిజ్ఞానం నా జీవితకాలంలోనే పూర్వస్థితికి వచ్చి గౌరవ ప్రదమైన, బౌద్ధికమైన వికాసం వెల్లివిరిసింది. విద్యా విషయంలో ఇప్పటి చిన్నారుల సరసన కూడా కూర్చోలేక పోతున్నామంటే ఎంతో ఆనందించాల్సిన విషయమే. నేను చదువుకునే కాలంలో నన్ను అందరిలో తెలివైన వానిగా, చురుకైన ఏకసంథాగ్రాహిగా గౌరవం పొందాను. ఇప్పుడు విద్యావిధానంలో ఎంతో అభివృద్ధి సాధించారు. కాని ఇది ఒకప్పుడు ఉన్నదే, భాషను నేర్పటంలో ఉన్న మెలకువలు వెలికితీశారు. ముఖ్యంగా గ్రీకుభాష విషయంలో–అది తెలియకపోతే ఎవ్వరూ, ఏ ఒక్కరూ తనను తాను పండితుడనని చెప్పుకోలేడు. హీబ్రూ, ఛాల్డియన్, ఇంకా లాటిన్‌భాషల విషయంలో కూడా. ఎంతో అందమైన ఖచ్చితమైన ముద్రణ–దీనిని కళే అన్నారు–ఇప్పుడు ఉపయోగంలోకి వచ్చింది. ఇది నా కాలంలోనే, నేను జీవించివున్న కాలంలోనే జరిగింది. ఈ మహత్కార్యానికి ఎంతో మానవాతీత ప్రేరణ కావాలి. దీనికి వ్యతిరేకం అన్నట్లు ప్రమాదకరంగా తుపాకి మందు, పేలుడు పదార్థాన్ని కూడా తయారు చేశారు. విచారకరమైన విషయమేమంటే దొంగలు, బందిపోటులు ఇప్పుడు వైద్యులకంటే, మతాధికారులకంటే తెలివైన వారుగా చెలామణి అవుతున్నారు...’’

రాబెలయిస్ సహాధ్యాయి తోటి వైజ్ఞానికుడు అయిన జీన్ ఫెర్నెల్ అప్పటి మహత్తర ఆవిష్కరణల గురించి ఉద్ఘాటిస్తూ దిక్సూచిని పేర్కొన్నాడు. దీనిని విజ్ఞానపరంగా ‘కనుగొన్న’ పరికరంగానే చెప్పాడు.

‘‘...ఈ దిక్సూచితో మానవుడు ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. సముద్రాలను దాటాడు. ఎన్నో ఘనమైన భూఖండాలని కనుగొన్నాడు. ముద్రణాయంత్రంతో విద్యను విజ్ఞానాన్ని వెదజల్లుతున్నాడు. ప్రేలుడు మందుతో యుద్ధప్రక్రియను సమూలంగా మార్చివేశాడు. అతి పురాతనమైన తాళపత్ర గ్రంథాలను, దారు శాసనాలను పునరుద్ధరించాడు. ఇదంతా కొత్త, అధునాతన యుగంలోనే జరిగింది...’’

ఇప్పటివరకూ మనం చెప్పుకున్నది రినైజాన్స్ తాలూకూ చారిత్రక నేపథ్యంలో ఎవరు ఏవిధంగా ఈ ‘పూర్వస్థితి’, ‘పునరుద్ధరణ’ మొదలైన ఎన్నో పదాలతో పురాతన విజ్ఞానాన్ని, సాహిత్యాన్ని, కళలను, వాస్తునిర్మాణాన్ని తరువాత తరాలవారు – దాదాపు 300 సంవత్సరాల చీకటియుగం తరువాత–పునరుద్ధరించి కొత్తపుంతలు

తొక్కించారో అని చర్చించాం. ఆ తరువాత రినైజాన్స్‌ను పునరావిష్కరించినవాడు వోల్టేర్.

1580 నుంచి 1750 వరకు చీకటి, మృతయుగం అని రినైజాన్స్ చరిత్రలో ఒక ఆలోచన. బహుశా ఇది రినైజాన్స్ కాలానికి మరీ దగ్గరగా లేక అంత దూరంగా కాకుండా ఉండటమే కారణం. కాని అది చారిత్రకంగా చూడగలగటానికి అవకాశం లేనంత సమీపగతం. ఆ చరిత్రలో పాత్ర కావటానికి వీలుకానంత దూరం కూడ-ఈ సంధికాలంలో వోల్టేర్ వచ్చాడు. ఆయన రాసిన 'సాంఘిక మర్యాదలు' అనే వ్యాసంలో అప్పటి పదహారో శతాబ్దంలో ఇటలీలో 'సాంస్కృతిక పునర్దర్శనం' సాధించిన విజయాలు ఉటంకిస్తూ వివరించటానికి ప్రయత్నించారు. దీనిని మనం రినైజాన్స్ పునరావిష్కరణ అనవచ్చు. మరో విశేషమేమంటే దీనికి సమాంతరంగా యూరొప్‌లో జరిగిన పురోభివృద్ధి, పరస్పర మర్యాదల నిర్వచనం ఇంకా అప్పటి రాజకీయ పరిణామాలు కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఇక్కడ మనం గమనించవలసిన విషయం వోల్టేర్ 14, 15 శతాబ్దాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి తరువాతి పరిణామాలు వివరించటానికి రినైజాన్స్ అనే పదం ఆయనకు అందుబాటులో లేకపోవటం మూలంగా సంఘటనలను, సంకలన పరచలేక పోయాడనవచ్చు.

"...మొదటిది, సాంస్కృతిక వైభవం! అది 16వ శతాబ్దానికి చెంది పూర్తిగా ఇటలీ దేశానికే పరిమితమైనది. గ్రీసులో యుద్ధకాల విరామంలో మాత్రమే కళలు కాస్త వెలుగు చూసేవి. ఆ యుద్ధాలు విదేశీయులతో కాని, అంతర్యుద్ధాలు కాని కళా సాహిత్యాలకు కొంతవరకే అవకాశం ఉండేది. దాదాపు ఇటలీలో కూడ ఇదే పరిస్థితి. ఇటలీ ప్రజలు గ్రీకుల పతనాన్ని, లాటిన్‌ల జీవనాన్ని అనుకరించినా వారు సాధించిన విజయాలు మాత్రం ఎవరూ అందుకోలేనివే. నిజానికి వారికి అనుకరించేందుకు అంతగా పూర్వ నమూనాలు కూడ లేవు...

"...16వ శతాబ్దంలోనే చిత్రకళ ఇటలీలోనే మహోన్నతిని సాధించింది. గ్రీకులకు దీని మూలాలు కూడ తెలియదు. ఇటాలియన్లు ప్రయోగించిన వర్ణసమ్మేళనం గాని, పరికరాలు గాని, వారి దూరదృష్టి గాని గ్రీకులకు అందుబాటులోకి రాలేదు.

"...ఇక శిల్పకళలో మాత్రం గ్రీకులు ముందున్నారు. వాస్తునిర్మాణ కౌశలంలో కూడ వారిదే పైచేయి.

"...సంగీతం 16వ శతాబ్దానికి మాత్రమే పునర్వైభవాన్ని సంతరించుకుంది. ఇందులో కూడ ఇటాలియన్లదే ఉచ్చస్వరంలో వినిపించింది. గ్రీకులు కనీసం పాటలు కూడ పాడిన దాఖలాలు లేవు.

"...నిజానికి తత్త్వశాస్త్రం అనేది కూడ 17వ శతాబ్దారంభంలోనే రూపుదిద్దుకుంది. గెలీలియో మొట్టమొదటగా భౌతికశాస్త్రాన్ని - సత్యాన్వేషణకు, తర్కానికి రుజువులతో ముందుకు తీసుకువచ్చాడు. దీనికి కొద్దిగా ముందు కోపెర్నికస్ ప్రాపంచిక సత్యాలను ఆవిష్కరించాడు. ఇంతకీ తత్త్వశాస్త్రం 16వ శతాబ్దంలో లలితకళల మాదిరిగా ముందుకు పోలేకపోయింది.

"...రెండవది, 16వ శతాబ్దం మొదటిభాగ సమయంలో ప్రపంచంలో ఎన్నో అద్భుతాలు జరిగాయని చెప్పవచ్చు. ఐరోపా దేశాలలో ఎవరి పరిపాలన ఐనాకాని వారి ప్రఖ్యాతి, వారి ప్రవర్తనావళి, వారు తీసుకువచ్చిన ఎన్నో మార్పులు-వారందరి పేర్లు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి. చిత్రకళలో లియొనార్డో డావిన్సీ ప్రవేశపెట్టిన వెలుగునీడలు అద్భుతాలు సృష్టించింది.

"... చార్లెస్-V పాత తరాన్ని పక్కకునెట్టి కొత్త ప్రపంచాన్ని కనుగొన్నాడు-జయించాడు. తూర్పు దేశాలతో సముద్రమార్గాల ద్వారా వ్యాపారం వృద్ధిచేశాడు. ఆయుధాలు, నౌకలు పోర్చుగల్లు దేశం సరఫరా చేసింది. సరిగ్గా ఇదే సమయంలో ప్రతివృత్తిలోనూ, లలిత కళల్లోనూ, ఇటలీలో అత్యంత ప్రతిభావంతులు జీవించారు. తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఆ కాలంలోనే మతోన్మాదులు, స్వార్థపరుల వలన యుద్ధాలు చెలరేగినా ఐరోపాదేశాలు కలవరపాటు చెందుతున్నా అన్ని రకాల లలిత కళలు ఎంతగానో వృద్ధిచెందాయి. రోమ్‌లో, నేపుల్స్‌లో, ఫ్లారెన్స్‌లో, వెనిస్‌లో-ఇలా ఇటలీ అంతా వెలిగిపోవడమే కాదు, ఈ కాంతిని యూరోప్‌కు కూడ ప్రసరింపచేసింది. ముఖ్యంగా సాంఘిక



**వోల్టేర్** (1694-1778)

మర్యాదలు, వ్యక్తిగత ప్రవర్తనావళిని ఎంతో సున్నితంగా క్రిష్టియన్ ప్రపంచమంతా వ్యాపింప చేశారు. ఇది ఫ్రాన్సిస్-I రాజాస్థానంలోనూ ఈ మార్పులు సంభవించాయి. అప్పటి సంపద, కలిమి ఇందుకు దోహదం చేశాయి. పరిశ్రమలు అన్ని చోట్ల వెలిశాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఐరోపా అంతా కొత్త కళతో నవనవలాడింది...!" అని వోల్టేర్ వివరించాడు.

ఆ తరువాత సిస్మాండీ తన 'ఇటలీ ప్రజాతంత్ర చరిత్రలో' మరింత స్పష్టంగా అదీ వోల్టేర్ చెప్పిన పరిశీలన కంటే మిన్నగా వివరించాడు. అతను తన గ్రంథాన్ని *'..ఒక దేశపు ఔన్నత్యం, ప్రజల గుణగణాలు, వారిని పాలించే ప్రభుత్వపు తీరుపై ఆధారపడి ఉంటాయి..'* అనే వాక్యంతో ప్రారంభించాడు. దీనికి తార్కాణం ఇటలీ దేశమే. ఆ దేశ చరిత్రే. సిస్మాండీ కి కూడ వోల్టేర్ లాగానే రినైజాన్స్ పదంపై అవగాహన లేదు. అందుకనే రాజకీయాలను ఆ వరుసలోకి తేలేదు. సిస్మాండీ చెప్పేది కూడ ఇటలీలో జరిగిన ఈ సాంస్కృతిక పునర్భవం దీనికి మూలకారణం అందులో రాజకీయ, నైతిక కోణాలు కూడ ఉండటమే. ఆయన ఉపయోగించిన పదజాలం 'renaissance des vertus' (పునరుజ్జీవనపు సద్గుణాలు). ఆయన 13వ శతాబ్దపు కాలంపై చేసిన వ్యాఖ్యలు పరిశీలించే ముందు ఒక విషయం గుర్తుంచుకోవాలి. సిస్మాండీ చెప్పేది-తరువాత వాడుకలోకి వచ్చిన రినైజాన్స్ కాలానికి చాలా ముందటిదని గుర్తించాలి. ఒక రకంగా మధ్యయుగపు విజయాలను ఏకరువు పెడుతూ రెన్యువల్ అనే పదం వాడాడు.

"...ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం..ఇవేమీ దేశాలకు శాంతిని, ప్రశాంత పౌరజీవితాన్ని భరోసా ఇవ్వలేవు. ఆర్థిక స్థిరత్వం కాని, పూర్తి న్యాయవ్యవస్థను గాని అందించలేవు. ఐనా వీటి ప్రయోజనం వీటికి ఉంది. ఈ వ్యక్తి స్వాతంత్ర్యం, ఈ సాధారణ బాధ్యతలు పౌరులకు గొప్ప అవకాశం కలిగిస్తాయి. తాను ఎంతటి కార్యాన్నైనా నెరవేర్చ గలనని, అందుకు తనకు స్వేచ్ఛతో పాటు శక్తి కూడ ఉందని సాధారణ పౌరుడు నమ్ముతాడు.



**సిస్మాండీ** (1773-1842)

వ్యక్తిగత ఆలోచనల కంటే రాజకీయ అవకాశాలు ఎక్కువ ప్రేరణ కలిగిస్తాయి. వారిలోనుంచే గొప్ప గొప్ప కళాకారులు రూపొందుతారు. ఎందరో కవులు, పండితులు, తాత్త్వికులు కూడ వృద్ధిచెందడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. గత శతాబ్దం మనకు ఇదే విషయాన్ని రుజువు చేస్తుంది. ఫ్లారెన్స్‌లో జరిగిన అంతర్యుద్ధం సమయంలోనే ఎన్నో గొప్ప వాస్తు నిర్మాణాలు జరిగాయి. శిల్పకళ, చిత్రకళ నవీకరించబడింది. ఇటలీ ఎప్పటికీ చెప్పుకోదగిన గొప్పకవిని ప్రపంచానికి అందించింది. తత్త్వశాస్త్రాన్ని ఎంతో ఉన్నత స్థానానికి తీసుకువెళ్ళింది. శాస్త్రవిజ్ఞానాన్ని ఇటలీలోని అన్ని పట్టణాలకు విస్తరించింది. శతాబ్దాల తరబడి కళాసంపదను అందించింది..."

సిస్మాండీ గుర్తించిన ఇటలీ సాంస్కృతిక వైభవాలు సాధారణ పదాలలో చెప్పలేనివి. అదృష్టమో, యాదృచ్ఛికమో అనలేనివి. ప్రకృతి ఆశ్చర్యకరంగా ఆ ప్రత్యేక కాలంలో మహోన్నత వ్యక్తులను సృష్టించింది. ఇదే వోల్టేర్ కూడ అభిప్రాయపడ్డాడు. అదిగో ఆ భావనే రినైజాన్స్ అవసరాన్నే మరింతగా ఆలోచింప చేసింది. దానికి సమాధానంగా 1855లో జూలియన్ మిచిలెట్ రినైజాన్స్ లోతుల్ని మరింతగా వివరిస్తూ 'ఇది ప్రపంచాన్ని కనుగొనటం, ఇది మానవుణ్ణి మళ్ళీ కనుగొనటం' అని అంటే లూసెన్ ఫాబెర్ సరిగ్గా దీనినే 'ఇన్వెంటా లా రినైజాన్స్' అని మిచిలెట్ కి ఆపాదించాడు.

మిచిలెట్ ఈ సందర్భంగా ఐదుగురు ఫ్రెంచి వారిని, ఇద్దరు ఇటలీ వాళ్ళను పేర్కొన్నాడు. అందులో చిత్రకారుడుగాని వాస్తుశిల్పి, శిల్పకారుడు కాని లేరు. మిచిలెట్ చెప్పిన రినైజాన్స్ కూడ రాబెలయిన్ చెప్పినటువంటిదే.

"...కళా ప్రేమికులకు రినైజాన్స్ అనే పదం కర్ణపేయంగా వినిపిస్తుంది. దానిని అద్భుతమైన ఊహలకు, సరికొత్త విధానాలకు పర్యాయపదంగా పరిగణిస్తారు. పండితులకు, పూర్వకళా సాహిత్యాలను పునః పరిశీలించటమూ, తార్కికులకు, పురాతన సాంప్రదాయల అయోమయ స్థితిని వెలుగులో చూడటమూ.

అంతేనా? మరో రెండు విషయాలను మరచిపోయాను. ఇప్పటివరకూ అధ్యయనం చేసిన పండితులు, అసలు ఇంతవరకూ సంభవించినది ఈ ప్రపంచాన్ని పునర్దర్శించ

గలగటం-మానవుణ్ణి మళ్ళీ కొత్త వెలుగులో తెలుసుకోగలగటం. 16వ శతాబ్దం పూర్తిగా, కొలంబస్ దగ్గరనుంచి, కోపెర్నికస్ వరకూ, కోపెర్నికస్ నుంచి గెలీలియో వరకు జరిగింది-ఈ భూగోళాన్ని-నక్షత్ర మండలాలను వినూత్న దృష్టితో దర్శించగలగటమే. అప్పుడే కదా మనిషి తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నం చేశాడు! వెసాలియస్, సెర్వేటస్ ప్రభృతులు మానవుణ్ణి భౌతికంగా ఎరుకపరిస్తే లూథర్, కాల్విన్, డూమాలిన్, కూజాస్, రాబెలయిస్ , షేక్స్పియర్, కారన్‌వాలీస్ మహాశయులు మానవుని నైతిక జీవనాన్ని నిర్దేశించారు..."


**మిచిలెట్** (1798-1874)

**ముగింపు...**

ఆ విధంగా రెనైజాన్స్ ప్రారంభదశలో కవిత్వానికి, చిత్రకళకు వినూత్న విషయంగా ప్రారంభమై, పోను పోను ఐరోపా చరిత్రకే నూతన శకాన్ని నిర్వచించింది. ఈ విషయంలో మిచిలెట్ చేసిన సహాయాన్ని తక్కువ అంచనా వేయకూడదు. రినైజాన్స్ గురించి మాట్లాడేవారు తాము కొత్త శకంలో జీవిస్తున్నామని అనుకొన్నారు. అందులో సాహిత్యం, చిత్రకళలు పునరుజ్జీవనం చెందాయని అది సంపూర్ణ పునర్వికాస చరిత్రలో భాగమని విశ్వసించారు. వారు ఉపయోగించిన క్రియాపదం రినాసిరె (పోర్చుగీసు: చైతన్యం కలిగించు). అదీ వారు సాధించిన విజయాలను ఏకరువు పెట్టడానికి. ఎందుకంటే, వారికి పూర్తిగా తెలుసు.. ఇప్పుడు జరుగుతున్న ప్రక్రియలన్నీ తమ పూర్వీకులు కూడ నిర్వచించారని!

ఇక్కడే మిచిలెట్ ప్రయోగించిన నామవాచకం రినైజాన్స్, సంపూర్ణ పునర్వికాస చరిత్రను తెలియ జేయడానికేననీ, కేవలం కళావికాసాలకు మాత్రమే పరిమితం కాకూడదనీ అనాలి.

చిత్రకళ వైభవాన్ని విద్యావిషయక పాండిత్యాన్ని మాత్రమే చెప్పకుండా మానవ మేధస్సు పరిణామాన్ని, మానవజాతి చైతన్యాన్ని ఆవిష్కరించటంలో ఈ రినైజాన్స్ పదం ఎంతగానో ప్రాచుర్యంలోకి వచ్చింది!! ఇదీ రినైజాన్స్ చరిత్ర, పీటర్ బర్క్ క్రోడీకరించిన చరిత్ర.

* * *

'రినైజాన్స్' అని దేనినంటున్నామో- అందుకు భిన్నంగా 19-20 శతాబ్దాలలో క్లాసికల్ ఆర్ట్ క్షీణించి డాడాయిజమ్ క్యూబిజమ్ అనాకార లేదా నైరూప్యకళ అంటూ పుట్టుకొచ్చాయి. ఇక సంగీతంలో, ఆస్ట్రియాలో ఎంతో ఉన్నతికి చేరిన క్లాసికల్ మెలోడి, సింఫనీ తగ్గుముఖం పట్టి హిప్పీల సంస్కృతితో జాజ్, రాక్, రోలింగ్‌స్టోన్స్ శబ్దాలకు ఆలవాలమైపోయింది.

* * *

**భారతీయ సందర్భం:**

భారతావనిలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. వేదకాలం నుంచి, బుద్ధునికాలం నుంచీ, ఇక్కడ మానవ విజయాలు ఎప్పుడూ మరుగున పడలేదు. (హరప్పా, మొహంజొదారో నాగరకతలు వెయ్యి సంవత్సరాలు చీకటిలో వుండటం నిజమే. దానికి ప్రకృతి వైపరీత్యమే కారణమంటున్నారు) అందుబాటులో ఉన్న గ్రంథాలలోనూ, చరిత్ర శకలాలలోనూ, శాసనాల ద్వారా ఇక్కడ వైభవం పురోగతినే సాధించింది. గతకాలపు నిధులలోనుంచి ఎప్పుడూ తవ్వితీసుకొని ముందుకు సాగుతున్నారు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ప్రబంధాలు, మహాకావ్యాలు ఇవన్నీ కొనసాగింపులే. ఎప్పటి అజంతా గుహలు, ఎప్పటి ఎల్లోరా శిల్పాలు, ఎప్పటి కుడ్య చిత్రాలు! అవి కొన్ని శతాబ్దాలు చీకట్లలలో ఉండిపోయినా అంతకంటే ఘనంగా దక్షిణభారతదేశంలో ఓరుగల్లు, హంపి, బేలూరు, హలిబేడు, లేపాక్షి ప్రాంతాలలో ఎంతో వృద్ధిచెందుతూనే ఉన్నాయి. పూర్వవైభవానికి కొనసాగింపుగానే ఇక్కడ చరిత్ర నడిచింది. తూర్పు దేశాలలోనూ ప్రచారం పొంది ఔన్నత్యాన్ని కొనసాగించింది. మలయు, లావోస్, కాంభోజం, వియత్నాం, బాలి అంతటా వ్యాపించింది. అయితే కొన్ని ప్రక్రియలు చిత్రకళా, వైద్యం లాంటివి పూర్తిగా మరుగునపడి ఆధునిక(వలసపాలన)పోకడల ప్రభావంతో రూపు మార్చుకున్నాయి. కాని సంగీతంలో మునుపటికంటే మరింత ఘనంగా కొనసాగింపు జరుగుతోంది. నాట్యకళ పూర్తిగా వికసించి వెలుగుతోంది. భారతదేశంలోనూ మహానుభావులు కొన్ని కాలాలలో ఒక్క సమయంలోనే ఉద్భవించినా మిగతా శతాబ్దాలలో అందుకు తక్కువేమీ కాదు. ఐతే ప్రపంచంలో అన్ని దేశాల మాదిరిగానే ఏవో కొన్ని పేర్లు మాత్రం అమరత్వాన్ని పొందాయి. అందులో

కొన్ని, వాల్మీకి, వ్యాసుడు, భవభూతి, భానుడు, భాసుడు, భారవి, పతంజలి, చాణుక్యుడు, కౌటిల్యుడు, అశ్వఘోషుడు, ఆచార్య నాగార్జునుడు, కాళిదాసు, దిఙ్నాగుడు, కొక్కోకుడు, భరతుడు, జాయపసేనాని, ఆర్యభట్టు, వరాహమిహిరుడు, పాణిని, నన్నయ, ప్రబంధకవులు అందరూ అమరులే.

**బుద్ధుడు :** బౌద్ధం ఎన్నో శాఖలుగా విస్తరించింది, ఎన్నో భౌగోళిక ప్రదేశాలకు వ్యాపించింది-ఇప్పటికీ సజీవంగానే వెలుగుతోంది.

అంతులేని అంతర్యుద్ధాలతో(ఇరుగు పొరుగు రాజ్యాలు) శతాబ్దాలు సాగిన దురాక్రమణ దారుల పోరులతో అలెగ్జాండర్, బాబర్, గజినీ, యవనులు, ఫ్రెంచి, పోర్చుగీసు, ఆంగ్లేయుల వలస పాలనలో నలిగి నేలమట్టమైన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు(అలాంటి సనాతన, ఆర్ష సాంప్రదాయాలు ఉన్నాయనుకొందాం) ఏనాడు పూర్తిగా మరుగునపడలేదు. అలాగే తెల్లదొరలతో పాటు వలసపోలేదు. భాషలు, అలవాట్లు కొద్దిగానో, ఎక్కువగానో ప్రభావితం పొంది ఉండవచ్చు కాని భారతీయతకు వచ్చిన ముప్పు ఎప్పుడూ లేదు. ఐతే దీనిలో భిన్నరీతులు ఉండవచ్చు. జంబూద్వీపం, భరతవర్షం, భరతఖండం భౌగోళికంగా, సాంస్కృతికంగా ఒక్కటిగానే ఉండిపోవటానికి గల కారణాలు అధ్యయనం చేయవలసిందే. ఐరోపా రినైజాన్స్ ఆలోచన భారతీయతకు చాలా చాలా దూరమనే భావనలో అసంబద్ధత లేదని అనుకోవాలి.

- అశ్వినీకుమార్



**బరోకి (Baroque) కాలావధిలో- చిత్ర, శిల్ప, వాస్తు, సాహిత్య, సంగీత, నృత్య, రూపకళలకు - సౌందర్యం, గాంభీర్యం, ఉత్కృష్టత, భావావేశం, లయ, తాళ, నాటకీయత, కలబోసి - చిప్పిలింపజేసిన అలంకరణ శైలి వాడుకలోకి వచ్చింది.**

**రొకోకో (Rococo) కాలశకలంలో - ఈ 'బరోకి' శైలి మరింత విజృంభించి ప్రకటితమైంది. అది 'రినైజాన్స్' చివరి మజిలీ...**

# చదవండి...

- ఎన్నార్కె




✦ **షోడశి - రామాయణ రహస్యాలు :** రచయిత గుంటూరు శేషేంద్ర శర్మ. సుందరకాండ వాఖ్యతో శ్రీవిద్యా విషయమును పేర్కొనుట చేత దీనికి రచయిత షోడశి అని నామకరణం చేశారు. సుందర కాండకు ఆ పేరు ఎలా వచ్చింది? రామాయణ, భారతాల్లో ఏది ప్రాచీనము- నలోపాఖ్యాన మేఘసందేశ నైషధాలపై సుందరకాండ ప్రభావం ఎంత వరకు? భారతము రామాయణానికి ఎంతవరకూ ప్రతిబింబము? ఇలాంటి అనేక విషయాలు సోపపత్తికంగా వివరించారు. ఎంతో శ్రమకోర్చి సాగించిన ఈ రచన శిష్టులే కాదు, ఉపవిష్టులు కూడా చదివి ఆనందించగలరు. ఇది అన్ని ప్రముఖ పుస్తక సంస్థలలో లభ్యం.

*పేజీలు : 250, వెల : ₹ 200/-*



✦ **భారత భవిష్యత్ బి.ఆర్.అంబేద్కర్ :** రచయిత జల్లి శ్రీరఘుపతిరావు. ఇది పైన చెప్పబడిన పుస్తకానికి కొనసాగింపుగా వచ్చిన రచన. ఇందులో రచయిత అంబేద్కర్‌ను నిమ్నజాతీయ నాయకునిగా కాక ప్రపంచ మేధావిగా, దేశభవిష్యత్ ద్రష్టగా మన ముందు నిలబెట్టారు.

*పేజీలు : 110, వెల : ₹ 60/-, పై రెండు ప్రతులకు - ఫోన్ : 9441634533*




✦ **గుంటూరు ప్రశస్తి :** సామాజిక చరిత్రకారునిగా అవిరళ కృషి చేసిన బి.యస్.యల్. హనుమంతరావు రచనిది. గుంటూరు ప్రాంతంలో అనాటి నుండి ఈ నాటివరకూ జరిగిన చారిత్రక సంఘటనలను పొందుపరుస్తూ ఆ సామాజిక, రాజకీయ విశ్లేషణలు చేసిన వ్యాస సంపుటిది. 215 పేజీలు గల ఈ పుస్తకం 146 పేజీలు ఇంగ్లీషు వ్యాసాలతోను, మిగిలినవి తెలుగులోను ప్రచురించారు. హనుమంతరావుగారు ఏమి వ్రాసినా, నిజాయితీ, నిబద్ధతతో వ్రాస్తారని మనందరికీ తెలుసు.

*పేజీలు : 215, వెల : ₹ 180/-, ప్రతులకు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*



✦ **సుభద్రాపరిణయము :** కూచిమంచి జగన్నాథ (జగ్గ) కవి ప్రణీతము. తిట్టుకావ్యకర్తలలో రెండవ వాడు కూచిమంచి జగ్గకవి. అతను వ్రాసిన సుభద్రాపరిణయమును పాఠపరిష్కరణ చేసి, సరి చూసి తెలుగు పాఠకులకు అందించిన పరిష్కర్త ఉన్నం జ్యోతివాసు. సుమారు 300 పేజీలున్న ఈ గ్రంథంలో 159 పేజీల తదనంతరము రచనను ఉన్నదున్నట్లుగా ప్రచురించారు. దానికి ముందున్న పేజీలు పరిశిష్టమునకు చెందినవి. తెలుగు సాహిత్యాన్ని ప్రేమించే వారు తప్పక చదవదగ్గ రచన. దక్కన్ ఆర్క్యలాజికల్ అండ్ కల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ వారి ప్రచురణ.

*పేజీలు : 320, వెల : ₹ 175/-, ప్రతులకు - ఉన్నం జ్యోతివాసు, వేములపాడు పోస్టు, వయా పెరిదేపి, ప్రకాశం జిల్లా.*



✦ **తెలుగు దేవభాష :** రచయిత నూర్‌బాషా రహంతుల్లా. తెలుగు భాషాభిమానైన ఈ రచయిత తెలుగు భాషాభిమానంతో వ్రాసిన 22 వ్యాసాల సంపుటిది. భాషా చైతన్యాన్ని తెలుగు వారిలో నింపి, వారిని ఉత్సాహ పరచేలా వున్నాయి వ్యాసాలు.

*పేజీలు : 125, వెల : ₹ 60/-, ప్రతులకు - అన్ని పుస్తక విక్రయకేంద్రాలు.*




✦ **సుందరయ్యకు అరుణాంజలి :** కామ్రేడ్ సుందరయ్యపై నంబూద్రిపాద్, జ్యోతిబసుల నుంచి అనేకమంది తెలుగు రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాల వ్యాస సంకలనం. సంకలన కర్తలు వి.ఆర్. బొమ్మారెడ్డి, డాక్టర్ ఎ.పి.విఠల్. సుందరయ్య బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ వారి ప్రచురణ.

*పేజీలు : 185, వెల : ₹ 50/-, ప్రతులకు - ఫోన్ : 040-27608107*

✦ **ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి జీవిత సంగ్రహము :** రచయిత ఎమ్.రాజగోపాలరావు. లౌకిక వ్యవహారానికి అతీతమయిన విధంగా జీవించే వారిని లోకోత్తరులు అంటాం. అటువంటి కోవలోని వారు సచ్చిదానందమూర్తి. వారి జీవన నేపథ్యాన్ని ఆధ్యాత్మిక తత్వాన్ని ఆకళింపు చేసుకొని దానిని తొమ్మిది పరివర్తనలుగా విభజించి ఆయన ధార్మికతను మన ముందుంచారు రచయిత. కొత్త సచ్చిదానందమూర్తి పై రావలసినన్ని పుస్తకాలు రాలేదు అని భావించేవారికి ఆ కొఱతను ఈ పుస్తకం కొంత వరకూ పూరిస్తుంది.

*పేజీలు : 300, వెల : ₹ 150/-, ప్రతులకు – ఫోన్ : 9866944186*



✦ **గాలిబ్ కవితా కౌముది :** దివానె గాలిబ్ నుండి ఎంపిక చేసిన కవితలకు ప్రామాణిక తెలుగు అనువాదం. ఉర్దూమూలం, తెలుగు లిపితో సహా కఠిన పదాలకు అర్థాలు, భావ వివరణలతో సాగిన రచన. రచయిత తన శైలిని వివరణాత్మక అనువాదం అని పేర్కొన్నారు. కొన్ని గాలిబ్ గీతాలు ఉర్దూ తెలుగు తో పాటు ఆంగ్ల అనువాదాలను కూడా ఇచ్చారు. గాలిబ్ అభిమానుల కిదొక వెల లేని కానుక.

*పేజీలు : 176, వెల : ₹ 120/-, ప్రతులకు – ఫోన్ : విశాలాంధ్ర బుక్‌హౌస్*




✦ **సోమయ్యకు నచ్చిన వ్యాసాలు :** సమకాలిక జీవితం, సమాజం సందర్భంగా వాడ్రేవు చినవీరభద్రుని రచన. "ఇప్పుడు పాఠకులు చూస్తున్నది. కాల్పనిక సాహిత్యం కోసం కాదు. ప్రపంచం గురించి, సమాజం గురించి వివరించగల తాత్విక సాహిత్యం" అన్న మిత్రుడు విజయకుమార్ మాటలను దృష్టిలో పెట్టుకొని చినవీరభద్రుడు వ్రాసిన వ్యాసాల సంపుటి. చినవీరభద్రుడు అన్ని రచనలానే ఇది సర్వకాలీనము. అందరూ చదవ తగ్గది. కొని భద్రపరచుకోదగ్గది. అమరావతి శిల్పం ఆధారంగా వేయబడిన ముఖచిత్రం అన్నివిధాలా సముచితంగా ఉంది.

*పేజీలు : 480, వెల : ₹ 250/-, ప్రతులకు – నవోదయ*




✦ **త్రిపుర కథలు :** అర్థం కావడానికి, విశ్లేషణకి అతీతమయిన లోచూపు కథా రచయిత త్రిపుర. విశాఖ మాండలీకంలో తెలుగు తనం మెరిసిపోయే మెటఫర్ త్రిపుర కథల విలక్షణత. సాహిత్యంలో కన్ఫెషనల్ ఎలిమెంటు లేకపోతే అది సాహిత్యమే కాదంటారు. మొన్ననే మనకు భౌతికంగా కనుమరుగయిన సంక్లిష్ట, సంక్షిప్త రచయిత త్రిపుర. ఆయన వ్రాసింది తక్కువ. చెప్పింది ఎక్కువ. త్రిపుర అభిమానులకిదొక అసాధారణ కానుక.

*పేజీలు : 123, వెల : ₹ 150/-, ప్రతులకు – ఫోన్ : విశాలాంధ్ర బుక్ హౌస్*




✦ **ఎందరో మహానుభావులు :** ఉత్తమ సాహిత్య విలువల కోసం నిరంతరం శ్రమిస్తున్న డా॥జానమద్ది హనుమచ్ఛాస్త్రి కలం నుండి జాలువారిన మరొక విలువైన కానుక ఈ పుస్తకం. 117 మంది వ్యక్తుల వ్యక్తిత్వాలను దేశ, కుల, మతాలకతీతంగా ఎంపిక చేసి క్లుప్తంగా చెప్పినా, సారం చెడకుండా చెప్పడం ఆయనకే సాధ్యం.

*పేజీలు : 165, వెల : ₹ 75/-, ప్రతులకు – వియన్నార్ బుక్ వరల్డ్. చౌడేపల్లి, చిత్తూరు-517257.*



✦ **నోబెల్ కవిత్వం :** 1901 నుండి నోబెల్ బహుమతి పొందిన కవుల జీవిత, కవిత్వ విశేషాలు. రచయిత ముకుంద రామారావు అనువాదం మూలానికి అతి దగ్గరలో సాగింది. కొండను అద్దంలో చూపించే ప్రక్రియలో చేయి తిరిగిన రచయిత విజయం సాధించారు. సాహితీ ప్రియులందరి వద్దా తప్పక ఉండవలసిన పుస్తకం.

*పేజీలు : 300, వెల : ₹ 170/-, ప్రతులకు – నవోదయ, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు.*



## వర్షాకాలం, మా సమకాలికుల యభిప్రాయం



*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

## I. మిసిమి ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి-1 **– ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి-2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990-2009 | 150.00 |

## II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ.హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

## III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ: ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థ లేక మరణ వ్యవస్థ *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం-ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమ గాథలు – *బోధ చైతన్య* | 75.00 |
| 17. | జాతకమాల – *బోధ చైతన్య* | 150.00 |
| 18. | సంఘమిత్ర కథలు – బొర్రా గోవర్ధన్ | 75.00 |
| 19. | తథాగత – *(భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 50.00 |
| 20. | నిత్యజీవితంలో అభిధర్మం – ఆంగ్లమూలం: ఉకోలే, తెలుగు: వోలేటి | 150.00 |

## IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |
| 3. | చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* | 299.00 |
| 4. | తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 250.00 |
| 5. | రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 50.00 |
| 6. | తెలుగులో పాళీ పదాలు – *చీమకుర్తి శేషగిరిరావు* | 50.00 |
| 7. | ఆంధ్రనగరి – *సాయి పాపినేని* | 290.00 |

**మిసిమి** మాసపత్రిక

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు:** ..........................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..........................................

వీథి ..........................................

పేట ..........................................

ఊరు ..........................................

పిన్ ..........................................

సెల్ ..........................................

**3. సంతకం :** ..........................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

*చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.*

★ **మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

★ రెండు సంవత్సరాల చందా దారులకు **'బాపు బొమ్మల' పుస్తకం పంపిస్తాము.**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **'చార్లీ చాప్లిన్' నా కథ గ్రంథాన్ని బహుమతి.**

★ ఐదు సంవత్సరాల చందా దారులు '2011 **మిసిమి సంచికల బౌండు' అందుకోవచ్చు.**

మిసిమి
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



ఎదురు చూపు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



పూల కూర్పు